Barcode - 2020120000036
Title - Abraham Lincoln
Subject -
Author - G.Harisarvottama Rao
Language - telugu
Pages - 244
Publication Year - 1907
Creator - Fast DLI Downloader
https://github.com/cancerian0684/dli-downloader
Barcode EAN.UCC-13
2020120000036

Vijnanachandrika Series 1.

Edited by K. V. LAKSHMANA RAO, M.A.,
*Editor: Moropant's Karna Parva (Maharati),*
*Author: Life of Sivaji (Telugu),*
*Dewan of Munagala (Kristna).*

# ABRAHAM LINCOLN

## IN TELUGU

BY

G. HARISARVOTTAMA RAO, B. A.


Madras:
THE VAIJAYANTI PRESS,
32, Mount Road.

1907.



*Registered Copy-right.*

విజ్ఞానచంద్రికాగ్రంథమాల. ౧.

అమెరికాదేశాధ్యక్షుఁడగు

# ఆబ్రహాము లింకను చరిత్ర.

ఇయ్యది

గాడిచెర్ల - హరిసర్వోత్తమరావు, బీ. ఏ.,

గారిచే రచియింపంబడి

కృష్ణామండలములోని మునగాల పరగణాకు దివాన్,
మహారాష్ట్రంబున మోరోపంతకృతమగు కర్ణపర్వంబునకు సంపాదకుండును,
టీకాకారుండును, తెలుఁగున శ్రీశివాజిచరిత్రకుఁ గర్తయు నగు

కొమర్రాజు - వేంకటలక్ష్మణరావు, ఎం. ఏ.,

గారిచే సంకలితమయ్యె.

చెన్నపురి:

వైజయంతీముద్రాశాల ముద్రింపఁబడియె.

1907.

*Registered Copyright.*

చందాదారులకు వెల అ. 8.] [ఇతరులకు వెల అ. 12.

# ఆబ్రహాము లింకను.



A. Lincoln

# అంకితము.

ఆంధ్రభాషాభివృద్ధికై తమశక్తికొలఁది పాటుపడు

## సకలమహనీయులకు

నీగ్రంథంబు

కృతజ్ఞతాపూర్వముగ సమర్పింపంబడియె.

# విజ్ఞానచంద్రికాగ్రంథమాల.

VISWANATHAN TEKUMALLA
FLAT 501, 'PRASANTH TOWERS'
MUSHIRABAD MAIN ROAD,
HYDERABAD-500

ఆంధ్రజనుల కొకవిన్నపము,

దేశాభివృద్ధికి భాషాభివృద్ధి యొక [illegible] బని యెల్లరకును దెలిసినవిషయమె. ఇంగ్లీషువారి యభివృద్ధికి వేఱుకారణంబు లనేకము లున్నను నందుకు వారిభాషాభివృద్ధి యొక ముఖ్యకారణ మని విద్వాంసుల యభిప్రాయమై యున్నది. ఇంగ్లండుదేశంబునఁ బ్రస్తుత మున్న గ్రంథసంగ్రహంబును వార్తాపత్రికలును నేదో యొక దైవికకారణముచే నేఁడు లేకుండ నయ్యేనేని ఆదేశము తన యాదిమయుగములోని యనాగరికతకుఁ దిగు నని చెప్పుట యతిశయోక్తి గానేరదు. ఇంగ్లండులోని వార్తాపత్రికలా దేశమునకు మేలుగాని కీడుగాని కలుగఁజేయుసామర్థ్యము గల యొక స్వతంత్రసామ్రాజ్యముగ నెంచఁబడుచున్నవి. ఇంగ్లీషు పత్రికారాజ మగు 'లండన్ టయిమ్స్' పత్రికయొక్క యనుగ్రహమును, జర్మనీచక్రవర్తియు, నమెరికా దేశాధ్యక్షుఁడును గోరుచుండెద రని మనము వినుచున్నాము. ఇట్టి మహిమ యాపత్రికకుఁ గల్గుటకుఁ గారణం బేమి? ఆపత్రిక చేయుచున్న భాషాభివృద్ధియుఁ దన్మూలకముగా లోకులలోఁ బ్రసరించుచున్న జ్ఞానాభివృద్ధియు నిందుకుఁ గారణము లని వేఱుగఁ జెప్పవలెనా? 'భాషాభివృద్ధి' 'జ్ఞానాభివృద్ధి' 'దేశాభివృద్ధి' యనుశబ్దములు పర్యాయపదము లని చెప్పనగు. వాఙ్మయంబు (Literature) నఁ దగినగ్రంథములు లేనిభాష శిశువుల వచ్చిరాని పలుకులవంటిది. బాలుని యస్పష్టపదములు కొన్నిదినములకు స్పష్టములయినఁగాని యెటుల వ్యవహారమునకుఁ బనికిరావో యటులనే భాషయం దన్నివిషయములనుగుఱించిన గ్రంథసంగ్రహమున్నంగాని యది జ్ఞానాభివృద్ధికిని, అందుమూలకముగా దేశాభివృద్ధికిని నుపయోగపడనేరదు. అట్లు గ్రంథసంగ్రహము లేనిభాషయే తమమాతృభాషగాఁ గలజనులు శిశువులను బోలి యజ్ఞానమునం దుండవలసివచ్చును. కాన దేశభాషల నభివృద్ధిచేయుట దేశాభిమానుల ప్రథమకర్తవ్యము.

హిందూదేశములోని నూఱాఱుదేశభాషలలోఁ బ్రతిభాషను నభివృద్ధి చేయు శ్రమకంటె నిదివఱకే యభివృద్ధిఁజెందియున్న యింగ్లీభాషనుగాని, హిందూదేశమున కంతటికిని సామాన్యమైన సంస్కృతభాషనుగాని జనులకు విద్యాదానము చేయఁగూడదా యని కొందఱు వాదించుచున్నారు. కాని దేవభాష యగు సంస్కృతంబును, రాజభాష యగు నింగ్లీషును మన దేశములో నెంత విస్తారముగా వ్యాపించినను, అవి యెన్నటికిని దేశభాషలు కానేరవు. పండితుల మనిపించుకొనఁ గోరువారు కొందఱుమాత్రము సంస్కృతము నభ్యసింతురు; రాజకీయోద్యోగముల కాశపడువారు మఱి కొందఱుమాత్ర మింగ్లీషు నేర్చెదరు. సర్వజనుల కీభాషలు సాధ్యములు కావు. కాని జనసామాన్యమును, ముఖ్యముగ స్త్రీలును, విజ్ఞానము గల వారయినం గాని దేశము నాగరికదేశముగా నెంచఁబడుటకు వీలులేదు. ఉన్నతస్థితియం దుండు కొందఱు జనులుమాత్రము సాక్షరు లయి యితర జను లందఱు నిరక్షరు లయి యున్నదేశము పైన రంగుబూయఁబడి లోపలఁ బేఁడతో నిండియుండు కొండపల్లి బొమ్మవంటిది. అట్టిదేశ మున్నతస్థితి కెన్నఁడును రాఁజాలదు. అందుల జనుల నందఱిని విద్యావంతులఁ జేయుటయే యిందుకు మందు. పైనఁ జెప్పఁబడిన కారణములవలన నింగ్లీషు సంస్కృతాదిపరభాషలలో సర్వజనులను విద్వాంసులఁ జేయుట మిక్కిలి కష్టసాధ్యము. అసంభవ మనియు చెప్పవచ్చును. కాఁబట్టి సర్వజనులకు జ్ఞానాభివృద్ధి కలుగవలెనన్నచో వారివారిదేశభాషలమూలముననే గలుగవలెను.

ఇదియుఁ గాక యింగ్లీషు సంస్కృతము చదువుకొన నిచ్ఛయు సామర్థ్యంబును గలవారికిఁగూడ నేదియేని విషయము పరభాషలో నేర్చికొనుట కంటె స్వభాషలో నేర్చికొనుట సులభముగదా? జనులకు మొదట నొక క్రొత్తభాష నభ్యసించుటకే యెంతోకాలము పట్టును. పిదపఁ గదా యా భాషలో నితరవిషయముల నేర్చుట. ఉదాహరణార్థము, సంస్కృతంబున గణితము నభ్యసింపవలెనన్న, మొదట సంస్కృతమును బాగుగ నభ్యసించి,

యందు వ్యుత్పత్తిజ్ఞానము సంపాదించి పిదపగదా గణితము చదువుటకుఁ బ్రారంభించవలెను. ఇంగ్లీషున నితరశాస్త్రముల నభ్యసింపవలయు ననినను మన మింత పరిశ్రమ చేయవలసి యున్నది. ఇంత ద్రావిడప్రాణాయామ మేల? ఎవరి మాతృభాషలో వానికి జ్ఞానదానము చేయఁగూడదా? అటులఁ జేయక ప్రస్తుతము మనవారు శాస్త్రములన్నియు నింగ్లీషులోఁ జదువుచున్నందున నెంతయో యెక్కుడు కాలమును, ఎక్కుడు పరిశ్రమయు, నెక్కుడు ధనమును వ్యయ మగుచున్న వని యనేక విద్వాంసుల యభిప్రాయమై యున్నది. ప్రవేశపరీక్షకుఁ బైపరీక్షలకుఁ జదువు విద్యార్థులకు నిబ్బంది లేకపోయినను, ప్రవేశపరీక్షకుఁ గ్రిందితరగతులలోఁ జదువుపిల్లలు, భూగోళము (Geography), భూమితి (Geometry), పదార్థవిజ్ఞాన శాస్త్రము (Physics), రసాయనశాస్త్రము (Chemistry) మొదలయిన శాస్త్రముల నభ్యసించునపుడు నర్థము తెలియనందునను, లేక తెలిసిన దాని నింగ్లీషులో మరల చెప్పఁ జేతకానందునను బుస్తకముల గ్రుడ్డిపాఠముచేసి పరీక్షలలోఁ గృతార్థు లగుట మనము చూచుచున్నాము. ఈ శాస్త్రము లన్నియు వారివారి మాతృభాషలలో నేర్పినయెడల నాశాస్త్రములఁ జదువుటకుఁ బ్రస్తుతము పడుచున్నంతశ్రమ పడ నక్కఱలేదు. ఇట్లు సమస్త విద్యలను దేశభాషలలో నేర్పి యొక యింగ్లీషుభాషమాత్రము ద్వితీయభాష (Second Language) గా బోధించినయెడలఁ, బ్రస్తుతము ప్రవేశపరీక్షకుఁ బోవు విద్యార్థులకుఁ గల జ్ఞానమంతయుఁ బ్రస్తుతము పట్టుచున్నకాలములో సగముకాలములోనే గడింపవచ్చునని మహారాష్ట్రీయులు సిద్ధాంతీకరించి యట్టిపాఠశాలల నేర్పఱచుచున్నారు. ఈ పాఠశాలలలో నిండియా, ఇంగ్లండ్, గ్రీస్, రోమ్ ఈదేశముల చరిత్రములును, అంకగణితము (Arithmetic), బీజగణితము (Algebra), రేఖాగణితము (Gecmetry), ఈగణితములును, భూగోళము (Geography), పదార్థవిజ్ఞానము (Physics), రసా

యనశాస్త్రము (Chemistry) మొదలయినశాస్త్రములు దేశభాషలలో నేర్పఁబడును. ఇంగ్లీషు ద్వితీయభాషగా నేర్పఁబడును. ప్రస్తుతము హిందూదేశమందు రాష్ట్రీయశిక్షణము (National Education), రాష్ట్రీయవిశ్వవిద్యాలయము (National University) నుగుఱించి జరుగుచున్న ప్రయత్నములలో దేశభాషలలలో జనులకు జ్ఞాన మొసంగుట యొక ముఖ్యాంశమై యున్నది. కాని యిట్లు దేశభాషలయందు వివిధవిద్యల జనులకు బోధించుటకుఁ బ్రారంభించుటకుఁ బూర్వము నాభాషలలో నన్నివిషయములనుగుఱించిన గ్రంథముల నిర్మింపవలయును.

ఈయంశముల నాలోచించియే హిందూదేశములోని బంగాళము, మహారాష్ట్రము, హిందూస్థానము (యునైటెడ్ ప్రావిన్సెస్) మొదలగుదేశములలోని జనులు తమతమదేశభాషల యభివృద్ధికై పాటుపడుచున్నారు.

బంగాలీభాషయందు ఫ్రెంచి, యింగ్లీషు భాషలలోని యుత్తమ కల్పితకథలను బోలిన కథలును, దేశచరిత్రంబులును (Histories), వ్యక్తిచరిత్రంబులును (Biographies), శాస్త్రీయ (Scientific) గ్రంథంబులును, విజ్ఞాన (Philosophical) గ్రంథంబులును, ఇంగ్లీషు పత్రికలఁబోలు నత్యుత్తమమాసపత్రికలును, దేశాభిమానపూరితంబు లగు నాటకములును అనేకములుగలవు. ఇంతియ కాదు. వారు భాషాభివృద్ధిఁ జేసిచేసి ప్రస్తుతమాభాషయందు నొక ప్రచండమైన విశ్వకోశమును (Encyclopædia) గూడ నిర్మించియున్నారు. విశ్వకోశము నిర్మించుటకు భాష యెంత యభివృద్ధిఁ జెంది యుండవలయునో పండితులకు వేఱుగఁ జెప్ప నక్కఱ లేదు.

బంగాలీభాషతో సమానముగా మనదేశములో నభివృద్ధిఁ జెందుచున్న రెండవభాష మహారాష్ట్రము. మీ కేదేశచరిత్రము కావలసినను నీభాషయందు దొరకఁగలదు. ప్రకృతిశాస్త్రంబు లనేకములు వ్రాయఁబడినవి. ప్రఖ్యాతిఁ గాంచిన యింగ్లీషు గ్రంథంబు లనేకము లీభాషయందు భాషాంత

T. Achyuta Rao



Bhimavaram.

రీకరింపఁబడినవి. జాన్ స్టుఅర్ట్ మిల్, హార్బర్ట్ స్పెన్సర్, సర్ జాన్ లబక్ మొదలయిన యింగ్లీషు గ్రంథకారు లనేకులు మహారాష్ట్రవేషముల వేసియున్నారు. ఇట్టిరూపాంతరీభూతగ్రంథంబులు గాక స్వతంత్రగ్రంథంబు లనేకములు ప్రతిసంవత్సరమును నాభాషయందు వెలువడుచున్నవి. ఇట్టి శాస్త్ర చరిత్రవిజ్ఞానవిషయిక నూతనగ్రంథంబులఁ బ్రచురించుటకు నాభాషయందు రెండువందలపుటల మాసపత్రిక యొకటి 'గ్రంథమాల' యను నది గలదు. దీని సంపాదకుఁడు (Editor) విష్ణు గోవిందవిజాపురకర్, ఎం. ఏ., అను విద్వాంసుఁడు. మహారాష్ట్రదేశచరిత్రకుఁ గావలసినసాధనంబుల సేకరించి 'మరాఠ్యాంచ్యా ఇతిహాసాచీ సాధనే' (మహారాష్ట్రులచరిత్రకు సాధనములు) అను పేరిటఁ బ్రచురించుటయే తనకర్తవ్యముగా నెంచు స్వార్థత్యాగియైన మహానుభావుఁ డొకఁడు మహారాష్ట్రదేశమునఁ గలఁడు. ఈమహాపురుషునినామము విశ్వనాథ కాశీనాథ రాజవాడే, బీ. ఏ. ఈయన గొప్పవిద్వాంసుఁ డైనను ఇతర యుద్యోగముల కాశింపక నెలకు నిరువది రూపాయలు వచ్చు పూర్వార్జిత మైనసొత్తుతోనే జీవనము గడపుచు, వివాహముఁ జేసికొనక, మంచి త్రోవలైనను లేని పల్లెలకుఁ గూడఁ జరిత్రసాధనంబు లున్నవని తెలిసిన నడచి వెళ్లి నెలలకొలఁది యచ్చట నుండి, వంట తానే చేసికొనుచు, నెన్నియో యితరకష్టముల కోర్చి దొరికినసాధనములకుఁ బ్రతులు వ్రాసికొని ప్రచురించుచుండును. ఇట్లు స్వదేశచరిత్రమునందే దృష్టినిలిపిన యీయోగి యిదివఱకు నెనిమిదిసంపుటములఁ బ్రచురించెను. ఇంక నెన్నియో సంపుటములకు సరిపోవు నన్ని సాధనముల సేకరించియున్నాఁడు. అందువలన నిప్పుడు మహారాష్ట్రీయుల చరిత్రసంబంధ మైన విశ్వాసార్హము లగు సాధనములు, మూలప్రతులు మొదలయినవి, వెలువడి పరదేశీయులు వ్రాసిన చరిత్రములలోని యసత్యాంశముల బయలుపఱచుచున్నవి.

ఇట్లు మన యిరుగుపొరుగువారు తమతమ దేశభాషల నభివృద్ధి చేసికొన నవిశ్రాంతముగా స్వార్థమునందును దృష్టియుంచక పాటుపడుచుండ

మన తెలుఁగుసీమవారుమాత్ర మితర యన్నివిషయములందువలె భాషాభివృద్ధివిషయమునను గాఢనిద్ర పోవుచున్నారు. ఇది మిక్కిలి శోచనీయము. ఇట్లనుటచే నిదివఱకు నాంధ్రభాషాభివృద్ధికై పాటుపడిన వారిని మే మెఱుంగ మని గాని, వారు మనభాష కొనర్చిన మహోపకారమునకై మేము కృతజ్ఞతఁ జూపనొల్ల మని గాని చదువరులు తలఁపవలదు.

భాషాభివృద్ధికి గద్యగ్రంథంబు లత్యంతావశ్యకంబు లని మొట్టమొదటఁ గనిపెట్టినది చిన్నయసూరి. తెనుఁగులోని గద్యగ్రంథంబుల కాతఁడు నన్నయభట్టు. ఇట్లు చిన్నయసూరిచేఁ బ్రారంభింపఁబడిన వచనకావ్యపద్ధతిని మిక్కిలి ప్రబలఁజేసి, విద్వాంసులకును, జనసామాన్యమునకును, స్త్రీలకును గావలయు గ్రంథరాజంబు లనేకంబులు నిర్మించి, గ్రంథసంఖ్యాబాహుళ్యంబుచేతను, సకలజనాదరణీయంబును సకలజనానుకరణీయంబును నగు శైలిని నిర్మించుటచేతను, గద్యతిక్కన యని చెప్పుటకు నర్హులు రావుబహదరు కందుకూరి వీరేశలింగముపంతులవారు. పంతులవారి యితరమతము (Opinions) లను గుఱించి యెవ రేమనుకొన్నను, వారు మనభాషను నభివృద్ధిచేయుటకై చేసినకృషికి వారి నభినుతించునెడ విజ్ఞానము గల యాంధ్రులందఱును నేకీభవింపక తప్పదు.

వీరుగాక యనేకులు పూర్వతరమువారును, మనతరమువారును దమ గద్యగ్రంథంబులచేఁ దెలుఁగుబాసను నలంకరించిరి. వారిలో మ-రా-రా-శ్రీలు, కొక్కొండ వేంకటరత్నముపంతులవారును, శతఘంటము వేంకటరంగశాస్త్రి గారును, పూండ్ల రామకృష్ణయ్యపంతులుగారును, వేదము వేంకటరాయ శాస్త్రిగారును, శేషగిరిశాస్త్రిగారును, పనప్పాకము శ్రీనివాసాచార్యులు బీ. ఏ. బీ. ఎల్ గారును, నాటకములకు నూతనమార్గము చూపినందుకు ధర్మవరము కృష్ణమాచార్యులుగారును, కల్పితకథలు వ్రాయుటలోఁ జిలకమర్తి లక్ష్మీనరసింహముగారును, స్త్రీల కుపయుక్త గ్రంథములు వ్రాయుటయందుఁ గీర్తి శేషురా లగు భండారు అచ్చమాంబగారును, శ్రీమతి కొటికల

పూడి సీతమ్మగారును భాషాభివృద్ధికై మిక్కిలి పాటుపడియున్నారు. వీరు గాక పూర్వ మొకప్పు డుండిన పురుషార్థప్రదాయిని, ఆంధ్రభాషాసంజీవని, మందారమంజరి, చింతామణి, శ్రీవైజయంతి మొదలయిన మాసపత్రికలును, ప్రస్తుత మున్న సరస్వతి, మంజువాణి, మనోరమ, సువర్ణలేఖ, సావిత్రి, హిందూసుందరి, జనానాపత్రిక మొదలయిన మాసపత్రికలును, ఆంధ్రప్రకాశిక, శశిలేఖ, కృష్ణాపత్రిక, ఆర్యమతబోధిని, సత్యవాది, రవి మొదలైన వార్తాపత్రికలును, తెనుఁగునం దొకవిధమైన యుపయోగకరంబగు వాఙ్మయంబును బుట్టించినవి, బుట్టించుచున్నవి. వీరివ్రాతలలో వ్యక్తి (individual) విషయికనిందాపూరితంబు లగునవి కొన్ని తప్ప కడమవన్నియు నేమతమును బోధించునవియైనను నుపయోగకరంబులే. కాన నేతద్గ్రంథకర్తలందఱును మనకు వంద్యులు. మే మిచ్చటఁ బేర్కొనినవారు గాక యనేకభాషాభిమానులు లాంధ్రవాఙ్మయాభివృద్ధి (Improvement of Telugu Literature) కై పాటుపడుచున్నారు. వారును మాకు గౌరవనీయులే. వారి యందఱినామము లిచ్చట నుదాహరించుటకు మాస్మరణశక్తియుఁ జోటును జాలవు గాన వారు మమ్ము మన్నించుదురుగాత.

ఇట్లిందఱు పాటుపడుచుండఁగా 'మన తెలుఁగువారు నిద్రపోవుచున్నార' ని మేము వ్రాయుట చదువరులకు వింతగ నుండు నేమో. కాని తెలుఁగుబాస యొక నాగరికభాష యనిపించుకొనుటకు మనము చేయవలసినప్రయత్నములో నిప్పుడు జరిగియున్నప్రయత్న మొక సహస్రాంశమైనను కాదని తెలిసికొనిన మనము నిద్రపోవుచున్నది మేల్కాంచినది తెలియఁగలదు. మనభాషయం దేగ్రంథములు లేవో మనము విచారించిన మనము ముందు చేయవలసిన కార్యముయొక్కచాయ కనుపడఁగలదు. ఇండియా, ఇంగ్లండ్, గ్రీస్, రోమ్, అమెరికా, ఫ్రాన్స్ ఈదేశములచరిత్రలు మనభాషయందు లేవు. హిందూదేశచరిత్ర మను పేరిట నొకటి రెండు చిన్నపొత్తములు గలవు. కాని వానిలో వర్ణింపఁబడినవిషయములు బహు

స్వల్పము లయినందున నవి 'చరిత్ర' యను నామమున కంతగాఁ దగినవి కావు. ప్రకృతిశాస్త్రము లన్ననో మనవారికిఁ గలలోనివార్తలు. పదార్థ విజ్ఞానశాస్త్రము (Physics), రసాయనశాస్త్రము (Chemistry), వృక్ష శాస్త్రము (Botony), పశుశాస్త్రము (Zoology), జీవశాస్త్రము లేక చేతనశాస్త్రము (Biology), భూగర్భశాస్త్రము (Geology) మొదలయిన ముఖ్యశాస్త్రములనుగుఱించి యొకచిన్నపుస్తకమయినను మనభాషలో లేదు. ఇంకను బ్రకృతిశాస్త్రంబు లనేకము లున్నవి గాని వానిలో ముఖ్యమైన వానిఁ బేర్కొంటిమి. ఈశాస్త్రములలో నొక్కొక్కదానిపై నింగ్లీషు నందు వందలకొలఁది గ్రంథంబులు వ్రాయఁబడియున్నవి. అంకగణితము (Arithmetic), బీజగణితము (Algebra), రేఖాగణితము (Euclid) క్షేత్రగణితము (Mensuration), త్రికోణమితి (Trignometry) మొద లయినగణితములనుగుఱించియుఁ బేర్కొనఁ దగినగ్రంథం బొకటియుఁ గాన రాదు. ఇంగ్లీషు కథలతోఁ బోల్పఁదగు కల్పితకథ యొకటియు లేదు. ఉన్న వానిలో మ-రా-రా-శ్రీ, చిలకమర్తి లక్ష్మీనరసింహముగారిచే రచింపఁబడిన కథ లుత్తమములు. అవి కొంతవఱకు నింగ్లీషుకథలను బోలియుండును. కాని యవియన్నియుఁ జిన్నవి. గాన వానిని లఘుకల్పితకథ (Novelettes) లన వలయునే కాని కల్పితకథ (Novels) లనుటకు వీలు లేదు. కనుక మన కిట్టి కథలు కావలసియే యున్నవి. నాటకములనుగుఱించి విచారించినను, సింగి సింగని సంవాదము వినియు, నలునికొఱకు సంగీతమున నేడ్చెడిదమయంతిని జూచియు, మదనతాపమునఁ బొర్లాడుచున్న శకుంతలను గాంచియు మన మిప్పుడు సంతసింపవలసినదే గాని వివిధమానవస్వభావములఁ గనుపఱచెడి, సంసారమునకు సరియైన ప్రతిబింబ మగు నాటక మాంధ్రంబున నొండైనఁ గలదే? జ్ఞానవిషయము లసంఖ్యంబులు. అందే విషయమునుగుఱించి విచా రించినను మనభాషలోఁ దగినగ్రంథంబులు లేవు. ఈగ్రంథంబుల నన్నిటిని

నిర్మించుటకు నూర్గురుపండితులు తెడతెగక నూఱుసంవత్సరములు పరిశ్రమ చేసినను చాలు నని తోఁచదు. కానఁ దనశక్తికొలఁదిని తెలుఁగుబాస నభివృద్ధి చేయుటకు విద్యాగంధ మించుకయినను గల ప్రతియాంధ్రుఁడును బ్రయత్నింపవలయును. నాచేత నేమగు నని యధైర్య పడరాదు. ఇతరులను నిందించుట్లయే తనపనిగఁ బెట్టుకొనక భాషాసేవయే పరమోద్దేశముగ నెంచుకొని యేదో యొక విషయమును జక్కఁగ నభ్యసించి యందున గుఱించి గ్రంథము వ్రాసిన నది గ్రాహ్యంబే యగు; భాషాభివృద్ధికి సహకారియు నగు.

ఇట్లు తలఁచి 'యుడుతభక్తి' చందంబునఁ మా యల్పశక్తికొలఁది నాంధ్రమాతృభాషాసేవఁ జేయఁ బ్రయత్నింపవలయు ననెడి యిచ్ఛ గలవార మయి 'విజ్ఞానచంద్రికామండలి' యను పేరిట నొక భాషాభివృద్ధి సంఘం బేర్పఱచినారము. ఈ 'మండలి' వారు 'విజ్ఞానచంద్రికాగ్రంథమాల' యను పేరిట గ్రంథంబులఁ బ్రచురించెదరు. జ్ఞానవిషయము లసంఖ్యాంబులు గాన నన్నింటినిగుఱించిన గ్రంథంబులు నిర్మించుట యేరికిని సాధ్యంబు గాదు. కానఁ గొన్నివిషయములకు సంబంధించిన గ్రంథములనే వ్రాయఁ దలఁచినారము. పద్యకావ్యములు, నాటకములు, కల్పితకథలు, భాషా (Language) విషయిక చర్చలు, వాఙ్మయ (Literature) విషయికచర్చలు భాషాభివృద్ధికి నత్యంతావశ్యకంబు లయినను ఈవిషయికగ్రంథములు మేము ప్రస్తుతము వ్రాయను, వ్రాయించను దలఁచుకొనలేదు. 1. దేశచరిత్ర (History), 2. వ్యక్తిచరిత్ర (Biography), 3. ప్రకృతి లేక భౌతికశాస్త్రములు (Physical Sciences), 4. [Mill's Liberty, Subjection of Women, Spencer's Education, Smile's Self help, Character, Thrift, Duty, Lubbock's Pleasures of Life,] మొదలైన యింగ్లీషులోని సర్వోపయోగకరములగు గ్రంథంబుల భాషాంతరీకరణము, ఈ నాల్గు విషయములను గుఱించినగ్రంథంబులు మాత్రము ప్రచురింపఁ దలఁచినారము.

కొందఱు మిత్రుల సూచన ననుసరించి, చరిత్రానుసార (Historical) లగు కల్పితకథల (Novels) నెవ్వరైన వ్రాసిరేని వానిని బ్రచురింప నియ్యకొంటిమి. మాకార్యక్రమమునకు మే మీయెల్ల లేర్పఱచుకున్నారము.

మెట్టమొదట మేము 'విజ్ఞానచంద్రిక' యనుమాసపత్రిక నొకదానిని బ్రారంభించి యందు నీగ్రంథంబులఁ బ్రచురపఱుపఁ దలఁచితిమి. కాని నాలు గసంపూర్ణగ్రంథంబులు నెలనెలకుఁ దునుకలుతునుకలుగా సంవత్సరమంతయు నిచ్చుచుండుటకంటె నొక్కొకతఱి నొక్కొక సంపూర్ణగ్రంథంబు చదువరుల కిచ్చుట మేలని పిదప నిశ్చయించితిమి. 'విజ్ఞానచంద్రికాగ్రంథమాల' యను పేరిట సంవత్సరమునకు మొత్తముమీఁద నెనిమిదివందలపుటలకు మించకుండ నాలుగుగ్రంథంబులఁ బ్రచురింపఁగలము. ఈగ్రంథములకు నెవ్వరును ముందు చందా యియ్యనక్కఱలేదు. గ్రంథము సిద్ధముకాఁగానే యది మాచందాదారులకు వాల్యూపేబిల్ ద్వారా పంపఁగలము. 'విజ్ఞానచంద్రికామండలి' వారు ప్రచురించెడుగ్రంథములకుఁ జందాదారుఁడ నగుదు ననియు, గ్రంథములు సిద్ధమగునప్పుడెల్లఁ దనపేర నాగ్రంథములు వ్యాల్యూపేబిల్ ద్వారా పంపవలసిన దనియు, 'మండలి' కార్యదర్శియగు మ-రా-రా-శ్రీ, రావిచెట్టి - రంగారావుగారు, రెసిడెన్సీ బాజారు, హైదరాబాద్ (డెక్కన్) పేర వ్రాసినఁ జాలును. ఇట్లు వ్రాసిన వారిపేళ్లు మాచందాదారులపట్టికలోఁ జేర్చికొందుము. ఇట్టి చందాదారులకు మే మచ్చువేయుగ్రంథంబు లన్నియు బహుస్వల్పమైనవెలకు నియ్యఁదలఁచితిమి. శ్రేష్ఠమైన (Superior) నున్నని (Glazed) కాగితముమీఁద నచ్చువేసినగ్రంథము, లంచెకూలి మొదలయినవి మేమే భరించి, నూఱుపుటలకు రు. 0—4—0 చొప్పున నిచ్చెదము. అనఁగా నొకగ్రంథము నూఱుపుటలే యగునేని యందు కగు నంచెకూలి రు. 0—0—6 వ్యాల్యూపేబిల్ కర్చు రు. 0—1—0 పోఁగా మిగిలిన రు. 0—2—6 మాత్రము పుస్తకభృతి యగును. పదునైదువందల శాశ్వతపుచందాదారులు సమకూరుదురేని గ్రంథ

ములవెల నింకను తగ్గింపఁగలము. చందాదారులు కానివారికి మాగ్రంథములు, అంచెకూలిగాక నూఱుపుటలకు రు. 0—6—0 చొప్పున నియ్యఁబడును.

మామండలిలోని సభాసదులందఱును బ్రస్తుతము ప్రతిఫల మేమియుఁ గోరకయే యీపనికిఁ బూనియున్నారు. ఇంతియకాదు; నష్టమువచ్చినను గొంతవఱకు భరించుటకు మాలోని గొందఱు సిద్ధముగ నున్నారు. అయినను నాంధ్రవాచకప్రపంచముయొక్క (Telugu Reading Public) సహాయములేనిదే యిట్టిప్రయత్నములు కొనసాగనేరవు.

తెలుఁగుసీమలోని జమీదారులును, ఇతర లక్ష్మీపుత్రులును ఇట్టికార్యములనవలంబించినవారికి ధనరూపమైన కేలూఁత యొసఁగి, రాజనరేంద్ర మనుమసిద్ధి కృష్ణరాయలచరిత్రమహిమ యిన్నివందలసంవత్సరములవఱకుఁగూడ నాంధ్రదేశంబున నున్నదని వెల్లడి చేయుదురు గాక. ఇది ధనాధికులకుఁ గర్తవ్యము.

ఇఁక విద్యాధికులు మాకును మావలె గ్రంథంబులఁ బ్రచురించు నితరులకును మూఁడుతెరంగుల సాయ మొనర్పవలెను. గ్రథంబుల వ్రాయుటయు, నితరులు వ్రాసినగ్రంథంబులఁ గొనుటయు, నాగ్రంథంబులలోని విషయముల జనసామాన్యమునకుఁ దెల్పుటయు. ఇది యింగ్లీషు నేర్చినవారు మాకుఁ జేయవలసిన త్రివిధసహాయము. ఇందు మొదటిది గ్రంథనిర్మాణంబు. ప్రకృతిశాస్త్రములు మొదలయినవి యింగ్లీషు నేర్చిన విద్వాంసులే వ్రాయవలయును. ఇందునగుఱించి రావుబహదరు కందుకూరి వీరేశలింగముపంతులుగారొకచోట నిట్లు వ్రాయుచున్నారు:—

“ఇట్టిపుస్తకములను రచించుట యింగ్లీషునందు మంచిపాండిత్యము గలిగి బహుశ్రుతు లయి సంస్కృతాంధ్రభాషలయందు తగినంతజ్ఞానము కలవారికే సాధ్యమగును గాని కేవలసంస్కృతపండితులకును కేవలాంధ్ర పండితులకును సాధ్యము కాదు. కాఁబట్టి యీపనిని నిర్వహించి దేశభాష

లను వృద్ధిచేయవలసినభార మింగ్లీషుభాష నభ్యసించిన ప్రతివారు తమ
మీఁదఁ బడిన యీకార్యభారమును వహించి దేశభాషాభివృద్ధికి తోడు
పడనిపక్షమున దేశముయొక్క హీనదశకు వా రుత్తరవాదులుగా నుందురు.
కాఁబట్టి యిఁకనైన సర్వకలాశాలలయందుఁ బట్టపరీక్షల నిచ్చి మెప్పొం
దినవారు తాము లౌక్యాధికారములయందుఁ బ్రవేశించి భార్యాపుత్రాదుల
కాభరణములు చేయించిపెట్టుటతోడనే కృతార్థుల మయితి మను కోక
దేశభాషావధూటికిఁ గూడ సద్గ్రంథాభరణములను వృద్ధిపఱుపఁ బ్రయత్నిం
తురని నమ్ముచున్నాము." ఇంగ్లీషు విద్యావిభూషితు లందఱు నీవాక్యంబుల
మఱవకుందురు గాక. రమేశచంద్రదత్తు వంటి యింగ్లీషుగ్రంథముల వ్రాసి
కీర్తిఁ గన్నవాఁడుగూడఁ దనమాతృభాషయగు బెంగాలీలో గ్రంథములు
వ్రాయుట తనకుఁ బరమకర్తవ్యముగ నెంచుచున్నాఁడు. ఇంగ్లీషునఁ బండి
మని విఱ్ఱవీగి తెనుఁగును దిరస్కరించెడు మనవారి నేమనవలె?

ఏశాస్త్ర మెవ్వ రభ్యసించిరో యాశాస్త్రము వారిచేతనే వ్రాయించ
నిశ్చయించితిమి గాన నెవ్వరి యభిమానశాస్త్రంబున వారు పొత్తంబులు
వ్రాసి మాగ్రంథమాలలోఁ గూర్చుదు రని కోరుచున్నాము.

ప్రకృతిశాస్త్రములు వ్రాయునపుడు ఆయాశాస్త్రంబులలోని పారి
భాషికపదములు (Nomenclature) దేశభాషలలో లేనందున గ్రంథకర్తలు
త్రొక్కులాడవలసి వచ్చుచున్నది. ఇందుకుఁ గాశీలోని 'నాగరీప్రచారిణీ
సభ' వారు విద్వాంసులయొక్క సంఘము నేర్పఱచి భౌతికశాస్త్రము (Physi-
cal Sciences) లలోని పారిభాషికపదముల నిర్ణయించి యున్నారు. ఈ
పరిభాష సంస్కృతపదభూయిష్ఠ మయినందున నీపరిభాషనే గ్రహించు
టకు మేము నిశ్చయించినాము. ఇట్లు నిశ్చితమైన పరిభాషను వాడక,
యెవరికి వారే క్రొత్తపరిభాష కల్పించుకొనుచు గ్రంథములు వ్రాసినచో
నవి యెవ్వరికిఁ దెలియక 'మూఁగ చెవిటివారి ముచ్చటరయ' యగు నను
టకు సందేహము లేదు. కాని మొదట నెంత పిచ్చిగఁ గానవచ్చినను ఒక

పరిభాషనే యందఱును వాడవలయు. ఎప్పుడు నుపయోగించుచుండిన నా క్రొత్తపరిభాషకే గహనార్థంబు సమకూరు. ఇంగ్లీషువారును నిటులనే చేయుచున్నారు. యూరపుపండితులచే నిర్మితంబగు శాస్త్రీయపరిభాష యెంత కర్ణకఠోరం బయినను ఇంగ్లీషు గ్రంథకారులు దానినె వాడుచున్నారు. ఇందువలన, శాస్త్రాభివృద్ధికిని, భాషాంతరీకరణంబునకును మిక్కిలి సహాయము కలుగుచున్నది. మనమును అటులనే నాగరీప్రచారిణీ సభవారిపరిభాష గ్రహింతము. ఇఁక మనవారిదివఱకు మనభాషయందు నిర్మించిన కొన్నిపారిభాషికపదములగతి యేమని కొందఱడుగవచ్చును. మనపదములు నాగరీప్రచారిణీ సభవారిపదములకు నవిరుద్ధము లయినయెడల రెండును పర్యాయములుగా వాడుకొనవచ్చును. 'ఆక్సిజన్' అనువాయువును వారు 'అమ్లజన' మనిరి; మనవారు 'ప్రాణవాయు' వనిరి. వీనిని బర్యాయపదములుగా వాడవచ్చును. మనపదము వారిపదమునకు విరుద్ధముగా నున్నపుడు మనము మనపదమును విడువవలెను. ఇందుకుఁ దార్కాణము, మనవారు 'ఆసిడ్' (Acid) అనఁగా 'క్షార' మనిరి. సభవారు 'ఆసిడ్' (Acid) అనఁగా 'అమ్ల' మనిరి. 'క్షార' శబ్దము ఆల్కలీ (Alkali) కి సమానార్థక మనిరి. కాన మనము మనపరిభాషను మార్చుకొనవలెను. ఈ నిబంధనానుసారముగా మాగ్రంథమాలలోని ప్రకృతిశాస్త్రములు వ్రాయఁబడును. ఇతరగ్రంథకారులును నీపరిభాషనే వాడినయెడల మనభాషయందు శాస్త్రీయపరిభాష స్థిరపడఁగలదు.

మేముగాని మావలె నితరప్రకాశకులు (Publishers) గాని ప్రచురించుగ్రంథంబులఁ గొనుట యింగ్లీషు నేర్చినవారు చేయవలసిన రెండవపని. మే మింగ్లీషులో నన్నియుఁ జదివెదము, మాకుఁ దెలుఁగుపొత్తంబు లేల యని కొందఱడుగుదురు. కాని యింగ్లీషు వచ్చినంతమాత్రమున వీరన్ని గ్రంథంబుల నాభాషయందుఁ జదువుచున్నారనుటయు, నాభాషలోని యన్నిశాస్త్రీయగ్రంథంబులు వీరి కర్థ మగు ననుటయు నిజము గాదు.

చరిత్ర (History) విషయమునందును, తత్వజ్ఞాన (Philosophy) విషయమునందును బట్టపరీక్షలలోఁ గృతార్థులయి, Geology (భూగర్భశాస్త్రము), Biology (జీవశాస్త్రము లేక చేతనశాస్త్రము), Zoology (ప్రాణిశాస్త్రము లేక జంతుశాస్త్రము) అను ప్రకృతిశాస్త్రములపేళ్లైనను విననట్టి బీ. ఏ., ఎం. ఏ., పదవి నందినవారల మన మెందఱిని జూచుట లేదు? ఇట్టివారీశాస్త్రముల నితరగ్రంథములఁ దెలుఁగున నేల చదువఁగూడదు? ప్రవేశపరీక్ష మొదలయినపరీక్షలకుఁ జదివినవారికి నిట్టిగ్రంథము లర్థమే కానేరవు. కాన వీరిట్టిగ్రంథంబులు తెలుఁగున నేల చదువఁగూడదు?

తామన్నివిషయములలో నిధులయి తమ కిట్టిపుస్తకములతోఁ బ్రయోజనము లేకపోయినను ఇంగ్లీషు విద్యావిశారదు లిట్టియాంధ్రగ్రంథంబులఁ గొని, యట్టిగ్రంథంబు లెక్కుడుగ వెలువడునటులఁ జేయుట వారికి పరమ ధర్మము. ఎందు కన నిట్టిపరిశ్రమను నభినందించు విజ్ఞానము వారికిఁ గలదు. విజ్ఞానము గలవా రజ్ఞానులవలెఁ బ్రవర్తించుట పాడియె?

ఇదియుఁ గాక మేము వ్రాయుగ్రంథములు జనసామాన్యంబుకొఱకైనను నేఁడు జనసామాన్యం బీగ్రంథంబుల గౌరవముఁ దెలిసికొనలేనందున నింగ్లీషు నేర్చినయుభయభాషావిదులే యిట్టిగ్రంథంబులఁ గొని ప్రచురించువారిఁ బ్రోత్సాహపఱచుచు, జనసామాన్యంబుల కాగ్రంథంబులలోని విషయములఁ దెలుపుచు, నాగ్రంథంబులు జనులకుఁ బ్రియంబు లగునటులఁ జేసి వారికి మార్గదర్శకు లగుచుండవలెను. అటులఁ జేయకునికి మాతృభాషాద్రోహ మనిపించుకొనును.

కేవల సంస్కృతమునందుఁగాని, కేవ లాంధ్రంబునందుఁగాని పాండిత్యము గలవారుగూడ మాకు సాయ మొనర్పవలసి యున్నది. క్రొత్త యింగ్లీషుపదములకు సమానార్థకములయిన సంస్కృతపదములుగాని, ఆంధ్రపదములుగాని సేకరించి యియ్యఁగల్గుశక్తి వీరికి కలదు. నూతనకల్పనల (New Ideas) మనము వారికిఁ దెల్పిన వారు సొగసైన యాంధ్రపదముల

నిర్ణింపఁగలరు. ఇందుకుఁ దార్కాణంబుగ మ-రా-రా-శ్రీ, కొక్కొండ-వేంకటరత్నముపంతులుగారిచే రచియింపఁబడిన 'శ్రీ ప్రిన్సుఫువేల్సు హిందూస్థానసందర్శన' మను గ్రంథముఁ జూడనగు. అందు 'నాంగ్లరాజనీతి' (British Coustitution) యొక్క సంగ్రహవర్ణనయు, బేకన్, షేక్స్పియర్ మొదలయిన యాంగ్లవిద్వత్కవులయొక్క వాక్యంబులకు సరియైన తెలుంగును, దేశాటనమువలనఁ గల్గులాభములవర్ణనయుఁ జూచిన, మన పూర్వపండితులు కొందఱు నిజముగ శబ్దసృష్టికి నీశ్వరు లని చెప్పవలసియున్నది. కాన నింగ్లీషు విద్యావిభూషితు లిట్టి పూర్వపండితులసామర్థ్యంబును వ్యర్థముగ పోనీయక తమగ్రంథనిర్మాణంబునకు వారి సహాయంబుఁ గొనుదురు గాక. పూర్వపండితులును మావంటి యింగ్లీషు నేర్చినవారు వ్రాసెడి నూతనాంధ్రగ్రంథంబుల నసూయతోఁ జూడక యందలిలోపములఁ జూపి యిట్లు దిద్దుకొనుఁడని తెలిపి మార్గదర్శకు లగుటకుఁ బ్రార్థితులు. ఇట్లు పౌర్వాత్యపాశ్చాత్యపాండిత్యసమ్మేళనమువలన మనభాషకు నుభయవిద్యల లోని చక్కఁదనము రాఁగలదు. ఇట్లు

సకలయాంధ్రజనులకు విన్నవించు
విజ్ఞానచంద్రికాసభాసదులు
బుధవిధేయులు,

**నాయని వెంకటరంగారావు,**
మునగాల జమీన్దారు.

**రావిచెట్టి రంగారావు,**
మన్సబ్దారు, హైదరాబాదు.

**కే. వి. లక్ష్మణరావు, ఎం. ఏ,**
మునగాల దివాను.

**జి. హరిసర్వోత్తమరావు, బీ. ఏ.,**

**అయ్యదేవర కాళేశ్వరరావు, బీ. ఏ. బీ. ఎల్.**

విజ్ఞానచంద్రికాగ్రంథమాల. ౧.

అమెరికా దేశాధ్యక్షుఁడగు

# ఆబ్రహాము లింకను చరిత్ర.

(ఛాయాపటమును, 220 పుటలును గలది)

శాశ్వతపుచందాదారులకు అంచెకూలితో అణాలు 8.

ఇతరులకు అంచెకూలి కాక అణాలు 12.

విజ్ఞానచంద్రికాగ్రంథమాలలోఁ బ్రచురింపఁబడు గ్రంథములన్నియుఁ గొనుటకు నొప్పుకొనువారు శాశ్వతపుచందాదారులుగ నెంచఁబడుదురు. వారి కీమాలలోని గ్రంథములన్నియు నంచెకూలితో నూఱుపుటములకు ర్పు. 0-4-0 చొ॥ నివ్వబడును. అట్లు చందాదారులు కాఁ దలఁచినవారు ప్రవేశపురుసుము క్రింద ర్పు. 0-2-0 ల చీట్లు పంపుచు నీ క్రిందిప్రకారము విజ్ఞానచంద్రికామండలికార్యదర్శి గారికి నుత్తరము వ్రాసికొనవలయును.

మ-రా-రా-శ్రీ, రావిచెట్టి-రంగారావుగారికి,

రెసిడెన్సీ బాజారు, హైదరాబాద్ (డెక్కన్).

అయ్యా,

విజ్ఞానచంద్రికామండలి ప్రచురించుపుస్తకములు కొనఁ గోరుచున్నాను. కావున నన్ను దమశాశ్వతపుచందాదారుల నొక్కనిగఁ గొని ప్రతిగ్రంథమును వి. పి. మూలమునఁ బంపుచుండవలెనని ప్రార్థించుచున్నాను. ప్రవేశపురుసుముక్రింద నిందుతో రెండణాలచీట్లు పంపినాను.

పేరు..........................................

గ్రామము......................................

తపాలాపీసు...................................

జిల్లా..........................................

ఈ గ్రంథమాలలోఁ బ్రచురించిన గ్రంథములనుగుఱించి తమయభిప్రాయముఁ దెల్పఁ గోరువారును, మాలలోఁ బ్రచురించుటకు గ్రంథముల వ్రాయఁ దలఁచినవారును మాలాసంపాదకులలో నొక్కరగు జి. హరి సర్వోత్తమరావు, బీ. ఏ., ట్రెయినింగ్ కాలేజ్, రాజమంద్రి యను పేరిట నుత్తరప్రత్యుత్తరంబులు సలుపవలెను.

# పీఠిక.

ఈ గ్రంథమాల యుద్దేశము లిదివఱకే వ్రాయఁబడి యెను. కావున నీజీవితము ప్రచురణకారణము విదితము. జన్మముచే హీనుఁ డయినను స్వప్రయత్నముచే మహౌన్నత్యస్థితికి రాఁగలిగిన యొకమహనీయుఁడు మనకథానాయకుఁడు. ఈ చరిత్ర చదివి పురుషకారమువల్ల నెంత పనియైన సాధ్యమగు ననియు సాధ్యముసేయుటకు దైవ మెల్లప్పుడు సిద్ధముగ నుండు ననియు మనము ప్రథమమున గ్రహింపవలెను. దానంజేసి యీ మహాపురుషుజీవితము మాకును మాచదువరులకును శక్తిశ్రేయస్సుల నొసంగెడుఁ గాత.

ఈచరిత్ర వ్రాయుటయందు నాంగ్లేయభాషలో థేయర్సనుగ్రంథకర్త కృతమగు నాబ్రహాము లింకను జీవితము ముఖ్యముగఁ దోడ్పడినది. కాన నే నతనికి మిక్కిలి కృతజ్ఞుఁడ.

అనుభవలోపంబున నగుదోషము లిం దేవేని గాన్పించినఁ బండితజను లవ్వాని నాకుఁ జూపట్టి మన్నింతురు గాత మని ప్రార్థించువాఁడ.

వైజయంతి ముద్రాక్షరశాలాధికారులు మా తొందరకు నాగి యెంతయు శ్రద్ధతోఁ జక్కఁగ గ్రంథమును త్వరలో ముద్రించి యిచ్చినందుకు వారిని మిక్కిలి కొనియాడవలసి యున్నది.

గాడిచెర్ల-హరిసర్వోత్తమరావు.

# విషయసూచిక.


| | | | పుట. |
|---|---|---|---|
| ఉపోద్ఘాతము | | ... ... ... | 1 |
| ప్రకరణము | 1. | అబ్రహాము లింకను తల్లిదండ్రులు జననము, శైశవము ... ... | 11 |
| ,, | 2. | బాల్యము ... ... ... | 22 |
| ,, | 3. | నూతననివాసస్థలనిర్మాణము ... | 35 |
| ,, | 4. | దుఃఖదినములు ... ... | 45 |
| ,, | 5. | ఉల్లాసతరదినములు ... ... | 59 |
| ,, | 6. | క్రొత్తతల్లి, క్రొత్తవిద్యాలయములు ... | 65 |
| ,, | 7. | కృషి, సంపాదనలు ... ... | 72 |
| ,, | 8. | ప్రవృద్ధి, ప్రకాశములు... ... | 78 |
| ,, | 9. | తెప్పపైఁబ్రయాణము ... ... | 84 |
| ,, | 10. | కొన్నివిషయములు, ఇల్లినాయిసేరుట. | 91 |
| ,, | 11. | న్యూ ఆర్లియన్సుకు రెండవయాత్ర... | 98 |
| ,, | 12. | క్రొత్తయంగడిగుమాస్తా... ... | 105 |
| ,, | 13. | యుద్ధమునకుఁబోవుట ... ... | 113 |
| ,, | 14. | అయాచితగౌరవప్రాప్తి ... | 121 |

పుట.

| | | | |
|---|---|---|---|
| ప్రకరణము 15. | న్యాయవాదిత్వము ... | ... | 134 |
| ,, 16. | గౌరవాధిక్యతం జెందుట | ... | 148 |
| ,, 17. | "సీతగృహా" లంకరణము | ... | 162 |
| ,, 18. | యుద్ధభటులయందనురాగము | ... | 174 |
| ,, 19. | బానిసలకైపడినపాట్లు ... | ... | 190 |
| ,, 20. | ద్వితీయనిర్వచనము, యుద్ధసమాప్తి | ... | 203 |
| ,, 21. | ఘోరహత్య, అంత్యము | ... | 210 |

# ఉపోద్ఘాతము.

మనభూమి గుండ్రముగా నుండుట యెల్లరకుఁ దెలిసినదే. ఈగోళమును రెండుభాగములుగా విభజించి పూర్వార్ధగోళము, పశ్చిమార్ధగోళ మని భూగోళశాస్త్రజ్ఞులు నామము లిచ్చి యున్నారు. పూర్వార్ధగోళమునందలిభూప్రదేశము శతశతాబ్దములుగ ననేకజాతులచే నాక్రమింపఁబడి యనారతము ప్రజల వ్యాపారములచే నిండియున్నది. పశ్చిమార్ధము గొంద ఱడవి జాతులవారిచేమాత్ర మచ్చటచ్చట నుపయోగించుకొనఁబడుచుండి యైదాఱునూర్లసంవత్సరములకుముందుఁ గొలంబసు యాత్రవలన సభ్యరాష్ట్రములకంటఁబడినది. నాఁటినుండి నేఁటివర కీనూతనఖండమున జరిగినమార్పు లత్యద్భుతములు. అం దుత్తరభాగమున వెలుఁగు యునైటెడ్ స్టేట్సు సంయుక్తరాష్ట్రపుఁ బ్రవృద్ధి వచించినఁ దీరదు. లోకమునందు మహాన్నత్యము గాంచి వాణిజ్యంబున నెల్లదేశములఁ గెలిచి సంపత్సమృద్ధికై యగ్రతాంబూలంబు స్వీకరించుటే గాక యీరాష్ట్రము ప్రజాపరిపాలనంబునఁ గూడ లోకమున కుపదేశమియ్యఁ గలిగి యున్నది. కావున నీరాష్ట్రపుఁబుట్టుక ప్రవృద్ధులగుఱించి సంక్షిప్తముగఁ దెలిసికొనుట యత్యావశ్యకము

పదునాఱవశతాబ్దమున నింగ్లాండున మతవిషయికచర్చ లతివిస్తరముగ జరుగుచుండెను. ప్రభుత్వమువా రొకమతం బవలంబించి యితరమతస్థులఁ బీడించుచు వచ్చిరి. మతముపేరు పెట్టి ప్రాణములు గొనుటయు సర్వసాధారణ మాయెను. అనేకులు చిత్రవధకైనను వెనుదీయక తమమనస్సాక్షికి సమ్మత మగుమతమును వదల రైరి. మఱికొందఱు స్వేచ్ఛానుసారముగా దేవపూజ లొనర్చుకొనుటకై విదేశములకు వెడల సాగిరి. అట్లు వెడలినవారిలో నొకగుంపు మొట్టమొదట యునైటెడ్ స్టేట్సు విత్తు నాటినవారు. న్యూ యింగ్లం డను ప్రదేశమున దిగి నివాస మేర్పఱచుకొని మొదట పల్లియలుగఁ దరువాతఁ బట్టణములుగఁ జేరిరి. వారియభివృద్ధిం గాంచి యితరులును రా నారంభించిరి. ఆంగ్లేయప్రభుత్వమువా రిట్లు దేశాంతరగతులైన తమవారికి సాయ మొసంగుచుఁ దమ యధికారముక్రింద నవీనమండలము లేర్పఱుప నుత్తరువు లిచ్చిరి. జనులు వర్తకసంఘములుగఁ జేరి రాజునాజ్ఞమీఁద నమెరికాలోఁ గ్రొత్తక్రొత్తసీమల నాక్రమించుకొని యేల మొదలిడిరి. కావున నీసంఘములప్రతినిధులే యధికారము వహించి పరిపాలించుచుండిరి. మున్మున్ను వచ్చి యుత్తరభాగమునఁ జేరిన ప్రజలు దమప్రతినిధులచే రాజ్యభారనిర్వహణము సేయించుచుండ దక్షిణమున వర్తకసంఘములయధికారులే రాజు లైరి.

దీనివలన నుత్తరభాగమున జనులెల్ల నొక్కరీతిగఁ బరిగణింపఁ బడుచు రాజకీయవిషయములఁ బ్రతినిధులద్వారా స్వానుకూల విధులనే యంగీకరించుచుండ దక్షిణమున దర్జాభేదము లెక్కువ యై కాయకష్టము హేయముగ నెంచఁబడి బానిసవ్యాపారము గడుపెంపు నొందుటకు మార్గము లేర్పడెను. అయిన నాంగ్లేయులకు స్వాతంత్ర్య మనినను బ్రాణ మనినను నొక్కటియ. కాబట్టి దక్షిణ భాగమునందలి వారుగూడఁ దమ దమ ప్రజా ప్రతినిధిసంఘముల వృద్ధికై పాటుపడుచుఁ బరిపాలనా భాగము విశేషము దమచేత నుంచుకొనుచు వచ్చిరి.

ఇట్లగుట నిప్పుడు యునైటెడ్‌స్టేట్సను ప్రదేశమున మొదట మొదట నింగ్లాండునకు లోఁబడి కొన్ని పరిపాలనా స్వాతంత్ర్యముగల పట్టణములును, సీమలును, మఱికొన్ని యర్ధస్వాతంత్ర్యముగల సీమలు నుండెను.

ఇవన్నియుఁ గాలానుగుణముగఁ బోయినపోక లనేకములు గలవు. ఇట విస్తరమనవసరము. ప్రథమముననుండి యీపట్టణములవారును సీమలవారును నేకీభావమున మెలఁగుచుందురు. తమలో నెవ్వరికేయాపద వచ్చినను అందఱుఁ జేరి దాని నివారింపఁ జూచుచుందురు. 1770-వ సంవత్సర ప్రాంతముల నాంగ్లేయ ప్రభుత్వమువారు దమదేశీయుల లాభమునకై యమెరికా యందలిసీమలపై గొంతపన్ను విధింపఁజొచ్చిరి. తమలో

నొకరిపైఁ బన్ను విధించు నధికార మాంగ్లేయుల కిచ్చినచో నందఱ కాకీడెప్పటికో యొకనాఁటికిఁ దప్పదని తెలిసికొని, యాంగ్లేయులు భేదోపాయము ప్రయోగింపఁ జూచినను, నాసీమ లెల్ల నొకకట్టుగ వారి నెదిర్చినిలచెను. ఆంగ్లేయు లెన్నియుపాయములు సేసినను సాగనందున యుద్ధమునకు సమకట్టిరి. ఆ సీమలవారును వెనుదీయక సమర మొనర్చిరి. తండోపతండములు సైన్యములుగొని యిరువాగులవారును దిక్కులు పిక్కటిల్లఁ జేయు భేరీ రవంబులతోడను నాయుధమనిన గజగజ వడఁకు పిరికినైన సంపూర్ణోత్సుకుఁ జేయు సింహనాదంబులతోడను గదలి మాటిమాటి కొండొరులతో నొరసికొని జయాపజయంబులఁ గొనుచుఁ, బట్టణముల ముట్టడింపుచు, విడిపించుచు, దేశము నాక్రమించుచు, నాక్రమణఁ దేర్చుచుఁ బలువిధముల బహుకాలము పెనఁగిరి. ఈపోరాటమున నాంగ్లేయులే యెక్కుడు దుర్దశఁ గుడిచి తుట్టతుద కమెరికాజనుల దాడికోర్వలేక కొందఱకు వారిచేఁ బట్టువడి తమయధికారము నంతయుఁ గోలుపోయిరి.

ఇట్లాంగ్లేయుల యధికారము నుండి దప్పించుకొని యీ సీమల వారు దామైకమత్యము గలిగి యేకరాష్ట్రముగఁ జేర కుండిన నితరులనోర్చుట కష్టమనుట మనసునకుఁ దెచ్చుకొని సంయుక్త రాష్ట్రమేర్పఱుపఁ జూచిరి. సంయుక్తరాష్ట్రవ్య

శక్తిబంధములు మొదట మొదట నామమాత్రములే యైయుం డెను. ఏసీమ వారాసీమ మేలుకీడుల యెడనె మెలఁకువగలిగి సంయుక్తరాష్ట్రపుఁ జట్టదిట్టముల లెక్కకుఁ గొనకుండుట దటస్థించుచుండెను. సీమలెక్కడ మరల వేరుపడి పోవునో యను భయముగూడ మెండుగ నుండెను. అయిన రానురాను జనులొకరితో నొకరుగలిసి వివాహవ్యాపారాదులవలన దగ్గర చేరుటచే సంయోగపు ఫలములు దెల్లమగుచు వచ్చెను. జాతీయతగౌరవ మిట్టిదిగదా యనుట వారికిఁ గ్రమేణ స్ఫురించెను. జాతీయతప్రవృద్ధి తోడనే సంయుక్తరాష్ట్రతయుఁ బ్రవృద్ధిఁ జెందెను. అప్పుడు 'సీమ' జనులు దమమేలును సంయుక్తరాష్ట్రపు మేలును నొక్కటియే యనియుఁ దాము సంయోగమున భాగస్థులు గావున సంయుక్త ప్రభుత్వమునకు లోఁబడుట యితరులకు లోఁబడుటగాక తమ నిబంధనల గౌరవించుకొనుట యనియు సంయుక్తరాష్ట్రపు నౌన్నత్యమునకై 'సీమ'లకుఁ గొంత నష్టము వచ్చినను నష్టముగా గణింపఁ బడగూడదనియుఁ దలంపఁదొడఁగిరి.

దక్షిణపు సీమలయందు బానిస మెక్కుడుగ నుండెనని నుడువఁబడినది. వానిని "బద్ధసీమ" లని పిలిచెదము. ఈ బద్ధసీమలఁ గూలిపని యను మాటయే యెరుదు. ఏకార్యమునకుఁ జూచినను 'దాసు'లనే యుపయోగించుచుందురు.

దాసులకుఁ బెట్టునది పిడికెడు కూడు, తొడిగించున దోక ముతుకగుడ్డ, కట్టిపెట్టున దోక రాతిగోంది, యనుభవింపఁ జేయునది సంకెళ్ల మోతయు, కొరడా దెబ్బలరుచియు. ఇవన్నియు యజమానికి వ్యయము లేక దొరకుచుండును. పశువుల కర్చుకంటె బానిసలకర్చు తక్కువగుట బానిస వ్యాపారము రానురాను మిక్కిలి యధికమాయెను. ఎచ్చటి జనులను దారిదప్పించి శరణరాహిత్యులఁజేసి దొంగిలించుకొనివచ్చి యీ సీమల నమ్ముచుంట సాధారణమయ్యెను. ఇట్టి యమానుషపుఁ గృత్యముల మొదలంట నశింపఁజేయ నుద్యమించి యుత్తర సీమలవారు ప్రయత్నములు సేయనారంభించిరి. కొన్ని దక్షిణ సీమలు దమ పూర్వ ఘోరాచారముల వదలి "ముక్తసీమ" లగుచు వచ్చెను. మఱికొన్ని సంయోగమునుండి దొలఁగిపోవ సిద్ధపడెను. బానిస వ్యాపారమున కడ్డుపడకూడదని మహాయల్లకల్లోలములు జరిపెను. అయినఁ దుట్టతుదకు మానవునం దడఁగియుండు దైవికాంశము పైకి లేచి యయ్యాసురప్రవర్తనఁ దుదముట్టింప సమకట్టి యుత్తరదక్షిణసీమలకు యుద్ధము వెట్టి దక్షిణసీమలఁ బరాజితులఁజేసి తనపనిఁ దీర్చుకొనెను. ఇది సులభసాధ్యము కాదాయెను. అనేకులు మహాత్ములీపనికై, దమ యసువులఁ దొరగవలసవచ్చెను. అయినను "ధర్మోజయతి" యనువాక్యం బెప్పటికైనఁ గల్ల యగునే. ఎంత ప్రబలుఁడైనను

ఖలుఁడు బహుకాలము నిలువఁడుగదా! బౌనిసంబున కంత్య కాల మాసన్నమై మన కథానాయకుని దనతోడనకొని పర లోకమున కరిగెను. అంతటితో యునైటెడ్‌స్టేట్సు సంయుక్త రాష్ట్రిత శిలాశాశ్వత మాయెను.

ఈసంయుక్తరాష్ట్రపు సార్వభౌమత్వము మూఁడుపట్ల నివసించెడిని.

i. సీమ ప్రతినిధి సభ:—ఆఱుసంవత్సరముల కొకమారు ప్రతి సీమయందలి చట్టనిర్మాణ సభవా రాప్రదేశ మందలి ప్రాముఖ్యు లిద్దఱి నేర్చి యీ సభకుఁ బంపుచుందురు. వీరు 30 సంవత్సరములకుఁ పైఁబడి లోకానుభవము గలవారుగా నుందురు. వీరి యభిప్రాయములు జనసామాన్యుల మేలు ననుసరించి స్వబుద్ధిజనితము లై యుండును.

ii. ప్రజాప్రతినిధి సభ:—సీమచట్ట నిర్మాణ సభకుఁ బ్రతినిధుల నేర్పఱచువారే వీరిని నిర్వచింతురు. సంయుక్త రాష్ట్రపుఁ జట్టదిట్టము లన్నియు నీరెండు సభల మూలముననే యేర్పడవలెను.

iii. దేశాధ్యక్షుఁడు:—ఆ చట్టదిట్టముల చెల్లించు సర్వాధికారము దేశాధ్యక్షునికిఁ గలదు. అతఁడు చట్టదిట్టములు నిర్మింపఁ బడుతరి వానికంగీకరింప వలెను. అతని యంగీకారము లేనియెడల నావిషయము మఱల పైసభల

యందుఁ జర్చింపఁబడి మూఁట రెండువళ్లు సమ్మతులఁ బడసిననేకాని రాష్ట్రమునఁ జెల్లదు. దేశాధ్యక్షుఁడు నాలుగుసంవత్సరముల కొకమారు జనసామాన్యులచేఁ బేర్కొనఁబడు నిర్వాచకుల సమ్మతుల వలన నేమింపఁ బడును. అతఁడా రాష్ట్రమున జననమందియుండవలయును. ముప్పదియైదు సంవత్సరములకు లోఁపుగా నుండఁగూడదు. ఒక్క మతమునకుఁ జేరియుండవలెనను నిర్బంధము లేదు. తా నధికారమున నుండునంతకాలము స్వచ్ఛందవృత్తి రాజ్యభారము నిర్వహింప వచ్చును. విదేశీయులతో యుద్ధము, సంధిమొదలుగాఁ గల్గువిషయముల నిర్ధారణ సేసికొనుటయందును దేశమునందలి యుత్తమస్థానముల కితరుల నేర్పఱచుటయందును మాత్రమ యతఁడు సీమ ప్రతినిధి సభకుఁ లోఁబడి యుండవలయును. ఈ పదవిని గుఱించి యుపన్యసించుచు బ్రైసను మహాచరిత్రకారుఁడు లోకమున నెల్ల మహా మతాచార్యుల స్థానమునకుఁ గుడి చేయి కెడమహస్తముఁ బోలు మహోత్కృష్టపద విది దక్క వేరొండు లేదని నుడివియున్నాఁడు. ఆంగలోదేశపు రాజును హిందూదేశపుఁ జక్రవర్తియు నగు నామహా పురుషుఁడును ఆసియా, యైరోపాఖండముల నుత్తరభాగమంతయుఁ దనస్వాధీనమున నుంచుకొని ప్రజలఁ గడగడవడంకఁ

చేయు నాసార్వభౌముండగు జారును ప్రపంచమున నిఁక నేరాష్ట్రాధిపతియు నమేరికా దేశాధ్యక్షుని శక్తి గౌరవంబులఁ గానఁ డనుట కెంతమాత్రము సందియంబందఁ బని లేదు. ఇట్టి లోకోత్కృష్ట పదవి నందిన వారిలో ననేకు లతిహీన జన్ములు గలరు. స్వకాయకష్టంబునను, స్వబుద్ధి విశేషంబునను ఈరెంటికన్న మిన్నయగు స్వగుణశీలంబునను వీరు దేశోద్ధారణ కార్యధురంధరులై యాచంద్రతారకంబగుఁ గీర్తిసామ్రాజ్యంబున సర్వాధికారంబు వహించి తాము పరిపాలించిన యీ యునైటెడ్ స్టేట్సునకు వన్నె వెట్టుచు క్షణభంగురం బగుస్థూలకాయంబు వదలి సూక్ష్మ స్వరూపంబునఁ బ్రపంచము నెల్ల లేవదీయఁ జూచుచున్నారు. అబ్రహాములింకనం దగ్రగణ్యుఁడు. అతని చరిత్ర నిచ్చట సంగ్రహముగ వ్రాయఁ బూనితిమి. దాని జాగ్రతతోఁ జదివి పరిశీలించినచో దేవుఁ డెంత కరుణాళుఁడో మనుజునకు వృద్ధిఁ బొంద నెంతశక్తి స్వాతంత్ర్యము లిచ్చియున్నాఁడో, మనదేశమునం దీశక్తి స్వాతంత్ర్యము లుపయోగించు కొనకనో, యుపయోగించు కొనుటకు వీలులేకనో కష్టతమములగు పురాతన సాంఘిక పద్ధతులకు లోఁబడియుఁ బరదేశీయుల యవచ్ఛిన్న సార్వభౌమత్వపుఁ జల్లని నీడనుండి సంతసింపవలసి వచ్చియు మన

హీనజన్ములందెందఱ ఆ బ్రహ్మణములింకను లడుగంటి పోయిరో చదువరుల చర్చింపఁ గలుగుదురు.

VISWANATHAN TEKUPALLI
FLAT 501, 'PRASANTH TOWERS
MUSHIRABAD MAIN ROAD,
HYDERABAD-500048. (A.P.

# ఆబ్రహాము లింకను.

## మొదటిప్రకరణము.

### ఆబ్రహాము లింకను తల్లిదండ్రులు, జననము, శైశవము.

రమారమి యొకటిరెండు శతాబ్దములకుఁబూర్వ మమెరికాఖండ మిప్పటివలె ధనసంపత్తిచే నొప్పి, గొప్ప పట్టణములనేకములచే నలంకరింపఁబడి లోకమందెల్లర కన్నుల మిఱుమిట్లు గొలుపుచుండుట లేదు. ఎచ్చటఁ జూచిన నడవులు విస్తారమై ఎఱ్ఱ యిందియనులను మోటుజాతివారితో నిండి యితరులకుఁ జోర భయము గల్పించుచుండు. అప్పుడప్పుడ తెల్లవారనేకు లితరఖండముల నాక్రమించుకొనిన తెఱంగుననే యీ ఖండము నాక్రమించుకొనఁ బ్రయత్నించుచుండిరి. పాశ్చాత్యులఁ దమదమ దేశముల జీవనోపాయము లేనివారు మనదేశమునందు వలె నాకలములఁ దినియో బిచ్చ మెత్తికొనియో పొట్టఁబోసికొనుట లేదు. ఇతర దేశములకుఁ దఱలి మొదటమొదట కష్టములపాలయ్యు తాను తాను స్వశక్తిప్రయోగమునఁ బ్రవృద్ధిఁగాంచి యిప్పటి యమెరికనుల వలె సుఖం

బుందురు. అయిన నెంతసాహసవంతు లయినను దారిద్ర్యమున మునింగి తేలువారే యిట్టిపనికిం బ్రప్రథమమున నడుముకట్టుచుం దురు. అమెరికాయందు నూరుసంవత్సరములకును న్నుత్తర పశ్చిమభాగములయందలి ఎఱ్ఱ యిందియనులు దెల్లవారసిన బద్ధవైరముం బూనియుందురు. ఆభాగముల వసించు యూరో పియనులంద ఱన్నివేళలం దుపాకి సాయము గొనక యిలువెడ లుట లేకుండెను. అంత జాగ్రత్తతో బయిలుదేరినను వారు తమ ప్రాణములం బిడికిటం బట్టుకొని ఎఱ్ఱ యిందియను లెప్పు డేమార్చి పైంబడుదురో గదాయని జంకుచు నటునిటుం జూచుచు మెలంగు చుందురు. మహాత్ముల కాలవాలమగు నిట్టితరుణమున నాబ్రహాము లింకను తాత పూర్వ ప్రదేశ మగు వర్జినియాయందుండి యచట జనబాహుళ్య మగుట గాంచి కెంటక్కీసీమ సారవంతమనివిని పశ్చిమభాగమై దుఃఖభాజ నంబగుటం గూడ లెక్కగొనక యచటికి 1780 సంవత్సరమునం బ్రయాణమై పోయెను. అప్పటికి లింకను దండ్రియగు థామసు రెండుసంవత్సరములవాఁడు. అతనిని మఱియిద్దఱు కుమారు లను, ఇద్దఱు కూతులను వెంటంబెట్టుకొని మహాయాసములకు వెనుదీయక లింకను తాత కెంటకీ సీమం జొచ్చి యొక నివాస స్థల మేర్పఱచుకొని నాలుగుసంవత్సరములు గడపెను. ఆ నివాసమున నొకనాం డతండు తనపెద్దకుమారులం బ్రక్కపొలములం

బనిచేయఁ బంచి థామసును దగ్గర నునుచుకొని తానొక చేని కావరణము గట్టుచుండెను. ఆ కార్యమున మగ్నుఁడై యుండఁ దటాలున నొక్కగుండుదెబ్బ యతనిని నేలఁగూల్చె. థామసు దిగ్భ్రమఁ జెందె. అతని యన్న మార్డికే సాహయ్యార్థము ప్రక్కపల్లియకుఱికె. మఱియొకయన్న జోషియా దమకుటీరముఁ జేరుకొని గోడకన్నముల నుండి శత్రువులఁ బరిశీలింపఁదొడఁగె. వారు దమ దాగుడుభూమి వదలి యేతెంచి తండ్రి భూమిప్రాల దిగ్భ్రమఁజెంది నిలుచున్న థామసుగాంచి యతని నెత్తుకొనిపోవఁ బ్రయత్నించిరి. అయిన జోషియా సూటిగఁ జూచి థామసు నెత్త నుద్యమించుచుండిన యిందియనును యమనిలయంబున కతిథిఁ జేసె. మార్డికే సబలుఁడై యారంగముపైఁ జూపట్టె. థామసును దిగవిడిచి యిందియనులు రయమునఁ దొలఁగి చనిరి.

కటకటా! కడుపుకక్కురితిఁ దనకును దనబిడ్డలకును భోజనము సమృద్ధిగ దొరకును గదా యనుపేరాసచే లింకను తాత యిట్లు చిచ్చుఱికి ప్రాణములఁ గోలుపోయెఁగా! ఇఁక నతని కుటుంబమునకు జీవనాధారమేమిగలదు. చేతికష్టము చేసి వారిని దొందరలపాలుసేయక రక్షించుచుండిన యా సత్వసంపన్నుని కళేబర మింటికిఁ దెచ్చినపు డావిపన్ను లెంత గోలిరో మనమూహింపఁగల్గుదుమే?

భర్త పరలోకగతుండగుటయు థామసుతల్లి యాప్రదేశము విడిచి చనెను. థామసు పెద్దవాఁడైనంతనే యతఁడు స్వపరిశ్రమమున సంపాదించుకొని బ్రతుకవలసి వచ్చెను. అతఁ డంతగ నొకచో నిలువంచి పనిసేయువాఁడు గాఁడు. ఒకయూరి నుండి మఱియొకయూరికిని ఒకవ్యాపారమునుండి మఱియొక వ్యాపారమునకును దిరుగు స్వభావ మతనికిఁ బుట్టువడి యుండెను. సోమరితనమునఁ బర్యటనము సలుపుచుండుటవలన నతని కొక్క చిన్నలాభము గలిగెను. అక్కడక్కడ వినుచుఁ గనుచు వచ్చిన విశేషము లనేకము లతనిశిరోపేటికఁ జేరి భావికాలమున నితరులకుఁ బ్రదర్శింపఁ బడుచుండుటఁ జేసి యతని కత్యాదర గౌరవములఁ దెచ్చిపెట్టుచుండెను.

త్రిమ్మరియై బహుకాలము చుట్టిచుట్టి కట్టకడపట నేదేని యొక వృత్తి ప్రవేశింతముగాకయని యిచ్చయొడమి యతఁ డెలిజబెత్ టవునునందుఁ బ్రబలుఁడగు జోసెఫ్‌హాంక్సను నొక వొడ్లంగివద్ద పని నేర్చుకొనఁ దీర్మానము చేసికొని యతని గృహమునకుఁ బోయెను. అచ్చట నితఁడొక్క దెబ్బన రెండు పిట్టలఁ గొట్టినట్లు విద్యాభార్యల రెంటిని గడించెను. వృత్తియం దతని కంతచౌరవ మలవడదాయెను. సర్వసాధారణ వస్తువుల నిర్మించుటయందు మాత్ర మతనికి శక్తిగలిగెను. నైపుణ్యమునఁ దాపి చక్కని పనివాఁడని పేరువడయుట కతఁ డసమర్థుడు

డయ్యెను. కావున నిందుఁ గళత్రసంపాదనమె యతని కెక్కుడు లాభకారియాయెను.

ఆలాభము పొంది థామసు ఎలిజబెత్ టవునులో నొక గుడిసెకుక్కియందుఁ దనగృహిణితోఁ గొంతకాలము వసించి యచటినుండి నోర్లి-చరి దరియం దంతకం టెఁగొంచె ముత్కృష్ట మగు నొక కొయ్యగుడిసె నిర్మించుకొని యచటికిఁ జనియెను. అది గవాక్షద్వార శూన్యంబై, సమప్రదేశ వర్జితంబై, నిర్జన భూమధ్యస్థాపితంబై, పేదరికమున కిదె ముద్ర వెట్టుచున్నదాన నని చాటుచుండెను. అయిన నాప్రక్క శిలలమధ్యము నుండి బుడబుడ ధ్వనులచే వీనుల విందు సేయుచు స్వచ్ఛోదకంబుల కన్నుల కానంద మొసఁగుచు నెల్లకాల మల్లనల్లన ప్రవహించు నొక చిన్న జలాశయమొండాచండకర్కశరంగంబునకు వన్నె వెట్టుచుండెను.

థామసాకుటీరమున కన్న మిన్నయగు గేహంబు నిర్మించుకొన నశక్తుం డగుట నద్దానిన తన యునికి సేసికొని యుండెను. ఇట్లు దురవస్థ పాలగువాఁ డతఁ డొక్కఁడె గాఁడు. అతని తెగవారెల్లరును విద్యాగంధము లేక యెప్పటి కప్పుడు క్షుత్పిశాచంబుఁ బోఁద్రోలు నంతటి సామర్థ్య మైనను లేనివారై దారిద్ర్యమున మునిఁగి తేలుచుందురు.

థామసెప్పుడునుఁ జాతశాల ముఖము సూచినవాఁడు

గాఁడు. నాలుగక్షరము చేర్చి చదువుటకుఁగాని రెండక్షరములుకూర్చి వ్రాయుటకుఁ గాని యతఁడెఱుఁగఁడు. అయిననతనిభార్య ధారాళముగఁ జదువఁ గల్గును. వ్రాయుటయందంత సమర్థురాలు గాదు. తనపేరు వ్రాసికొనునంత మాత్రము పరిశ్రమ గలది. ఇట్లగుట వివాహానంతర మామె దనభర్తఁ గాంచి విద్యాభ్యసనమునకుఁ గాలాతిక్రమణ మెప్పటికిని లేదు. మీ రిప్పటికైనఁ బనిఁబూని యక్కార్య మొనర్పవచ్చుననియె. థామసనువదియెనిమిది సంవత్సరములవాఁడై సౌలభ్యమునందే దృష్టికలవాఁ డగుట ముసలిముప్పునకుఁ దొలిసమర్త యన్నట్లా వయసున నక్షరమాలఁ బ్రారంభించుట దుర్ఘట మని జడసెను. అయ్యిన నాంసి యతని సందియంబులఁ దీర్చి స్వహస్తమున పేరు లిఖింపఁ గల్గినను గుర్తువేసి కాలము గడుపుటకన్న ననేక మడుంగులు లెస్స యగునని తెల్పి దాఁ దనభర్త నంతవానిగఁ జేయ సమకట్టెను. తుట్టతుద కాసాత్త్వికుఁడు దన సతీతిలకమే గురువుగాఁ జేకొని మిక్కిలి శ్రద్ధఁ జేసి బుద్ధికుశలత్కవగాహన మగువిధమున సంతక మొనర్చునంతటి ప్రవీణుఁడై ఈ x గుర్తువేయు విద్యావిహీనుల దుర్గతి నుండి తప్పించుకొనఁ గల్గెను.

థామసు నాంసి వీరిరువురును క్రైస్తవ మతస్థులై యున్నటి బాప్టిస్టు తెగకుఁ జేరినవారు. ఆకాలమున నిచ్చట వారే

సుగుణసంపదకుఁ బేరెక్కి యుండిరి. కావున వా రెల్లప్పుడును స్వామత ధర్మములఁ దప్పక పాటింపఁ బ్రయత్నించుచుందురు. థామసుభార్య యాతనికన్న నెక్కుడు దైవభక్తి గలదియు నెక్కుడు మనశ్శక్తియుతయు. "ఆమె సన్నదై యంత రక్తపుష్టిలేక చుఱుకుదనము గల్గి, సాహ సౌదార్య స్వభావముచే నొప్పి తనవారల మొఱకుదనమునకు వగచుచుండె" నని డాక్టరు హాలండు చెప్పుచున్నాఁడు. "ఆమె కుటుంబమువారామెబుద్ధిచాతుర్యము లనన్యసామాన్యము లని తలంచుచుండి" రని లేమను వక్కాణించుచున్నాఁడు. నిశ్చయముగా నామె గుణగణ్యయై బుద్ధి కుశలత గలిగి యొప్పుచుండెను. ఆమెయందు థామసున కధిక గౌరవమును గౌరవముచే నాదరణానురాగములును బలము నొందెను. అందువలన నాతఁ డామె సుబోధలచే సంపూర్ణఫలము వడసెను.

నిరుపేద లగు నిట్టితలిదండ్రులవలన నిదివఱకు వర్ణింపఁబడిన మహామందిరమున 1809 - వ సం॥ము ఫిబ్రవరి 10 - వ తేది అబ్రహాము లింకను భూమియం దవతరించెను. నాలుగుసంవత్సరములకుఁ దరువాత నతనితండ్రి నాబుచరియదరికి వెడలెను. అచట నతఁడు మూటముప్పది యెకరములభూమి గడించుట మిక్కిలి యాశ్చర్యకరమై తోఁచుచున్నది. రెండవసంవత్సరమే యందు నూరెకరము లమ్మివేయఁబడియె ననుట యీ యాశ్చర్య

మును గొంత నివారించుచున్నది. అయినను దక్కిన ముప్పదియెనిమిది యెకరములైనఁ గొని పైరుపెట్టుట ఈబీద లింకనున కెట్లు సాధ్యమాయెనను సందియము గలుగక మానదు. నాంసీని జేపట్టినదిమొదలు థామ సేదో యొకవిధమున వృద్ధిఁ బొందుచువచ్చె ననుట నిర్వివాదాంశము. అతని పూర్వాచారములును పూర్వగుణవిశేషంబులును మెల్లమెల్లగ నాతని విడిచిపెట్టసాగెను.

థామసు లింకను కథలు సెప్పుటయం దతిసమర్థుఁడు. తమ పూర్వీకుల చరిత్రము నంతయు మిక్కిలి యుత్సాహముతోఁ జెప్పుచుండును. ఇదివఱకు వ్రాయఁబడిన విషయముల కీతఁడు మఱియొక యంశమును వీరరసోత్పాదకంబును జేర్చి తన కుమారుని మనము రంజిలఁజేయుచుండెనఁట. థామసు ఆబ్రహామును గుఱించి "అబ్బీ! మీతాత నాకుఁ జెప్పుచుండిన విషయము లన్నియు విశదీకరింపఁ దొడఁగితినేని దినములు గాదు వారములైనను జాలకపోవును. అతఁ డీ దేశమునకు వచ్చిన 1780-వ సంవత్సరముననే ఎఱ్ఱయిందియనులు గుంపులు గుంపులుగఁ జేరి తెల్లవారిపై దండెత్తివచ్చి ముట్టడించిరి. అప్పుడు మనవా రెల్లరును సైనికులు గావలసివచ్చెను. డేవియల్ బూనను మహావీరుఁడు సేనానాయకులలో నొకఁడుగ నియమింపఁబడెను. జనరల్ క్లార్కు సర్వసేనాధిపత్యము వహించి [illegible] శత్రువుల సమూహంబున నెదు

ర్చెను. అతిఘోరయుద్ధ మొకటి ప్రారంభ మాయెను. ఇంది యనులు తెల్లవారిని బరాజితులఁ జేసి పలుతెఱంగుల వేధింపఁ జొచ్చిరి. బూను కుమారుఁడు గాయము లనేకములు తగిలి క్షతకలిత శరీరుఁ డాయెను. అతనితండ్రి యాతని నెత్తికొని పలాయితుఁ డగుటకుఁ బ్రయత్నించెను. తదర్థ మతఁడు పుత్రుని వీపున మోసికొని ప్రక్కనుండు హ్రాదంబున దుమికి యీదుకొని పోవ నారంభించెను. ఎదురుగట్టు చేరునంతన ఆబాలుఁ డుసురులు దొరఁగెను. అచట నిలిచి తిరిగిచూడ నిందియనులు వెన్నంటి ప్రవాహజలంబులఁ దేలుకొని వచ్చుచుంట విశద మాయెను. తనప్రాణములఁ గాపాడికొనుటకై యతఁడు దిట్టతనము వహించి దనపట్టికళేబరంబు నట్టె దిగవైచి పరువిడవలసివచ్చెను. అట్లు పఱువిడి సురక్షితముగ నతఁడు బ్రయంటు ప్లేసను జేరెను.

ఈ మధ్యకాలమున నిందియనులు ముగ్గురు పడుచులఁ జెరబట్టి గొంపోయిరి. అం దొక్కతె బూను కొమార్తె. ముగ్గురును బూన్సుబరో గ్రామమునకుఁ జేరినవారు. వారు కెంటకీ నదియం దొక చిన్న యోడపై విహరింపుచుండి దూర తటంబు చేరిసి యొడ్డుతాకిరి. అప్పుడు సామీప్యకుంజపుంజంబుల నుండి తటాలున నిందియనులు వెలువడుటఁ గాంచి యా మూఁడుబిడ్డలు మృత్యుసాన్నిధ్యంబున కీడ్వఁబడినతెఱంగున భయవిహ్వలమానసలై ఘనస్వనంబున మొఱ్ఱోయని కేకవైచి

యాకోట యందలిజనుల చెవు లవియఁ జేసిరి. మనవారును ద్వరితగతి సాయమొనర్ప వెలువడిరి గాని వా రాయోడ చేరు నప్పటి కిందియనులు పిల్లలఁగొని కడుదవ్వున కఱగి యుండిరి. రాత్రి యైనందున వారిని దఱుముకొని పోవుట యసాధ్య మయ్యెను. కావున బలములఁ జేర్చుకొని మనవా రిందియనులఁ బోరికొల్పి తమబిడ్డలఁ గాపాడుకొను నుద్యమమున వేకువ జామున బయలుదేఱిరి. వారు నలుబదిమైళ్లు వెదకివెదకి కట్ట కడపట లోకభాంధవుఁడు పశ్చిమాంబుధిఁజేరఁ నాతనికై వగచు జంతుసంతానంపు దుఃఖపుంజంబు వ్యాపించుచున్న దో యనుతెఱంగున తిమిరంబులు దట్టము లగుసమయంబున రాత్రిభోజనంబునకై పచనకార్యంబు లొనరించుకొన దండు విడిచిన యిందియనులఁ గాంచిరి. కాంచి తా మచట నుండుట కనిన నిందియను లాపడుచుల ప్రాణములు గొందు రేమో యనివెఱచి వారి కట్టి కార్య మొనర్చుటకుఁ గాల మొసంగక హటాత్తుగ నొక దెబ్బన బిడ్డలఁ దాకకుండ గురిపెట్టి జడివాన యందలి వడగండ్ల తెఱంగున తుపాకి గుండ్ల కోలాహలంబుగఁ బఱపిరి. ఇందియనులలో నొక్కని గుండుదెబ్బ చెండాడుటయే వా రెల్లరు నీ మహోత్పాతంబునకు నిలువఁజాలక చెల్లా చెదరై పడుచుల విడనాడి దిక్కొక్కఁడుగ పాఱిపోయిరి.”

అని యీవిధమున నుప్పొంగుచుఁ జెప్పుచుండును.

ఇట్టి కష్టతరానుభవంబుల విషయము లాబ్రహాము నం దేలాటి యూహ లోడమఁజేసినదియుఁ జెప్ప నలవిగాదు. అయినఁ దన పూర్వీకుల స్థితికంటె దనస్థితి పెక్కు మడుంగు లనుభవనీయ మనుట మాత్ర మాతనికిఁ దప్పక విశదమై యుండును.

నాంబుచరియ గృహమునందే అబ్రహాము లింకను చేపలు పట్టుట మొదలగు నాటల నేర్చెను. మిక్కిలి చిన్నవాఁడుగ నుండునపుడే యతఁ డసామాన్య శక్తిఁ జూపుచుండెను. ఆరు సంవత్సరములనాఁడే యతఁ డేదుబందుల వేటాడుచుండెను. మఱియుఁ జెట్టు కొమ్మలఁ బట్టుకొని జలాశయంబులపై నూగు చుండు టాతని కత్యానందదాయి. అతఁ డొకనాఁ డీ కార్యమున నుండ నకస్మాత్తుగఁ బట్టువదలి గభీలునఁ దటాకంబునఁ బడియెను. అతని తోడిబాలుఁ డగు బిల్లి మనస్థైర్యంబు నూపి, జాగ్రతపడి, సత్వరమున నతని సేవింపకున్న థామసు లింకను దన పుత్రరత్నంబును, యునైటెడ్ స్టేట్సు దన దేశాభ్యుదయ శిరోమణిని నాఁడు గోలుపోయి యుండును.

అనేకవిధంబుల నాబ్రహాము తన బుద్ధిచాతుర్యంబులను, శక్తి సాహసంబులను బిల్లతనమునందే చూపి తనసాటి బాలుర కంటె మిక్కిలి సమర్థుఁ డగుట వెల్లడి చేసెను. అతని తల్లిదండ్రు లీ విషయమును గ్రహించి సంతసింపక పోలేదు. రాఁ

బోవు ప్రకరణమున నాబ్రహాము లింక నింకొక విషయమునఁ జదువరుల మనంబుల కాహ్లాద మొసఁగెదనుగాత.

---

## రెండవ ప్రకరణము.

### బాల్యము.

ఆబ్రహాము తల్లిదండ్రులు నివసించుచుండిన దేశస్థితిని గురించి యిదివఱకే వ్రాసియుంటిమి. అప్పుడు దేశమునకుఁ దగిన విద్యాశాలలును, విద్యాశాలలకుఁ దగిన యుపాధ్యాయులును అరుదు. మన దేశమునఁగూడ గ్రామము లనేకములయందు బళ్లు లేకుండుటయును, ఉన్నచో నైన తగుపంతులవా రుండకపోవుట దటస్థించుటయు సర్వసాధారణము. పూర్వ నాగరికు లగుప్రజలును నవనాగరికాగ్రగణ్యు లగు ప్రభువులునుఁ గల హిందూదేశమే యిరువదియవశతాబ్దంబున నిట్టి దుర్దశయం దుండ నిప్పటి కొక శతాబ్దమునకు మున్నప్పుడప్పుడ గన్నులు దెఱచుచుండిన యా కెంటకీ సీమయందు విద్యాసాధనములవి యరు దగిన నేమివింత. అందున లక్ష్మీప్రసాదములేని యదృష్ట హీనులకు సరస్వతి చెలిమి కష్టసాధ్యము. థామసు లింకను కొట్టెముక్కకంటె నెక్కుడాశించనివాఁడయ్యెనుఁ దనబిడ్డలఁ జదివించఁ బ్రయాసపడుచుండెను. మొట్టమొదట

ఆబ్రహాము లింకను ప్రవేశించిన పల్లెకూటము రైని యను నుపాధ్యాయునిచే నుంచఁబడి యుండెను. అతఁ డచటికిఁ గ్రొత్తగ వచ్చినవాఁడు. ఉపదేశమునకు వలయు సామగ్రి యెంతమాత్రమును గలవాఁడు గాఁడు. తన శిష్యులకు వాచకముమాత్రము నేర్పఁ గలవాఁడు. వ్రాత గఱపుట కాతనికిఁ జాతుర్యము చాలదు. మిక్కిలి బీదవాఁ డగుట నాతఁడు దన కొద్ది రాఁబడి కేదో యొకకొంతఁ జేర్చి జీవనోపాయ మేర్పఱచుకొనఁ నీపనికిఁ బూనెను. అతనికంటె సమర్థుఁ డిం కొకరుఁడు దొరకనందునఁ దలిదండ్రు లాతని శిష్యులై తమ బిడ్డల నను పనియ్యకొనిరి. ఇట్టి గురువుకడ నాబ్రహాము లింకను తలిదండ్రు లతనికి విద్య యెంతెంత చేకూరిన నంతంత లాభకారి యగు నని నమ్మి యతనిని అతనిసోదరి సారాను విద్యాభ్యాసమునకుఁ బంపిరి. అచ్చటి పుస్తక భాండాగారమున శిథిల మైన డిల్వర్తు వర్ణక్రమ పుస్తక మొండుమాత్ర మొప్పుచుండును. అద్దానినే బహు జాగరూకతతో వారు సంపూర్ణ ఫలాపేక్షచే నుపయోగించిరి. బుద్ధిమంతు లెట్టి స్వల్పసాహాయ్యంబు నైన స్వవృద్ధి కుపయోగించుకొందురుగాదే!

ఈ ట్లుపాధ్యాయులకడ నాబ్రహాము వాచకము నేర్చుకొనెను. అయిన నా విద్యాలయము చాలకాలము నిలచినది కాదు. అయిదారు వారములలోపల దాని యాయు వుడిఁ

గెను. బోధకుల పాండిత్య మొండగొలెఁ గాఁబోలు. శిష్యులఁ గొంద ఱతనికంటె నెక్కుడక్షరజ్ఞు లయిరనిన నంత యనృతముగా నుండదు. అది యెట్లుండిన నేమి. ఆబి (అబ్రహాము) సారా రైనిగారి నుండి సెలవు పుచ్చుకొని మరొండు బడికిఁ దఱలిరి.

అయ్యది హేజల్ అను నతఁ డుంచినది. అతఁడు రైని కంటె పెక్కు మడుంగు లెక్కుడు నేర్చినవాఁడు. తన శిష్య బృందమునకు వాచక లేఖనములు రెండును సాధారణముగ నేర్ప సమర్థుఁడు. మొత్తముమీఁద నతఁ డాబికిఁ బ్రారంభదశ యం దుచితవిధమున నుపదేశ మొసఁగఁ గలిగియుండెను. అయిన నతని పల్లెకూట మాబ్రాహా మింటికి నాలుగుమైళ్ల దూరము నుండెను. నాంసీ థామసు లీవిషయమును లెక్కకుఁ గొన రైరి. ఎక్కువ వ్రయమునకుఁ గూడ వెనుదీయ రైరి. తమ గడించినదాని నతిమితముగ నుపయోగించుకొని బిడ్డలకు విద్యాసంపత్తి లభించినఁ జాలు నని యనేక కష్టముల కోర్వ నిశ్చయించిరి. నాఁటినుండి ఆబిసారాలి రిరువురును ప్రతిదినమును మధ్యాహ్న భోజనమునకు రొట్టెతునుక మోసికొని నాలుగుమైళ్లు నడచి విద్యార్థులై వెడల నారంభించిరి. అప్పుడ యాబ్రహాము విద్యా సంపత్తికిఁ బ్రారంభము. అట నాతఁడు లేఖనము నభ్యసించెను. దాన నంత ప్రావీణ్య మల

వడకుండినను అక్షరములఁ గూర్చునంతటి సమర్థతనొంది యుత్సాహకలితుఁ డయ్యెను. వాచకమునమాత్ర మత్యద్భుత శక్తి సంపాదించెను. ఇంతేల. ఎనిమిది పది వారములఁ దన యుపాధ్యాయు నంతటివాఁ డాబ్రహాము డయెనని నొడివిన నతని బుద్ధివిశేషము బయలుపడఁ గలదు. ఈ విషయము గురువగు హేజల్ గమనించినట్లు నిదర్శనము లున్నవి.

ఆకాలమున నా ప్రాంతమున మత ప్రసంగమున కెడము లేకుండెను. దేవాలయములును, మతవిషయిక సభలును మిక్కిలి యరుదు. ఆప్రదేశమున కప్పుడప్పు డొక మతాచార్యుఁడు వచ్చుచుండును. దైవికజ్ఞాన మంత గలవాఁడు గాకున్నను పురోహితన్యాయనతఁ జేసియు, సర్వజనప్రియత్వం బునఁ జేసియు, నతఁడె స్వాగతం బనుభవించుచుండును. అతఁడును నెడనెడ లింకనుల కుటీరమున నుపన్యసించి తన త్రోవఁ దాఁ బోవును. కావున సాధారణార్చనలును బైబిలు పఠనమును వారు దమంతకుఁ దామ నెరవేర్చుకొనుచుండురు. ఆబ్రహాము లింకను దల్లి యక్షరజ్ఞురాలు. భాను వాసరం బులను మఱి యితరదినములను దమకుఁ గల పుస్తకరాజం బొక్కటి బైబిలును పలుమారు చదువుచుండును. దాని వినుట యందును నద్దాని యందలి కథలకుఁ జెవి యిచ్చుటయందును నాబికి మిక్కిలి యాసక్తి. పుస్తకము చదువ నేర్చుకొనుటకు

మున్నె యతఁడు బైబిలునం దెక్కుడుభాగము నెఱింగికొనెను. విద్యాభ్యాసనము చేసినతరువాత నాయన కొదవిన ప్రథమ గ్రంథము నదియె. గొప్పవాఁడై లోక వ్యవహారములఁ జే రొందునప్పటికిఁ గ్రైస్తవుఁడు గాకున్నను అతఁడు బైబిలును మాత్రము మరవలేదు. తలుచుగ నా గ్రంథస్థిత విషయముల నట్టె ప్రయోగించుచుండె ననుట కనేకదృష్టాంతము లున్న యవి. ఆ యుత్కృష్ట గ్రంథపఠనం బాబ్రహామునందు నమ్రత, సత్యము మొదలగుసద్గుణముల యంకురములను నాటి యతని పురోభివృద్ధికిఁ దోడ్పడెననుట నిర్వివాదాంశము.

కెంటకీ సీమ 'బానిససీమ' యగుటఁ దత్ప్రాంతమున నేదేని యొక 'ముక్తసీమ' గలిగిన నటకు వెడలుదముగా కని లింకనులు వేచియుండిరి. వారిట్టిప్రయత్నమున నుండుటకుఁ గారణము మఱి యొకటిగలదు. కెంటకీ సీమయందు క్షేత్ర స్వామ్య మస్థిర మగుచుండెను. అనేక సంవత్సరము లెండ యనక, గాలి యనక కష్టించి భూమి వృద్ధిఁ జేసికొని యనుభ వింతము గదా యని యుండ నోటికివచ్చినకడి జారిపడె నను విధమున భూ స్వాతంత్ర్యం బగోచరం బగుచుంట కటస్థిం చుచు వచ్చెను. అనేకులు దమ పూర్వీకులు గడించిన స్థితి నంతయుఁ గోలుపోయి రిక్తహస్తు లయిరి. కష్టనష్టపఱు పాటిల్లుచుండఁ జూచి ప్రతి భూస్వామియుఁ దన భూ

కెక్కప్పుడు నిరర్థకం బగునో యని జడియుచుండును. ఈ భయము లింకనులకుఁ గూడ కలిగెను. ఈ రెండు కారణములకును థామసు పర్యటనేచ్ఛ ప్రోద్బలం బొసంగుచుండును. ఇట్టి సందర్భముల 'ఇండియానా' ముక్తసీమ గాఁగలదా యను విమర్శ జరుగుచుండుట విని యా విషయమున థామసు నాంసీ లిరువురును మగ్నులైరి.

1816-వ సంవత్సరము ఆకురాల కాలమున 'ఇండియానా' ముక్త సీమయై యునైటెడ్ స్టేట్సు సంఘ రాష్ట్రమునఁ జేరెనను వార్త బయలువెడలెను. సీమాంతరముల నుండి యచటికి జనులు గుంపులు గుంపులుగఁ దరలుచుండి రనుటయు విశద మాయెను. లింకనులకుఁ గ్రొత్తసీమఁజేర దత్తరం బొడమె. తమస్థితి నమ్ముకొనఁ గలిగినతోడనే ప్రయాణం బగుట కాయత్తబడిరి. అమ్ముట కియ్యకొనినఁ గొనువా రొకరు వలయునే యను చింత వారిని బీడింపఁ దొడఁగె. దేశ కాల గతులను బట్టి యచటఁ గొనువారే గరువైరి. వేచివేచి తుట్టతుదకు 1816-వ సంవత్సరము అక్టోబరు నెల మధ్యదినములఁ దమ కుటీర ద్వారమున నొక నూతన విగ్రహమును కోల్బినిఁ గాంచిరి. అతఁడ వీరితో బేర మాడ నేతెంచినవాఁడు. కొద్ది భూస్థితి సంపాదింప నిష్టము గలవాఁ డగుటఁ గోల్బి లింకనుల చేనులఁ గొన నుద్యమించెను. కాని వాని వెల నొసంగుట కతనికడ ద్రవ్యము

లేదాయెను. వ్యాపారమునకుఁగాను చేర్చిపెట్టిన సారాయి మాత్రము దగినంత యుండెను. * లింకను తనభార్య సలహా యడిగి మఱి వేరు మార్గము గానక సారాయి చేయుట నెఱుగని 'ఇండియానా' జనుల కడ్డానిఁ నమ్ముకొనిన ద్రవ్యము గడింప వచ్చునని తలఁచి కోర్చి చెప్పిన మార్గము నవలంబింప నియ్యకొనియెను. †

బేరము ముగిసినతోడనే థామసు దన నవీన నివాస స్థలమునకుఁ దరల నాయత్తము కావలసి వచ్చెను. కొంత భాగము ధనముగను విశేషభాగము సారాయిగను దన గృహోదికముల విలువగఁ జేకొని యా సరకు నొక తెప్పపై నిడుకొని యుపక్రమ ప్రయత్నములఁ జేయఁ దా నొకఁడ వెడలి చనెను. త్రోవన దురదృష్ట మొకండతనిఁ గలంచె. తనసొత్తున కపాయ మేమి లేక దరిచేరు సమయము సమీపించెగా యను సంతసమున నతం డుండఁ, దటాలున నా తెప్ప పల్లటిలి సారాయి

* ఆకాలమున నాదేశమున సారాయి యమ్ముటగాని కొద్దిగ స్వీకరించుటగాని తప్పుగ గణింపఁబడుట లేదు. తాగుబోతుతనముమాత్రము దూష్యమై యుండె.

† నాణ్యము లింత ప్రబలినకాలమున నొకఁడు దన గృహమును సారాయి కమ్ముకొనె ననిన నతిచిత్రముగ నుండునని యొక యాంగిలేయ పుస్తకకారుఁడు నుడువుచున్నాఁడు. మనదేశమున నిది యొక వింత యని తోచనేర దని చెప్ప నొప్పును. దరిద్రులై ద్రవ్యార్జన విశేషముగ లేక ధాన్యమునకనేక వస్తువుల గొనువారు మనవారనేకులు.

తిత్తులు జలంబులఁ బొరల నారంభించె. థామసు సొమ్ము దక్కించుకొను సంభ్రమమున నా తెప్ప నెక్కి పట్టుట కెదురువైపునకు పరుగిడియెఁ గాని సారాయిబరువుచే నా తెప్ప దలక్రిందులాయెను. తిత్తులతోఁగూడ దాను నీట మునుఁగవలసి వచ్చుట గాంచి యతఁడు ప్రయత్నించి యా తెప్ప పట్టు వదలక తన ప్రాణములఁ గాపాడుకొన సన్నద్ధుం డాయెను. అప్పుడ "అధైర్యపడకు మధైర్యపడకుము. మే మిదె యొక్క నిమేషంబున వచ్చితి" మను శబ్దము విననాయెను. అందుల కానందం బంది థామసు దత్తరపాటున "శీఘ్రంబు నను రక్షింపుఁడే" యని కేక వైచెను. కొందఱు దనుఁ బై కెత్తుచుండు టతనికి విశదమాయెను. ప్రక్కనఁ దమ కార్యముల మెలంగుచుండిన యోడవా రతనిపై జాలిఁగొని రక్షింప వచ్చియుండిరి. వా రతనిఁ దమ పడవపై నెక్కించుకొని యతని సామగ్రి నెత్తియిచ్చుటకుఁ బూనిరి. ఓహియోనదియం దిట్టి యుత్పాతము లాదినములలో బహుమెండు. తన్నివారణానుకూలు లగుసహాయులు పెక్కండ్రుందురు. వా రితరుల కష్టములఁ దీర్చుటకుఁ గంకణముఁ గట్టియుందురు. సోదరభావంబును నైకమత్యంబును నెల్లెడలఁ గనుపఱచిగాదే పశ్చిమదేశము లతివినుతిఁ జెందినవి.

ఇట్లు థామసు రక్షింపఁబడి దనరక్షకు లెత్తి యియ్యఁగల్గిన సొమ్మును మరల దన తెప్పపై నెక్కించుకొని వారు

సూచించిన దారిని యుద్దేశితస్థానముచేరి లంగరు వైచెను. అటనుండి పదునెనిమిది మైళ్లు లోపలికి సారాయితోఁగూడ తన్నుఁ గొంపోయి విడుచుటకు పోసీ యను మార్గదర్శకుని నియమించుకొనియెను. అతని కుంకువగఁ దన తెప్ప నియ్యనంగీ కరించెను. పోసీ యొక కాడిఎద్దులు గలవాఁడు. తెప్పనొకదాని నెచ్చటనైనఁ గొనవేచియుండెను. థామసునకుఁ దెప్పతోఁ దరు వాతఁ బనిలేకుండెను. కావున వీరిద్దఱికిని నీచేరము పొసఁగెను.

పయనమై కదలుటకుమున్న దేశస్థితి చక్కఁగ గుర్తెఱిఁగినవాఁడు గాన పోసి "ఈ ప్రాంతముల మంచి బాటలు లేవు. మన మడవి ఛేదించుకొని వెడలవలసియుండు" నని నొడివెను. థామసద్దానికిఁ గుంది "నివసించు జనులైన నిందున్నారా" యనియెను. "అచ్చటచ్చట నలువురు నలువు రున్నారు. మిముఁ జూచినవా రత్యానంద మొందెదరుగాక. వెడలుదము రండ"ని పోసీ దన కాడిగట్టి దానిపై తిత్తుల నెక్కించి తన యజమానునిఁ దోడ్కొని దారిఁబట్టెను. కడుదవ్వరుగకమున్నెఁ దట్టం బగు గహనప్రదేశ మాసన్న మాయెను. గొడ్డలితోఁ జెట్లుచేమల నఱకి త్రోవచేసికొని ప్రయాణము జరప నారంభించిరి. ఎంతదూర మిట్లు ప్రయాస పడవలె నని విచారింప నడుమెల్లయు నడవియే యనియు బాట తేర్పఱచుకొనుట కష్టతర మనియు విశద మాయెను. అయినను దుస్సాధ్యం బని

వెఱవక వారనేకాయాసముల నోర్చి దినములు గడపి పదునెనిమిదిమైళ్ల ప్రయాణము సలిపిరి. అక్కాననంబున నటనట వసించు జనులు నూతనాగతులఁ జూచినఁ బ్రేమాదరణంబులఁ గనుపఱుచుచుందురు. క్రొత్తగ వచ్చినవారికి వలయుసాయ మొనర్చుటకుఁ దమచే నైనంత పాటుపడుచుందురు. వారి కాతిథ్యం బొసంగి తమ శక్తికొలఁది గౌరవించుచుందురు. నియమిత స్థానముఁ జేరుటకు రెండుమూడు మైళ్లదూరమున నొకగృహస్థుఁడు థామసు పోసీల కమితానందంబున స్వాగత మిచ్చి యాతిథ్యంబు సలిపెను. తనకు దేవుఁ డిచ్చినదాన వారి సంతృప్తులఁ జేసి తద్దేశస్థితు లెఱిఁగించి వారి వెంబడిచని థామసునకు నివాసయోగ్య మగుప్రదేశంబుఁ జూపెను. ప్రయాణము ముగిసినందుకు మిక్కిలి యలరి దన నవమిత్రుఁడు 'ఉడ్డు' దెల్పిన భూమి నివాసార్హం బని నిశ్చయించి పోసీ ననిపి తన వస్తువుల 'నుడ్డు' స్వాధీనమున నుంచి థామసు దన పూర్వ గృహమునకు నడవ నారంభించెను. చక్కని బాట మైన నిందియానా నుండి కెంటికి కొకవంద మైళ్లదూరము. థామసు లింకను దీసిన త్రోవ యంతకంటె నిరువదియైదు మైళ్లెక్కుడు. వేసరక నడచినడచి తుట్టతుద కతఁ డిల్లుచేరెను. పుత్రకళత్రము లతని నతిసంతోషమున లోఁ గొనిరి. అబ్రహాము దన తండ్రి యనుభవముల నచ్చెరువున వినియెను.

ప్రయాణ ప్రయత్నములు త్వరితగతి నొనర్పఁ బడియెను. రెం డశ్వముల నద్దెకుఁ దీసికొని వానిపై గృహోపకరణంబుల నెక్కించిరి. నాంసీ, ఆబ్రహాము, సారా కొంత దూరము నడచుచు నప్పుడప్పుడు గుఱ్ఱములపై నెక్కుచుఁ బ్రయాణము సాగింప నారంభించిరి. ఈ విధిఁ దరలి రాత్రులు తారాపథంబు కప్పుగ గొంగళులు హంసతూలికాతల్పంబులుగఁ గడపి యేడు దివసంబులు దారినడచిరి.

వారి కదియెల్ల నూతనానుభవంబె. ఆయనుభవంబును ననేకాపాయకారణకలితంబు. అయిన వారికి భీతి లేశంబును గానరా దయ్యె. ఆ దేశమున నాదినముల నెట్టికష్టములు వచ్చినను స్త్రీపురుషు లందఱు జంకు కళంకు లేక ప్రవర్తించుచుండురు. అప్పటి స్త్రీ లిప్పటివారివలె బెదరుపోతులు గారు. వారొక్కొకతఱిఁ జూపిన ధైర్యసాహసంబులు మహాద్భుతములు. ఆపదశ్రేణులకుఁ దల లొగ్గవలసి యుండుట వా రెట్టి కష్టములనైన దిట్టతనంబున వహింపనేర్చి కీడు జంకించిన ధైర్యంబవలంబించి నష్టముల గణింపక రానురాను సుగుణపుంజంబుల కిక్కలగుచు దేవుఁడు దమకు నిర్ణయించిన కార్యము నెరవేర్చుచుండురు

ఈవిషయము నుదాహరించుటకు ననేక చరిత్రాంశములు వ్రాయవచ్చును. ఆబ్రహాము తాత కెంటకసీమ చొచ్చిన కొద్ది

దినములకు విచిత్రవిషయ మొకటి జరిగెను. డేవిసను నొక తెల్లవాఁడు కార్యార్థి యై యిలు వెడలిపోయి యుండెను. అతని భార్యాపుత్రులుమాత్ర మట నుండిరి. దీనిం గాంచి యొక యిండియ నతనియిల్లు కొల్లగొట్టి యాలుబిడ్డలఁ జెరగొనిపోవ నిశ్చయించుకొని తుపాకి చేతఁబూని డేవీసుగృహము సొచ్చెను. డేవిసుభార్య వానిఁజూచి గుండెనీరు విడువక మన స్థైర్యమున నా హాతకుని నాతిథ్య మంగీకరింపు మని వేడుచు సారాయి సీసా నొకదానిఁదీసి బల్లపై నిడి వాని నద్దాని స్వీకరింపు మని ప్రార్థించెను. వాఁ డట్లుచేయ నిచ్ఛగించి సీసానుండి సారాయి పోసికొనఁ బ్రయత్నమునఁ దన తుపాకి బల్లపయి నిడియె. అంత నా నారీమణి దాని చివుక్కున లాగుకొని వాని శిరంబునకు దానిమూతి నిడి 'నీవు నా కధీనుఁ డవు గాకున్న నీ యుసురుల నీ క్షణంబునఁ దీసెద' నని వెఱపించెను. ఆ యిండియను దనచేత నున్న బుద్ధి దిగవిడిచి "నను కాల్వకున్న నే నీకేమియుఁ గీడు చేయ"నని పలికి కదలమెదలలేక కూర్చొని యుండెను. ఈతీరున వానిఁ దన పెనిమిటి యిలుసేరువఱకు నా రమణీలలామ పట్టుకఁబట్టి యుండెను!

ఆదేసమయమున నద్భుత తరం బగు సాహసప్రవర్తనంబు మఱొకడు రామాకులవతంసంబు గనుపఱచె. ఒకనాఁటి నిశీథమునఁ గొంద ఱిండియనులు మొగి [illegible]

యతఁడు కవాటముదరికి వచ్చునప్పటికిఁ బ్రాణావశేషునిఁ జేసి గేహముఁ జొర యత్నము సేసిరి. అతని భార్యయుఁ గూతురును దలుపుమూసి బంధించి వారి నడ్డగించిరి. వారద్దానికిని వెనుదీయక ద్వారంబున బిలంబొనర్చి యొక్కఁడొక్కఁడుగఁ బ్రవేశింప సమకట్టిరి. బిడ్డల యాక్రందనంబును మేరిలు దురవస్థయు నసహ్యము లయ్యె. అయినను వానినిఁ గణింపక మేరిలుసతి గండ్రగొడ్డలి చేతఁగొని మొదటివాఁడు గన్నమున దూరినతోడనె వానితల నట్టె కత్తిరించి మొండెంబును లోని కీడ్చివైచెను. ఈవిధమున నలువురు జము నిల్లు చేరుటయు నిందియనులు మేల్కాంచి గవాక్షము నుండి యిద్దఱుగఁ బ్రవేశించి యామె రూపుమాప నుద్యమించిరి. స్త్రీలకు బుద్ధికౌశల్యం బెక్కుడుగదా? ఆ వనిత చక్కగ యోచించి తనబిడ్డం బిలిచి రాజుచుండిన ప్రొయ్యిలోఁ దమ పరుపు దూదిం గ్రుమ్మరించు మనియెను. అ దట్లుచేయుటయు నెక్కువచ్చు మంటలలోఁ బొగలలోఁబడి యూపిరి యాడక విఫలమనోరథులై యిందియనులు ప్రాణము లున్నవో లేవో యనుస్థితియందు నేలం గూలిరి. మెరిలు మహాప్రయత్నమున వారిం బరిమార్చె. ద్వారమున నొక్క యిందియను మాత్రము మిగిలియుండెను. వాఁడును మెరిలుసతిదెబ్బకు నిలువలేక పాఱిపోయెను

ఇట్టి యుదాహరణములచే గ్రంథంబుల నింపవచ్చును. అయిన నీరెండును నాకాలపు స్త్రీలకుఁ గల ధైర్యస్థైర్యంబుల నిరూపింప లిఖింపఁబడియెను. వారిగుణములచే నలంకృత యగు అబ్రహాము తల్లి నిర్భయమానస యై యెల్లగష్టంబులనెల్ల తొందరల నోర్చెను.

ఏడుదివసములు త్రోవ నడచిరని చెప్పితిమిగదా. అట్లు నడచి తమనిర్ణీతస్థానమునకు రెండుమైళ్లదూరమున నీలను పొరుగువారి గుడిసె చేరిరి. వారును లింకనుల మిక్కిలి యాదరించి మఱునాఁడు గృహనిర్మాణంబునఁ దోడ్పడఁ బూనిరి.

ఈయనుభవవిషయములెల్లఁ బెంచివ్రాయుట కొకకారణమున్నది. ఇవెల్లయు నాబ్రహామునందు ధైర్యస్థైర్యసాహసాదిగుణంబుల వృద్ధికి హేతుభూతంబు లాయె ననుటకు సందియంబు లేదు.

---

## మూడవ ప్రకరణము.

### నూతన నివాసస్థల నిర్మాణము.

ఆకాలమున 'దేశసంపాదన మార్గదర్శకు' లగు వారలకు ముఖ్యసాధనము గొడ్డలి. దాని నుపయోగించుటయందుఁ బ్రావీణ్యము సంపాదింపఁ బ్రారంభించుట యాబ్రహామునకు

నూతననివాసస్థలము సేరినతరువాతఁ దటస్థించెను. అతఁడు దనతండ్రికి సాయ మొనర్చుచు నెనిమిదిసంవత్సరములవాఁడైన దాదిగ మిక్కిలి దేహపరిశ్రమ చేయఁ దొడంగెను. తదనుసరణముగ నతనికాయపుష్టి నానాఁటికిఁ జెన్ను వహించెను. దేశాధ్యక్షత వహించినతరువాత నొకానొక యంతర్యుద్ధానంతరంబున నొకవైద్యశాలయం దుండిన మూఁడువేలయుద్ధభటులను జూచి వచ్చుట కతఁడు వెడలెను. అచట నందఱ క్షేమలాభము లడిగికొని వారికిఁ జేయియిచ్చి గౌరవించుచుండెను. పరిజను లతనిహస్తము నొచ్చునేమో యని జడసిరి. దానికిఁ బ్రత్యుత్తరముగ నతఁడు 'నాకష్టములు ననుఁ దిట్టడిఁ జేసిన' వని నుడువుచుఁ బని తీరినమీఁదటఁ బార్శ్వమునఁ బడియున్న గొడ్డలి నొకదాని నందుకొని పదిపదునైదునిమిషము లొక్కుమ్మడి పెద్దమొద్దును దుత్తునియలుగ నఱికి యాగొడ్డలి నెత్తి కరముతో నొక్కరేఖగ నుండు తెఱంగున నిలిపెను. వణఁకుడు గొంచెమేనియు లేక నెట్టన వ్యాపించిన చేయిఁ బొడ గాంచి చూపరు లత్యద్భుతం బందిరి. ఎట్టి యనుభవశాలి యగు వృత్తిశ్రేదికిఁ గాని యిట్లొనర్చుట గష్టసాధ్యం బగిన నాబ్రహాము బలము వ్యక్తం బాయెను.

క్రొత్తయునికి చేరినతోడనె థామసునకు గృహనిర్మాణము కర్తవ్యమాయెను. అతఁడు తత్కాలమున నొక పందిరి వేసి

కొని క్రమేణ యిల్లు గట్టుకొన నిశ్చయించుకొనెను. కావునఁ గొంతకాలము వారు ముప్పదికృలమాత్ర మావరణమును నాలవప్రక్క మార్తాండవాయువుల రాకపోకల కనుకూలం బగు బయలును గలగేహంబున నివసింపవలసి వచ్చెను. అతి శీతలదేశమున నిట్టిబ్రతు కెంతకష్టమో యూహింపవలసినదే గాని వర్ణింప నలవిగాదు. వర్షాతపములకు నోర్చుట వారి కంతటి దుస్సాధ్యములోనిది కాదు. వా రట్టికష్టములకు వెనుదీసి యుండినచో నభివృద్ధి యెచ్చటనో దాగియుండును.

అబ్రహాము దండ్రి 1817-వ సంవత్సరము శిశిరఋతువు నందు సామగ్రియంతయు సమకూర్చుకొని వసంతంబున విత్తు నాటినపిదప నిల్లు కట్టుకొన మొదలిడెను. ఉపకరణముల సాయత్తపఱచుటయం దతనిపుత్రుండు రంపముపట్టుట కొయ్యల నఱకుట మొదలగుపనులు సేయుచు వచ్చెను. ఆకుటీరము నప్పుడప్పుడు చూచుచుండినవా రొకరు దాని నీప్రకారము వర్ణించి యున్నారు.

"అది 18 అడుగుల పొడవును 16 అడుగుల వెడలుపును గలది. నడునేల పూతలేమియు లేక యెక్కుడుదిగుడు లగు భూప్రదేశము. ఇంటిగోడలు సూచితిరే! ఒకటిపై నొకటిగ బంధింపఁబడిన దుక్కలు. వానిని మూలలఁ జక్కగ జటించి నేపయఁఱమట్టితోఁ గప్పివైచి యుందురు. దానికప్పు వసారా

కప్పుంబోలి మ్రాకుపలకలచే నిర్మిత మై యుండు. ఇల్లంతయు నొక్కగదియ. కప్పునకును గోడలకును మధ్య పలకలువేసి యొక వెలిసెగట్టుకొని యాభవనంబుఁ జేరుట కొక గోడమూలనఁ గన్నములు మేకులు నిలిపియుందురు. ఆగది కొక్క ద్వారంబును మఱియొండు కిటికీయుఁ గలవు. ఈ రెండవదానివిషయము గొంచము ముచ్చటించుట యుక్తము. థామసు కిటికీదట్టము నొకదాని నాలుగడ్డపుబిళ్లల నుంచులాగున పన్నెను. పన్నిదానినిండుగ నొక సూకరపు క్రొవ్వుపై నుండు పొరఁ గప్పివేసెను. పొరయద్దమునకుఁ దగిన ప్రత్యామ్నాయవస్తువయ్యె." ఇట్టియూహావిశేషంబుఁ గనుపఱచిన వానిబుద్ధియే బుద్ధిగదా!

తే. గీ. దేవుఁ డిచ్చినదానిచేఁ దృప్తినొంది
యాతఁ డిచ్చిన ధీశక్తి నలరఁజేసి
తనకు గొంచమ సంపద యనుచుఁ బొంగి
బ్రతుకు మనుజునిదేహమ్ము బ్రతుకుధరను.

గృహనిర్మాణం బైనమీఁదట గృహోపకరణనిర్మాణంబు గావలసి యుండెను. తద్విషయమునఁ దండ్రికుమాళ్ల కిట్లు సంభాషణ జరిగెను.

"అబి, ఆ పోగరకొత్త త్రాడును నిటు తీసికొనిరమ్ము. పరుండ మంచ మొక్కటి నిర్మింపవలయు."

ఆ రెండుసాధనములఁ దెచ్చుచు నాబి "నాయనా! నేన పోగరవట్టి రంధ్రములు సేయఁ గలుగుదు."

"అబ్బీ! నీవా కార్య మొనర్పఁజాలవు. ఈ పెద్దమొద్దుల రెండంగుళములు దొలుచుట గష్టము. నీవు వెడలి కోడున కుగా నొక్కకొయ్యయు దానిపై నుంచుటకు రెండుపట్టెలను సంపాదింపవలసినది."

"అంతమాత్రమ చాలునా?"

"అంతే. అదిగో! యామూలన దాని నిర్మించెదను. రెండుప్రక్కల గోడమొద్దులు పట్టెలవలె నుండనే యున్నవి. రెండురంధ్రములుమాత్రము వానియందుఁ జేయవలసి యుం డును. ఒకకోడుమాత్రమె నిలుపవలసి యుండును. మఱి రెండుపట్టె లా రెండుకన్నముల నుండి యాకోడు పైకిఁదెచ్చి యద్దానిపై బిగించినఁ జాలును. ఈ పనియంతయు నొక గంట కాలమునకంటె నెక్కుడు పట్టదు."

ఇంట నొకవైపున పరుండ స్థానము నియమించుకొనుటఁ జేసి పని యంత విశేష ముండదాయెను. పైనఁ జెప్పినవిధమున గోడ మొద్దులఁ బొడవున నెనిమి దడుగులమీఁదను వెడలుపున నాలుగున్నరయడుగులమీఁదను రెండురంధ్రములు సేసి రెండు పట్టెల వానిలోఁదూర్చి యొకకోడు మీఁదికిఁ దెచ్చి బంధించి వేసెను. ఇట్లిది ముగిసిసినతోడనె థామసు:

"అబీ! ఇఁక నవారున కేర్పాటు సేయవలయును. శయ్య వేయుట కేదైన నొక యాధారము గావలయునే" యని హేళనముగ ననియెను.

తండ్రి యర్థము స్ఫురింపక యాబ్రహాము "మ్రానిపలకలు వేయుదు రని యెంచియుంటి" ననియెను.

"మఱేవిధమైన నవారును గానరాదు. ఆపలక నిటు లందిమ్ము."

ఇంటికప్పున కుపయోగింపఁబడిన జాతిపలకల నుపయోగించి మంచ మేర్పఱచుకొనిరి. ఇదేవిధమున బుద్ధికౌశలము సూపి యొకబల్ల, కుర్చీ వీని రెంటిఁ జేసికొనిరి.

ఆకాలమున వారికి ధాన్యము విసరుకొని పిండి చేసుకొనక భుజించు మార్గములు దెలియవు. తిరుగలులు మన రాతితిరుగలివంటివి వా రెఱుఁగరు. పది పండ్రెండు మైళ్ల దూరము పోయి వాయువే ముఖ్యాధారముగాఁ గల యొక యంత్రమునఁ దమ ధాన్యమును విసరుకొని వచ్చుచుందురు. దీనిచేఁ గాలనష్ట మధిక మగుచుంటఁ గాంచి థామసు బుద్ధికౌశలము గలవాఁడు గనుక తన కుమారుని సాహాయ్యముఁ దీసికొని పెద్దమొద్దు నొకదాని మధ్యఁగాల్చి మసరోలుఁబోలె నొకసాధనంబును నొక రోకలిని దాని నుపయోగింప నట్టి యొక సాధనంబును జేసి యాకొఱఁత మాన్పుకొనియెను.

ఈవిధమున గృహోపకరణముల నన్నిఁటిని రెండు దినములలోపలఁ జేసికొనిరి. అబ్రహాము విద్యాభ్యాసనంబు నకును నిద్రకును స్థాన మింటియందలి వెలిసెయే. ఆస్థలమున రాత్రుల నొక గొంగళి పఱచుకొని సుఖనిద్ర యనుభవించుచు ననేకసంవత్సరములు గడపెను. అదియ యతనికి మహా హర్మ్యభవనంబులలోని హంసతూలికాతల్పంబునకు సమానంబుగ నుండెను. అంతకంటె సౌఖ్యాకర మగువస్తు ప్రపంచ మతఁ డప్పుడు కని యెఱుంగఁడు; తరువాతఁ గందు నను తలంపు నతనికి లేదు.

1817-వ సంవత్సరము ఆకురాలుకాలము వచ్చులోపల లింకనులు దమ నూతన నివాసస్థలమున స్థిరపడి యుండిరి. అప్పటికి ఆబి కర్తవ్యాంశముల నెల్లఁ జక్కఁగ గ్రహించి యుండెను. వాచక లేఖనములఁగూడ మిక్కిలి పరిశ్రమ చేసి యుండెను. వారి పుస్తకభాండాగరములోని మూడుగ్రంథములు నతనికి నుపయోగకారు లై యుండె.

ఆ దేశమున శిశిరఋతువునందుఁ జలి దుర్భరము కావున నక్కడ నివసించువా రా దివసముల మంటలు వేసుకొని రాత్రులు పుచ్చుచుందురు. ఈ యగ్నుల వెలుఁగుదప్ప వారి గృహముల నితర వెలుంగులు గానరాకుండును. పేదరికమున కాలవాలమైన నా 'మార్గదర్శకు'లకు క్రొవ్వువత్తులు, కెరుసినూ

నూనెలు, విద్యుచ్ఛక్తి యెడినుండివచ్చు? దేహప్రాణములఁ గాపాడికొన నుపయుక్త మగు సామగ్రిదప్ప మఱొండు వారి కలవడ నలవిలేకుండెను. దేవుఁ డిచ్చిన మహాటవి దమపొంత నె యుండ వారికిఁ గట్టియలకుఁ గరవుగాదు. ఎంతమంట గావలయు నంతమంట ప్రజ్వరిల్లఁ జేయ వారి కుపకరణము లుండును. కావున నీజ్వాలలప్రకాశంబె వారిపనులకెల్లఁ జాలియుండును.

ఇట్టి దీనియ ముంగలఁ గూరుచుండి మన కథానాయక రత్నము చదువును. చెట్టుపట్టలమీఁదను పలకబండలమీఁదను బొగ్గుతో వ్రాయుచుండును. శీతకాలమున మంచు గురియు వేళల దానిపై నొక కాష్టముతోఁ దననామము లిఖించును. వేసవికాలమునఁ దోఁటలోనికిఁబోయి యిసుకనేలన నభ్యసించును. ఈవిధమున శ్రద్ధఁజేసి వ్రాతపనియం దెంతో ప్రావీణ్యము నొందెను. గొప్పవారి కెంతటి కష్టతమము లగుస్థితులును నాటంకములు గాఁజాలవు. చూచితిరే!

థామసు లింకను మంచి వేటకాఁడు. అతని నివాసస్థలము వేటకుఁ దగినదియే. చుట్టుప్రక్కల దట్టమైన యడవి యుండుటఁజేసి యతఁ డనేక మృగములఁ బక్షులఁగొట్టి భోజనమునకు వస్తువుల జేర్చఁగల్గెను.

అతనిగృహ మొక్కవిషయమునఁ దక్కనెల్లవిషయంబుల ననుకూలముగ నుండెను. జలశూన్యం బొండు వారికిఁ గష్టములఁ

బెట్టు ఆబ్రహాము సారాలు ప్రతిదినము నొక మైలుదూరమున నుండు బుగ్గకుఁబోయి పానీయంబు గొనివచ్చుచుండిరి. ఈ లోపము దరువాత నేదో యొక తెఱంగున దీసివేయఁబడియెను.

ఇఁక నా సీమయందలి జనులస్థితిఁ జూచితిమేని యందనేకులు సురకుదాసులు. సుర యన నమృత మని యర్థము సేయువారును, సురాపానము పూర్వాచారమునకు వ్యతిరేకము గాదని వాదించువారును, ఔషధతుల్యముగఁ గొంచెము గ్రహించిన నేమిగాఁగల దనువారును, మన దౌర్భాగ్యమున కాన వాలుగ నిప్పుడు దేలుచున్నారు. జీర్ణకోశము మ్రాన్పివేసి పలు రోగములకుఁ బాలుచేసి నడయాడు శవంబులఁ జేయు ద్రవాకారం బగు దుష్టభుజంగమువిష మల్లనల్లన దేహమునఁ బ్రసరించుట నెఱుంగనేరని మతిభ్రమణుల నా కోలాహలహారణుండగు నీశ్వరుండ మరల్చుగాక. ఓ మహాసీయులారా! ఆబ్రహాము తల్లి స్నేహితదోషము దన కుమారు నంటునేమో యను భయంబున నతని కప్పుడపుడు చెప్పిననీతి వినుఁడు. ఆ ఘనుఁడు లోకమునఁ బేరుఁగాంచి వెలుఁగుతఱి మత్తు పదార్థములఁ దాకకూడ దను ప్రతిన నడపునెడ "మనుష్యులు ద్రాగుట కారంభింతురు గానఁ ద్రాగుబోఁతు లగుదురు. ఎప్పటికినిఁ ద్రాగకుండువాఁ డెన్నటికినిఁ ద్రాగుఁబోతు గాఁజాలఁడు" అని నాతల్లి నాకు బోధించెనని చెప్పను.

బొత్తుగఁ ద్రాగనివారిని, ద్రాగకుండుట యను ప్రతిన వట్టినవారిని నామె యెన్నఁడుఁ గనివిని యుండలేదు. అయినను నెద్ది యీరోగమునకు దివ్యౌషధంబో యెద్ది యీరావణునకు రామాస్త్రంబో నద్దాని నామె గుర్తించి కుమారునకుఁ దెల్పుట యామె సూక్ష్మదృష్టియు నామె దోషాదోషవివేచనజ్ఞానంబును వేనోళ్ల వెల్లడి చేయుచున్నది.

ఈవిషయమును మఱియొక యంశము దెలుపుడు చేయుచున్నది. ఓహియోలో నష్టమైన సారాయివిషయ మొకరోజు నాంసీ థామసులు చర్చించుచుండిరి. వారిచర్చఁ గొంచెము పరిశీలించినఁ జాలు. "కొంతసారాయి నా నదీగతంబు సేసి దైవము మనకుఁ దోడ్పడియెను. ఎందఱో పిల్ల లాదుష్టవస్తువు దగ్గరఁదీసి కుటుంబనాశన మొనరించి యున్నారు. ఎల్లరకు మేలుగోరు దైవము మనకెప్పుడు సాయమొనర్చు. అట్టి వస్తు వింట నుండుటయె హానికరంబు. ఉన్న కొంచెము నమ్మివేసితిమి. వగపిక పని లేదు." అని సంతసించిరి.

౧౮౧7-వ సంవత్సరపు వేసవి సనియె. లింకనుల యింటికి తన ముందుప వారి స్నేహితులు స్పారోలు అచట నివసింప నేతెంచిరి. స్పారోగారి భార్య నాంసీపెంపుడుతల్లి. వారు వచ్చినతోడనె లింకనుల మొదటిగృహ మగు పందిరియందు బసచేసిరి. స్పారోగారి భార్య బెట్సీ డెన్నిస్ హాంక్సును బెంచు

చుండెను. కావున నతఁడును వారి వెంబడి వచ్చిచేరెను. అతని రాక యాబ్రాహామునకు మిక్కిలి యానందమియ్య నొకరి కొకరు మిత్రులయి యన్యోన్యముగ మెలఁగుచుండిరి.

---

## నాలవ ప్రకరణము.

### దుఃఖ దినములు.

తమ మందిరమున నున్న పుస్తకత్రయంబులును జదివి చదివి క్రొత్తపుస్తకముల వాసనఁ గానక అబ్రహాము వేసారెను. ఉన్నవాతనికిఁ గంఠోక్తిగ వచ్చిపోయెను. నూతన గ్రంథములు చిక్కునా యను చింత యతని హత్తియుండెను. ఇట్టితరుణమున నాతని దృష్టి మరల్చు విషయ మొకటి కడుదుఃఖకరం బగు నది సంభవించెను. ఇరుగుపొరుగుల 'స్తన్యరోగ' మను బుజ యొండు ప్రబల నారభించెను. మనుష్యులును పశువులును నద్దాని వాతఁబడి మరణ మొందిరి. సమీపించి సమీపించి స్పారోల భార్యాభర్తల నది తాఁకెను. లింకను లడలిపోయిరి. వైద్యు లనేకమైళ్లు గడచినంగాని కానవచ్చుటలేదు. కావున నీ 'మార్గదర్శకుల' యందు స్త్రీలు రోగుల మేలుకీళ్లరసి వారికిఁ దగుసాయ మొనర్చుచుందురు. నాంసీకిఁ దల్లిదండ్రులం జోలె స్పారోలు రోగపీడితులగుట చూచి యామె చాల దుఃఖించి వారిని దమ కుటీరమునకుఁ దీసికొనివచ్చి పరిచర్య లొనర్చు

చుండెను. అయినను దైవానుగ్రహము దప్పినందునఁ గొంత కాలమునకు వారిరువురును లోకాంతరగతు లైరి. శోకము లింకనుల హృదయముల నాక్రమించెను. ఆప్రాంతపు జను లెల్లరు నప్పుడప్పుడు స్పారోల స్థితిగతులఁ దెలిసికొనుచుండి వా రంతమొందిరనుట వినినతోడ నేతెంచి యనంతర కార్యముల నడపిరి. థామసునకుఁ దప్ప మఱెవరికిని శవము నుంచుటకుఁ బెట్టెసేయుటకు రాదు. కావున నతఁడె దనశక్తికొలఁది దాని నొనర్చెను. స్పారోల నద్దానియం దుంచి యందఱును నశ్రుధారలఁ దమప్రేమఁ గనుబఱచుచు నుచితవిధమున వారికి సమాధి యొనర్చిరి. అబ్రహాము డెన్నిసుల కిదియ మిక్కిలి దుఃఖకరం బగు వార్తగ నుండెను.

తగిలిన కాలె తగులును; నొగిలినకొంపె నొగులుననుట యనృతముగాదు. దుఃఖము లొక్కటిమీఁద నొకటి తరంగంబుల తెఱంగున పైఁ బడుచుండును. స్పారోల మరణముచే నుద్భవిల్లిన సంతాపాగ్నిజ్వాల లింకనుల మనోవీధిఁ బ్రచండంబుగ రేఁగుచుండఁ బ్రళయకాలవహ్నింబోలు మఱియొక వహ్ని యటఁ జేరె. స్పారోలు నాకలోకంబునకుఁ జన్నదాదిగఁ గొన్ని దినములకు స్తన్యరోగము నాంసీనె యంటె. ప్రాతఃకాలము మూడుగంటలసమయమున నాబ్రహాము నిద్రనుండి లేపఁబడియెను. సమాచారము వినినతోడనె డా[illegible]

యవస్థఁ జూచి యోర్చుట యసాధ్య మాయెను. ఋజబాధ మిక్కిలి యెక్కుడాయెను. ఆప్రాంతములనుండు నబలలెల్ల రామెకు సాయ మొనర్ప నేతెంచిరి దిగులంది సహాయార్థము ఉడ్డుగారింటి యాడువారిఁ గొనిరాఁ బరుగిడియెను. వారిలోఁ గొంద అనుభవముచే రోగులఁ గాపాడుటయందు సమర్థులుం దురు. అయిన దైవసాహాయ్యము లేనియెడ మనుజసాహాయ్య మెంతయుండిన నేమిఫలము? తగిలిన యైదుదినములలోపల నాంసీ పరలోకప్రాప్తిఁ జెందెను. అచటిజనుల దుఃఖ మంతింత యని నుడువఁజాలము. లింకనులకుఁ గలిగిన నష్ట మపార మయ్యెను. వారి మనములు నిండి దుఃఖము వెల్లివిఱియఁ జొచ్చెను. నిర్హానుష్యాటవికల్పమగు నాసీమయందు దడఁగి సద్గుణోపేతుండగు నాబ్రహాము కానుశీలయగు తల్లి దనువాసి పరమపదం బందిన నెంత మనోవైకల్యంబు సంభవించెనో నుడివినఁ దీరదు. చదువరుల యూహింతురు గాక. ఇట్టి కట్టడి విధి సంప్రాప్త మైన వారి యెక్కటికము దుర్వహమై తోఁచక మానదు. ఆబ్రహాము మాటలాడ నోరాడక తనతల్లి విషయ మెత్తుటయే మాని దిగ్భ్రమఁ జెందినవానివలె దుఃఖవర్షుస్సుఁ గోలుపోయి తిరుగుచుండెను.

ఆమెకు సమాధి యొనర్చుట కేర్పాటులు సేయఁబడియెను. థామసు దనచేతన భార్య కళేబరం బుంచుట కొకపెట్టె

సేసెను. స్పాోల ప్రక్కన నొక గోరీ దీసి యద్దాన నా శవంబు నునిచిరి. ఆసీమయందలి 'మార్గదర్శిక' కుటుంబము లెల్లయు నచటి కేతెంచి యార్తహృదయకమలములును నార్ద్ర చక్షురుత్పలములను నామె కర్పించి దమప్రేమ సూపిరి.

సతి మరణానంతరము గొన్నిమాసములమీఁదట నొక సాయంకాలమునలింకను "అబి! పార్సన్ ఎల్కిన్సు (పురోహితుఁడు) గారికి నీ వొక యుత్తరము వ్రాయవలెను. నీ విప్పుడు చక్కఁగ వ్రాయఁ గలుగుదువుగదా" యనియెను. అబ్రహాము పదిసంవత్సరములు దాటి యుండెను.

"ఏమి వ్రాయవలయునో నొడివిన నే వ్రాసెదఁగాక" యని యాకుఱ్ఱఁడు ప్రత్యుత్తర మిచ్చెను.

తరువాత థామసు దనభార్య యారోగ్యము దప్పినది మొదలుగఁ బరమపద మందినవఱకు వ్రాయించి యాపార్సన్ దమ కుటీరమునకు విచ్చేసి యథావిధిగ నాంసీ జ్ఞాపకార్థ మూపన్యసించి పోవలసినదని వేఁడెను. అబ్రహాము దమ నూతన నివాసస్థలపు వర్ణనయుఁ దా మట కేతెంచుటయుఁ దమ యుత్తరాపేక్షలను ఆ పత్రమున లిఖించెను

వ్రాసినజాబు కుమారుఁడు చదువుచుండ థామసు సంపూర్ణహృదయంబున వినుచుండెను. అంత పసివాఁడు దనపుత్రరత్న మింతకార్య మొనర్పువాఁ డాయె నను మోద మాతు

నకు మొండాయెను. తమ కుటుంబమున నేరును వ్రాయునం తటి ఘనకార్య మొనర్చి యుండలేదు. అతని కదియ వింత యై తోఁచెను.

తండ్రి వ్రాతనేర్పరితనపుఁ బ్రయోజనములఁ బొగడుచుం డెను. ఆబ్రహాము నకవెల్లఁ గడుసామాన్యముగఁ దోఁచుచుం డును. ఒక్కొకమారు దీనివిశేష మేమియను. మఱొండుతఱి నే నింతకంటె బాగుగ నేర్చెద నవిసంతసించు.

జాబు ముగిసినతోడనె యతనిదృష్టి వేరువిధమునఁ బాఱ నారంభించెను. తాఁ బంపిన కమ్మ పార్సన్‌గారి కెప్పుడందునో యతఁడెన్నడు విచ్చేయునో యెఱుఁగఁగోరి తండ్రిని బ్రశ్నిం చెను. అతని కాలెక్కలు దెలియవు. ఉత్తరము పోయి చేరు ననిమాత్రము వినియుండును. కావున 'నదంతయు నేనెఱుఁగ. జాపుపోయి చేరును. చేరిన పార్సన్ రావచ్చు' ననియెను.

ఆయుత్తరము మెల్లమెల్లగ మార్గము వట్టెను. దాని ఫల మరయ నాబ్రహాము మనసు తొందరపడుచుండును. మొత్త ముమీఁద నీకార్య మతని బాల్యమున నొకముఖ్యాంశ మను టకు సందియములేదు. అది పార్సన్‌కుఁ జేరునా యనుశంక యతనికట్టుట స్వాభావికము. దాని వ్రాసినదిమొద లతనికిఁ బ్రఖ్యాతిం దెచ్చి యితరుల మేలున కతనిఁ బురికొల్పె ననుట యుఁ జిత్రముగాదు.

లింకనుతండ్రి దన పుత్రుని యాచరణను గుఱించి యితరులకుఁ బొంగిపొంగి చెప్పుచుండును. వారును సంతసంబున నతనిఁ బొగడుచుందురు. ఆ ప్రదేశమునకు నిరుగుపొరుగునఁ జాలదూరమువఱకుఁ గల పెద్దవారలలో నొక పాతికమందికిఁ గూడ వ్రాయ నేర్పలేదు. కావున నాబాలకున కంతపని చేయు శక్తిగల్గుట మహాద్భుతముగ నుండెను. ఆవార్త చుట్టుప్రక్కల వ్యాపింపఁ దత్ఫలముగ ననేకు లాబ్రహాము లింకను కడకఱిగి తమ కుత్తరముల వ్రాసి యియ్యుమని ప్రార్థింప మొదలిడిరి. అతఁడును శైశవము నుండి తనవల్ల నగు మే లితరులకు లే దనువాఁడు గాఁడు. ఇతరుల కోరికలఁ దన శక్తికొలఁది నెరవేర్ప నెప్పుడుఁ బ్రయత్నించుచుండును. అట్లగుట బహుకాలము దమ బంధుమిత్రుల క్షేమసమాచారములు వినని దూరదేశీయు లెల్ల నాబ్రహాము వ్రాయఁగలిగినందున నెడనెడఁ దమవారినుండి పత్రికల నందుకొను భాగ్య మనుభవింపఁ గనిరి. ఉత్తరముల వ్రాసియిచ్చు టతని కొక బరువుగఁ దోఁచుట మాని యాహ్లాదకరముగఁ బొడగట్టుచుండెను.

అతని ప్రధమపత్రము చేరి మూడుమాసములమీఁదట పార్సన్గా రేగుదెంచిరి. అప్పు డాబి యింటికి మూడు మైళ్లదూరమున మెలఁగుచుండి యీ పురోహితునిఁ గాంచి సంతసించి "అయ్యా! నా కష్ట మీకందెనే" యని తనమనమున నిండి

యున్న విషయమునే మొదట నడిగెను. జాబు చేరిన దను టకు లక్ష్యము దనకంత్ల కగుపడుచుండినను దాఁ జేసిన కార్యము ఫలించిన దనునిశ్చయ మెఱుఁగ నతఁడు దడబడు చుండెను.

"నీ యుత్తరమా? మీ తండ్రిగారిది నాకుఁ జేరె." తండ్రి నామ మిడి వ్రాసిన విషయము స్మరించుట కాబ్రహాముకు నవకాశము లేకపోయెను.

"నేను వ్రాసితిని."

"నీవా వ్రాసితివి?"

"అవును తండ్రిగారు వ్రాయ లేరుగా."

"అవునవును. నా కిపుడు స్మరణకు వచ్చినది. నీతండ్రి వ్రాయలేరు. కావున నీవే వ్రాసితివే? బాలురలో నీ తెలివిగల వనేకులు వ్రాయఁజాలరు సుమా."

"అదియ నా ప్రథమ ప్రయత్నము."

"ఓహో! కడు లెస్స. నీ మొదటి కష్టమయా యిది? నీవద్దాన లోపము లున్నవని జంక నవశ్యము లేదు."

ఈవిధమున సల్లాపము లాడుచు వారు లింకనుల గుడిసె సమీపించుచుండిరి. అబ్రహాము గుఱ్ఱముప్రక్కనఁ బరుగిడు చుండెను పార్సన్ అతనిపైఁ గరుణావలోకంబుల సారించి భాషించుచు సవారిసేయుచుండెను. ఇలు గాన్పించినతోడనె

యాబి చేచాయనె చూపి "అల్లదె మాగృహము. మే మట నివసింతు" మనియెను.

"ఓ! కాపురముండుట కది రమ్యముగ నున్నది. మీ తండ్రిగా రట నుందురు?"

"అదె యతఁడె. మిముఁ జూడఁ గుతూహలుఁడై యున్నాఁడు."

"నాకును నతనిఁ జూడఁ గొప్ప వాంఛ గలదు."

ఈలోపుగ వారు ధామముం జేరిరి. అతఁడు పార్సన్ రాక కుప్పొంగి మనఃప్రీతిగ స్వాగత మిచ్చెను. వారిద్దఱకును గొంత సంభాషణ జరగినపిదప నెల్కిన్సు పార్సన్ గా రుపన్యాసము నామరుసటి భానువాసరమున నాంసీ సమాధికడ నిచ్చునట్లు నిర్ధారణ చేసికొనిరి. పదిపదునైదు మైళ్లలోఁగల 'మార్గదర్శక' గృహములకెల్ల నీవార్త పంపఁబడియెను. ఈ పవిత్రకార్యమునకు వలయు సన్నాహము లన్నియు నాయత్తపఱుపఁబడెను.

మధ్యకాలమున నా పురోహితుఁ డిరుగుపొరుగులనుండు జనులనెల్లర దర్శించి దైవికవిషయముల వారికి బోధించుచుండెను. ఆబియొక్క బాలప్రౌఢిమకు మెచ్చి యతనికిఁగూడఁ గొంత యుపదేశ మొనర్చెను.

ఆదిత్యవారము సమీపించెను. నాంసీ చనిపోయి యాఱు మాసములై యుండినను నాపె జ్ఞాపకార్థ ముపన్యాసము నిన

నెల్లరును మూఁగ నారభించిరి. ఏరికిని నామెపైఁ బ్రీతియే. ఇట్టియుపన్యాసములు వారి కెండకాలపు వానలుగాన ననేకుల కిది పండుగఁ బోలియుండెను. అందున నాంసీ స్మరణార్థము గాన మాహాత్మ్యాకృష్ట మయ్యెను. పదిమైళ్లనక పదునైదు మైళ్లనక, శైశవ మనక ముదుసలితనమనక కొందఱు శకటముల మీఁదఁ గొందఱశ్వములపైని గొందఱు నడచుచుఁ గొందఱు పఱచుచు పలువిధముల జనులు పలువిధ యానములతో గుంపులుగుంపు తేతెంచిరి. ఆప్రాంతముల కుటుంబములన్నియు నట నుండెను.

పార్సనెల్కిన్సు మనఃపూర్వకముగఁ బనిసేయువాఁడు. అకార్య గౌరవం బాతని కౌత్సుక్యం బొసంగె. లింకనులు దక్క నతని యుపన్యాసము లదివఱ కెవ్వరును వినియుండరైరి. అతని వాక్సుధారసంబుఁ గ్రోలి యందఱు నానందం బొందిరి. నాంసీ గుణసంపద నతఁడు వర్ణించుటలో న్యాయ వ్యతిరేకము లేదని యామోదించుటేగాని "యెంత వర్ణించినను నామె గుణసంపదకు నావర్ణన చాల" దనిరి.

• ఆ యుపన్యాసమున నాబ్రహాము మగ్నుఁ డయ్యెను. తల్లి ప్రేమయుఁ గనికరంబును మరల నతని నావరించిన ట్లుండెను. రెండవమారా రాపె యుత్తరక్రియలఁ బరికించులాగు గనుపించెను. ఆమెసమాధి తనకుఁ గొంతదవ్వున నుండెను;

ఆమె సుగుణపుంజంబు దన మనమున నివసించి యామెను సంపూర్ణముగ గోచరింపఁ జేయుచుండెను.

ఉపన్యాసస్థితభావముల ననేకముల నతఁడు చక్కఁగ గ్రహించెను. తనంతటఁ దా యోచించువాఁడు గాన నతని కిది యపూర్వము గాదు. కొన్ని సంవత్సరములకుఁ దరువాత నిట్టి యుపన్యాసకుల యభిప్రాయముల ఖండించుచు వినువారల నానందింపఁ జేయుచుండును. ఒక్కొక్కవేళ వారు చేసిన సిద్ధాంతములఁ బూర్వపక్షము సేయుచుండును. అతని బాల్యప్రౌఢిమ యీవిధమున బయలుపడుచుండెను. పైఁజెప్పిన నాంసీ జ్ఞాపకార్థకోపన్యాసము నందలి భావములు మాత్ర మతని మనఃశిలపైఁ జెరపరాని స్ఫుటాక్షరముల లిఖితము లయ్యెను.

బాల్యమున నాబి యిరుగుపొరుగువారి సంభాషణముల తఱచుగ శ్రద్ధతో వినును. జ్ఞానశూన్యు లగుగొందఱు మాటలాడునెడ వారి యర్థములేని పిచ్చిమాటలకు విసుగును. అతని తీక్ష్ణబుద్ధియొక్క విషయమున జ్ఞాన మలవడిన నట నిలుచునవిగావు. ప్రతిసంగతియు గ్రహింప నిచ్ఛగలిగి చలించుచుండును. కావున నప్పుడప్పుడు జ్ఞానహీనుల ప్రగల్భములకు నతఁడు గోపించుకొనుచుండుటఁ గలదు.

నూతన పుస్తకము లతనికి దొరకిననో వానిఁ జదివి తద్విషయముల విమర్శించి తన యభిప్రాయమును [illegible]

శంబుగ నిచ్చుచుండును. పైరుచుల పచరించు బాలురకును నతనికిని ఇదియ భేదము. వారు చదువుదురు; అచ్చటన వారి పని ముగియును. వారావిషయమున శ్రద్ధ జేయుట లేదు. చెప్పఁబడినవిషయ మేల చెప్పఁబడియె? దీని మూలకారణ మెద్ది? యను చర్చ వా రెన్నఁడుఁ జేయుట లేదు. కావునఁ జదివినవిషయముల జాఱవిడుచునలవాటు పట్టవడును. తమకుఁ దాము యోచించుకొనుట వా రెఱుఁగరు. ఇతరులు నంది యనిన వారికి నంది; పంది యనిన వారికిఁ బందియె యగు. వా 'రిట్లు జరగుచున్న' దని తెలిసికొనినఁ జాలునని సంతసిం తురు. ఏల జరగుననుసంశయముతో వారికిఁ బని లేదు. ఆబ్రహా మట్టివాఁడు గాఁడు. తాన యోచించు. స్వబుద్ధిచేఁ బరిశీలించు. ఇదియ యాతనిమనఃశక్తి నత్యద్భుతముగ వృద్ధిసేయఁ గల్గెను.

ఈ మార్గదర్శిక 'పురోహితుల' విషయముఁ జదువరు లిఁక కొంచెము వినవలయును. అందుఁ గొందఱు మహాశక్తి యుతు లుండినను సాధారణముగ వారు విశేషము విద్య గడిం చినవారు గారు. కళాశాలలును విద్యాలయములును వా రెఱుం గరు. అయిన దైవికజ్ఞాన మితరులకుఁ గలుగఁజేయ వా రుత్సుకులయి యుందురు. ఈశ్వరుం డట్టికార్యము దమకు విధించెనని వారు గట్టిగ నమ్మి నిర్మలహృదయు లై పనిఁ జూచుచుందురు. ఒక యశ్వమును బుస్తకముల సంచియు

వారికి విడువని మిత్రులు. పల్లెనుండి పల్లెకు సంవత్సరారంభము నుండి సంవత్సరాంతమువఱకుఁ దిరిగి యుపన్యసించుట వారి పని. తమ యుపన్యాసముల మార్గమున సిద్ధపఱచుకొను చుందురు. ఎచ్చట సాయంతన మగు నటన వారికి విడిది. ఒక్కొక సమయమున మనుష్యసంచారభూమికి నెన్నియో మైళ్లదూర మున నాకసము గప్పుగ భూమిశయ్యగ వారు నిద్రింతురు. వారికి జీతమిచ్చువా రొక్కరు నుండరైరి. అందుఁ బలువురు కట్టుటకు మంచిబట్టలును, దినుటకు రుచ్యమగు నన్నమును గోరక దైవభక్తిచే లోకమున కుపకార మొనరించుచుందురు. అం దొక్కరివిషయము వినుఁడు.

ఒక పురోహితుఁడు నిరుపేద దనస్థితికి వగవక ప్రయాస పడి తిరుగుచు నితరులకు జ్ఞానప్రదానము సేయుచుండెను. అతని దైవభక్తికిని, నైర్మల్యంబునకును మెచ్చి యొక భర్తుఁడు భూ స్వామి యతనికి 320 యెకరముల క్షేత్రము దాన మిచ్చి దానపత్రము వ్రాసి చేతి కిచ్చెనఁట. అతఁడు సంతసించి దానిఁ చేకొని కృతజ్ఞత సూచించి వెలువడిపోయెను. పోయి మూడు మాసములకు మఱలివచ్చి దానపత్రమును దిరిగి భూదాత కియ్యఁబోయెను. ఆ భూస్వామి యాశ్చర్యమును భయమును వెనగొన,

"...ం దేమైన లోప మున్నదా" యన

నతఁడు "లేద"నియెను.

"మంచిభూమి కాదా?"

"ఈ సీమ నంత సుక్షేత్రము లేదు."

"అయిన రోగముల కిక్కయా?"

"ఆరోగ్యదాయినే."

"నే దానము మనస్ఫూర్తిగఁ జేయలేదని శంకించెదరో?"

"మీ త్యాగమున లోప మున్నదని నే నెన్నటి కను వాఁడఁ గాను."

"అయిన మీ రేల యీ చేనుల విడిచెదరు?"

"ఒకటి వినుఁడు. నేను కీర్తనలు పాడుటయం దాసక్తిగల వాఁడ నని మీకుఁ దెలియునుగదా? అట్టికీర్తనల నొక్కటి నా ప్రాణ మున్నంతదాక నానందం బొసంగునది యిదె వినుఁడు:

సీ. క్షేత్రాధిపతిఁగాక చెలఁగుచుండుటఁజేసి
ధన్యుండ నైతి నే ధరణియందు;
గహనభూముల నైన గృహ మొండు లేకుంట
సంసార దుఃఖంబు సడలెనాకు;
స్వేచ్ఛా విహారంబు సెడకుండ సల్పుచు
నీశ్వరు భజియింతు శాశ్వతముగ;
నిమిషమాత్రము నన నిర్భూల మందెడు
పటకుటీరము దీనిఁ బాసి చనఁగ,

నాకు హార్ద్యంబు గలుగు నా నాకమందు
నదియ సౌభాగ్య గరిమంబు లందఁజేయు ;
నదియు నా మేన మానందమందు నుంచు ;
నదియ యెల్లప్పు డగు నాకు సభవుగృహము.

మీ కడ దానము గొన్నది మొద లీకీర్తన నే మనస్సంతోషమునఁ బాడ లేకున్నాఁడను. మీభూమి మీకు గొనుఁడీ. నాకమెరికాఖండ మంతయు నిచ్చిన నే నొల్ల. నాకీర్తన నేఁ బాడుకొనియెద" ననియెను.

ఇట్టివారితో సాంగత్య మప్పుడప్పుడు అబ్రహామునకుఁ దటస్థించుచుండెను. వారు చెప్పినవిషయములును వారి చరిత్రవిశేషములును అతని మనమున నాటి యాతని యుత్కృష్టపదవికి దారిఁజూపెను. నిర్మల మనస్కులై నిజ మరయుచుఁ బై పూతలఁ దిరస్కరించి సద్గుణముల నలరారు పురోహితులు లోకమున కెంత మేలు గలుగఁజేయనేరరు?

చదువరులారా! మన కిప్పు డిట్టి యాచార్యులు గావలయును. లోకమును మోసపుచ్చు పై వేషములఁ జూచి భ్రమయంబోకుఁడు. మనోనైర్మల్యంబును గార్యధురంధరత్వమును దేశక్షేమము పై దృష్టియుఁ గల మహనీయులకు జన్మబలంబుగాని ద్రవ్యబలంబుగాని మిథ్యాశాస్త్రబలంబుగాని యనవసరంబు. కావున నీ బహిఃపటాటోపము చూపు డాంబికుల నిర

సించి నిత్యు, నిర్మలుఁ గరుణాసముద్రు, ననన్యసామాన్యు, సర్వేశ్వరు మనోవాక్కాయకర్మంబులచేఁ దెల్పు గురుజనంబుల నరయఁ బ్రయత్నింపుఁడి.

---

## ఐదవ ప్రకరణము.

### ఉల్లాసతరదినములు.

మృత్యువురాక గృహంబునఁ గలుగఁజేసిన మార్పులకు వగచి యాబ్రహాము బహుకాలము దైన్యావలోకనములఁ బ్రసరింపఁజేయుచు ఖిన్నవదనుండై యుండెను. మధ్యకాలమున మిక్కిలి యానందదాయి యగు విషయ మొక్కటి తటస్థింపకున్న నతఁ డా స్థితియందె యుండియుండునేమో యని తోఁచుచున్నది. అతనితండ్రి యిరువదిమైళ్ల దవ్వున నుండు నొకానొక స్నేహితునింట 'పిల్గ్రిమ్సుప్రోగ్రెస్'ను నొక పుస్తకముఁ గని దానిఁ దనకొమరున కియ్యఁదెచ్చెను. ఆబ్రహా మా గ్రంథము గాన్పించినతోడనె చాల సంతసించి తండ్రి కద్దానిపేరును జదివి చెప్పెను. తండ్రియు నాపుస్తకపువిషయ మేన్నఁడో వినియున్నవాఁడు గానఁ దనపుత్రునకు సుగ్రంథ మలవడె నని పొంగి 'అబ్బాయీ! నీ వా పుస్తకమును జక్కఁగఁ జదువుము. అందలి విషయము మంచిది. నీకు మే లగు'నని కొడుకుచేతి కిచ్చెను.

సామాన్యబాలురకు మంచిభోజన మనిన నెంతప్రీతియో యాబ్రహామునకు మంచి పుస్తక మన్న నంత ప్రీతి. బహుకాలము దన మూడుపుస్తకములె చదువుచుండు నితని కీ పుస్తక మొక నూతన సంతోష మొసంగెను. పట్టినది విడువక దాని నొక్కమారు చదివి రెండవమారు చదువునప్పటికి మఱొండు గ్రంథ మతనికిఁ బ్రాప్తించెను. అది 'ఈసాఫ్స ఫేబిల్స'ను నీతికథామంజరి. దీని నతఁడు పలుమారు చదివెను. చదివిన యనేకభాగము లతని శిరోపేటికయం దట్టె నిలిచిపోయెను. కథలఁ జదివి నీతుల స్మరించుటయం దతని మనము సంపూర్ణముగ మునిఁగి యుండెను. ఆ నీతుల నతఁడు ప్రాణమున్నంతకాలము జ్ఞాపక ముంచుకొని తదనుగుణముగఁ బ్రవర్తించుచుండెను.

ఇంతయానంద మిచ్చు పుస్తకద్వయంబు చేదొరకినఁ బనిపాటలమీఁద నతనికి దృష్టి గొంచము దక్కు వాయె ననిన నేమి వింత. తెలియనివా రీ లోపమును సోమరితన మని తలఁతురు. ఆప్రకారమ యతని తండ్రి తలఁచి యతని పై గోపము నూపుచు వచ్చెను. విద్యావంతులు గాక విద్యవలని ప్రయోజనములు సంపూర్ణముగ నెఱుంగని మోటువారి కిది సహజము సదా. మన దేశమున నిక్కాలమున ననేకులు దలిదండ్రులు దమ పుత్రులకుఁ బుత్రికలకు: జదు వనవసర మనియుఁ జదువ

నారంభించినవారు సోమరు లగుదురనియు నెన్నుచుందురు. ఇదెల్లయు దురభిప్రాయము. విద్య గడించుట యొకపనియనియు, దాన బుద్ధి సారఁజేసి పాటుపడెడువారు సోమరులుగాక మహాగొప్పవా రనియు మనము నమ్మవలెను. విద్యయొక్క యావశ్యకత నిట వ్రాయుటకు వీలుగాదు. అబ్రహాము లింకనె దీనికిఁ దార్కాణ మగుఁగాక. విద్యాధికత హీనజన్ముల ననేకుల కలవడి యున్నది. అలవడఁగలదు. సమర్థతకును జన్మమునకును సంబంధము లేదు. ఎవ్వఁడు పాటుపడునొ వాఁడు గొప్పవాఁడు గాఁగలఁడు. పరమేశ్వరుఁడు నిష్పక్షపాతి. తన సృజించిన జనులంద అతని కొక్కటియె. ఎవఁడు గష్టించి సుగుణసంపత్తిఁ జేర్చుకొని తన పాదారవిందములఁ గాంచు నతఁడ దనకుఁ బ్రియపుత్రుఁ డని దైవము ప్రసన్నుఁ డగును.

తండ్రికోపము సూచించినను అబ్రహాము వినయమున 'నిదె వచ్చితిని. త్వరితగతిఁ బ్రయత్నించి యెంతపని యున్నను దీర్చెదను. త్రుటికాలమున నా చదువు ముగించి వచ్చెద' నని తండ్రిని కొంత యోదార్చుచుండును. తండ్రి దన కుమారుఁడు విద్యాపేక్షచేఁ దన యుత్తరువుల నెరవేర్చుటయం దలసత సూపుచుండె నని తెలిసికొనలేక యాగ్రహము పూనినను బ్రేమాతిశయంబున నా యాగ్రహ మంత వెలువడఁ జేయుచుంట లేదు. అబ్రహా మింటితలుపులమీఁదను గోడలమీఁ

దను వ్రాయుచుండును. తండ్రి దీనిఁ జూచి కొంత కనలెను. అయినఁ గుమారు సామర్థ్యమువల్ల నగు సంతోష మాకోపము నణఁచివేయుచుండెను.

కొన్ని దినములమీఁదట నొక పొలమున నాబియు నతని తండ్రియు దున్నుచుండ నచటి కొక స్నేహితుఁ డేతెంచెను. ఏతెంచి మట్టిలోఁ జెక్కిన కొన్ని యక్షరములఁ గాంచి యవి యెవరు వ్రాసిరని యడిగెను. ఆబ్రహాము చిఱునగవున నూరకుండెను. అతని తండ్రి 'యాబి కార్యమై యుండును, మరే మున్న' దనియెను. అట వచ్చినమిత్రుఁడు 'ఆబి వ్రాయ లేడు గాఁబోలు' నని శంకించుచుండ నాబ్రహాము 'నేన వ్రాసితిని. కఱ్ఱదీసికొని యక్షరములఁ దీర్చితిని. ఆబి నాసంతకము' అని నుడువుచు నొకకఱ్ఱఁ దీసికొని మరల వ్రాయనారంభించెను. చదువుట విని వ్రాయుట కని యాగతుఁడు చాల ముదమంది 'ఆబి! చక్కగ వ్రాసితివి శభాస'ని యాబ్రహామును బుజ్జగించెను.

ఇండియానా నేలన ఆబ్రహాము నాఁడు వ్రాసినది చూడ ముందు నాతఁడు యునైటెడ్ స్టేట్స్ చరిత్రములోఁ జెఱుపరాని స్వాక్షరములఁ దన నామము లిఖించుననుటకు సూచనగ నుండె నని మనకు గోచరింపక మానదు.

ఈ ప్రకారము పుస్తక పఠనము పై దృష్టినిలిపి యాబ్రహాము క్రొత్త పుస్తకములు దనచేతి కబ్బినవి బహు జాగ

రూకతతోఁ జదువుచు వచ్చెను. నీతికథామంజరి యతనికి దొరకిన రెండుసంవత్సరములలోపల మరి రెండుపుస్తకములు లభించెను.

అం దొకటి 'వాషింగ్టను' జీవితము. అతఁడు యునైటెడ్ స్టేట్సు మొదటి దేశాధ్యక్షుఁడు. స్వాతంత్ర్యార్థ యుద్ధమం దతఁడు ప్రధాన సేనానాయకుఁడుగ నుండెను. అతఁడు 'యునైటెడ్ స్టేట్స తండ్రి" యని ప్రసిద్ధిఁగాంచెను. అతని చరిత్రము మా చదువరులు శీఘ్రకాలములోనె చదువఁ గలుగుదురు గాక. అబ్రహాములింకను బాలుఁడుగ నుండగ నా జీవితమును మాటిమాటికిఁ జదువుచుండెను. దాని ప్రతులు సంపాదించుటకై యాబ్రహాము పడినపాట్లనేకములు గలవు. వీ మను నతఁడు వ్రాసిన చరిత్ర మొకటి యా ప్రాంతముల జోషియా వద్ద నున్నదని విని యతని దర్శించి దానిఁ గొనితేఁబోయెను. పుస్తకము లెరవుగొనువారు వాని మరల నియ్యకుండుట పలుమారు తటస్థించుచుండును. ఇచ్చినను విరూప మొందఁ జేసి యుండుట సర్వసాధారణము. ఇతరుల సొత్తుఁ దమసొత్తుం బోలె చూచుకొని జాగ్రత్త పుచ్చుకొనకుండుట యిద్దానికిఁ గారణ మగుచున్నది. ఇట్టి యజాగ్రత్తవలన ననేకవిద్యాశాలలును, బుస్తక భాండాగారములును, అనేకగ్రంథములఁ గోలుపోయినవి. అయిన నాబ్రహాము మేమరుపాటునకు లోఁబడు

వాఁడు గాఁడు. తన ప్రాణములఁ గాపాడుకొను తెఱంగునఁ బుస్తకములఁ గాపాడుకొనుచుండును. కావున నతఁడు జోషియాకు "అయ్యా! మీ గ్రంథము నుపేక్షసేయక దాచి మంచి స్థితియందుఁ గొద్దిదినములలోఁ దెచ్చియిచ్చెద" నని చెప్పి చాల సంతసమున నాపుస్తకముం దీసికొని పోయెను. తనపని యంతయు నైనపిదపఁ బ్రతి సాయంకాలమును సంపూర్ణ మగ్నతతో నా గ్రంథము చదువుచు వచ్చెను. మధ్యకాలమున నెప్పుడొకనిమిష మవకాశమున్న నాపుస్తక మవలోకించుటయంద దానిఁ గడపుచుండెను. ఒకనాఁడు గాలివాన విశేషమై యుండి పని లేనందున దినమంతయుఁ జదువుచునే యుండెను. పరుండఁ బోవు సమయమునఁ దాఁ జదువుపొత్తమును రెండు మొద్దుల మధ్యభాగమున దాఁచెను. రాత్రియందు గాలి ప్రబలి జల్లు గొట్టి యా పుస్తక మంతయుఁ దడిసిపోయెను. తెల్లవారి లేచి తన ప్రియవస్తు వా స్థితి నుండుటకుఁ జాల చింతిల్లి జోషియాకు మొగముసూప సిగ్గగుఁ గదా యని దుఃఖించి యతఁ డేమిపని యడిగిన నాపనిచేసి యతని సంతోషపెట్టుద మని నిశ్చయించుకొని యతనిఁ జూడ వెడలెను. జోషియా యీవార్త వినినతోడనె మండిపడఁ జొచ్చెను. మధుపానపు మత్తు సహజ హృదయకాఠిన్యమునకు సహకారి యాయెను. అయిన నా జహామునుండి పనిదీసికొను నాశ యతనిఁ

గొంత శాంతపఱచెను. తుట్టతుద కా పుస్తకపు వెలగ నాబ్రహాము జోషియా పంటఁ గోయవలసి వచ్చెను. అనేక యకరముల విరివిగలిగి మనుష్యు నెత్తుగఁ బెఱిగిన పైరు గోయుట కాబ్రహా మియ్యకొని సాధారణముగ నొక మనుష్యుఁ డైదు దినములలోఁ జేయఁగలుగునంత పనిని మూడురోజులలో సంపూర్తి సేసి పెట్టెను. "ఇంతకష్టపడినఁ బడితిని గాక. నా కొక క్రొత్త గ్రంథ మబ్బెనే" యని యతఁ డెల్లపుడు హర్ష మొందుచుండెను.

---

## ఆఱవ ప్రకరణము.

### క్రొత్త తల్లి, క్రొత్త విద్యాలయములు.

1819-వ సంవత్సరమువఱకు థామసు ద్వితీయ వివాహ ప్రయత్నములు సేయలేదు. ఈ మధ్యకాలముననంత సారా గృహకృత్యముల నెరవేర్చుచుండెను. అబ్రహాము దన సోదరికి సాయ మొనర్ప నియమింపఁబడి యుండెను. గొప్పవాఁ డెచ్చటను గొప్పవాఁడె గదా. ఇంటి పనుల నెరవేర్చుటయందతఁడు ప్రవీణుఁ డాయెను. తరువాత నిరుగుపొరుగువారి గేహముల నతఁడు పనిసేయుచున్నెడ మిక్కిలి మెప్పు వడయుట కిదియే కారణ మాయెను.

స్త్రీయజమాన్యము లేని గృహము శ్రీ దక్కియుండు ననుటకు సందియము వలదు. బిడ్డల యుడుపులు చినిగి వ్రేలాడుటకుఁ బ్రారంభించెను. ఇంట వస్తువులు చూడ నింపులు గురిపించు విధమున నుండుట దూర మాయెను. పూరిగుడిసె నైనను వైకుంఠము చేయఁగల్గు నారీరత్నము లేమిఁజేసి యిల్లే యడవి యాయెను. కావున థామసులింకను భార్యాన్వేషణార్థము వెడలెను. కెంటకీ సీమసొచ్చి పూర్వము దన్ను వరించుటకు మాఱుగ జాన్సన్ అను నతని వరించి విధవ యై యుండిన "సాలీబుష్" అను నామెను వివాహ మాడెను. ఆమె కప్పటికి ముగ్గురు బిడ్డలు: జాన్, సారా, మటిల్డా. ఆ కాలమున కామె ధనవంతురాలు. మూడుకాండ్లఁగట్టి యామె సామాను, ఆఱు కుర్చీలు, ఒకబీరువ, కొన్ని పెట్టెలు, బల్లలు, పరుపులు మొదలగునవి, ఇందియానాకు సాగింపఁబడెను. ఆబ్రహామున కివన్నియు నద్భుతము గలుగఁజేసెను. అదివఱకెన్నఁడు నంత సామాను దాఁ జూచియెఱుఁగడు. మాఱుదల్లిపై నతని కప్పుడ ప్రేమాంకురంబులు చూపట్టెను.

"సాలీ", "నాంసీ" కంటె విశేషము విద్యాపరిశ్రమగలది. దేహము గృహము మిక్కిలి యింపుగను శుభ్రముగను ఉంచుకొనఁ బ్రయత్నించుచుండును. కావున దా లింకను కుటీరము చేరినవెంటనె దానిఁ జక్కఁ బెట్ట మొదలిడెను. నడు

భూమి చదునుచేసి కవాటములును గవాక్షములును దీయించి కుర్చీలు బల్లలు దగువిధముగ నిలిపి యాగృహమునకుఁ గ్రొత్త వన్నె దెచ్చెను. కొద్దిదినములలోపల నామె తెచ్చిన కాంతిఁ జూచిన నామె సమర్థతయు, కార్య నిర్వాహకత్వమును దేట పడియెను.

ఇంతటిబుద్ధికౌశల్యమును, విద్యాసంపత్తియు, గల మాఱుఁ దల్లి యింటి నలంకరించిన దిన మాబ్రహామునకు మహా సుదినము. ఆమె రాక యతనికిఁ దల్లి మరణ మాదిగ నెప్పుడు లేని హర్ష మొసఁగెను. ఆమెను, ఆమె బిడ్డలను సంతోషముతోఁ జేర్చుకొని వారిని మిక్కిలి యాదరణ ప్రేమతో స్వంతతల్లి సోదరుల తెఱఁగుననే గణింప దొడఁగెను. మొదట వచ్చినప్పు డా బిడ్డల యుడుపులు ముద్దుగ నుండెను. అబ్రహా ముడుపులును మాఱుఁదల్లి రాకచే నాప్రకారమ సవరింపఁ బడెను. ఆ బిడ్డ లాబ్రహామునకు సంపూర్ణ సోదరభావము చూపుటయేగాక యతని ప్రౌఢిమ కద్భుత మంది యతని గౌరవించుచుండురు.

"సాలీ" యాబ్రహాముపై మిక్కిలి దయగల్గి ప్రేమతోఁ బెంచుచుండెను. అతని విద్యాభ్యాసమున కామె మిక్కిలి తోడ్పడెను. అతఁడును జీవించినంతకాల మామెయం దనురాగము గనుపఱచుచుండును. ఆపె బిడ్డలును అబియుఁ గలసి

మెలసి చదువుచుందురు. లింకనుగూడ దగువిధమున విద్య గఱపిన నాబి గొప్పవాఁ డగునని గుర్తింప నారంభించెను.

1819-20 వ సంవత్సరమునందుఁ బ్రాప్తించిన గొప్పలాభ మాబికి మాఱుఁదల్లిరాక యొక్కటియగాదు. క్రొత్తబడి యొకటి దమ కుటీరమునకు రెండుమైళ్ల దూరమున నుంచఁబడెను. తల్లిదండ్రు లిద్దఱు నాబీని నచటికిఁ బంప నిశ్చయించిరి.

జనులు విశేషముగ వచ్చి చేరియుండిరి. వారి బిడ్డల కొఱకు విద్యాలయము గావలసివచ్చెను. కావున వా రొక పూరి గుడిసె నిర్మించి యుంచిరి. చక్కఁగ మనుష్యుఁడు నిలిచిన నాగుడిసె కప్పు దలఁదాకుచుండును. గోడ కన్నములే గవాక్షము లాయెను. మంట సేసికొనుట కొఱకు ప్రక్కన ప్రొయి యొకటి సిద్ధముగ నుండెను. ఇట్టి సరస్వతీ సదనమున నాబ్రహాము గణితము నేర్చుకొనుటకుఁ బంపఁబడెను. అతనితండ్రి వెదకివెదకి యొక ప్రాఁత గణిత పుస్తకము నొకదానిని దెచ్చియిచ్చెను. తల్లి క్రొత్త యుడుపులఁ గుట్టి యాబ్రహామునకుఁ దొడగ నిచ్చెను.

అచట నాబి గణితమునఁ బ్రవీణుఁ డాయెను. వర్ణక్రమమున నద్భుతశక్తి సంపాదించెను. అయిన నప్పటి విద్యాలయము లన్నిటివలె నదియును గొన్ని వారములలోపల నగోచరమాయెను.

ఆబ్రహాము మిక్కి రెండుతరుణముల మాత్రమె పాఠశాలల ముఖము సూచెను. మొత్తముమీఁద నతఁడు విద్యాలయము లలోనుండినకాల మొక సంవత్సరమునకు మించదు. ఏ బడికిఁ బోయినను, ఏయుపాధ్యాయునివద్ద నభ్యసించినను, ఆబ్రహాము మచ్చట గల్గువిద్య నంతయు సంగ్రహింపక మరలినది లేదు. గురువుకుఁ బ్రియత్వ మింత పెనచినవారునులేరు. అతని గుణాధిక్యము వెల్లడిసేయు నంశములు గొన్ని యిట వివరించెదము.

ఆబి క్రాఫోర్డు గారి బడిలోఁ జదువుచుండెను. అచట నొక గోడకు బంధింపఁబడిన దుప్పికొ మ్మొకనాఁడు విఱిగిపడి యుండెను. పంతులవా రదిచూచి బాలురలో నొక్కరుఁ డా పని సేసియుండనోపు నని తలంచి మఱునాఁడు వా రందఱు చేరినతరువాత ‘ ఎవ రీకొమ్ము విఱిచి ’ రని యడిగెను. దానికిఁ బ్రత్యుత్తరముగ నాబ్రహాము “ అయ్యా! నే విఱిచితిని. తెలియక దానిఁ బట్టి యూఁగితిని. అది విరిగె. నే తప్పుసేయ నెంచనైతి ” నని నిజము పలికి యుపాధ్యాయుని మెప్పు వడసెను. అతఁ డెప్పు డనృత మాడినది లేదు. తన తప్పితరుల పై నేడఁ జూచినది లేదు.

కూర్మముఁ బట్టి వేధించుట యా బడిపిల్లలకు సర్వసాధారణము. దాని నణఁచివేయ నాబ్రహా మెన్నొ ప్రయత్నములు చేసెను. ఉపన్యాసములు వ్రాయుట యాపాఠశాలయం దాచా

రము గాకున్నను 'జంతుహింస' ఖండించుచుఁ జిన్న వాక్యములు మొదటమొదట వ్రాసి తరువాత నొక పెద్ద యుపన్యాసము వ్రాసి చదివెను. అతని జ్ఞాపకశక్తియు ననన్య సామాన్యము. చదివినభాగము లనేకము లొక్కవిధమునఁ గథనము సేయు చుండును. అతనివాగ్ధోరణియు నపారముగ వృద్ధిఁబొంద దొడఁగెను. కవిత్వమునఁగూడ నతఁడు గొంచెముగొంచెము పరిశ్రమ సేయుచుండెను.

ఆబ్రహాము బాల్యమునుండి దయామయుఁడు. కొందఱు బాలు రొకతాఁబేటివీఁపున నగ్గినిడి దాని వేధించుచుండిరి. ఆ యగ్గి దనవీఁపున నిడిన నెంతబాధ గలుగునో యంతబాధ నొంది యతఁడు,

"అటు చేయకు మటుచేయకు" మని యఱచెను. అందొకఁడు "ఎటుచేయకు మెటుచేయకు" మని వెక్కిరించుచు హా. తాఁబేటి నొక కఱ్ఱతో నడఁచెను.

"అంత శౌర్యము వలదు. నీ వీపునఁ జిచ్చిడిన నీ వేలా గుందువో యోచింపు" మని యాబి నుడివెను.

దానికి మఱియొకఁడు "ప్రయత్నించి చూడు" మని కేక లిడెను.

ఆ ప్రకార మాజంతువు నలయించుట దౌర్జన్యంబును నీచత్వము నగు" నని యాబ్రహాము గట్టిగఁ బల్కెను.

"కూర్మమాత్రమున కింతేల యఱచెదరని" యొక్కండు నివారింపఁ జూచెను. అయిన నాబ్రహాము మొక కొయ్యతో నా తాఁబేటిపై నగ్గిని ద్రోసివేసి పిడికిలిఁబట్టి ధిక్కరించుచు నా దెబ్బకుఁ దాళఁజాలితివేని దాని నలయింప సమకట్టుమని యా బాలు నట్టె నెట్టివైచెను. కరుణా విహీనుఁ డగు బాలుఁడు "ఆహా! నీవంటి భీరు వీ జగంబున లేఁడు. నీ కా కచ్ఛపము సోదరుఁడు గాఁ బోలు" నని హేళన మొనర్పఁ దొడఁగెను. "సోదరుఁడైన నగుఁగాక. నా యెదుట నీ విట్టి క్రూరకృత్యంబులు గావింపకకుండు" మని యాబ్రహాము శాసించెను. ఇంతలో నొక కొందఱు బాలు రాతనితో నేకీభవించుటయు నా తాఁబేటి వేదన తీరిపోయెను.

ఒకానొకరోజు బడి తీరి విద్యార్థు లెల్లరును దమతమ యిండ్లకు వెడలుచుండిరి. అం దిద్దఱకు వర్ణక్రమ విషయమున నొక పోట్లాట ప్రారంభ మాయెను. కొంచెపుమాటలు పోయి కఠినోక్తులకుఁ దిగి కఠినోక్తులుపోయి ముష్టియుద్ధము ప్రారంభ మగుగాల మాసన్న మాయెను. ఇది గమనించి యాబ్రహాము వా రిద్దఱి మధ్యఁజేరి వారి భుజములపైఁ జేతులునిచి యం దొక్కరుని "ఈపనికిమాలిన విషయమున కింత పోరనేటికి? రా రమ్మ"నియెను. వాఁడు "న న్నన్యాయముగఁ గల్లరి యన నేల? నిన్న నిన నీ వూర కుందువే?" యనెను. తరువాతఁ

గొంతే సంభాషణ జరిగినమీఁద నాబ్రహాము "మన మితరుల దూషణములఁ గైకొని యాగ్రహింపకున్న వా రూర కుందురు" ని బుద్ధి చెప్పెను. ఈ లోపల నా బాలురు ప్రశాంతులైరి. దుడుకుతనమునఁ గల్లరి యనిన వాఁ డాపదప్రయోగమునకుఁ జింతించుట సూచింప నాబ్రహాము వానినిఁ గొనియాడి మరల వారి నెప్పటివలె స్నేహితులఁ జేసెను.

---

## ఏడవ ప్రకరణము.

### కృషి, సంపాదనలు.

అబ్రహాము లింకనున కిరుగుపొరుగున నుండు జనులెల్ల మిక్కిలి మూఢులు. మన దేశమున గొందఱఁబలె మంత్ర తంత్రములయం దత్యాదరము గలవారు. మంత్రకాండ్రు మంత్రకత్తెలు మనలఁ దమ వశము చేసికొందు రనియు, నందులకుఁ బ్రతిక్రియ వారి ప్రతిమలఁ జేసి యవ్వాని వెండిగుండునఁ గాల్చుటయే యగుననియు నమ్ముచుందురు. ఎవఁడైన వేఁట వెడలునప్పుడు దారిని గుక్క యడ్డుపడిన మిక్కిలి కష్టసూచక మనియు, నద్దాని నివారణార్థము నడిమి వ్రేళ్లఁ జెనవేసి ముందుకు గనుమఱుగువఱకు లాగుకొనుచుందురు. కొందఱు మాంత్రికులు మంత్రపూరితదండములఁ గొని భూమిలోని [illegible] ద్రవ్యసముదాయములఁ జూపెదమని జనుల భ్రమింపఁ

జేయుచుందురు. గూఢతంత్రములచేతను గుప్తోచ్చారణల చేతను వ్యాధుల మాన్ప నుద్యమించు వైద్యులనేకు లుందురు. ఏదో యొక పక్షి గవాక్షములోనికిఁ దిగిన నాయింట మృత్యువు ప్రవేశించు నని జడియుచుందురు. బిడ్డకు గుఱ్ఱపుశ్వాసము దాకినఁ గుక్కదగ్గు ప్రారంభ మగునని తలంచుచుందురు. శుక్రవారముననే ముఖ్యకార్యమును జేయఁగూడదఁట! ఇఁక నిట్టి నమ్మికలు లెక్కకుమీరి యిప్పుడు మనల నెట్లో వారి నప్పు డటు బాధించుచుండెను.

పుట్టినదిమొదలు పెద్దవాఁ డగువఱకు నాబ్రహాం విగాలాటి జనుల మధ్యఁ బెరుఁగుచు వచ్చెను. వారి యాచారవ్యవహారములును వారి యభ్యాసాభిప్రాయములు నెల్ల నతనికిఁ జక్కగ మనసునకు వచ్చెను. అయిన నతఁడు వారి బాలురఁగూడి మెలఁగుచుండుటను వారివద్ద పనులు సల్పుచుఁ గాలము గడపుటవలనను వారితోడన సంభాషింపుచు, వారికష్టనష్టములన పరిగణించుటచేతను మఱి యేరివిషయములనైన నెఱింగి వానితోఁ దనజనులయాచారాదుల సరిపోల్చుకొనఁ జాలకుండెను. అయిన నతని మనస్థితికిఁ దగు నున్నతాచారాభిప్రాయము లెచ్చటను గానరాకుండెను.

టెయిలరు అనువాఁడు ఓహియో నదిమీఁదను అండర్ సను అనువాఁడు క్రీకుమీఁదను నొకచిన్నపడవతో వ్యాపా

రము సేయుచుండిరి. తన పడవనడుప మనుష్యుఁ డొక్కని నియమించుకొనన నభిలషించి థామసువద్ద కేతెంచి యాబ్రహాము నంపెదవా యని యడిగెను. ఇద్దఱును గొంతతడవు బేరము లాడుకొనినతరువాత టెయిల రాబ్రహామునకు భోజనముపెట్టి నెలకు రెండున్నఱరూపాయిలు జీత మియ్య నొప్పుకొనెను. థామసును అందులకు సమ్మతించి తన కొడుకును మఱుసటిదినము పనికిఁ బంపెను.

యజమానునాజ్ఞఁగొని యతఁడు నావికుఁడాయెను. సమయము పడిన చేనుకాపఱిగను, గుఱ్ఱపు మానిసిగను, ఇంట సేవకుఁడుగను కార్యములు నెరవేర్చవలె నను విషయము గూడ నతని కెఱుకపఱపఁబడెను. ఓడ నడపుటాతనికి నవీనమగుట నెక్కుడు సంతసోత్సాహము లొసఁగెను. పదునేడు సంవత్సరముల బాలుఁడైనను ఆఱడుగుల నాలుగంగుళముల యెత్తై తదనుగుణముగ దళమై యాప్రాంతముల బలమున నెల్లర నతఁడు మించియుండెను.

టెయిలరుగారి యింటియం దతఁడు సర్వకార్యములను నెరవేర్చుచు వచ్చెను. తెల్లవాఱ నందఱికంటె ముందు నిదుర లేచి ప్రొయి రాజఁ జేసి నీళ్లు సిద్ధపఱచి పచనకార్యమునకు వలయునదెల్ల సాయత్తము సేయుచుండును. చేసినపనియెల్ల మిక్కిలి జాగరూకతతో లోపములు కడమిరాక ముగించుచుం

డును. కావున టేలరుభార్య యాబ్రహామంతటియద్భుత బాలు నెన్నఁడుఁ జూడ నైతి నని యతని గౌరవించుచుంట విపరీతముగాదు.

టెయిలరుగారి గృహమున నాబికి యున్నైటెడు రాష్ట్రపుఁ జరిత్రయు మఱి రెండుపుస్తకములును జేఁ జిక్కెను. వానిఁ జదువుటయం దతనికి మిక్కిలి యభిలాష యొడమెను. దిన మంతయుఁ గష్టపడి యొడలువంచి పనిసేసి రాత్రి నవ్వాని పఠించుచుండును. టెయిలరు కుమారుఁడు గ్రీను నిద్రాపర వశుఁడు. దీపము వెలుఁగున కోర్వక యాబీని నదలించుచుం డును. మనసునఁ గోపము నిండియుండియుఁ బైఁబడి కొట్టునంత బలమున నొప్పియు శాంతస్వభావము గలవాఁడు గావున నాబ్ర హాము గ్రీను నేమనక తనంతకుఁ దాఁ జదువుచుండెను.

అచ్చట నాబి సూకరవధ నేర్చుకొనియెను. టెయిల రీ పని కతని నియమించి నెల కిరువదియాపాయిలవంతున సంపా దించుచుండెను.

ఓడనడపువాఁడుగ, వ్యవసాయదారుఁడుగ, కుట్టుపువాఁ డుగ, సేవకుఁడుగఁ, గడపటఁ గటికవాఁడుగ నిట్లే పనిచేసి నను సంపూర్ణముగఁ దనశక్తినెల్ల నుపయోగించి జయప్రద ముగఁ దుదముట్టించుచుంట నాబ్రహాము యజమానుని నపరి మితానందమున ముంచెను.

నిర్ణీతమాసములు దొమ్మిది చనఁగానే యాబ్రహా మిల్లు చేరెను. అతని సోదరి పాణిగ్రహణ మహోత్సవ మప్పుడ యాలింకనుల కుటీరమున యథావిధిగ జరిగెను. తదర్థ మాబె కొన్ని పద్యములు వ్రాసి యతిథులకెల్ల హర్షము గలుగఁజేసెను. నాప్రాంతముల నతఁడుదక్క మఱి యెవ్వరు నిట్టిసమయముల గ్రంథస్థితవిషయముల కథనముచేసియు, నూతనముగఁ గల్పించియు వాక్చాతుర్యమునఁ గవననైపుణినిఁ గనుబఱచి వినువారలఁ బ్రక్కలెగయ నవ్వఁ జెనకు సమర్థులు లేనందున నతఁ డిట్టి సంతసనమయముల ముఖ్యుఁడుగ గణింపఁబడుచుండెను.

ఈ వివాహానంతర మొకసంవత్సరమునకు సారా పరలోక ప్రాప్తి నొందెను. సోదరిని మిక్కిలి ప్రేమించుచుండెఁ గాన నిది యాబ్రహాము హృదయముఁ గొంతకాలము చింతాక్రాంతముఁ జేసెను

కొద్దికాలమునకుఁ దరువాత నాబ్రహాము మఱియొక వ్యాపారి జోన్సుదగ్గఱఁ బనికిఁ గుదిరెను. ఆయజమానుఁ డితని యద్భుతశక్తి కలవాఁడు గాన నితని దన విశ్వాసపాత్రునిగఁ జేకొనియెను. అతనికొట్టు లింకనుల కుటీరమునకు నొకటిన్నర మైళ్లుదూరమున నుండెను. అం దాబ్రహామునకు ఫ్రాన్క్లిన్ జీవితము మొదలగుఁ గొన్ని పుస్తకములు దొరకెను. వార్తాపత్రికలు గూడ నా యజమానుఁ డొకదానిఁ దెప్పించుచుం

డును. వీనినన్నిఁటి నాబ్రహాము జక్కఁగఁ జదువఁ దొడఁగెను. రాజకీయ వ్యవహారముల జ్ఞానము సంపాదించుకొనుట కిదె యాబికిఁ బ్రథమప్రయత్నము.

జోన్సు యాజమాన్యము దప్పిపోయినపిదపఁగూడ నాబ్రహాము స్నేహితులతో నాతని కొట్టునకు విచ్చేసి రాజకీయ వ్యవహారముల గుఱించి చర్చించుచుండుట సాధారణముగ నుండెను.

ఈ చర్చల నొకరాత్రి ముగించి స్నేహితులు దానును నిండ్లకేగుచుండిరి. మంచు విశేషముగ గుఱియుచుండెను. చలికి నిలువలేక జంతుసంతానమెల్ల నెక్కడి వక్కడ ముడిఁగి కొని పోయియుండెను. చీఁకటు లల్లనల్లన దట్టమగుచుండెను. అట్టి సమయము నాదారియందొక శరీరము గదలమెదల లేక పడియుండెను. పరిశీలింప నాప్రాంతమున నుండు నొక త్రాగుఁబోతు దప్పఁద్రాగి మైమఱచి నేల గూలియుండుటఁ గాంచిరి. తన మిత్రు లెల్లరు నట్టివాని కిట్టి శిక్షయె దగు నని నుడువుచుఁ దమతమ నెలవులకుఁ జనిరి. ఆబిమాత్రము వానిపైఁ జాలిఁగొని బలశాలి గావునఁ జేతులపై వాని నెత్తికొని పోయి సమీపమున నుండు నొకమిత్రుని కుటీరమునఁ జేర్చెను. వాఁడును మొదట నుపేక్ష సేయఁబూని య్యాబ్రహా ముపన్యసింప జ్ఞానముఁ దెచ్చికొని యతనికి సాయ మొనర్చె

చుండెను. మంటవేసి రాత్రియంతయు నాయదృష్టహీనునకుఁ బరిచర్య లొనర్చుచు నాబియు నాతని స్నేహితుఁడును గడపిరి.

మఱునాఁ డుదయమున మేల్కాంచి యా త్రాగుబోఁ తెంత సంతసించి యుండునో ఘన మెఱుంగఁజాలము.

---

## ఎనిమిదవ ప్రకరణము.

### ప్ర వృ ద్ధి, ప్ర కా శ ము లు.

అబ్రహా మెప్పుడును దల్లి కెదురుసెప్పి యెఱుఁగఁడు. ఆయమ చెప్పిన పనియంతయుఁ జేయుచుండెను. తల్లికూడ నతని మాటయనిన మిక్కిలి యాదరించుచుండు. అతఁడు పరలోకప్రాప్తిఁ జెందినతరువాత నంత గుణవంతుఁ బుత్రుఁ దా నెన్నఁడుఁ జూడ లేదని నుడువుచు నాపె పలుమాఱు విలపించుచుండును. దేశాధ్యక్షత కాతఁ డెయ్యకొనునపుడు దన మన మెట్లో భయ మందెననియు, నతని కా పదవి రాకున్న మే లగునని దాఁ దలంచుచుండుననియుఁ జెప్పి పుత్రరత్నముఁ గోలుపోయి బ్రతుకుటకంటె దన ధవునకుఁ బూర్వమె దా నేల భూలోకము విడువకుంటి నని దుఃఖించుచుండును.

తండ్రిమాత్ర మబ్రహాము పైఁ గొంచె మాగ్రహము గనుబఱచుచుండును. విద్య గఱపించుటకుఁ గాలము దొఱక

నా యని వేచియుండి చిక్కిననిమిషమును విడువక యుపయోగించుకొనుచుఁ దండ్రిపనుపు లంత శీఘ్రముగఁ జేయకుంట దండ్రి కంత సమ్మతముగా నుండదాయెను. అయిన నింతకంటె గొప్ప యాగ్రహకారణము మఱొకం డుండెను. రాజకీయోపన్యాసములకును మతవిషయిక చర్చలకును నాబి పేరువడసెను. ఎచట నొక మొద్దు పడియుండిన దాని పై నెక్కి యుపన్యసించుట యతనికి సర్వసాధారణము. ప్రతి యాదివారమును సాయంకాలమునఁ బురోహితులు నుడువునదెల్లఁ దాఁ జక్కఁగ వినుచుండును. దానిని దన మనోపేటికఁ జేర్చి సంపూర్ణముగ జ్ఞాపక ముంచుకొని మఱునాఁడు పెద్ద మొద్దు నెక్కి కథనముసేయ మొదలిడును. అతఁ డెప్పు డుపన్యసించుటకుఁ బ్రారంభించునో యప్పుడ చుట్టుప్రక్కలవా రందఱు దమ పనుల వదలుకొని విన వచ్చుచుందురు. ఏ పురోహితుఁ డేమాటలతో నేవిధమున నేస్వనమున నుడువు నామాటలతో నావిధమున నాస్వనమున నాబ్రహాము వినువారల వీనుల విందుసేయును. ఇట్టినడత పనుల కడ్డమువచ్చుటఁబట్టి థామసు కుమారుని గోపగించుచుండును. అయిన నిట్లు చేయఁగూడదని గట్టిగ నుత్తరువు సేయఁడాయెను. కొన్నిదినములమీఁద నాప్రాంతముల కొకయాచార్యుఁడు వింతవాఁ డేతెంచెను. అతఁ డుపన్యసించునపుడు బల్ల బద్ద లగునట్లు పిడికిటితోఁ గొట్టు టతని

కలవాటు. అతని మాటలు కేకలకు సమముగా నుండును; స్వనము పగిలి ముక్కుగుండ వచ్చిన ట్లుండును. ఈ వైపరీత్యములెల్లఁ జిన్నవారలకు హాస్యాస్పదము లయ్యె. అబ్రహామవ్వాని నట్లె ప్రదర్శింపఁ దొడఁగె. కొందఱు వయసుదీరినవారు మతాచార్యుల నట్లవమానపఱచుట తగదని ఖండించినను వారుగూడ నాబ్రహాము ప్రతికల్పనఁ గనినప్పుడు ప్రక్కలెగయ నవ్వుచుందురు. థామసునకుమాత్ర మిది మిక్కిలి దుర్భర మాయెను. తనకొమరుఁడు పలుమా ఱీవిధమున నితరులఁ బరిహాసించుట కతఁ డోర్వక పనిచేయునని తలంచి యిట్టి నడవడి మానివేయవలసినదని యాబి కాజ్ఞ యొసఁగెను.

అయినఁ గొడుకు బుద్ధికుశలతకును, ఉపన్యాస శక్తికిని థామసు మనసున బహుసంతోషము నొందె ననుటకు సందియము లేదు. అతఁడు సంతసించినను సంతసింపకున్నను అబ్రహాము మాత్రము దన పురోభివృద్ధికి నవశ్యంబులయిన సాధనంబుల సేకరించెను. రాజకీయోద్యోగములఁ బ్రాముఖ్యతఁ దెచ్చు సాధనముల గడించుట కీ యభ్యాసముకంటె శ్రేష్ఠమైనది వేరొకటి లేదుగదా.

లింకనుల గుడిసెకు మైలున్నర దూరమున నివసించుచుండు సద్దను వతనివద్ద పలుమారు పనిసేయుట కాబ్రహాము నిజయజమానమునఁ బోవుచుండును. ఆ యజమానుఁడు రెండు

వార్తాపత్రికలఁ దెప్పించుచుండెను. అందొకటి మత్తుపదార్థముల ఖండన నిమిత్త మేర్పడినది. రెండవది రాజకీయ వ్యవహారములగుఱించినది నై యుండెను. రెండవదానికంటె న్యాబహాముకు మొదటిదానియం దెక్కుడు గౌరవము. దానిఁ జదివిచదివి తుట్టతుద కీ విషయమున మునిఁగిపోయి తా నొక పెద్ద యుపన్యాసము వ్రాసి యుడ్డుచేతి కిచ్చెను. అతఁ డద్దానిఁ జదివి పట్టరాని సంతోషమున నితరులకుఁ జూపి యాబాలకుఁ బోగడి దాని వార్తాపత్రికయందుఁ బ్రచురింపించి యిరుగుపొరుగువా రందఱకుఁ జదువ నంపెను. చదివినవారెల్ల నాపత్రికయందలివిషయ మత్యుత్తమముగా వ్రాయఁబడినదని మెంచి, దాని వ్రాసిన యాబ్రహాముశక్తికి మెచ్చిరి. ఉడ్డుగా రతనిఁ జూచి "రాజకీయోపన్యాస మొండు వ్రాయఁ గల్గుదువే?" యనిరి. "నే నిదివఱకుఁ గొన్ని వాక్యములు వ్రాసి యుంచితిని. గొప్ప యుపన్యాసము వ్రాయ నైతిని. ఇప్పుడు ప్రయత్నించెదఁ గాక," యని యాబ్రహాము ప్రత్యుత్తర మొసఁగి విషయ మేదియైన బాగుండు నని యడిగెను. ఉడ్డుగా రొక కొన్ని యంశంబుల సూచించిరి. ఒక్కవారము గడవకముందె యాబ్రహా ముపన్యాస మతని కందెను. ఏమి వ్రాసినదియు నతనికి సంపూర్ణముగ జ్ఞాపకము లేకున్నను దాని ముఖ్యాంశము లివియని చెప్పియున్నాఁడు:

"బుద్ధి కుశలు లగు జనులకు నమెరికా ప్రభుత్వమే (అనగా ప్రజాప్రతినిధులచేఁ బరిపాలన) తగును. ఇది చక్కఁగఁ బ్రబలి యెల్లకాల ముండుఁ గాత. దేశ మంతటను విద్యా దీపము వెలుఁగఁజేయుట కర్తవ్యము. రాజ్య నిబంధనలు గాపాడఁ బడవలసినది. రాజ్యైక్యము వృద్ధి చేయవలసినది చట్ట దిట్టములు చక్కఁగఁ బ్రయోగింపఁ బడవలసినది. జనులహ్వాని గౌరవింపవలసినది."

ఉద్ధుగా రీ యుపన్యాసముఁ జదివి మునుపటికంటె నెక్కుడు సంతృప్తిఁ జెందిరి. ఎక్కు డాశ్చర్యాద్భుతములకును నిది యెడ మిచ్చెను. ఇప్పు డీ విషయమును బరిశీలించు మన కీ యుపన్యాసము నూతనానందము గలుగఁ జేయుచున్నది. అబ్రహాము దేశాధ్యక్షత వహించునెడ మొదటి యుపన్యాసమున నీవిషయములే నుడివి వాని నెల్లఁ దా నెరవేర్పఁ బ్రారంభించెను. అడవుల నిడుమలఁ బడుచుండు బాలుఁడగు నీయుపన్యాసపుఁ గర్త ముప్పదిమూఁడు సంవత్సరముల మీఁదట దేశాధ్యక్షత వహించి రాజ్యైక్యపు శత్రువులు రాజ్యనిబంధనలఁ దుడిచివేసి, యైక్యముఁ బోఁదోలి, చట్టదిట్టముల మట్టిఁగలుపఁ జూచుచుండఁ దన ప్రథమోపన్యాసమున వారికి వ్యతిరిక్తముగఁ దా వ్యాఖ్యానము వ్రాసిన విషయములనే నుడువు టెంత చిత్రము ఆహా! ఏమి వింత.

గీ. పురుషకారంబు దానెంత పొరవడినను
దేవుఁ డెప్పుడు దగురీతిఁ దీర్చుచుండు.

ఈ రాజకీయోపన్యాసమునుగూడ నుద్దుగారు పత్రికయందుఁ బ్రచురింపించుటకుఁ బ్రయిత్నములు సేసిరి. ప్రిచ్చర్డను నొక న్యాయవాది యీ దారినిఁ బోవుచుండ నతని కాలిఖితవిషయము సూపిరి. అతఁడు దానిఁ జదివి యుద్దుగారిదేమో యని సందేహించి యీబిన్సృష్టి యని విని మనమున నలరి తమ పక్షపుఁ బత్రికయందు ముద్రింపించుట కియ్యకొనెను. కొన్ని రోజులలో నా యుపన్యాసము పత్రికయందుఁ జేరి యుద్దుగారికి సంతృప్తియు, నాబికి సంతోషమును, ఇరుగు పొరుగువారల కానందమును గలిగించెను.

అబ్రహాము నాటలయం దభిరుచి బహుమెండు. వాక్చాతుర్యమున జనరంజకత్వము నొప్పు నతఁ డవ్వానియందు మిక్కిలి పేరు వడసెను. అతను లేనియాటలన్నియు మంగళసూత్రములులేని కన్యాదానములవలె నుండును. పదునెనిమిది సంవత్సరములవాఁ డైనదాదిగ నతని కాయపుష్టి పేరొందినదాయెను. రూపునందేగాక బలమునందుఁగూడ రాక్షసునిఁ బోలియుండును. ముగ్గురుమనుష్యులు సాధారణముగ మోయఁగల్గు బరువు నతఁ డవలీలగ నెత్తివైచుచుండును. మల్లయుద్ధ మప్పటికాలమునఁ గడుప్రియ మగు నాట. దానియందు నాబి

బహు సమర్థుఁడు. తనతో నాడువారల నెల్లర సునాయాసముగ నోడించుచుండెను.

---

## తొమ్మిదవ ప్రకరణము.

### తెప్పపైఁ బ్రయాణము.

ఆకాలమున నమెరికాయందుఁ బాగబండ్లుగాని, మంచి రాదారులుగాని లేవు. దట్టమగు నడవులచే నిండి చోరభయము గలిగించుచుండు ప్రదేశము లనేకము లుండెనని యిదివఱకే చెప్పఁబడియెను. నదులు దేశములకు మహోపకారులు. మఱి యేబాటలును లేనితరుణమున నవి రాకపోకల కుపకరణములుగ నుపయోగించుకొనఁబడుచు వచ్చుచున్నవి. పెద్ద పెద్ద నదులపై నుండుపట్టణముల వ్యాపారము మెండుగ నుండుట పలుమారు తటస్థించుచున్నది. అమెరికాయందు నిట్టి పట్టణములు గొన్ని యప్పుడప్పుడ వృద్ధిఁజెందుచుండెను. అయిన నీటిమార్గమున వానిఁ జేరుటకుఁ దగిన సులభసాధనము లప్పుడు లేవు. ఇప్పటి నావికుల యదృష్ట మప్పటివారి కుండ దాయెను. పడవ నిర్మించుట యనిన నాలుగు మొద్దు లొక్కటిగఁ గలుపుట. వీనిపై సరకుల నెక్కించుకొని ప్రవాహమున [illegible] పోవలసి యున్నప్పుడు త్రాళ్లచే మనుష్యుల నీడ్చికొని

పోవుచుందురు. రాత్రి యనక, పగు లనక, చలి యనక, గాలి యనక, యెండ యనక, నీడ యనక ప్రయాణము సేయుచు నా కాంతారంబుల శత్రువు లెదిర్చిన వారితోఁ బోరుచుఁ బ్రాణముల కాశింపక పనిసేయుచుండుట యప్పటినావికుల కతిసామాన్యము. ధైర్యసాహసంబులు వారియందు మూర్తీభవించిన ట్లుండుట యత్యావశ్యకము. ఇట్టి పడవల మిసిసిప్పి నదిపై కెక్కు సరకులన్నియుఁ బంపఁబడుచుండును. కొన్ని సమయములఁ దగినంత సామగ్రి యున్న గొప్పగొప్ప సాహుకారులు దామ యిట్టి వ్యాపారయాత్రలకు వెడలుచుందురు.

1828-వ సంవత్సరమున నాబ్రహాము జెంట్రి యను సాహుకారికి సేవకుఁడుగఁ జేరెను. అచ్చటను నాబి సర్వకార్యములు నిర్వహించుచుఁ దనదొరచే మెప్పువడసెను. అతని కాలెనను కుమారుఁడు గలఁడు. ఆ బాలుఁడును నాబియుఁ గలిసి పనిసేయుచుందురు. జెంట్రి యాబ్రహాముగార్యనిర్వాహకత్వమున దక్షత గలవాఁ డని నమ్మి యతనిఁ దన కుమారుతో న్యూఆర్లియన్సు నగరమునకు సరకిచ్చి పంప నిశ్చయించుకొనెను. తండ్రి యాజ్ఞ యైనఁ దా వెడలుటకు సిద్ధముగా నున్నాఁ డని యాబ్రహాము వచించెను. లింకనులు జీతము విషయము నిర్ధారణ సేసికొని యా ప్రయాణమునకు నాబిని సిద్ధము గమ్మనిరి. పదమూడు వందల మైళ్లు కష్టములకోర్చి

యపాయములకుఁ దలయొగ్గి రాత్రింబవళ్లు త్రోవ నడవవలయు నని విని "పసివాఁడ వీ వెట్లు పోఁగల్గుదువో" యని యాబ్రహాము దల్లి కొంచె మనిష్టము గనుబఱచి "అయినను నీ కీ ప్రయాణమున జయము గలుగుఁగాక. లోకజ్ఞాన మిందుమూలమునఁ గొంత యలవడుఁగాక. ధైర్యస్థైర్యము లింకను గుదురుఁగాక. దేవుఁ డెప్పుడు నీకుసాహాయ్యుఁ డగుఁగాకని" పంపెను.

ప్రయాణ సన్నాహములు వెనువెంటఁ జేయఁబడియెను. అచటి రేవున నొక పడవ యాయత్త మాయెను. ఆబీ యాలెనులు దమ సరకులతో మిసిసిప్పి నదిపైఁ దేల మొదలిడిరి. ఆబ్రహాము దెప్ప ముందుకు నడప మొదలిడెను. ఈ నవీనానుభవ మాబ్రహామునకు మిక్కిలి యాహ్లాదకారి యాయెను. తా నిదివఱకుఁ జూడని ప్రపంచపు వింతలెల్ల నప్పు డతనికిఁ జూడఁగల్గెను. ఆ గొప్ప జలసముదాయముపై నూఁగాడుచుండుటచేతను నూతనవిషయములఁ బరికింపుచుండుటచేతను నతఁడు ప్రపంచపరిమాణ మిట్టిదిగదా యని యూహించుకొనుచు సర్వకర్తయగు నా సర్వేశ్వరు మహిమాతిశయంబుల గ్రహింపఁ దొడఁగెను.

దారియందు వారి కనేకానుభవములు ప్రాప్తించెను. వాని నన్నిటి నిచట వివరింప నలవిగాదు. వారి కాలమంతయు నా పడవపైనే గడపఁబడుచుండెను.

రాత్రులు పడవను గట్టున కీడ్చి పదిలముగఁ గట్టియుంచి పశువుల కాశింపక దానిపైఁబడి కంబళ్ళులఁ గప్పుకొని నిదుర పోవుచుందురు. అడవులలోఁ బెరిఁగినవారి కివియెల్లయు నంత విశేషపుమార్పులు గాకున్ననుఁ గొంతమార్పులైన నగును గాదే. కొన్ని రాత్రులయందు వా రొంటిగఁ బరుండుట చూచిన నేరికి వారిపైఁ జాలి గల్గదు?

వారిప్రయాణ మసహ్యముగా నుండ దయ్యెను. దృగ్గోచరప్రదేశ మప్పటప్పటికి మాఱుచుండుటవలనఁ గ్రొత్తక్రొత్తల తావితానముల, వృక్షసమూహముల, జంతుజాలములఁ, బ్రకృతివిచిత్రములఁ బొడసూపి యానందము గలుగఁజేయుచుండెను. పలుమాఱు నది దిగివచ్చు 'పడవలు' ను వానియందలి నావిక సమూహములును నెదురుపడుచుండెను. ఆ యేటియొడ్డున నుండు గ్రామజనులు గుంపులుగుంపులుగ వచ్చి సంభాషణచే సంతృప్తి సేయుచుండిరి.

ఎల్లకాల మొక్కరీతిగ నుండదుగదా! గాలివాన లత్యుగ్రముగ నప్పుడప్పుడు పైఁ గ్రమ్ముచుండును. అట్టి సమయములఁ దమ తెప్ప పల్లటిలకుండ నుంచుకొనుటకు వారి శక్తియంతయు నుపయోగించి పాటుపడుచుందురు. దినదినమును వానలోఁదడిసి ప్రయాణము చేయవలసి యుండును. ఒక్కొక్క పర్యాయము రాత్రులు విపరీతముగ ఝంఝామారుతము

పీవ నాకసము చిల్లిపడి కడవలఁ గ్రుమ్మరించిన తెఱంగునను, ప్రతివస్తువును నా ధారల సముద్రముఁ జేర్తునని వరుణుఁడు మూర్తీభవించెనో యనునటులను వర్షము గురియుచుండును. అట్టిరాత్రుల నా 'నావికులు' పరుండ వారికి మఱొండు శరణు లేదు. తను తెప్పపై జడివాన తాకుడుకు నడలక పడకచేసి కొని పడియుందురు. వారి ధైర్యోత్సాహములఁ బరిశీలింప దైవమున కిట్టివియ యుక్త మగుసమయములు. వారును దమ స్థితి గతుల గుఱించి యెప్పుడును వగచినది లేదు. ఎట్టి యిక్కట్టులు వాటిల్లినపుడును నీ ప్రయాణమున కియ్యకొనకున్న బాగుండునని యాబ్రహాము దలఁచినది లేదు. అతని మన మాకార్యమున నంత మగ్న మయి యుండెను.

ఇట్లు పరిపూర్ణహృదయమున యాత్ర నడపుచు నొక దినము సాయంకాలమున నా తెప్ప గట్టున కీడ్చి బంధించి దాని ముందరిభాగమునఁ బడి నిదురపోవుచుండిరి. అర్ధరాత్రమున నడుగుల చప్పుడు వారిని మేలుకొల్పెను. అబ్రహాము గొంచెము చెవియొగ్గి విని యిది మోసమైనకృత్య మగునని యాలెనునకు గుసగుసధ్వనితోఁ జెప్పెను.

దొంగల బెదరింప నమకట్టి యాలెను గంభీరస్వనమున "తెండి; తుపాకులఁ దెమ్ము. వారిఁ బరిమార్చు" మని యుఱ

ఈ యఱపులకు నీగ్రోలు జడియరైరి. ఎప్పటియట్లు మరల నిశ్శబ్ద మావరించెను. తమకడ సాధన మొక్కటియైన లేకుండుట సూచి యాబి ధైర్యము పూని యొకదుడ్డుకఱ్ఱఁ దీసికొని ప్రాణమునకై పోట్లాడవలె నని నుడువుచు మహారావమున "ఎవఁడురా దుర్మార్గుఁ డని" యఱచెను. దానికిఁ బ్రత్యుత్తరము లేనందున నింకను భయంకరముగ నదేవిధమున నఱచెను.

"దుష్టవర్తనులారా! ఏల మీ రిచటి కేతెంచితిరి? మరలి చనిన మే లగు. లేకున్న నిదె మిము జలముల కాహుతి యొసంగెద" నని యాగ్రహమునఁ బల్కుచు శరాసనంబు నుండి విడువఁబడిన బాణంబువ్రాలె చీఁకటియనక రివ్వున వారిపై కురికెను.

కొంతకాలము గఱ్ఱలతో యుద్ధము జరిగెను. తరువాత దగ్గరదగ్గర చేరి ముష్టియుద్ధమే ప్రారంభమాయెను. సమరము మిక్కిలి ఘోరమై రక్తముల వెల్లువల కావాసమై ఫల మే మగునో యెఱుంగరాక పదినిమిషములవఱ కొక్కపెట్టునఁ బ్రబలసాగెను. తుట్టతుద కాబ్రహాము శత్రువులలో నొకనిఁ బ్రవాహంబునఁ ద్రోసె. తక్కినవారెల్ల నీట దుమికి పలాయితు లయిరి.

"వారి వెన్నంటి దఱిమి చంపుదముగా" కని భయంకెల్లఁ బోఁదోలి యాబ్రహా మాలెను లరమై లా నీగ్రోల

వెంబడించిరి. వారును నెందఱు 'నావికులు' దము నెదిర్చిరో గదా యని భయపడి తిరిగిచూడక పరుగెత్తిపోయిరి.

ఈ నీగ్రోలు బానిసలు. తమ యజమానుని యుత్తరువు ననుసరించి నాదారిఁ బోవు పడవలఁ గొల్లగొట్ట నేతెంచిరి. ఆహా! బానిసవృత్తి యెంతహీన మైనదో చూడుఁడీ. తమ దేహముల దొర కర్పించుటయేగాక మనములఁ గూడ నర్పించ వలసి వచ్చుచుండెను. దొంగతనముచేసి ధనము గొనిరమ్మనిన నట్టిదుష్టకార్యము మే మెట్టుల నల్పుదు మనుటకు వారికి స్వాతంత్ర్యము లేకుండెను. ఇట్టిదుర్దశయం దుండువారల నీ తరుణమున నెదిర్చి పోరి యోడించి, వారిదెబ్బలచే నెన్నియో గాయములు తగులఁ గంటి పైమచ్చ దాని కానవాలుగఁ బ్రాణాంతమువఱకు నిడికొనిన యాబ్రహాము దేశాధ్యక్షత వహించి యీదిక్కుమాలినవారికై పెనఁగి వారిదుర్దశ మాన్చి, వారికై ప్రాణము లర్పించు నంతటిదైవికాజ్ఞయో గమనింపుఁడీ.

తమ వైరులఁ బాఱఁదోలి యాబ్రహా మాలెనులు దమ పడవను మఱియొకస్థలమునకుఁ గొంపోయి నాఁ డచట రాత్రి గడపి తరువాతఁ బ్రయాణముసేసి న్యూఆర్లియన్సు చేరిరి. వారి సరకంతయుఁ దగినవెల కమ్మబడియెను. మొదట నేర్ప ఱచుకొనిన తెఱంగున వారిరువురును దమ యింట్లకొఱకు పొగ యోడపై వచ్చిచేరిరి

## పదియవ ప్రకరణము.

### కొన్నివిషయములు, ఇల్లినాయి సేరుట.

ఆబ్రహాము దనంతకుఁ దాఁ బనిచేసికొని బ్రతుకఁ బ్రయత్నములు సేయఁదొడఁగెను. అదివఱ కతఁ డొకపడవ నిర్మించుకొని దాని నడపుచుఁ గొంతధనము సంపాదించినట్లు నిదర్శనము లున్నవి. ఒకతఱి తన పడవ చక్కఁబఱచుకొనఁ జూచుచుండెనఁట. అప్పు డిద్దఱు ప్రయాణీకు లేతెంచి తమ్ముఁ బొగయోడఁ జేర్పవలసిన దని యతని నేమించికొనిరఁట. వారి సామగ్రి యంతయు నెక్కించుకొని యాబి నిర్ణీతస్థలము సేరి వారి పెట్టెల నెత్తి పొగయోడపై నిడి తన పడవ చేరి కూలికాసులకై వేచి యుండెనఁట. అంత వారు తలా యొక యరడాలరు (అనగా మన రూ. 1-4-0) అతనిచేత వేసిరఁట. దాని కతఁ డొందిన సంతసమునకు మేరయే లేకపోయెనఁట.

ఈవిషయముఁ దా దేశాధ్యక్షతకు వచ్చినతరువాతఁ జెప్పుకొని 'యీవిధమున నే మొదటిడాలరు గడించితిని. అప్పటి కీదియ మహా నిధానము గనినతెఱంగున నుండె' నని చెప్పుచుండును.

న్యూఆర్లియన్సు యాత్ర ముగిసినతరువాత నతఁడు సంపాదనపరుఁడై కుతూహలమున నుడ్డుగారిని జేరి తన్ను

యోడపుఁ బని కెచటనైన నియమింపవలసినదని వేఁడెను. "నీ తండ్రిగారి కీవు సాయ మొనర్పక యిట్లు వెడలుట తగునే" యనిన "నే నీవిధమునన యతని కెక్కుడు సహకారిగాఁ గల్గుదు" నని ప్రత్యుత్తర మొసఁగెను. అయిన ననుజ్ఞావిషయమున శ్రద్ధ తీసికొన నంగీకరింపనందున నాబ్రహా మింటికిఁ దరలెను.

స్త్రన్యరోగము దానికి నిలువలేక యనేకులు "ఇల్లినాయి" సీమకుఁ జనియుండిరి. థామసుగూడ నీప్రకార మొనరింతమా యని యోచించుచుండెను.

మధ్యకాలమున నాబ్రహాము 'ఇండియానా చట్టదిట్టము'ల నొక స్నేహితు నింటఁ గని యతఁడు సమువని వేళలఁ దాఁ జదువుకొనియెను. చట్టదిట్టములఁ జదువు టందఱి కానందదాయిగాదు. క్రొత్త యూహలఁ బుట్టించి నూతనచర్చల కెడమిచ్చినందున నవి యాతనికి మిక్కిలి రుచ్యము లయ్యెను భావికాలమున నవి యతని కెంత తోడ్పడినది మన కెఱుక పడఁగలదు. తాత్కాలిక ఫలమొండిచట వివరింతము.

ఆచటి న్యాయస్థానమున నేమి సేయుదురో న్యాయజ్ఞు లేలాగు విచారింతురో చూడవలె ననుయభిలాష పొడమెను. బూన్విల్లను గ్రామమునకుఁ బదునైదుమైళ్లు నడచి న్యాయస్థానము సేరెను. అచ్చటివిచిత్రవిధు లతని నాకర్షించి పలుమాఱచ్చటికిఁ బోఁజేసెను. ఒకానొకతఱి యొక "హత్య" విషయ

మై చర్చ జరుగుచుండెను. అచ్చటిన్యాయవాదులలో నగ్రగణ్యుఁ డగునతఁడు మిక్కిలిసమర్థతతో నుపన్యసించుచుండెను. దానిం గని తా నెన్నఁ డట్టి వక్త యగుదునను చింత యతని బాధించెను. సొంపుగుల్కు మాటలకు మిక్కిలి యలరి తన దీనస్థితిని మఱచి యాన్యాయవాది వెడలునెడ నతనిఁ జేరి "నే వినినయుపన్యాసములలో మీది యుత్తమ" మనియెను. ఈ మోటుబాలునిఁ జూచి విస్మయమంది యతఁడు మాఱు మాటాడక తనత్రోవనఁ బోయెను.

ఇంటికి మరలివచ్చి వాగ్ధోరణి యనర్గళముగ వృద్ధిచేసికొన నెంచి యాబ్రహాము సభల నేర్పఱచి యట సంభాషించుట, యుపన్యసించుట, చర్చించుట మొదలగుపనులకుఁ బూనెను. ఆప్రాంతములఁ బసివా రందఱు ఆకార్యముల శ్రద్ధఁ జేయ నారంభించిరి. అనేకు లతనిచుట్టుఁ జేరి యతఁడు వక్కాణించునదంతయు నేకాగ్రచిత్తులై వినుచుందురు. అతని చమత్కారమునకు మెచ్చి యాబాలవృద్ధు లెప్పు డతని వాక్యామృతవర్షంబునకుఁ జంద్రకిరణములకుఁ జాతకపోతంబులువోలె వేచియుందురు. ఈ సందర్భముల నాబిక్కిఁ దా కంఠోక్తిగ నేర్చినవిషయము లన్నియు నుపయోగకారు లాయెను.

అతఁడు చర్చించుచువచ్చిన విషయముల నొకటి "నీగ్రోల కక్కడన్యాయము జరుగుచున్నదా? ఇండియనులకా?"

యను నంశము. విశేషము పాటుపడి యీవిషయమునకు వలయు సాధనముల సమకూర్చుకొని యుండెను. ఇండియను లనిన నతనికి మిక్కిలి వైరము. వారు దన పూర్వికుల గాసిఁ బెట్టిరే యనుకిన్క యతని మనమున నాటియుండినను ఇండియనుల నన్యాయముగ బాధపెట్టుచుందు రనిమాత్రము నొక్కిచెప్పుచుండును.

అయిన నీగ్రోల దుర్దశ దుర్భరమని యతఁడు చక్కఁగ గ్రహించెను. కావున వారి గష్టములమాన్పి వారికి స్వేచ్ఛా విహార మొసంగవలె నని నాఁడు మొదటి యుపన్యాసము చేసెను.

ఈ యుపన్యాసముల వినుచుండిన ముదుకలి యొకతె మిక్కిలి యుత్సాహముతో "నాంబి యునైటెడ్ రాష్ట్రపు దేశాధ్యక్షుఁ డగున" నెనఁట!

1830-వ సంవత్సరము జనవరినెల ప్రారంభ మగునప్పటికి థామను 'ఇల్లినాయి' సీమకు వెడల నిశ్చయించుకొనెను. ప్రయాణ ప్రయత్నములు సేయఁబడెను.

ఆబె యప్పటికి యిరువదియొకసంవత్సరములవాఁడు. తల్లి దండ్రులనిన నతనికిఁ గడుప్రీతి. కాన నా యాత్రకుఁ దా లేనిది వారు పూనరని తన జనకునకుఁ దానును వారితోడన పోవ నిశ్చయించుకొనెను. [illegible]

రులకై పనిసేసి యుండనోపఁడు. తండ్రి కతఁడ పెద్దకుమా
రుఁడు. ప్రయాణములాకాలమున మిక్కిలి ప్రయాసకారులు.
అనేక విషయముల సహాయకారులును. నూతన గృహనిర్మాణ
మును కష్టతమంబె. కానఁ దన మాతాపితరులు, తన యక్క
సెల్లెండ్రు, తనవారెల్లరు సురక్షితముగ 'నిల్లినాయి' సేరి
యచట కాఁపురము గుదురువఱకు వారివెంట నుండుట కతఁడు
గర్తవ్యముగఁ జేకొనెను.

ఇట్లు నిర్ధారణ చేసికొని వెడలి యెట్టికష్టము లెట్టియా
పదలు దమ్మెదిరించినను సరకుచేయక దమవారికెల్లఁ బ్రోత్సాహ
మొసఁగుచు బహుదినములు ప్రయాణముసేసి నూతననివాస
ప్రదేశముఁ జేరిరి.

అచట నొక కొయ్యగుడిసె అబ్రహాము దాన పూని
నిర్మించియిచ్చెను. లింకనులు నివసించిన గుడిసెలలో నిదియ
యుత్తమము.

తరువాత నితఁడు దన మఱఁదియగు జాన్ సాయముఁ
గొని పదునైదెకరముల భూమి దున్ని కంచెవేసి సిద్ధము చేసి
యుంచెను.

ఆ శీతకాలమున నెప్పుడును మూడడుగుల దట్టముగ
మంచు గప్పియుండెను. అబ్రహాముయొక్క పట్టుదలయు సాము
ర్థ్యంబును దోడుపడకుండిన లింకనుల కనేకసౌఖ్యములు గల

లోనినై యుండుననుటకు సందియము లేదు. అంతచలియం దతఁడు దుపాకి మోసుకొని వేటకుఁ బోయి భోజనమునకుఁ బలలము దెచ్చి పెట్టుచుండును. పంట లేమియుఁ బండఁజాలని యా ఋతువుల నీ 'మార్గదర్శికు' లింతకంటె వేఱుమార్గము గానలేరు గదా!

ఇంట నింతపని సేయుచు నాబ్రహాము బయట జీతము నకుఁ గుదిరి యజమానుల సంతృప్తిపఱచుచుండును. విద్యాభివృద్ధికిఁ బాటుపడుటయు మానఁడయ్యెను. ఈ యంశమునకు దృష్టాంత మిదె. బ్రౌనుసతి యాబ్రహాము లింకను మరణానంతరము నొడివిన మాటల వినుఁడి:

"లింకనును నే నెఱుఁగుదును మా ముసలాయనకై యతఁడు పనిసేయుచుండును. మాపొరుగుననె యతఁడు నివసించుచుండును. ఆకాలమున బాటసారులకు మార్గముల విశ్రమించుటకు సత్రము లుండలేదు. అందువలన వా రెవ్వరైన యిల్లుగలవారి సత్కారములకు లోనై యుందురు. ఒకసాయంకాలమున దరుణవయస్కుఁ డొక్కరుఁడు మాకంచెయొద్ద గుఱ్ఱము నాపి మా ముసలాయనను రాత్రి విశ్రమింప స్థలమిచ్చెదరే యని వేడెను. కాని కతఁడు "మీ రా పశువునకును మీకును నాఁకలి దీర్పఁగల్గుదును. కానిఁ బరుండుటకు మా యింట నా సేవకుని ప్రక్క దక్క స్థలము లేదు. మీ రా యిచ్చ

వచ్చిన నతనిఁ జూడవచ్చు" నని ప్రత్యుత్తర మిచ్చెను. ఆ పాంథుఁడు దిగిరా మా ముసలాయన యతని నింటివసారాకుఁ దీసికొనిపోయెను. అచట నేలపై నాబ్రహాము చేత నొక పుస్తకము పట్టుకొని కాళ్లు చాచుకొని పఱుండి యుండెను. అతని "నదె నాసేవకుఁ" డని యాతఁడు సూపెను. బాటసారి యు నాబ్రహాము స్నేహమున కంగీకరించి నాఁటిరాత్రి యునైటెడ్ స్టేట్సు దేశాధ్యక్షునితో నిదురించెను."

ఆసంవత్సర మాకురాలుకాలమున నాప్రాంతములఁ జలి జ్వరములు విస్తారమాయెను. లింకనులందఱు నొకరివెనుక నొకరు వాని ననుభవించిరి. అబ్రహాముగూడ వానికి లోఁబడియెను. గాని కొద్దికాలములోనె వాని బారినుండి తప్పించుకొనియెను.

ఇట్టిరోగములకుఁ బుట్టినిల్లగు నా సీమ వదలి మఱియొక సీమకుఁ బోయి యచ్చటినుండి థామసు లింకను కోల్సు సీమ చేరెను. అచట నతఁడు 18[illegible]1 వ సంవత్సరమున జనవరి 17 వ తేదినఁ బరలోకప్రాప్తిఁ జెందెను.

ఇఁక ముందు 'లింకను' అనిన అబ్రహా మని చదువరులు గ్రహించ వలయును.

---

## పదునొకండవ ప్రకరణము.

### న్యూ ఆర్లియన్సుకు రెండవ యాత్ర.

1831వ సంవత్సర ప్రారంభమున ఫిబ్రేవరిలో నొకనాఁడు డెంటను ఆఫుట్టను వ్యాపారి యొక్కఁడు దనసరకుల న్యూ ఆర్లియన్సుకుఁ గొనిపోవ 'నావికుఁడు' గావలె నని వెతకుచు జాన్‌ను గాంచి నీవు నాకార్యము నెఱవేర్పవలె ననియెను. అతఁ డందులకు వెనుదీసి యాబ్రహామైన నాపనికిఁ జాలునని పలికి వర్తకుని నొడంబఱచి వేతనముల నిష్కర్ష చేసికొని లింకను మాఱుదమ్ముఁ డగు జాన్‌స్టనునుగూడఁ జేర్చుకొనున ట్లేర్పఱచి వారిద్దఱితోఁ గలసి మాట్లాడ వెడలెను.

ఆఫుట్టా ప్రదేశమున నెల్ల నుదారబుద్ధి గలవాఁ డని ప్రసిద్ధిఁ జెంది యుండెను. అతని యీగి కొన్నిసమయముల నతనికే హానికరముగ నుండునంత యెక్కుడనియు వదంతి గలదు. ఇది యెట్లుండినను అబ్రహాము జాన్‌స్టనుల కతఁడియ్య నంగీకరించిన వేతనపు మొత్తముమాత్రము మిక్కిలి యౌదార్యమును సూచించుచుండెను. అంతటి కూలి వారది వఱకు గడించినది లేదు. కావున నాబ్రహాము జాన్‌స్టను లిందున కానందంబున నొప్పుకొనిరి.

ఆ మార్చినెల మొదటిదినముల నిర్ణీతస్థలమున నాపుట్టును జూచుటకు నీ త్రిమూర్తులు వెడలి యతనిఁ గాంచిరి. అతఁడు ప్రథమమున నాబ్రహామును జూచి వెఱఁ గందెను. జాక్ చెప్పినమాటలవలన లింక నందఱికంటెఁ బొడవు గలవాఁడుగ నుండునని యతఁడు దలంచెనేగాని భీమబలు నెదుట గాంచెద నని యొకనాఁడును ననుకొనఁ డయ్యెను. గాన నాజానుబాహు నాబ్రహాముఁ గని విస్మయ మందెను. అయినఁ గొంతసేపటి కా యాశ్చర్యపు ననలు సంక్షిప్తములై స్నేహాంకురములు బయలు వెడలెను. అంతటఁ దనపనివారలఁ గలయఁజూచి "మనరేవున నేఁటికి పడవ సిద్ధముగ నుండు ననుకొంటిని. అది యింకను నాయత్తము గాలేదు. ఏమిచేయుటకును దోఁచకున్న యది" యనియెను.

అందు కాబ్రహాము "పడవ నొకదాని నిర్మింతముగా" కని స్ఫుటముగఁ బల్కెను.

ఆపుట్టు ముదమున "నిర్మింప నెఱుఁగుదువే" యని యడిగెను.

"మూఁడువారములలోపల మేముముగ్గురమును నాపనిని దీర్చెదముగాక. నా కోడలగట్టుట చక్కఁగఁ దెలియు" నని ప్రత్యుత్తర మొసఁగెను.

అడవియందలి చెట్లనఱికి దూలములు మొదలగు నుప కరణముల నాయత్తము చేసికొని నాలుగువారములలో నా బ్రహామును అతని స్నేహితులును బడవ సిద్ధముచేసిరి. ఆ ఫుట్టు వారితో నడవియందుఁ గొన్నిదినములుండి వారు చేయు పనులఁ జూచుచుండెను. అప్పు డతనికి నాబ్రహాము సామర్థ్య మెఱుంగ వీలుగల్గెను. రుచ్యముగ భోజనము వండిపెట్టుట మొదలు, ఉపన్యాసము లిచ్చుచు రాజకీయవిషయముల చర్చించి సిద్ధాంతములు చేయుటవఱకు ననన్యసామాన్యశక్తి యాబ్రహాముననుఁ గాన నగుచుండెను.

పడవ సిద్ధమైనవెంటనే దానిపై బరువులనెత్తి యది క్రింది కైవునకు నడపఁ బ్రారంభించిరి. అచటనచట వ్యాపారము సేసికొనుటకై యాఫుట్టును ఆపడవతోఁ జనెను. న్యూసేలము పట్టణము దాఁటి జనినతరువాత రట్లెడ్జి యానకట్టతాఁకి యా పడవ వెనుకటిభాగము నీటిలోనికి దిగెను. ముందటిభాగము మాత్రము కట్టపై లేచియుండెను. ఇట్లొకరాత్రియంతయు నుండి కొంత పగలుగూడ గడచెను.

సరకులు వెనుకకు జరగుచుండెను. తీరమున జనులు గుంపులుచేరి "జాగ్రత పడుఁడి. లేకున్న మీ పడవ నడిమికి విఱిగినను విఱుగు. నీట మునిఁగినను మునుఁగు" నని కేక లిడు చుండిరి. ఆఫుట్టు కలఁతఁజెంది యీ యాపద దప్పించుకొను

టకు మార్గము గన నెన్నివారములు పట్టునో యని కుందు చుండెను. అబ్రహాము మాత్రము ధైర్యమునఁ దనపని దాఁ జేయఁ దొడఁగెను. అప్పుడున కభయమిచ్చి తమ పడవలోని సరకుల నింకొక పడవలోనికిఁ దీయింపించెను. తరువాత నాన కట్టమీఁది కెగసిన యోడభాగపు టడుగున నొకబిల మొనర్చి యాబిలద్వారమున లోపలినీరు వెలువడువఱకు నీటిలోనిభాగ మును గొంచెముగొంచెముగఁ గదలించుటకుఁ దగు కొన్ని యుక్తులఁ బన్నెను. పడవలోనిజలమంతయు గ్రుమ్మరించిన పిదప నా బిల మొక్కనిమిషమున మూయఁబడియెను. పడవ యెప్పటి యట్ల నీటఁ దేల నారంభించెను. సరకులనెల్ల మరల నెక్కించుకొని ప్రయాణము సాగింప మొదలిడిరి. అప్పుడు సంతోష మునకు మితి లేకుండెను. చూచువారల యాశ్చర్యమును దట్టమై సంతోషారావముల వెలువడియెను. ఎచ్చటఁ జూచిన నాబ్రహాము బుద్ధికుశలతకు మెచ్చి జనులు గొట్టు చప్పట్ల ధ్వని యాపుట్టు వీనుల విందుచేసెను. అతఁడు మిక్కిలి యు త్సాహమునకు లోనై "నే నిలుసేరినతోడనె నొక పాగ యోడఁ గట్టించి దానికి నాబ్రహాము నధ్యక్షుని జేసెద" నని యఱచెను.

ఈ యపాయకర మగు ననుభవ మాబ్రహాము మనమునఁ బనిచేయఁ బ్రారంభించెను. ఇట్టి కష్టములపాలుగాక పడవలు

రాకపోకలు సల్పు శక్తి వాని కొసంగుట లెస్స యని యతనికిఁ దోఁచెను. యోచించియోచించి తుదకు న్యాయవాదిగ నుండునప్పు డతఁ డొక యుపకరణములతో బొమ్మ యోడను నిర్మించి యావిధి నోడల నిర్మింప నూతన కల్పనాధికారపత్రికఁ గొనుటకై యుచితస్థానమునకుఁ బంపెను. దాని నిర్మాణమందలి పన్నుగడ లెల్లరకు సులభముగఁ దెలియుచుండు ననియు నాబ్రహాము సూక్ష్మబుద్ధిని వెల్లడి చేయుచుండుననియు నొకానొకరు వ్రాసి యున్నారు. అయిన నధికారపత్రిక తీసికొని యుపయోగించుకొనకుండుటకుఁ గారణము లెవ్వియో మన మెఱుఁగము. నావికుల ప్రయాసలఁ దగ్గించునిమిత్తము బహుకాలమీ లింకను శ్రమఁ జేసెననుటమాత్రము విదితము.

ఇఁక న్యూఆర్లియన్సు యాత్రకు మఱలుదము. అట్లా గట్టు తగులుకోలు దప్పించుకొని మనప్రయాణికులు సాల్టు క్రీకను ప్రదేశము సేరిరి. అచట నాపుట్టు సూకరములఁ గొన్నిటిఁ గొనెను. అవి పడవచేరుట యసాధ్యమాయెను. అతఁ డెన్నియో యుపాయముల వెదకెఁగాని యవన్నియు నిష్ఫలము లాయెను. కడపట నాబ్రహాము వానికండ్లఁ గుట్టి కాళ్లఁ గట్టివైచిన నవి కదలమెదలలేక పడియుండునని సూచించెను. ఆపుట్టదివిని మన పటున నెఱరి వల్లె యాయెను. అంత నాజంతువుల జాన్ చెవులచే నిష్పత్తి నాబ్రహాము గండ్లఁ గుట్టివైచెను. పిదప దానినెల్లఁ గాళ్లు

గట్టి యొకబండిలో వైచికొనిపోయి యొకదానితరువాత నొక దాని నెత్తిపడవలో నుంచెను. ఇదంతయుఁ గ్రౌర్యమే యై గను పట్టినను బంధులతోఁ బెనఁగు నెడ వానికిఁ దగువిధముననే నడవ వలయునుగదాయని యాబ్రహాము సమాధానపఱచుకొనెను.

అటనుండి తఱలునపుడు పడవ వేగము హెచ్చుచేయుట కతఁడు పలకలతోను ముతకగుడ్డతోను ఒకవిధమగు నోడ చాపల నేర్పఱచెను. చూచువారల కది వింత యై నవ్వు పుట్టించినను శీఘ్రయానమునకుఁ గడు తోడ్పడెను.

మే నెల యగునప్పటికి న్యూఆర్లియన్సు చేరిరి. అచ్చటన బానిస లనుభవించుకష్టముల నాబ్రహాము చూచినది. సంకెళ్లతో బంధించి కొరడాదెబ్బలఁ దీయుచుఁ జూచువారల మనమున నాగ్రహఖేదములఁ బుట్టించుచు నీగ్రోలఁ దోలుకొనిపోవుట ప్రథమమున లింకను కంటఁబడి హృదయమునకు శరవేగమున దిగి నాటుకొనిన దచ్చటయ.

దైవ మేరికిఁ దెలియనివిధములఁ బాటుపడుచుండును గాదే! ఆబ్రహాము నిటకుఁ దెచ్చి యీ ఘోరకృత్యములఁ గనఁజేసి వాని నట్లె యడంపఁ బ్రయత్నములు సేయ నుత్సుకమొసంగిన యాకరుణాంభోనిధి మహిమఁ గొనియాడఁ దరంబె?

జూన్ నెలలో నాఫుట్టును అతని ముగ్గురు పనివారును గృహోన్ముఖు లైరి. యజమానుఁడు దా మందఱు స్టీమరు

నెక్కిపోవ నేర్పఱచెను. కొంతదూర మరిగినతరువాత నా ఫుట్టు లింకనును న్యూసేలమున నుండు దన యంగడిలో గిడ్డంగిదారుఁడుగా నుండవలె నని యడిగెను. అందు కతఁడు దన కాపనికి వలయుశక్తి లేదనియు శక్తి యుండిన సంతసమునఁ జేసి యుండుదుననియుఁ బ్రత్యుత్తర మిచ్చెను. ఆఫుట్టు లింకను శక్తిసామర్థ్యంబు లెఱిఁగినవాఁడు గావునను అతనియందుఁ దన యందువలె నమ్మకము గలవాఁడు గావునను "నీ కదియెల్ల మిక్కిలిసులభసాధ్యము. నీ వొక్కమాట నుడివితివేని నేను నీ కచట సర్వాధికార మిచ్చెదను. నాకు నీవలన నెంతటిపనీ యైనఁ గాఁగల దనునిశ్చయము గలదు. ఇయ్యకొను" మని పలికి యతని యంగీకారముఁ గొని తల్లిని దోఁబుట్టువులను జూచివచ్చుట కతఁ డింటికి వెంటనే పోయిరా సెలవిచ్చెను.

అబ్రహా మిలు సేరిన కొన్ని దినముల కతనితోఁ బోర విచ్చు వొడమి యొక మల్లుఁ డచటి కేతెంచి భుజాస్ఫాలనంబు నేసి కుస్తీకి రమ్మని పిలిచెను. లింకను దనకంత పరిశ్రమ లేదనియుఁ బోర నుద్యమింపననియు జవాబు చెప్పెను. చెప్పినను వినువక యాజెట్టి యబ్రహామును వెన్నంటెను. తుట్టతుద కతఁ డియ్యకొని నిర్ణీతస్థలమున వారిరువురు నాదూసముగ రెండుమాఱులు సంప్రాప్తజయము గొనెను. ఆరౌడీ మిక్కిలియవమానకారియై కోపానలంబును బ్రజ్వరిల్లఁ

జేసెను. అంతట వాఁడు "నీవు నను బడవైచిన వైచిత్రివిగాక. ముష్టియుద్ధమున నాకు నిలువఁగలవే యని" గర్వోక్తులాడెను.

"నాచేనైనను నిను ముష్టిపోడుపులఁ బొడువ నేనిష్టపడ న"ని గంభీరభావమునఁ బ్రత్యుత్తర మిచ్చుచు హాస్యోక్తిగ "నీ ముష్టిపోటులు నా కనవసరము" యనియెను.

ఆ మల్లుఁడు లింకనును విడువక తొందరపెట్ట సాగెను. ఎంత చెప్పినను విననందున నాబ్రహాము "ఇదె నీకొఱకై నిను మర్దించెద" నని లేవఁబోవ నతఁడు సమయము గుర్తించి తప్పించుకొనినఁ జాలునని యూరకుండ నియ్యకొని యాబ్రహాము సౌజన్యతకు మెచ్చి యతని స్నేహముఁ గోరెను.

---

## పండ్రెండవ ప్రకరణము.

### క్రొత్తయంగడిగుమాస్తా.

ఏర్పఱచుకొనినవిధమున లింకను దన యజమానుని న్యూ సేలమునఁ గలసెను. సామగ్రి యీ పట్టణముఁ జేరు టాలస్య మైనందున లింకను గార్యరాహిత్యమునఁ దిరుగుచుండెను. నిర్వాచన దినమున నొక లేకరికై యధికారులు వెదకుచుండి యెదుటనుండు లింకనునుగాంచి యతనిని నియమించుకొనిరి. అతఁడు దనశక్తికొలఁది పనిచేసెద నని నమ్రతతో నియ్యకొ

నెను. ఆకాలమున నాదేశమున వ్రాయ గలుగువారే యరుదు. గాన వెదకుచువచ్చి యుద్యోగము లిచ్చుచుందురు. నాఁడు గార్యము దీర్చుటయందు లింకను మిక్కిలి సమర్థత సూపె ననుట కతని సహోద్యోగి యగు గ్రేహామను నుపాధ్యాయుఁడే "లింకను పనులెల్ల మిక్కిలి సౌలభ్యముతో న్యాయానుసరణముగఁ బక్షపాతరాహిత్యముతో సల్పెను. రాజకీయోద్యోగముల నతని కిదియె మొదటిది. నాఁటి పత్రము లిప్పటికిని స్ప్రింగుఫీల్డునం దున్నవి. చూడఁ గోరువారెల్లరును జూడ నగు" నని సాక్ష్యమిచ్చుచున్నాఁడు.

న్యూసేలము జనులు లింకనును రట్లెడ్జి యానకట్టమీఁదఁ జిక్కినపడవను జక్కచేసిన బుద్ధిశాలి వీఁడె యని గుర్తించి యుండిరి. నెల్స నాపట్టణమును విడువఁదలఁచి యప్పుడు సంపూర్ణముగ నొడ్డు లొరసికొని ప్రవహించుచుండిన నదిపైఁ దమ్ము రక్షించుకొనిపోవువాఁ డెవ్వఁడని యరయుచుండ నందఱా బ్రహామును జూపిరి. ఆ సూచనానుసరణముగ లింకను గర్ణధారుఁడుగఁ జేకొనఁబడియెను. ఓడను సురక్షితముగ నడపి రేవుఁ జేర్చి తన వేతనమును గొని యతఁడు న్యూసేలమునకు వచ్చిచేరెను.

ఆపట్టున సరకులు దిగినతోడనె యా గ్రామస్థు లీ నవీనాగతుని యుద్యోగము నెఱింగికొనిరి. లింక నొక్కొకవస్తువుం జేసి కొట్టున నుచితస్థలమున నుంచ నారంభించెను.

గాజుపాత్రలు, మట్టిపాత్రలు, పింగాణిపాత్రలు, కాపీ విత్తులు, తేయాకు, పంచదార, కత్తులు, గుండీలు, కత్తెరలు, పలువిధములగు పాదరక్షలు, పొగాకు, వెన్న, తుపాకిమందు, ఇవి మొదలుగాఁ గల యనేకవస్తువు లాయాస్థలములఁ గంటికింపగువిధమున నిలుపఁబడెను. కొద్దికాలములోనే క్రొత్త సామానులు క్రొత్తగిడ్డంగిదారుఁడును లోకులకన్నుల కానంద మొసర్పఁ దొడఁగెను. లింకను మర్యాదచేష్టలును, అతని జనప్రియత్వమును నంగడి కనేకుల నాకర్షింప మొదలిడెను.

అప్పుట్టితరకార్యములఁ దగిలి న్యూసేలమున నుండలేకుండెను. కావున నచ్చటి తిరుగలియంత్రపుఁ బై విచారణయు నంగడియందలి సర్వాధికారమును లింకనున కప్పగించి విల్లియం గ్రీను అనువాని నతనికి సాయ మిచ్చెను.

అప్పుట్టు పలుమాటలవాఁడు. లింకనును బొగడుటయం దతనికిఁ దనివియే లేదు. ఒక్కొక్కమారు "యునైటెడ్‌రాష్ట్ర మున నుండినవారలలో జ్ఞానసంపత్తికి లింక నగ్రగణ్యుఁడ" నును. ఒక్కొక్కమారు "నేఁ జెప్పునది జ్ఞాపక ముంచుకొనుఁడు. లింక నిఁకముందు దేశాధ్యక్షత వహింపఁ గలఁడ "నును. ఇట్టి సంకీర్తనములచేతను రట్లెడ్జి యానకట్టవిహాఁదఁ జూపిన బుద్ధికౌశల్యము చేతను లింకనని నాగ్రామమున గొప్ప మర్యాదతోఁ జూచుచుండిరి.

గొప్పవారి కితరులు సేయు మర్యాద లెల్లపుడు నమ్రత పుట్టించి ఘనతర కార్యములఁ జేయ నుత్సాహముఁ గలుగఁ జేయును ఒకడు మనయెడల గౌరవము చూపిన మన మింత వార మైతిమని విఱ్ఱవీగుట మాని యీ గౌరవమునకుఁ దగు నర్హత మనకుఁ గలదే యని తర్కించి యట్టియర్హత సంపాదింపఁ బాటుపడుట గదా సుజనుని లక్షణము.

లింకను వినయప్రవర్తనచేతఁ, గలుపుఁగోలుతనముచేత, సుస్వభావముచేత, నెల్లర యుల్లముల రంజిల్లఁ జేయుచుండును. అతని సత్ప్రవర్తనకుఁ బట్టణవాసులెల్ల సంతసింపుచుండురు.

ఒకనాఁడు లింకను నతికి రెండున్నర డాలరుల వస్తువుల నమ్మెను. సాయంకాలము లెక్కఁజూచుకొనఁ నామె యర్ధడాలరెక్కు డిచ్చినట్లు తేలెను. వెంటనే యంగడి రాత్రికి మూసి వేసి తలుపుబిగించి యర్ధడాలరు చేతఁగొని రెండుమైళ్లు నడచి పోయి దాని నామె కిచ్చి యిలుసేరి సుఖనిద్రఁబోయెను.

మఱియొకనాఁ డొక యబల సంధ్యాకాలమునఁ బ్రొద్దు గడచినతరువాత నంగడి మూయుసమయమున వచ్చి యర్ధపౌను తేయాకు కిమ్మన్ని యడిగెను. వెలపుచ్చుకొని తేయాకిచ్చిన వాఁడును బంధించుకొని లింకనింటికిఁ బోయెను. మఱునాఁ డుదయమున వచ్చినతోడనె తక్కెడయందు కాలుపౌను రాయి యుంచఁ [illegible] రాత్రి యా స్త్రీకిఁ గాలుపౌను దక్కువ యిచ్చుటఁ గుర్తించి

యొక కాలుపొను తూఁచి యంగడి తలుపువేసి యానెలఁత యిం
టికరిగి తేయాకు నిచ్చివచ్చి తన యుద్యోగమునకుఁ బూనెను.

ఇట్టి సన్మార్గ ప్రవర్తన లింకనునకు గౌరవస్నేహముల వృద్ధి
పఱచినదేగాక యా యంగడి కనేకుల బేరగాండ్ల రప్పించి
యాపుట్టువు లాభము మెండుగఁ గలుగఁ జేసెను.

గిడ్డంగిదారుఁ డనిన నాగ్రామమున మిక్కిలి యాదరణ.
అందున నుత్తమ గుణసంపత్తిచే నొప్పి విద్యాదికములచే నలంకః
రింపఁబడిన లింకనును గౌరవించనివాఁ డెవఁడు? ఆగ్రామము
నందలి కలహములఁ దీర్ప నీతఁడె న్యాయాధిపతిగ గణింపఁ
బడుచుండెను. నిష్పక్షపాతముగ నేకార్యము జరగవలసినను
నిరువాగులవారును దమదమ దుఃఖముల నితనికిఁ జెప్పుకొని
యితని తీర్మానముల నడపుచుందురు.

ఉపాధ్యాయుఁడు గ్రేహాము లింకనును బ్రాణస్నేహితుఁ
డుగఁ జూచుచుండును. అతనియొద్ద లింక నింగ్లీషువ్యాకరణ
మభ్యసించుటకుఁ బూనెను. వ్యాకరణపాఠమనిన ననేకులకు
విద్యార్థులకుఁ దలకంటగించును. లింక నిద్దాని నొప్పుకొనినను
విద్య సంపాదింప నుద్యమించు ధీరుఁడుగాన నెట్టి కాఠిన్యమును
నతని నెదుర్చలేకుండెను.

శిథిల వ్యాకరణగ్రంథ మొకదాని నెచటనో సంపాదించు
కొని సమయము వేచి యొక నిమిషమాత్రము కాలము

దొరకినను దానిన వల్లించుచుండెను. పని తొందరలేనపుడు దుకాణపు బల్లపైఁ బరుండి చదువుచుండును. కొన్నివేళల నంగడిముందటి చెట్లనీడనఁ బరుండి పఠించుచుండును. మఱి కొన్నివేళల గ్రామము వెలువడిపోయి యెరికి నెఱుకరాని యేకాంతస్థలమునఁ గూర్చుండి పరిశ్రమ సేయుచుండును. రాత్రివేళలఁ జాలసేపు మేలుకొనియుండి పీపాలు సేయువాని కుంపటిలో నచటి చెత్తవైచి దానివెలుఁగునఁ జదువుచుఁడును. తెలియని విషయముల గ్రేహాము నడిగి తెలిసికొనును. విద్యాపారీణు లనిపించుకొని యా పట్టణము సొచ్చినవారంద ఱతనిచేఁ బ్రశ్నింపఁబడకపోవుట లేదు

ఇట్లింతో పాటుపడి లింకను వ్యాకరణమునందు ప్రౌఢిమఁ గాంచెను. ఇతర విద్యలఁ బ్రవీణత వడసెను. ముందు కతని కత్యంత సహకారు లగుసాధనము లన్నిటి నతఁడు దైవికాజ్ఞా నుసారముగ నాయత్తపఱచుకొనుచుండెను. ఇట మఱియొక విషయముఁగూడ నుడువవలసియున్నది.

న్యూసేలముపట్టణములోనికిఁ గ్రొత్తవాఁ డెవఁడు వచ్చిన నతని బలుకష్టములఁ బెట్టు దుర్మార్గులసంఘ మొకటి యచ్చట నుండెను. వారు నూతనాగతుఁడు గాన్పించినతోడనె యతనిని బరువెత్తుట, కుస్తీ, మొదలగు పందెములకుఁ బిలుతురు. అతఁడం దుల కంగీకరింపకున్నఁ బలువిధముల నవమానపఱతురు. ముష్టి

బట్టిగుంజుదురు. ముఖమునఁ బొగాకునీరుఁ జల్లుదురు. ఇవన్నియు నోర్చుకొనిన నేటికిఁ గొనిపోయి ముంచుదురు; లేకున్న ననేకు లొక్కరీతిఁ గాలుసేతులఁ దన్ని గ్రామము వెడలఁ జేతురు. అతఁడు దమలో నొకరితోఁ బెనఁగ నియ్యకొనియెనా యన్యాయపుఁబోకలఁ బోయి యతని వేధింతురు. దానికి వెను దీయక వారి నోడించెనా వానిఁ దమవానిగఁ జేకొందురు.

ఇట్టి యిక్కట్టులు లింకనుకుఁ బ్రథమమునఁ దటస్థింప వయ్యెను. అతనిశక్తిని నానకట్టమీఁదఁ జూచినవా రగుటనో యాపుట్టు పల్కు లాలకించి జడిసినవా రగుటనో యా దుర్మార్గులు లింకనును జెనకకుండిరి. అయిన నొకనాఁడు వారిలో నొకఁడగు బిల్లి యనువానికిని అప్పుటునకును సంవాదము గలిగి యొకరినొకరు దూషించుకొని తమతమ మల్లుల యెదు రొడ్డిరి. బిల్లి తమజాకుతో లింకను పోరవలెనని కోరెను. లింకను సమ్మతింపఁడాయెను. అందుపైని నాదుష్టులు లింకను ముక్కుఁ బట్టి గుంజి యతని నవమానపఱచిరి. అతఁడు వారిని హెచ్చ రించెను. వా రది లెక్కకుఁ గొనక నతని నలయించిరి. తుట్ట తుదకతఁడు జాకుతో మల్లయుద్ధమున కంగీకరింపవలసి వచ్చెను. ఎన్నిమాయోపాయములు సేసినను లింకను జయమున కడ్డు లేకపోయెను. జాకు నోడించి చక్కగఁ జేఁ జాఁచి వాని మెడఁ బట్టి పై కెత్తి నిలుపుటఁ గాంచి యాదుష్టు లతని శరణుఁ

జొచ్చిరి. నాఁటినుండి యట్టి దుర్మార్గప్రవర్తనముఁ గూడదని ఖండించి లింకను వారినెల్ల మంచిపౌరులఁ జేసెను. నవీనాగతుల కష్టము లంతటితోఁ దీరిపోయెను. సత్పౌరులసంఖ్యయు నెక్కుడాయెను. సంస్కరింపఁబడిన జాకు మొదలగువారు లింకనునెడ భక్తిగలిగి యతనికి శిష్యభావమున మెలఁగుచుండిరి. దీనికిఁ దార్కాణ మొండు గలదు. ఒకదినము పరదేశీయుఁ డొకఁ డా గ్రామమునకు వచ్చెను. అతఁడు ధూర్తుండై జాకుతోఁ గలహామునకు సమకట్టెను. అంత జాకు కోపమున "నీవు వేలపు కల్లరి" వని యతని నూనాడెను. అతఁ డాగ్రహమున నొకకొయ్యతో వాని నడచెను. ఇద్దఱును పెనఁగ నడుము గట్టుచుండిరి. దీని నాబ్రహాము గాంచి యచటి కేతెంచి విషయము విచారించి జాకునకుఁ దప్పుఁ జూపెట్ట వాఁ డంగీకరించెను. తరువాత వారిరువురకును సంధిఁజేసి మైత్రి గలిపెను.

ఆపుట్టుగిడ్డంగిదారుగా నున్నపుడు లింక ననేక లాభములఁ బొందెను. మెల్లమెల్లఁ నడచి సభలకుఁ బోయి రాజకీయోపన్యాసము లొనఁగుచుఁ జర్చ లుపక్రమించుచు వాక్చాటవధోరణుల సంపాదించెను. ఉడుపులకైన వెచ్చపెట్టక ధనముఁ గూర్చి యొక వార్తాపత్రికఁ దెప్పించుకొని చదువుచుండును. అంగడిపని లేనప్పుడంతయు విద్యాసంపాదనపరుఁడై యతఁడు కాలముఁ గడపెను.

ఆపుట్టు కొన్ని యందరాని ద్రాక్షపండ్ల కట్టులుసాచి నష్టముల పాలయ్యెను. తిరుగలి యంత్రపు వ్యాపారమున నతనికంత సొమ్ము దొరకదాయెను. ఇతర వ్యాపారములంగూడ నతని సంచి యుత్తదగుచు వచ్చెను. లక్ష్మీకటాక్షము లతనిపైం బ్రసరించుట రానురాను దగ్గుచువచ్చెను. దినదిన మతని కష్టము లినుమడింపం దొడంగె. తుట్టతుద కతని వ్యాపారశక్తియే యడంగిపోయెను. అంగడి మూసివేయవలసి వచ్చెను. తిరుగలి యంత్రము నిలుపవలసి వచ్చెను. లింకనును దీసివేయ వలసి వచ్చెను.

---

## పదమూడవ ప్రకరణము.

### యుద్ధమునకుం బోవుట.

న్యూసేలమున మల్లయుద్ధమున నపజయమంది లింకను స్నేహమునకుం బాత్రుండై వర్తించుచు వచ్చిన జాకును అతని మిత్రులును లింకను నాధిపత్యముక్రింద యుద్ధమునకుం దరలుట ప్రాప్తించెను.

బ్లాక్ హాకను నొక "ఎఱ్ఱ ఇందియను" మహాఘోరముగం దెల్లవారితోం బోరుచుండెను. వాని నెదుర్చుటకు దండు నాయత్తపఱుచుటకై గ్రామగ్రామమునకు వార్త లంపంబడెను.

జనులంద ఱావిషయమున మిక్కిలి యుత్సుకులై యుండుట చేతఁ బ్రతి పల్లియయందును నొక పటాలము చేరుచుండెను. న్యూసేలములో బలవంతు లగువార లనేకు లుండిరని యది వఱకే సూచింపఁబడియెను. వారి దుర్మార్గములఁ బాపి సన్మార్గమునఁ బ్రవర్తింపఁజేసిన లింకను దన బలౌన్నత్యముచే వారి కందఱకు నాయకుఁడు గాఁదగి యుండెను. వారివారి శౌర్యధైర్యములఁ జూపి దేశముఁ గాపాడికొన సమయ మిదెయని లింకను ప్రోత్సాహమున నచట నొక పటాలము సిద్ధమాయెను. నాయక నియామకముమాత్ర మచట జరగలేదు. అయిన నీవిషయమున గొప్పచర్చ ప్రారంభమాయెను. ఫిట్జుపాట్రిక్కను మఱియొకఁ డాబ్రాహాముతో నాయకత్వమునకుఁ బెనఁగుచుండెను. జనరంజకత్వము గలవాఁడే యైనను అబ్రహాము నెదుట నిలువలేకపోయెను. నిర్ణీతస్థానమున నా యుద్ధభటులు నాయకునిఁ గోరుకొన సెలవొసంగఁ బడిరి.

లింక నొకప్రక్కన పాట్రిక్క తని కెదురుగ నిలుచుండిరి. యుద్ధభటులలోఁ బ్రతివాఁడును దాఁ గోరుకొను నాయకుని జేరి నిలువవలసినదని యుత్తరువు చేసిరి. వెంటనే ముప్పాతిక మంది లింకను జేరిరి. గొప్పసంఖ్య లింకను ప్రక్కకు ఉఱుకుటఁ జూచి తక్కినవారు తామును అతనియొద్దకు మఱలిరి. పాట్రి [illegible] నాతనిఁ జూచిన జాలి వేయుచుండె

నని కొందఱు పరిహసించిరి. మఱికొందఱు లింకనకు వ్యతిరిక్తముగ నిలచుట కితనికి బుద్ధిమాంద్యము గాదా యని పలికిరి.

ఇట్లు సమ్మతులవలన నాయకుఁడుగ నేమింపఁబడిన లింకనుపన్యాస మియ్యవలసినదని యతని శిష్యులు వేడిరి. దానికిఁ బ్రత్యుత్తరముగఁ దనకు వారు చూపిన గౌరవమునకు వారికి వందనము లాచరింపుచు నమ్రతతోఁ దనశక్తికొలఁది దాఁ దనధర్మములఁ దీర్ప నుద్యుక్తుఁడై యున్నవాఁడ నని నుడివెను.

ఈ పటాలము బహుకాలము నిలువలేదు. ఈ యుద్ధభటులును విశేష కార్య మొక్కటియుఁ జేయలేదు. ముప్పది దినములు వీరు పనిసేయవలసినదిగ నేమింపఁబడి యుండెను. ఆ స్వల్పకాలమున జరగిన సంగతులలో నొకటి విస్తరింపఁదగినది.

ఒకనాఁడు 'ఎఱ్ఱ యిండియ' నుఁ డొకఁడు వడవడంకు ముదుసలి యీ దండు విడిదిఁ బ్రవేశించి తా వారి మైత్రిఁ గోరి వచ్చినవాఁడ నని నుడువుచు శరణ మడిగెను.

"మే మిండియనులఁ బరిమార్ప వచ్చితి" మని యొకఁడఱచెను.

"నీకు దయగాదు; నీసపుగుండే గతి యగు న" ని మఱియొకఁడు గద్దించె.

"చంపుఁడు, చంపుఁ డ" ని యనేకులు కేక లిడిరి.

"పరపక్షపు వేగులవాఁడు, వేగులవాఁ డ" ని యిత రులు గర్జించిరి.

ఈ రావములచే దిగ్భ్రమఁజెంది యావృద్ధుఁడు దనచేత నున్న యొక కాగితపు ముక్క దిగ విడచి చనుచుఁడెను. నాయకమణి లింక నది చదివి సేనా నాయకుఁడు క్కాసిచ్చిన యోగ్యతా పత్రిక యగుట దెలియఁజేసెను.

"సృష్టింపఁబడిన యసత్యపు లేఖ" యను నఱపులు దట్ట మాయె.

"ఇట్టి మాయలు మముఁ గలంచునే" యని కోపమునఁ బలుకుచు బిల్లి తుపాకి నెత్తి ముసలివానిఁ గాలువ జంకించెను.

వా రెల్లరు 'ఇందియను' జీవముఁ గొనఁ బట్టువట్టిరి. అందఱు గుమిగూడి వానిపైఁ బడఁబోవుచుండిరి. అపుడు దటాలున లింకను వారిముందటికి దుమికి తన దేహముచే నింది యనును గప్పి "సేనాధ్యక్షుని యుత్తరు వాలించి తీరవలయును. వాని మీఁదు దాకఁగూడదు. నిలుం డని" యాగ్రహమున వారింపఁ జూచెను.

అందులో నొక దుర్మార్గుఁడు "మే మిదె వాని యుసు ఱులఁ దీయ నిశ్చయించితి" మనెను.

లింకను గనలి భీకరాకారమున నిలచి వారిం దృణీకరిం చుచు "ననుఁ గాల్చినం గాని వానిఁ జేరలే" రని మహో గ్రావమున ననియెను.

పట్టుదలతో నేకాగ్రచిత్తమునఁ దన మాట నడప నుపక్ర మించిన యతని భయదాకృతికి వెఱచి వారెల్లరు సూటివెట్టిన గుంపుఁ బాఱనీక మఱలిపోయిరి. కొందఱు గొణగొణ యను కొనుచుండిరి. ఒకఁడు మాత్రము లింకనునకు "ఇది నీ పిఱికి తనమునకుఁ దార్కాణ" మనెను.

త్రోకుఁడు వడిన భుజంగపతిలీల విజృంభించి లింకను "నేఁ బిఱికి ననువాఁడవు నాతోఁ బెనఁగి తెలిసికొందువుగాక. రమ్మ"ని కదనమునకుఁ జేరెను.

అం దొకఁడు "నీవు మా యందఱకంటె దళమగు వాఁ డవే" యనియెను.

భయ లేశమును దోపని ముఖకాంతితో "మీ యిష్ట మునకు వచ్చిన యాయుధములఁ గొని పోరుఁ డ"ని ప్రత్యు త్తర మొసఁగెను.

వా రిది విని భయకంపితు లయి మాఱు మాటాడక 'ఇందియను' నకు వే లైనఁ జూపనోడి యూరకుండిరి. అమీఁద నెప్పుడును లింకనునకుఁ బిఱికితన మారోపింపఁ జూచిన వారు లేరు.

ఈవిషయమున లింకను ప్రాణము లపాయస్థితియం దుం డెను. తన యుద్ధభటుల కూరకుండుఁ డని యుత్తరువు సేసి యుండినఁ దిరుగఁబడి యుందురు. వారిని దండించుట యనిన

దుస్సాధ్యము. పౌరుల నొక కట్టుగఁ జేర్చినందునను వారికి యుద్ధభటత్వమును సంప్రాప్త మయి యుండినందునను వారు లాభనష్టముల నెఱుంగునంతటి స్థితిలో నుండరైరి. వారి నిర్ణీత కాలమును నంతమందుచుండెను. కావున వారి నేరములు పై వారికిఁ దెలియఁ జేయుట దన గార్యనిర్వాహ శక్తికే లోపముగఁ గన్పట్టు. అందువలన నతఁడు దన స్వశక్తి స్థైర్యంబులఁ జూపుటయె యతనిఁ గాపాడెను.

ఈ పటాలము ముప్పదిదినము లైనతోడనె విడదీయఁ బడెను. ఎవరింటికి వారు వెడలిరి. అయిన లింకను మఱి రెండు పటాలముల నుద్యోగములఁ గొనెను గాని మెచ్చుటను అతఁడు దన యోధశక్తిఁ జూపినది లేదు. ఈ విషయమునుగుఱించి లింకను మిక్కిలి చమత్కారముగఁ బలికియున్నాఁడు. దేశాధ్యక్షత కతఁడును జనరల్ క్యాసును బ్రయత్నించుచుండిరి. క్యాసు పక్షపువా రతఁ డీయుద్ధమున మిక్కిలి పాటుపడెనని యొక్క విధమునఁ జాటుచుండిరి. దానినిగుఱించి దేశీయ మహాసభలో ముచ్చటించుచు లింక నీవిధముగ నుడివి యున్నాఁడు.

"అయ్యలారా! నేను వీరాగ్రేసరుఁ డైనది మీ రెఱుఁగరా? వినుఁడు నేనెఱుఁగుదు. బ్లాక్‌హాక్ యుద్ధమపుడు నే సమరమొనర్చి, నా రక్తము గొంత చిమ్మించి యుఱికివచ్చి చేరితిని. జనరల్ క్యాసు గారు కార్యముల జరపించునెడ నా కార్యము

లును స్మరణకు వచ్చుచున్నవి. 'హాల్లు' గారు పట్టువడిన స్థలమునకు సమీపమున 'క్యాసు' గా రుండిరఁట. అదేరీతి నేనును స్టిల్లుమన్ పరాజితుఁ డయినచోట లేకున్నను అతనికి సమీపముననె యుంటిని. కార్యమైనతరువాత నేనును అతనివలెఁ గార్యరంగమును బొడగాంచితిని. నావద్ద ఖడ్గము లేనందున నది విఱిగిపోవునంతటి దెబ్బ తిననైతిని; అయినను నా తుపాకి వంకర పోవునంతటి తరుణ మొక్కటిమాత్రము సంప్రాప్త మాయెను.

"జనరల్ క్యాసుగారు నాకంటె ముందు గెనుసుగడ్డల నెదుర్చుచు నేగినది వాస్తవమే; అయిన నుల్లిగడ్డలఁ బోరునందు నే నతని మించితిని. అతఁడిందియనుల యుద్ధభటులఁ గాంచుట నాకంటె నెక్కుడు పనిసేయుటయు; అయిన నాపెంపు మఱొండు గలదు. నే నెన్నియో దోమలతో నుగ్రసంగ్రామ మొనర్చినాఁడను; నే నెప్పుడును రక్తనష్టమున సోలలేదు గాని పలుమారు రాకలికి బడలినాఁడను. నే నిఁకిప్పుడైన డెమొక్రాటిక్ పక్షము (అప్పటికి క్యాసుపక్షము) చేరి దేశాధ్యక్షతకు నిలిచినను నిట్టి యుద్ధవీరుఁడుగ మాత్రము నాపక్షపువారు వర్ణించి నా హక్కు స్థిరపఱుపఁ జూడ కుందురుగాత."

ఈ యుద్ధమునకు వెడలుటకుముం దొొకసంగతి జరిగెను. దాని గమనింపవలెను. స్ప్రింగ్ఫీల్డ్‌ సేలమున గ్రీనునకును మఱియొకనికిని ఆబ్రహాము బలమును గుఱించి వివాద మాయెను.

గ్రీను "లింకను సారా పీపా నెత్తి దానిలోని రంధ్రమునుండి జారు ద్రావకము నాస్థితియందఁ ద్రాగు" ననెను. వివాదకు లిరువురు పందెములు వైచికొని లింకను దగ్గరకు వచ్చిరి. లింకను దన మిత్రుమాట సెల్లింప నతఁడు సెప్పినట్లు లఘువుగఁ బీపా యునెత్తి ద్రావకము నోటఁ బోసికొనెను. గ్రీను పరపక్షపు టతనికిఁ 'జూచితివే' యని సంతసింపుచుఁజూపి, లింకనుఁజూచి "నీవు త్రాగువాఁడవు గావే" యనుచుండ నోటనుండిన హాలా రసమును నేల నుమిసి "నే నెప్పటికిని ద్రాగను, ఇప్పుడును ద్రాగ లేదు. నీమాట నడపుట కింతమాత్రమునకైన నియ్యో కొంటి" నని నుడువుచుఁ బీపాయిఁ గ్రింద దింపెను. ఆ మూఁడవవాఁ డట్టి యాశ్చర్య మెన్నఁడును జూడలే దని వెఱఁ గుపడి చూచుచుండెను.

చదువరులారా! మనము ముఖ్యముగఁ గమనింపవలసి నది యాబ్రహాము మనస్థైర్యము, దుష్టవస్తువును దూరముగ నుంచు దిట్టతనము. సురాపానము నతఁ డెంత నిరసించినదియు గనుకే. ఇంతటితో నతఁడు నిలువలేదు. సాయంకాలమున గ్రీను నేకాంత స్థలమునకుఁ బిలిచి పందెములు వేసికొనుట జూదముతో సమానమని చెప్పి, యా దురభ్యాసము నిఁక మానుము వదలివేయుమని బోధించెను. లింక నుపన్యసించిన విని [illegible] తన యపరాధము నొప్పుకొని ముం దష్టి

పని యెన్నటికిని జేయనని వాగ్దానము సేసి బ్రతికి నంతకాల మది మఱవకుండెను.

---

## పదునాలవ ప్రకరణము.

### అయాచిత గౌరవ ప్రాప్తి.

బ్లాక్ హాకు యుద్ధమునకుఁ దరువాత నాబ్రహాము న్యూ సేలమునకుఁ దిరిగివచ్చెను. ఉద్యోగ మేమైన దొరకిన బాగుండునని యోచించుచుఁ గమ్మరిపనిపై దృష్టి సారించెను. ఆ విషయమును గొందఱు మిత్రులు గమనించి యతనిఁ జట్ట నిర్మాణసభకుఁ బంప నిశ్చయించితిమని చెప్పిరి. అతఁ డందుల కంగీకరించుట గడుదుర్లభ మాయెను. తనకంటె విద్యావంతులును, ధనవంతులును, అనుభవశాలులును అనేకు లుండఁగా నెట్లాపదమునకుఁ బెనఁగఁ గలననియుఁ దన కావిషయమున నేలాటి కోరికలు లేవనియుఁ బలుకఁ దొడఁగెను. ఆ పట్టణములోని గొప్పవారందఱు నతనిఁ బ్రతినిధిగ నుండుమని యడుగుట కేతెంచిరి. స్నేహితులు దను విశేషము ప్రార్థించుటఁజేసి యాబ్రహాము తుట్టతుద కియ్యకొనిథెను. అతఁడు తన నియామకులకు నొడివినమాటల వినుఁడీ:

"ఆర్యులార! స్వదేశసోదరులారా! నే నెవ రైనది మీ కెఱుఁగుదురని తలఁచెద. నేను బీద అబ్రహాము లింకనును.

చట్టనిర్మాణసభకుఁ బ్రతినిధిగ నియమింపఁబడ నిలువుమని నన్ను స్నేహితు లనేకులు నిర్బంధపఱచిరి. నా రాజకీయవిషయికాభిప్రాయములు తక్కువ యై యుంపైనవి. జాతీయనిధి యొకటి యుండవలె ననియు, స్వదేశములోపలిపనుల వృద్ధి సేయవలె ననియు, గొప్పసంరక్షణ సుంకముల వేయవలె ననియు గట్టిగ నమ్మువాఁడను. నా రాజకీయవిషయిక యభిప్రాయములును, న్యాయములు నివి. మీరు నన్ను బ్రతినిధిగా నేర్పఱచినఁ గృతజ్ఞుఁడనై యుండెద; నేర్పఱచ కున్నను నా కొక్కటియు."

ఇంతటి చిన్నయుపన్యాసమునకుఁ గారణ మతని నిగర్వమనియే సుధువ నగును. ఈవిషయ మతని నిర్వాచకు లనగా సమ్మతు లిచ్చువారు గమనింపకుండ లేదు. అతఁడు నియమింపఁబడకపోయినను విజయమందిన యుద్యోగార్థి కితఁడు రెండవవాఁ డాయెను. ఇతనికి వచ్చిన సమ్మతుల సంఖ్యయు నతనికి వచ్చిన వానికంటెఁ గొన్నిమాత్రము తక్కువగా నుండెను. ఆబ్రహాము నెడ నితరులకుఁ గల గౌరవము న్యూసేలముల లోని 284 సమ్మతులలో 277 సమ్మతు లతఁడు సంపాదించె ననినఁ దెల్లము గాఁగలదు.

ఆబ్రహాము కెదురుపక్షమువా రతని యాకారవేషములఁ జూచి పరిహాసింపుచుండురు. అట్లు పరిహసించువారికిఁ గొన్ని

కారణములుగూడఁ గలవు. అతనివిగ్రహమే యంతసుందర మైనది గాదు. మఱియతని యుడుపులును నవ్వుపుట్టించునవిగ నుండెను. అయిన నతనిఁ జూచి యతనిమాటల వినిన వారం దఱు నిట్టి యభిప్రాయ మెప్పుడును మనములఁ జొరనీరైరి. అతని స్వరూపమును, వస్త్రములును నతని నమ్రతకు సాక్షు లని కొనియాడుచుందురు.

ప్రతినిధి యుద్యోగవుఁ బనుల జయము గాంచకున్నను నాబ్రహాము మిక్కిలి ప్రసిద్ధిమాత్రము వడసెదు. ముందు సమయము వచ్చినపుడు జయము గలుగు ననుట స్పష్ట మాయెను.

ఈ పరిశ్రమ దీరినపిదప నాబ్రహాముబొక్కసమున నొక్క కాసైన లేకుండెను. న్యూసేలమున నతని కనేకులు స్నేహితు లుండిరి. గ్రీ నతని న్యాయపరీక్షకుఁ జదువుమని కోరెను. అతఁడు దనకు యోగ్యత చాలదనియు, నావృత్తి యం దనృత మాడవలసి వచ్చుననియుఁ, దా నాకార్యమును జేయు నెన్నటికిని సమ్మతింప ననియుఁ, బలువిధముల నాస్నే హితునికి బదులుచెప్పుచువచ్చెను.

న్యాయవాదిగ నుండుటకు లింకనున కిష్టము లేకుండెను. ఆ వృత్తికి వలయు శక్తి దనకుఁ జాలదని యతఁడు జంకుచుం డెను గొప్పవారల కెంతటి నమ్రతయో గనుఁడీ. తన్నుఁ

బోలె పెంచఁబడిన చిన్నవాఁడే ప్రకారమా వృత్తియం దడుగువెట్టునని యతనికి సందేహము. అయినఁ దన కొక్క జీవనాధార వ్యాపారము లేక యటునిటు తిరుగుచుంట నతఁడు సహింపలేకుండెను. పసితనముననే యేదో యొక వృత్తి నిశ్చ యించుకొని విడువక పాటుపడ కున్న మనుజుఁడు వాంఛాసిద్ధి నొందలేఁడని తర్కించి తా నట్లు చేయు మార్గ మరయు. అరసి కానలేక బహువెతలఁ దగులు. తా నెద్దానికిఁ బనికి రాఁడని తలంచెనో దానిని దన స్నేహితులు ప్రయత్నింపు మనుచుండు టతని కింక నెక్కుడు వ్యసనకారి యాయెను. తన శక్తిని దాను గొద్దిగఁ దలంచుకొని యితరులు తన కెక్కుడుశక్తి నారోపించిరని వగచు. ఇది యతనియం దొకలోపమే యైనను మిక్కిలి మంచిలోపము. ఈవిధముగ లోపముగల పసివారి సంఖ్య చాల తక్కువ. తమ శక్తి సామర్థ్యములు ముల్లోకముల మించుననని భ్రమసి తప్పుదారులఁ బట్టువా రనేకులు గలరు. కొండొకరు పనికిమాలిన వెడఁగులు లోకము దమకు లోకువ యనుకొనుచుందురు.

ఆ. వె. అల్పుఁ డెపుడు పల్కు నాడంబరముగాను
సజ్జనుండు పల్కుఁ జల్లగాను
కంచు మ్రోఁగునట్లు కనకంబు మ్రోఁగునా
విశ్వదాభిరామ వినర వేమ."

అనిన విధమున గొప్పతనమునకు నిగర్వమే యానవాలు గదా? కావుననే లింక నితరుల దృష్టికిఁ దాఁ గనుపడినంత శక్తిసామర్థ్యములు గలవాఁడుగఁ దనకంటె కగుపడ కుండెను.

కమ్మరి యగుట మాని యాబ్రహాము వ్యాపారి యాయెను. బెట్టీయను వానితోఁ జేరి యొక యంగడి నడపసాగెను. అయిన బెట్టీ జ్ఞానహీనుఁడై త్రాగుబోతుతనమున నప్పుల కుప్పయై నష్టములఁ దెచ్చిపెట్టి దివాలా యెత్తెను. అతని దివాలాతో నంగడి ముగిసి పోయెను. గొప్ప యప్పుమాత్రము నిలిచెను. గ్రీనువద్దఁ గొంతధనము పుచ్చుకొని యాబ్రహాము మాయప్పును దీర్చివేసెను. తా న్యాయవాది యైన తరువాతఁ గ్రీనుకుఁ గడపటి కానుతోఁ జెల్లించెను.

దుకాణ మదృశ్య మగుడు నుద్యోగహీనత్వ మాబ్రహాము మున కాసన్నమాయెను. పనిలేనికాలమున నతఁ డనేక గ్రంథములఁ బఠించెను. అందు 'పూర్వకాలపుఁ జరిత్రము,' 'రోమక రాజ్యప్రవృద్ధినాశములు' మొదలగునవి సర్వోత్తమములు. అతఁడు చదివిన విషయముల నన్నిటిని సంగ్రహముగ వ్రాసియుంచుకొనును. తరువాత వానిని సులభముగ శిరోపేటికఁ జేర్చుచుండును. అతనికిఁ జిక్కులు విడఁదీసి యుదాహరణ బాహుళ్యము సూపి మనోరంజకముగ నుపన్యసించు శక్తి నొసంగిన దిదియ గాఁబోలును.

కొంతకాలమునకుఁ దరువాత హఠాత్తుగ నొకనాఁ డతఁడు జాన్ కాల్హూనను భూములు గొలుచువానిని (సరవేయరును) గలసెను. అతఁ డాబ్రహామును గొల్తపనికిఁ (సరవేపనికి) బూనుమని ప్రోత్సాహపఱచెను. కొంత యోచించి యాబ్రహా మతనిదగ్గర నాఱువారములలోఁ బనినంతయు నేర్చుకొనెను. అతఁడు సేయఁగల్గినంతపనియుఁ దానికనుగుణమగు జీతమును రాఁ బ్రారంభించెను. ఆపనియం దతఁడు సంపాదించిన ప్రావీ ణ్యమున నెట్టివివాదములు వచ్చిన నతనిని మధ్యస్థిగఁ బిలుచు చుందురు. ఎచ్చట నున్నను సింగపుబుడుత సింగపుబుడుత యే గదా.

తనకుఁ దీఱికయున్నపుడంతయు నాబ్రహా మితరుల కుప కార మొనరించుచుండును. దురదృష్టము పాలఁబడినవారికిని, కష్టములఁ గుడుచువారికిఁ, బీదసాదలకును నతఁడు సాయ మొసంగఁ బ్రయత్నించుట రానురాను వృద్ధిపొందుచువచ్చెను.

చలి దట్టముగ గ్రమ్మినకాలమున నొకనాఁ డాబ్రెం బనువాఁడు హిల్లనునతనికై పాడుపడిన యొకకొయ్యయింటిని గట్టెలనిమిత్తము గొట్టి యిచ్చుచుండెను. బెంటు పాదరక్షలు లేక చలిలోఁ గడగడ వడకుచుండెను.

దానిఁ జూచి 'ఈపనికి నీ కేమికావలె' నని యాబ్రహా మడిగెను.

"ఒక్క డాలరు పాదరక్షలకై పాటుపడుచున్నా" నని ప్రత్యుత్తర మిచ్చుచుఁ జలిచే రాయిగట్టిన పాదములఁ జూపెను.

అంత నాబ్రహాము "ఆ గొడ్డలి నిటందిమ్ము. వెచ్చగ నుండుచోటికిఁ బోయి చలికాఁచుకొని రమ్మ"ని వానిఁ బంపివేసి త్వరితగతి నాయింటిసంతయు క్షణములోఁ గొట్టిపెట్టెను. ఆ యింటి యజమానుఁడును బ్రెంటును ఈతని శక్తి కాశ్చర్యముం బొందిరి.

ఇఁక నిట్టివిషయము లెన్నియైనఁ జెప్పవచ్చును. అయిన గ్రంథవిస్తరభీతిచేఁ జెప్పనెల్ల.

1833 వ సంవత్సర మాబ్రహాము న్యూసేలము పోస్టుమాస్టరుగ నియమింపఁబడెను. ఆ పట్టణమున నతనికంటె నెక్కుడు తగినవారు గానరానందున నతనికే యాపని నిచ్చిరి. అచ్చటను నతఁడు దన సౌజన్యముఁ గనుపఱచెను. చదువు రానివారలకెల్ల నుత్తరములఁ జదివిచెప్పుటయు, ననేకులను సభగఁ జేర్చి వారికి వార్తాపత్రికల బిగ్గరగఁ జదివి వినిపించుటయు నతనకి మిక్కిలి సహజములాయెను. అతఁడు వచ్చినయుత్తరములఁ దనటోపీలో నుంచుకొని తా బయలువెడలునప్పుడు పంచిపెట్టుచుండెననికూడఁ గొందఱు చెప్పుచున్నారు.

చట్టనిర్మాణ సభయందుఁ బ్రతినిధులు రెండుసంవత్సరములకొకమాఱు నియమింపఁబడుచుందురు. కావున 1834 వ

సంవత్సరము 1376 సమ్మతులవలన ననగా నిందలు జనుల కోరిక ననుసరించి యాబ్రహాము సంపూర్ణగౌరవమునఁ బ్రతినిధిగఁ బేర్కొనఁ బడియెను. నిర్వాచకులకు ననగా సమ్మతి నిచ్చువారికి నాకాలమున సారాయితోఁ బిందుగలు సేయుట యాచారమైనను నాబ్రహా మట్టిపనిఁ దలంచినవాఁడుగూడఁ గాఁడు.

ప్రతినిధిగఁ బేర్కొనఁబడి సభకుఁ బోవుటకుఁ దగు నుడుపులు లేనివాఁడగుట నొక స్నేహితునివద్ద కొంతధన మప్పుపుచ్చుకొని తగువేషము ధరించెను. సభయం దతఁడు దన నియామకుల విషయముల నెల్లఁ జక్కఁగఁ జర్చించుటకుఁ దత్పూర్వమే మిక్కిలి శ్రద్ధఁజేసి వానిని సంపూర్ణముగ నరసి తెలిసికొనెను. సభయం దతిశయముగ మాటలాడకున్నను గొప్ప యల్లకల్లోలములు జరుగు సమయముల వాని నొప్పుట్టయం దితఁ డనన్యసామాన్యుఁ డాయెను.

ఈ తరుణమున నాబ్రహాము స్టూఅర్టను నొక గొప్ప న్యాయవాదితోఁ గలసిమెలసి దిరుగుచుండెను. అతఁ డీ చిన్నవాని శక్తి యపారమని గ్రహించి 'నీ వేల న్యాయవిద్య నభ్యసింపరా' దని' యడిగెను. ఆబ్రహా మెప్పటివలె వెనుదీసెను. అయిన స్టూఅర్టు మిక్కిలి ప్రోత్సాహపఱచి తాఁ బుస్తకము లిచ్చెదనని చెప్పి యాబ్రహామును సమ్మతింపఁ జేసెను. మ్యాసె

లమునం దాబి స్నేహితులెల్లగు నానందం బందిరి. అందఱు నతనికి సాహాయ్య మొనర్ప సిద్ధపడిరి. అతని వా గమృతం బున నోలలాడు మిత్రు లనేకు లతని విద్యాపరిశ్రమ దమ సౌఖ్యముఁ జెఱచునని తలంచిరి. కొల్లపనిఁ జూచుకొనుచు న్యాయవిద్యఁ గడించుట యనిన నెంత పరిశ్రమ, పట్టుదల, సౌఖ్యనిరసనములు గావలయునో వా రెఱుఁగరైరి. అయినను

శా. "ఆరంభింపరు నీచమానవులు విఘ్నాయాససంత్రస్తులై
యారంభించి పరిత్యజింతు రురువిఘ్నాయత్తులై మధ్యముల్
ధీరుల్విఘ్ననిహన్యమానులగుచున్ధృత్యున్నతోత్సాహులై
ప్రారబ్ధార్థములుజ్జగింపరుసుమీ ప్రజ్ఞానిధుల్ గావునన్."

లింకను స్నేహితులతో వినోదప్రసంగముల నుండుట మాని వేసెను. ప్రతిసాయంకాలమును దేహపరిశ్రమ సేయుచుండు వాఁడు. అద్దానినిగూడ వదలవలసినవాఁ డయ్యె. పుస్తకము లకై యప్పుడప్పుడు స్ప్రింగుఫీల్డుకు నిరువదిమైళ్లు నడచిపోయి పెద్దపెద్ద గ్రంథముల నవలీలగ మోసికొనివచ్చుచు మార్గము నందె గొంతభాగము పఠింపఁ దొడఁగెను. కొల్లపనులఁ బగ లంతయు నొక్కొకతఱిఁ గడపవలసి యుండును. అపుడు రాత్రి వేళల బహుకాలము చదువును. ఈవిధమునఁ బట్టినపట్టు వదలక యనేకులు తరుణవయస్కులు వినోదముల నాటలఁ బాటలఁ

బుచ్చు ప్రొద్దెల్ల నితఁడు విద్యాభివృద్ధికై వెచ్చించెను. పగలు కొల్లపనిలో నుండునప్పుడుగూడ నతని మనము పుస్తకముల పై నుండును. తత్కారణముగ రాత్రిఁ జదివినది పగలు పునః పఠనము గావించుచుండెను. కాయపుష్టి ప్రాప్తిగఁ గలవాఁడు గాన నతఁడెంతెంత పరిశ్రమఁ జేసిన నంతంత యనురక్తి దానియం దతనికిఁ బుట్టుచుండెను.

అబ్రహాము దననియామకుల యోగక్షేమమును గుఱించి చట్టనిర్మాణసభలో సంపూర్ణహృదయముతోఁ బనిచేసినందున వారు మరల 1836 వ సంవత్సరమున నతనినే నియమించు కొనిరి. ఇప్పటి కతఁడు మిక్కిలి యభివృద్ధిఁ జెందియుండెను. అతని యుపన్యాసము లుత్తమపదవిఁ జేర నారంభించెను. అప్పటిసభయందలి నియమితసభ్యులును గొప్పవారే యై యుం డిరి. బానిసలవిషయము చర్చకే తెంచెను.

బానిసతనము నిర్మూలము చేయఁగోరువారు పత్రికల వ్రాసి యన్నిదిశలకుఁ బంపుచు, ముక్తసీమలయందు బానిసపుఁ బాపములఁ గుఱించి యుపన్యసించుచు, నెచ్చటఁ జూచిన బాని సల కష్టముల వర్ణించుచు బలువిధముల బాటుపడుచుండిరి. 'సిమదొరతనము' వారుగూడ వీరి నసహ్యపడఁ జూచుచుండిరి. ఇల్లినాయియందును వీరిఁ జూచిన వల్లకల్లోలము గావించు చుండెను. వీరిలో ముఖ్యుఁడగు 'లవ్జాయి' యను నతఁడు

'బానిసము మానుడ' మని యొక పత్రిక ప్రచురించి నందులకు గుండు దెబ్బఁ గుడిచి లోకాంతర గతుఁ డై యుండెను.

ఇట్టిసమయమునఁ జట్టనిర్మాణసభయందు దాస్యపరులైన కొందఱు దాస్యనిర్మూలకులకు వ్యతిరిక్తముగఁ గొన్ని చట్టముల నిర్మింపఁ గట్టిగఁ బ్రయత్నించిరి. బానిసతనము ప్రవృద్ధియగుటకు వలయుసాధనముల నేర్పఱుపఁ జూచిరి. ఈ కార్యములు మిక్కిలి హేయములై యెట్టికట్టడి బానిససీమకును నపకీర్తి తేఁ గలిగియుండెను. అయిన దాస్యనిర్మూలకుల జడిపించి తమ కార్యము నెరవేర్పఁ బూనిరి. అనేకుల నాప్రకారము దమ వశులఁ జేసికొనిరి. అబ్రహాము మాత్రము లోఁబడకుండెను. మిక్కిలి కోపోద్దీపితుఁ డై యా చట్టములనెల్ల సంపూర్ణముగ ఖండించెను. దాస్యపరులను వారికార్యములను బట్టరాని యుగ్రతతో నిరాకరించెను. దాస్యనిర్మూలకులలో నొక్కఁడు డానుస్టోను మాత్ర మతనిఁ జేరును. వీ రిరువురును జాగరూకతతో నొక విరుద్ధాభిప్రాయపత్రిక వ్రాసి యాచట్టము లన్యాయములనియు లసంగతము లనియు ఖండించి యాసభఁ జర్చావిషయిక సంగ్రహపట్టికల లిఖింపించిరి.

1836 మొదలు 1833 వఱకు నా సభయందు స్వాతంత్ర్యమునకై వాదింపుచుండెను లింకను నిర్భయముగ మహా

సామర్థ్యముతో న్యాయముకొఱకుఁ బెనఁగువాఁ డని దేశము నం దంతయుఁ గీర్తిప్రఖ్యాతుల వడసెను.

1837వ సంవత్సరమున లింకను న్యాయవాది యా యెను. ఆవృత్తియం దతఁడు చూపిన బుద్ధిచాతుర్యములును అతఁడు గడించిన కీర్తిప్రసిద్ధులును ముందు ప్రకరణమున వర్ణింపఁ బడెడిని.

చట్టనిర్మాణసభకు నతఁడు మఱి రెండుమారులు 1838-1840 లలో జయపరంపరలతో నియమింపఁబడెను. 1840 వ సంవత్సరము నియమింపఁబడినపు డా సభలో వాబాషుసీమ ప్రతినిధి యొకఁడు విధానలోపములని యనేక గష్టములఁ దెచ్చుచుండును. అందఱు నతని నణఁపలేక వెనుకముందుఁ ద్రొక్కుచుండురు. లింకనునియామకులకు సంబంధించిన యొకా నొక విషయము చర్చింపఁబడుచుండెను. వాబాషు ప్రతి నిధి వెంటనే లేచి యిది విధానలోపకలితమని ఖండింపఁ బ్రారంభించెను. దానికిఁ బ్రత్యుత్తరముగ లింకను లేచి యీ ప్రకారము చెప్పఁదొడఁగెను.

“సభాధ్యక్షా! ఈప్రతినిధిగారి యాక్షేపణవినిన నా పూర్వస్నేహితుఁ డొక్కరుఁడు జ్ఞప్తికి వచ్చుచున్నాఁడు. వాఁడు వింతచూపుల ముసలివాఁడు. కనుబొమలు మిక్కిలి దట్టములై కనుల నావరించికొనఁ జూచుచుండును. వాని క్రింద

నాసికపై సులోచనముల జత యతని కలంకారముగ నొప్పు చుండును" (ఈవర్ణన విని ప్రతిసభ్యుఁడును వాబాషు ప్రతినిధిం జూచి వర్ణితాంశములు సూటిపడుట గమనించెను) "ఆ ముదుకఁడు ఒకనాఁడు ప్రాతఃకాలమున నిదుర లేచి బయటికివచ్చి యింటిముందఱి చెట్టుమీఁద నొక యుడుతం గాంచితి ననుకొని యెను. కావునఁ దన చేతితుపాకిఁ గొని దానిఁ గాల్చెను. ఆ యుడుత దీనికి లక్ష్యపెట్టినట్లు గనుపించ దాయె. అతఁడు మరల నొకమారుఁ గాల్చె. ఫలంబు మొదటియట్లె యుండె. కాన నావృద్ధు మఱిమఱి గాల్చుచుండె. పండ్రెండుమాఱులు గాల్చి వేసవి ఫలసిద్ధి మార్గముఁ గానక తుపాకిఁ గ్రిందిడి ప్రక్కన నిలిచి చూచుచుండిన తన కుమారునితో "అబ్బాయీ! ఈ తుపాకి చెడినట్లున్నది" యనెను. వాఁడు తుపాకిఁ బరీక్షించి చూచి "ఇం దేమియు దోషము గానరాదే. మీ యుడత యెక్కడ" నని ప్రతిప్రశ్న సేసెను. దానికా ముసలివాఁడు సులోచనముల దృష్టిసారించి చూచుచు "నీకుఁ గనుపించ లేదా? చెట్టునడిమి కొమ్మ ప్రాకినదే" యనెను. "లేదు నా కగుపడలే" దనుచు నా బాలుఁడు దనతండ్రి ముఖముసూచి "ఓహో! తెలిసె. మీ ముక్కుద్దముపై నుండు నొక పేనుం జూచి చెట్టుమీఁది యుడుత యనికాల్చుచున్నా" రనియెను.

ఇదివిని యచ్చటి సభ్యులందఱు బ్రక్కలు వక్కలగునట్లు నవ్వ నారంభించిరి. అటుతరువాత నెవ్వఁడును వాబాషు ప్రతినిధి విధానలోపములని యాక్షేపించినవాఁడు కాఁడు.

లింకను దన కట్టెగుడిసె వదలిన పదిసంవత్సరములలో నిల్లినాయిలో మహాప్రసిద్ధి వడసెను. ఇచ్చట న్యాయవాదులలోఁ బ్రాముఖ్యుఁ డెవ్వఁడనిన నాసీమ జనులెల్ల రతనిని జూపుచుందురు.

1842 వ సంవత్సరమున ముప్పదిమూఁడు సంవత్సరముల వయస్సున నతఁడు హానరబిల్ రాబర్టు యస్. టాడ్ కూఁతురగు మేరి టాడును బెండ్లియాడెను. ఈ వివాహమువలన నతనికి రాబర్టు, ఎడ్వార్డును, విల్లియము, థామసులను నలుగురు కుమారులు గలిగిరి. ఎడ్వార్డు బిడ్డగా నున్నపుడె చనిపోయె. విల్లియము పండ్రెండు సంవత్సరములవాఁడై వాషింగుటను పట్టణమున మృతినొందె. థామ సిరువదేండ్లవాఁడయి యిల్లినాయిలోఁ బరలోకప్రాప్తిఁ జెందె. రాబర్టుమాత్రము తరువాత వాషింగ్టనులో యుద్ధవిషయిక కార్యదర్శి యయ్యెను.

## పదునైదవ ప్రకరణము.

### న్యాయవాదిత్వము.

లింకను న్యాయవాదయుద్యోగము ప్రారంభించినప్పు డతనియొద్ద నొక కాసైనను లేకుండెను. [illegible]

గుఱ్ఱమును దానిపై సామగ్రి మోసికొనిపోవుట కొఱకు త్తిత్తియుఁ గొనుట కతనికి ధన మొకస్నేహితుఁ డియ్యవలసివచ్చెను. అశ్వ మావశ్యక మై యుండెనా యను సంశయము చదువరుల మన ములకు గోచరింపవచ్చును.

ఆకాలమునఁ గక్షిదారులు న్యాయస్థానమునకుఁ బోవుట లేదు. న్యాయస్థానమ గక్షిదారుల నరసికొని సంచరించు చుండును. న్యాయాధికారులు దమతమ నిర్ణీతప్రదేశములకు వెడలి యచ్చటి వివాదముల నచ్చటనె తీర్చివచ్చుచుండురు. ఇట్టిన్యాయస్థలములకుఁ దేఁబడు వివాదముల సంఖ్య కనుగుణ ముగ 'భ్రమణ' కాలము పట్టుచుండును. ఒక్కొకమారీ 'భ్రమ ణము' లనుండి లింక నింటికి మూడుమాసములమీఁదటఁ దిరిగి వచ్చుచుండెను. ఇట్లొకతరి యతఁడు గార్యార్థియై వెడలియుండి నపు డతనికి సందియముఁ గొలుప నాతనిభార్య దమగృహమున కింపులు గురిపించు మేడ గట్టించి నూతనాకారము వహింపఁ జేసెనఁట. లింకను మఱలివచ్చి యింటియందలి మార్పులఁ బరికించి తెలియనివానిఁబోలె దూరముననుండు నొకనిఁ బిలిచి,

"నాయనా! లింక నిప్పు డెచట నివసించు. ఇదివఱకీ గేహంబున నుండునే?" యని ప్రశ్నించెనఁట.

కొంతద్రవ్య మార్జించినపిదప లింక నొక యొంటిగుఱ్ఱపు బండిని సంపాదించెను. అదియు నంత యుత్తమ మైనది గాదు.

సొంపుగాని దినముల నద్దాని నుపయోగించుకొనుచుం డెను. ఇంతటిమితపరికరములు గలవాఁ డైనను అతనిరాకమాత్రము భూస్వాములకును న్యాయవాదులకును మోదప్రదం బయి యుండెను.

న్యాయవాదిగ నున్నెడ నతఁడు నిష్కాపట్యము, నిష్పక్షపాతము, న్యాయవాంఛ, దయ, ధారాళత్వములఁ జూపి ప్రసిద్ధి వడసెను. ఈ గుణముల సూచించు దృష్టాంతముల లిఖించి యొక గ్రంథము నింప నగును. అయిన నిచ్చటఁ గొన్నిటి మాత్రము పొందుపఱచెదము.

లింకనువద్ద కొక వ్యాజ్యకాఁ డేతెంచి తన కథనెల్లఁ జెప్పుకొనియెను. చక్కగ విని,

"నీకు నే నుపయుక్తుఁడఁ గాఁజాల. నీ వ్యాజ్య మనృత" మనియెను.

"అదంతయు మీ పనిగాదు. నే డబ్బిచ్చి మిము నాపరము వాదింప నునిచికొనిన సరిగదా" యని వాఁడు ప్రతివల్కెను.

"నే నట్లు వాదింపను. న్యాయవాదిగ నుండుట యన్యాయమును న్యాయ మొనర్పఁ గడఁగుట కాదు. నిస్సంశయముగఁ దప్పుత్రోవఁ ద్రొక్కు వ్యాజ్యమే నెన్నటికిని నంగీకరింపను."

"నా వెరిని మీరు దొందరలఁ బెట్టవచ్చును గాదా?"

"అవును. వివాదము నే గెలిచియిచ్చెద ననుటకు సందే హము లేదు. ఒక ప్రదేశపు జనులనెల్లరఁ దాలుమాలు చేయఁ గల్గుదును. ఆ విధవను ఆపె యాలుగురు దండ్రిలేని బిడ్డలను రిక్తహస్తులఁజేసి న్యాయానుసారముగ వారికిఁ గల యాలు వందల డాలరుల నీ కిప్పించఁ గల్గుదును. అయిన నే నట్టి యన్యాయపు పనులు సేయువాఁడను గాను."

"మీ కెంత వేతన మిచ్చిననుఁ జేయరా?"

"నీకుఁ గలదంతయు నా కూడ్చి పెట్టినను నేఁ జేయను. చట్టదిట్టములు సరియని యొప్పుకొను విషయములు గొన్ని నీతిబాహ్యములు గలవని యెఱుంగుము. నీ వివాదమునకుఁ దోడ్పడుదు ననుట గల్ల."

ఈ యుత్తర ప్రత్యుత్తరములకు వ్యాజ్యకాఁ డాగ్రహము పూని,

"మీరు రాకున్న గుడ్డిగవ్వపోయె. మీవంటి న్యాయ వాదు లీసీమయందుఁ దండోపతండములు గల"రని నోడివి రభసమున వెడలఁబోయెను.

లింక నతని నాపి "వేతనముఁ దీసికొనక నీ కొక యాలో చన సెప్పెద వినుము. నీవు చూడ మిక్కిలి చులుకైన పనివాఁ డుగ నున్నావు. ఆ యాలువందల డాలరు లిఁక నేవిధమున నైన గడింపుము. పొమ్మ"ని చెప్పి పంపెను.

ఒకనాఁటి మధ్యాహ్నకాలమున లింకను హేరండనుల యుద్యోగస్థలమున కొకముసలి నీగ్రో (సిద్దీ) స్త్రీ యేతెంచి తన విషయమెల్ల సాంతముగఁ జెప్పుకొనెను. అంతకుఁబూర్వ మాపె గెంటకీ సీమయందు హిన్క్లె లను నతని బానిసగా నుండెను. అతఁడు దయామయత్వంబున నామెను బిడ్డలను నిల్లినాయి సీమకుఁ దెచ్చి స్వేచ్ఛ యొసఁగి యుండెను. అప్పు డామె కుమారుఁడు న్యూఆర్లియన్సుకుఁ బోయి యుండి యవివేకి యై గ్రామము సొచ్చెను. ఇతరసీమలనుండి వచ్చు ముక్త బానిసలఁ బట్టి మరల దాస్యమున కమ్మవచ్చు నను 'సీమ' చట్టము ననుసరించి పోలీసువా రతనిఁ బట్టి యుంచిరి. వెంటనే మరల్చుకొని రాకున్నఁ ద్వరలోనే మరల నతనికి దాస్యము సంభవించున ట్లుండెను. అట్టి యాపదనుండి తన పుత్రుఁ దప్పించరే యని యామె వేఁడెను. లింక నార్ద్రహృదయత్వము వెల్లివిరియఁ జొచ్చెను. కఠినచట్టములపై నాగ్రహము నుద్దీపితుం డయ్యెను.

హేరన్డను నవలోకించి "రాజకీయోద్యోగస్థలమునకుఁ బరువిడి యీ నీగ్రోను రక్షింప గవర్నరు చిన్నెలుఁగా రేమైనఁ జేయఁగలుగుదురేమో తెలిసికొని రమ్ము" నెను.

ఆ యాలోచన విఫలమాయెను. గవర్నరు దన కా విషయమున నెట్టి యధికారమును లేదని వార్తఁ బంపెను.

ఇట్టి యానురకృత్యమును నిరాకరింపఁజాలని చట్టముల హీనత్వంబునకు మిక్కిలి కనలి లేచి నిలిచి తన నిడుపుచేతుల నాకాశమార్గంబునకుఁ బఱపి,

"దైవానుగ్రహం బుండిన నా నీగ్రో నిప్పుడ రక్షించెద. లేకున్న గవర్నరు కిట్టివిషయముల నిష్టానుసారముగఁ బ్రవర్తింప నధికార మిచ్చువఱ కిరువదిసంవత్సరములైనఁ జట్టనిర్మాణసభయందుఁ బోరాడి యల్లకల్లోలం బొనర్చెద" నని యెను.

వెంటనే లింకను హెరన్డనులు దమ ధనము న్యూఆర్లి యన్సుకుఁ బంపి యా నీగ్రోను విడిపించిరి.

లింక నొకతటి చిక్కుల కిక్క యగు నొక వ్యాజ్యములో వాదించుచుఁ దాను దప్పుపక్షమున నుంటఁ బొడఁగాంచెను. కక్షిదారుఁడు దుర్నీతుఁడై యతని కబద్ధము సెప్పియుండెను. అతఁడు శ్రమఁజేసి తన కక్షిదారునకై యొక యప్పులెక్కను సిద్ధాంతపఱచెను. అయినఁ బ్రతికక్షివా రా లెక్కల్ల విరుద్ధముగఁ జెల్లుచీటి (రశీదు) నొకదానిఁ గనుపఱచిరి. దీనివిషయము లింకనున కెఱుకయే లేదు. ఎదురు న్యాయవాది దన వాదము ముగించుటకుమున్నె లింకను న్యాయస్థలమునుండి లేచిపోయి యుండెను. దానిఁ గాంచి న్యాయాధికారి యతనిఁ బిలువ నంపెను. అయిన లింకను నేను రాఁజాల

నని న్యాయాధికారికిఁ జెప్పుము. నాహస్తము మాలిన్యంబు నందినది, కడుగుకొన నేతెంచితి” ననిదూత ననిపెను.

హత్య వివాదమున నొక్కట ముద్దాయిని రక్షించుటకై లింకను సీవెట్టులు నేమింపుకొనఁబడిరి. సాక్ష్యము వినినతరువాత లింకనునకుఁ దనపక్షమువాఁడు నేరస్తుఁడే యని తోఁచెను. వెంటనే ప్రక్కగదిలోనికిఁ దన సహవాదింబిలిచి,

“సీవెట్టూ, మనవాఁడు నేరస్తుఁడే” యనెను

“అందుకుసందియములేదని”సీవెట్టుప్రత్యుత్తరమిచ్చెను.

“అతనిని నీవ రక్షించుకొనవలెను. నే నిఁక సాయ మొనర్పఁజాల” నని లింకను దన సదనమునకు వెడలెను.

సీవెట్టు మిక్కిలి చాతుర్యముతో వాదించి నేరస్తుని న్యాయశిక్షనుండి తొలఁగించెను. వాఁడు వేతనముగ న్యాయ వాదుల కని వేయిడాలరు లిచ్చెను. అయిన లింక నందొక్క వీసమైనఁ గొనఁడాయెను.

ఒకనాఁ డొక యబల యతని మందిరమునకు వచ్చి తనకు న్యాయమును జరుప నతని నియమించుకొనఁ గోరెను. ఆలోచన వేతనముగ రెండువందల యేఁబది డాలరుల చీటినిచ్చి మఱు నాఁడు రమ్మన నంగీకరించి పోయెను.

రెండవరోజు నామె వచ్చునప్పటికిఁ దగు విషయముల నెల్ల లింకను పరామర్శించి యుంచెను. ఆమె వచ్చినతోడనె

"అమ్మా, నీ హక్కు స్థాపించుట కావలసినయైన నాధారము గానరా దనుటకుఁ జింతిల్లుచున్నా" ననెను.

ఆమె మిక్కిలి చిన్నవోయి "అదెట్లు" ని విచారించెను.

అంత లింకను విషయములనెల్ల నామెకుఁ జక్కగ విశదీకరింప నామె లేచిపోవ నుద్యమించెను. లింకను "నిలునిలు" మనుచుఁ దన కోటు జేబులోనుండి యామె యిచ్చిన చీటిఁ దీసియిచ్చెను.

ఆమె వెఱఁగంది "మీ రద్దాని సంపాదించితిరి. అది మీదె యగు" ననెను.

"కాదు, కాదు, అది సరికాదు. నా ధర్మము నేఁ జేసితిని. నే నేమియు గ్రహింప" నని గట్టిగఁ బల్కి యామె దానిఁ గొని పోవునట్లు చేసెను.

లింకను బాల్యమున "పిన్ని హానా" యను నామె యతనియెడఁ బ్రేమ గలిగి యుడుపుల శుభ్రపఱచి యిచ్చుచు భుజించుట కప్పుడప్పు డేమైన నొసఁగుచుండెను. అందుకుఁ బ్రతిక్రుతిగ లింక నామె కుమారుని యుయ్యేల నూపుచుండెను.

ఇప్పటి కా శిశువుతండ్రి పరలోకప్రాప్తిఁ జెందియుండెను. ఆ శిశువు దరుణవయస్కుఁడై పోరాని పోకలఁ బోవుచుండెను. అట్లు మెలఁగుచు నొక్కతఱి హత్యానేరమునఁ జిక్కి

[illegible]నెను. హానా దుఃఖము నిర్వచనీయ మాయెను. తన కుమారుఁడు దుర్మార్గమున నిట్టి యిక్కట్టులఁ బడి దండనీయుఁడు గావలసెనే యను చింతచే నేమియుఁ జేయఁ దోఁపక భ్రమజెందె కొంతసేపటికిఁ దెప్పిఱిలి "గుఱుగుణుఁ డాబి" మనసునకుఁ దట్ట నతఁ డేమైన సాయ మొనర్చు నని నిశ్చయించుకొని లింకనుకు మొఱ వెట్టుచుఁ దన పుత్రు రక్షింపవలసిన దని వేడుచు వార్తఁ బంపెను. లింక నాజాబుఁ జూచినతోడనె చక్షువుల నుదకములు వ్రాల్చి తనకృతజ్ఞతఁ జూపుట కిదియె సమయ మనుకొని, హానాకై యామె బిడ్డ నెంతకష్టముల కోర్చియైనఁ గాపాడఁ గంకణముఁ గట్టెను. శక్తికొలఁది పాటు పడుదుననియు దైవానుగ్రహముండిన మేలు గాఁగలదనియుఁ, దక్షిణ మాపె స్ప్రింగుఫీల్డుకు రావలసిన దనియు హానాకుఁ బ్రత్యుత్తరము వ్రాసెను.

ఆమె కా వాగ్దాన మాకాశవాణి దోడ్పడ నెంచి పల్కిన ట్లగుపడెను. పగులుస్థితియుండుడు గుండె ధైర్యముఁ గొననామె యత్నమునుగ స్ప్రింగుఫీల్డుకు వచ్చి చేరి లింకనున కున్న విషయములఁ దెల్లడిపఱచెను. కొందఱు వయోవంతులు హాలారస పానమత్తులై హాస్యసూక్తు ప్రసంగంబుల నారంభించి క్రైస్తవాలంబున వివాదంబులకుఁ గడఁగి రోషావేశారుణితలోచను లై [illegible] ంగదసింధురంబుల తెఱంగున మై [illegible] [illegible]

రులఁ దాకికొనుచుండ నందు మేట్సుగారను నతఁడు మృతి నొందెను. అతని చావునకు హేనా కుమారుఁడు విల్లియము గారణమని యానేరము మోపియుంచిరి. హేనా మాత్రము దనకుమారుఁడుగాక మఱెవ్వఁడో యాపనినిఁ జేసె నని నమ్మెను. ఆమె కథనెల్ల సంపూర్ణముగ వినిపించిన తరువాత లింకనుగూడ విల్లియము నిరపరాధియని స్థాపింప లేకపోయినను నపరాధి యనుటకుఁ దగినంత యాధారములు గానరాకుంట స్పష్టముగాఁ గనెను. అందువలన నా ముదుసలిపై నిక్కలి దయపుట్టి యాపె పట్టిని యురినుండి యెట్లైన రక్షింపవలె నని నిర్ధారణ సేసికొనెను. నేరస్తుని దండింపించవలె నను నుత్సాహ మప్ప డతివిస్తరముగ నుండుటంబట్టియు, నీ విల్లియమే దండ నీయుఁ డను వార్త వ్యాపించి యుండుటంబట్టియు నప్పటి స్థితి యందు నిష్పక్షపాతులగు జ్యూరరులు (న్యాయసభలోని పంచా యితిదారులు) లభించుట గష్టతమ మనుట గుర్తించి యా వివాదపు విచారణ మఱియొక మాఱు మూడుమాసముల మీఁద జరుపవలసిన దని లింకను న్యాయవాదిని వేడి యట్లే సేయుటకు నుత్తరువు గొనెను. ఈ మార్గ మవలంబించుటకు హేనా దనపుత్రుఁ జూచుదత్తరమున నియ్యకొనకున్నను లింకను పైఁ జెప్పినవిషయముల విశదీకరించి తన వివాదము జరుపుకొనుటకుఁగూడ నది సహాకారి యగునని నుడివిన

తరువాత నామె దన కుమారుఁ లింకనున కప్పగించి యతఁ డేమిచేసినను మంచిద యని యంగీకరించెను.

నిర్ణీతదినమునకు మధ్యకాలములో నాబ్రహాము మైనువేల డాలర్ల వేతనముగఁ గొనినవానిఁబోలె శ్రమపడి సాక్ష్యవిశేషముల సమకూర్చుకొనుచు నితర సాహాయ్యములఁ జేర్చుకొనుచుండెను.

విచారణదినమున న్యాయస్థానమున కనేకులు లగ్నహృదయు లాగతులైరి. వారు ప్రశాంతమనస్కులై మధ్యఁ గొంతకాలము గడపియుండుటచే మొదటిదినములయందువలె సంభ్రమచిత్తులై యుండుట మాని న్యాయాన్యాయవివేచన సేయుటకుఁ దగిన మనోవృత్తి గలవారై యుండిరి. పిర్యాదుపరము సాక్షులొక్కరివెంబడి నొకరు పరీక్షింపఁబడిరి. కొందఱు విల్లియము పూర్వపు దుష్ప్రవర్తన స్థిరపఱచిరి. మఱి కొందఱు నేరము సమయమునఁ దాము చూచినవిషయములఁ దెలుపుట కేతెంచిరి. పిర్యాదిమాత్రము విల్లియ మాయుధముచే నిహతునిఁ జావనడచినది చూచితినని దృఢముగఁ బల్కెను.

అయిన నీపిర్యాదిని జమత్కారముతోఁ బరీక్షించి లింకనందఱు వెఱఁగందఁ బ్రతిపక్షమువారి వాదమె వారిపైకిఁ ద్రిప్పెను. సాక్ష్య మతఁడు విమర్శించువఱకు నచ్చటివారెల్ల

నేరము నిస్సంశయముగ స్థాపింపఁబడె ననుకొనుచుండిరి. అయిన నతనిచర్చ ప్రారంభమగుటతో నా నేర మన్యాయముగ నీతరుణమున విల్లియముపై మోపఁబడెననుట విశదమాయెను. లింకను మనస్థితి వర్ణింపఁ బదసామగ్రి చాలదు. ఒక్కెడఁ దన యుపకారికిఁ బ్రత్యుపకారము సేయవలయు నను వాంఛయు, నొక్కెడ నన్యాయపు నేర మారోపించిన దుష్టాత్ములపైఁ గిన్కయు, మఱి యొక్కెడ నిరపరాధి కిట్టి యిడుములు దటస్థించె నను వగపును, నింకొక్కెడ నితరులకష్టముల మాన్పఁ బురికొల్పు సహజదయామయత్వంబును నతనిహృదయముం బ్రజ్వరిల్లఁ జేయుచుండెను. దానఁజేసి యతని వాద మద్భుత వాక్పాటవము వల్లను, క్రమక్రమముగ నారోహణ మొనర్చు స్వనగాంభీర్యము వల్లను, మాటిమాటికి మనోవికారముల బోధించు ముఖవైఖరీభేదముల వల్లను వినువారి మనముల నినుమును గాంతముపోలె నాకర్షించి యైంద్రజాల శక్తిబలంబునఁబోలె మార్చివేసెను. అచ్చటివారెల్ల లింకను వాదము వినకమున్ను విల్లియముపై నెంతయాగ్రహ మూనియుండిరో యంతయాగ్రహము వినిన తరువాతఁ జిర్యాదిపైఁ బూనిరి. వా రందఱు లింకను శక్తికిమెచ్చి యనేకపర్యాయములు హాహారావము నింగి ముట్టఁ జేతులు చఱచిరి.

న్యాయాధిపతియు జ్యూరరులును విల్లియము నిరపరాధి యని యతని విడుదలచేసిరి.

విల్లియముహానాల సంతసమునకు మేర లేకుండెను. లింకనునెడ వారికిఁ గలిగిన కృతజ్ఞత వెలువరింప లేరైరి. అతఁడును వారి గౌరవాదరణవచనములఁ బ్రేమతో స్వీకరించి విల్లియమునకు బుద్ధిసెప్పి యతఁడు మరల నట్టి దుష్టసాంగత్యములకుఁ బోకుండుటయె తనకుఁ జూపఁదగు కృతజ్ఞత యని నొడివి వానిచేత నొప్పించుకొనియెను.

మఱియొకవిషయమునఁగూడ నీ "పిన్నిహానా" కితఁడు సాయ మొనర్చెను. అది పెంచి వ్రాయు టనవసరము.

మాఱుదల్లియెడ నితనికిఁ గల యనురాగము గనఁబఱచు నట్టి యంశ మొండిటఁ జూపనగును. న్యాయవాదిత్వమునకుఁ బ్రారంభించిన కొన్నిదినములలో నొక్కవివాదమున లింక నైదువందల డాలర్లు గడించి వాని లెక్కించుకొనుచుండెను. అపుడు సహవాది యొకఁడు గనుపింప నాతనితో,

"ఇదె చూడుఁడు. నే సంపాదించినదానిలో నిదియె గొప్ప వేతనము. ఇఁక రెండువంద లేఁబదిడాలరు లున్న నొక మంచి క్షేత్రముఁ గొని నాముసలి మాఱుదల్లి కియ్యఁగల్గుదు" ననెను.

'మిగత భాగ మే నప్పిచ్చెద' నని యతఁడు ప్రత్యుత్తర మిచ్చెను.

"అయిన సంతోషించితిని. కానిమ్ము" అనుచు లింక నప్పుపత్రము వ్రాయఁబోయెను.

"కొంచెము నిలువుము. నీవు చెప్పినరీతిని వ్యయపఱచుట కంగీకరింప" నని సహవాది పల్కెను.

"ఏలాగో?"

"మీ మాఱుదల్లి ముదుకలి యగుచున్నది. బహు కాలము జీవింపదు. ఆయమ యనంతర మాచేను నీవ యనుభవించున ట్లేర్పఱుపవలెను"

"అట్లు నే నొక్కనాఁటికిఁ జేయను. ఆయమ నాపైఁ గనుపఱచిన విశ్వాసప్రేమల కేనొనర్చు నుపకృతి బహు స్వల్పము. అందును లోపము సేయ నా మనసొప్ప" దని ఖండితముగఁ బలికి తనచేతనైన త్వరలో నాయాస్తిఁగొని మాఱుదల్లి కిచ్చివేసెను.

1851 వ సంవత్సరమునఁ దండ్రికి మరణావస్థ దటస్థించిన దని విని లింకను గార్యబాహుళ్యమునఁ జేసియుఁ దనభార్యను ఘోరతర వ్యాధి బీడించుచుండుటఁ జేసియుఁ గదలిపోఁజాలక పితృభక్తి యుట్టిపడు పదముల నుత్తరమొకటి వ్రాసి పంపెను. అందుఁ గొంతభాగ మీక్రింద వ్రాయఁబడుచున్నది.

"నాతండ్రికిఁగాని తల్లికిఁగాని వారు జీవించినంతకాల మెట్టిసౌఖ్యలోపంబును నుండఁగూడదని నాకోరిక. తండ్రిగారి కిప్పటి జబ్బు కుదురుటకు వలయు వైద్యులుగాని వస్తువులుగాని నాపేరు స్వేచ్ఛగ నుపయోగించి సమకూర్పవలసినది.

తండ్రిగారి కీజాడ్యమునుండి విముక్తి గలుగుఁగాకని యెప్పుడు దైవమున కెఱఁగుచున్నాను. అయిన నెట్లుండి యెట్లువచ్చినను దండ్రిగారిని దయాసముద్రుండును, సర్వాంతర్యామియు, సర్వ శక్తుఁడును నగు నాపరమాత్మను మఱువక యారాధించి యతని మఱుఁగుఁ జొరు మనుము...... ఇప్పుడు నేనును దండ్రిగారును నొకరిని నొకరు చూచుకొనుట యిద్దఱికి మిక్కిలి దుఃఖప్రదముగనే యుండునుగాని సంతస మియ్యఁజాలదు. దైవానుగ్రహము తప్పి యతఁ డిప్పుడు పరలోకమున కేగవలసివచ్చిన నిదివఱ కటకుఁబోయిన ప్రియబాంధవుల సంతోషముతోఁ గలసికొనఁ గల్గును. అచిరకాలములోనే నిలువయుండు మేమును నీశ్వరాజ్ఞచే నా యానంద మనుభవింతుము గాక."

---

## పదునాఱవ ప్రకరణము.

### గౌరవాధిక్యతం జెందుట.

లింకను న్యాయవాదిత్వమున నుండి సంపాదించిన ప్రజాప్రతినిధి సభ్యత్వాది విషయములఁగుఱించి విశేషము వ్రాయఁ బనిలేదు. అతఁడు దేశాధ్యక్షతను వహింపఁబడవలయునను క్రమ క్రమముగ వృద్ధిబొందుచు వచ్చెను. జనుల కందఱు [illegible] [illegible]సంపద విదిత మగుట నెల్లరకు దపుడమ వృత్తిశేద

ముల గణింపక యతనినె విశ్వసించి యతనినే బహుకార్య స్థానముల కేర్పఱచుచు వచ్చిరి.

అతని యౌన్నత్యమునకుఁ గారణభూతము లైనవిషయములు గొన్ని కలవు. బానిసవ్యాపారనిర్మూలనంబునకై యతఁడు దన శక్తి నంతయు నుపయోగించి పాటుపడెను. అతని వాక్ఛక్తియు వాదమహిమయుఁ బ్రతిమనుజుని సత్స్వభావంబును క్షణక్షణ ప్రవర్ధమానపటుత్వముతోఁ గొల్లగొని యాజ్ఞాపాశబద్ధులై న్యాయచింతనకు బహుదూరు లగు ప్రతిపక్షము వారిని బానిసవ్యాపారమం దుత్సాహులమాత్ర మంతకంతకుఁ గనలఁజేసెను. గొప్పగొప్ప సభల వైరు లతని పేదపుట్టుక నుపన్యసించి హేళనము సేయుటగూడఁ దటస్థించెను. అయిన నది యతని కవమానకారి గాక వారి నీచత్వమునే వెల్లడి చేసెను. ఏనుఁగుం జూచి కుక్క లఱచిన నేరికి లోకువ యను లోకోక్తి వృథ యగునే?

లింకను దుష్టసమరము నొకదానిని నివారింప మిక్కిలి పాటుపడియెను. అయ్యది బానిసవ్యాపార వృద్ధికై యొకానొక సీమను లోబఱచుకొన జరపఁబడియెను. ఘోరకర్మలచే నిండియున్న యిట్టి దేశ మెన్నఁడైన నొకదినము దేవుని యాగ్రహ మనెడి యనలమునఁ బడి భస్మము గాఁగలదు. దాస్యము ప్రబలఁజేయుటకొఱకు నొకసమయ నిర్బంధించు

యానురంబగు” నని యతఁడు మంట లెగయుమాటల విను వారల మనముల జ్వలింపఁజేయుచు ఖండన మొనర్చెను.

సీమ ప్రతినిధి సభ్యత్వమునకుఁ బెనఁగుచు నచ్చటచ్చట నితఁ డిచ్చిన యుపన్యాసములు మహాద్భుతవిధమున లోకుల డెందముల కానందంబిచ్చి యితనియందలి గౌరవభావముం బెంచుచుండెను. ఒకనాఁ డితఁ డుపన్యసించి ముగించినతరువాత ననేకు లొక్కటిగ నితని భుజములపై నెక్కించుకొని కడు దూర ముత్సాహముతోఁ గేకలు వైచుచు మోసుకొని పోయి రఁట. మఱియొకతఱి నొక ముదుసలి ప్రతిపక్షమువాఁడు లింకను వాక్యామృత మంతయుఁ గ్రోలి తుట్టతుదకు మన స్సారఁ జేతులుచఱచి యాహ్లాదమున మునిఁగితేలి తనపక్షము జ్ఞప్తికిఁ దెచ్చుకొని,

“ఇతఁడు సెప్పు నంశముల నొక్కటైన నే నమ్మను. అయిన నితని వాక్సుధాలహరి కేను సంతసించి మెచ్చి తీర వలసి యున్నది. అది యేమిచిత్రమోగాని యీతని భాషణము లింత సొంపుగ నున్నవి.” యనె నఁట.

ఇట్లు న్యాయవాదివృత్తి నిర్వహించు కాలమున లింకను గుణములఁ జూపు విషయములు కొన్ని యిందుఁ గమనింపవలసి యున్నది.

ఒకపరి యతఁడు రాజకీయోద్యోగ స్థలమునుండి దిగి వచ్చుచు మెట్లమీఁదఁ దన కక్షిదారు నొకనిఁ బొడగాంచి,

"ఓ! కాడ్గల్లు" ని మనఃపూర్వకముగ హస్త మొసఁగి "మీరీమధ్య పెద్ద దురదృష్టము పాలఁ బడితిరని వింటినే" యనెను. కాడ్గల్ తుపాకిమందు దాకస్మికముగఁ గాలుటవలన నొక చేయిఁ గోలుపోయి యుండెను. కావున "అవును. కొంతవఱకు దురదృష్టహీనుఁడనె! ఇంతకంటె నెక్కువ యపాయము గలిగి యుండవచ్చును. అది తప్పిన" దనెను.

"సరియె. అది వైరాగ్యమార్గ మయ్యెను. మీ వ్యాపారమైనఁ జక్కఁగఁ జరుగుచున్నదే" యని లింకను ప్రతి పల్కెను.

"చెడవలసినంత చెడినది. వ్యవహారమున నున్న యగుటయె గాక కాయస్థితినిగూడ నణఁగఁద్రొక్కఁ బడినాఁడను."

"మీ గతిఁజూచినఁ జాల విషాదము గల్గెడిని. అయ్యో! పాపము" ని లింకను శోకార్ద్రహృదయముతో నాడెను.

"తమకు నే నియ్యవలసిన ద్రవ్యమువిషయము యోచించుచుంటి" నని కాడ్గల్ విన్నదనమునఁ బల్కెను.

లింకను సగము నవ్వుచు "దానికేమి? మీ రావిషయము నింకఁ దలపెట్టకుఁడ" ని యనుచుఁ దన చేతిపుస్తకమునుండి యా పత్రముఁ దీసియిచ్చెను.

సీమ ప్రతినిధి సభ్యత్వ మొకమాఱు మువురు కోరుచుండిరి. అం దొకఁడు లింకను. రెండవవాఁడు ట్రంబ లను

దాస్యనిరాసకుడు. మూడవవాడు బానిస వ్యాపారుల తెగకుఁ జేరినవాడు. అయిన నీ మూడవవాని దిగవిడిచి యాపక్షమువారు మాధిస ననువాని బానిస వ్యాపార విషయమున నుపేక్షకుని నియమింపఁ బ్రయత్నించిరి. మూఁడు సమ్మతులు సేరిన జయమందుకాల మతనికి సంప్రాప్త మాయెను. అది చూచి లింకను బానిస వ్యాపారులు విజృంభించి విజయము నొందుదురని తెలిసికొని తనపక్షమువారు దనకు సమ్మతు లియ్యవలదనియు ట్రంబలున కియ్యవలసిన దనియు వేడెను. అయిన నతని పక్షమువా రతనికి నిచ్చెదమని పట్టుపట్టిరి. దానిమీఁద నతఁడు మిక్కిలి స్థైర్యముపూని "మీ రట్లు చేసి తీరవలసినది. వేరుమార్గము లేదని" గంభీరస్వనమున శాసించెను.

అతని కక్షవారు గొందఱు మిక్కిలి చింతిల్లి యేడ్వఁగడఁగినను నతనిమాట జవదాట రైరి. రెండుకక్షులవారు సేరుటచే ట్రంబలు సీమ ప్రతినిధి సభ్యుఁ డాయెను. ఈ తరుణమున లింకనౌదార్యము బయలుపడినట్లు మఱియెప్పుడును బయలుపడదయ్యెను. అప్పు డాతని గొప్పతన మచటిజనుల మనస్సులయందు స్థిరముగ నాటఁబడెను. దేశసంరక్షణమున కిట్టి యౌదార్యమేగదా యనేకపర్యాయములు గావలసి యుండును. ఇదియు మనదేశమున నిప్పటి స్థితిలో మనకు ముఖ్యతమము.

గదా! చట్టనిర్మాణసభకు నేను ప్రతినిధి గావలె నేను ప్రతినిధి గావలె ననుట మాని మనవా రెన్నడు లింకను గలపిన తెలంగున 'నేరు ప్రతినిధి నైన నేమి? దేశక్షేమమునకుఁ బాటుపడుదము గాక' యందురు?

ఉపోద్ఘాతమున దేశాధ్యక్షులు నిర్వాచకుల సమ్మతులచే నేమింపఁబడుచుందురని వ్రాయఁబడియెనుగదా. అయిన నా నిర్వాచకులకుఁగూడ దారిచూపువారు దేశజనులే యగుదురు. భిన్నాభిప్రాయము లెక్కడనుఁ గలుగక మానవు. ముఖ్య విషయముల నట్టి భిన్నాభిప్రాయము లొక దేశమున గలిగినచో నా యభిప్రాయముల ననుసరించి కక్షు లేర్పడు. ప్రజాపరిపాలిత దేశముల నీకక్షుల ముఖ్యాధికారము వహించును. ఏ కక్షి యభిప్రాయము జనసామాన్యమునకు సమ్మతం బగు నా కక్షియ శాసించుట కర్హాత నందుచుండును. * రాజ్యాధికారుల

* ఇంగ్లాండునందును నిదేవిధము. మనకు లార్డు కర్జను ప్రభువుగా నుండినపుడు కాంజర్వేటివు కక్షువారు రాజ్యాంగము నడపుచుండిరి. ఎల్ల ప్రజలకు సంపూర్ణ స్వాతంత్ర్య మియ్యఁగూడదనుట వారి యభిప్రాయము. స్వలాభము గణించుటయే వారి ముఖ్యోద్దేశము. కావుననే మన మప్పుడు గుడిచిన యిడుమలు మనల నిప్పటికిని వీడకున్నవి. ఇప్పు డన్ననో లిబరల్ కక్షువారు (అనగా నందఱకు స్వాతంత్ర్య మిచ్చుటయే యెల్లరకు లాభదాయి యను కక్షువారు) రాజ్యాంగము నడపుచున్నారు. కావున మనదేశమునకు మంచిరోజులు మరలవచ్చిన వనియు మన మెక్కుడు శ్రద్ధఁ బుచ్చుకొని

నియమింపఁబడుటకు మున్నా కక్షవా రొక గొప్పసభఁ జేర్చి తమ కిచ్చవచ్చినవానినిఁ జేర్కొందురు. అతఁడ సర్వసాధారణముగ జయ మందును.

లింకను దేశాధ్యక్షతకుఁ బెనఁగునప్పటి కిట్టి కక్ష లట మూ డుండెను. అందు రిపబ్లికను (అనఁగా ప్రజలుగాని, వారి ప్రతినిధులుగాని రాజ్యము నడపవలె ననియు నందఱకు జాతి మతభేదము లెంచక స్వాతంత్ర్యము గలుగఁజేయ వలె ననియు నను) కక్షయె మహాబలవంతముగ నుండెను.

ఈ రిపబ్లిక్ జాతీయసభ 1860 వ సంవత్సరము జూను నెల పదునాఱవ తేదీన చికాగోలో జరుపఁబడెను. దూరాగత ప్రజలకును వారి ప్రతినిధులకును గూర్చొనుటకుఁ దగినవిధమున నొక పెద్దపందిరి నిర్మించియుంచిరి. సభనాఁ డచ్చట నిరువది యైదు వేలజను లాసీనులైరి. ఆకక్షవారిచే నేమింపఁబడఁతగినవారు లింకనుతో నెనిమిదిగు రుండిరి. అందుఁ గొందఱు లింకనున కంటె నెక్కుడు ప్రసిద్ధిఁగాంచినవారు. అయినను వారిలో వారికి సమ్మతు లెచ్చుతక్కువ లైనతటి వారివారుగూడ లింకనునకే సమ్మతు లిచ్చిరి. కావున నాసభవారిచే లింకను దేశాధ్యక్షతకుఁ జేర్కొనఁబడియెను. లింకను దేశాధ్యక్షతకు

---

పాటుపడిన ఫల మందుదుమనియు మనలోఁ ప్రాముఖ్యులు నొక్కి వక్కాణించుచున్నారు.

నుడువఁబడినతోడనె జనులు గనుపఱచిన సంతోషము వర్ణింపఁ దరముగాదు. ఒక్కెడ సభాసదుల కరాస్ఫాలనంబును, నొక్కెడ మహాత్మకుల జయజయారావంబులును, వేఱొక్కెడ 'లింకను పేరొ్కనఁబడియెను. ఫిరంగుల ప్రమోయించుఁ' డను సేవకుల యార్భాటములును, మఱొక్కెడ తెరతెరలై వచ్చు ఫిరంగి శబ్దంబులును మిక్కుటముగ నిక్కటిలి యుత్సాహాబ్ధి మితిమీఱి వెల్లివిరియుటం దెల్లము సేసెను.

ఈ విషయము దంత్రీవార్తమూలముగ స్ప్రింగుఫీల్డున వినవాయెను. అచ్చటివారు మిక్కిలి యలరి లింకనునకుఁ బూర్వాచారానుసరణముగఁ గొన్ని యుత్తమ సారాయిదినుసులఁ గొని కానుకగ నంపిరి. అతఁడు వానినెల్ల మరలఁ బంపుచు "మా యింట నిట్టి పదార్థము నెప్పుడు నుంచుకొనమని మీ రెఱుఁగుదురు గాదే" యని ప్రత్యుత్తరము నిచ్చెను.

ఆగౌరవమునకుఁ బ్రతీకారముగఁ దనయింటికిఁ గొందఱు ప్రముఖు లాతిథ్య మంగీకరింపఁ బ్రార్థితు లైరి. అతఁడు దనకుఁ సహజమగు సుస్వభావముచే వారి కెల్లరకు స్వాగతం బిచ్చి తన గృహమున దయామయుం డగు నీశ్వరుఁ డిచ్చిన శుద్ధోదకమునకన్న బలవంతంబగుఁ బానీయము లేదని పల్కి వారి యాయురారోగ్యములు దేవుఁడు హెచ్చించుఁగాత యని

ప్రార్థించుచు నొక గిన్నెడు తేటనీళ్లు స్వీకరించెను. * సమయానుగుణముగఁ దన యభిప్రాయముల లింకను మార్చుకొనునని జను లనుకొనిరి గాని యతఁ డెప్పుడును మంచిమార్గము వదలఁడాయెను. లింకను బానిసంబు నెంత బలముగ నెదిరించుఁ ద్రాగుటను నంతియ బలమున ఖండించును. జనులు దేశాధ్యక్షుఁడు గౌరవార్థము ద్రాగుట ముఖ్యమని తలంచి యుండినను లింకను దనకార్యములచే నట్టిదాన గౌరవము లేదనియు దేవుఁ డిచ్చిన స్వచ్ఛోదకమునకంటె బలిష్ఠమగు పానీయంబు మఱొండు లేదనియు బహిరంగముగఁ జాటెను.

లింకను కేర్కొనఁబడియె ననువార్త పర్వగానే బద్ధసీమలయం దుద్భవించిన రోషజ్వాలలు నింగిముట్టెను. సంయోగమునుండి వీడిపోయెదమని కొన్నిసీమలు జంకించెను. నవంబరు నెలలో లింకను నిర్వాచకులచే నేమింపఁబడునప్పటికి దక్షిణసీమలేడు దాము మిక్కిలి పనిచేసి యొక నూతనసంఘమేర్పఱచుకొని రాఁబోవు మహోత్పాతముల సూచించుఁ గొఱకొఱలు వినిపించెను.

కడుదూరమున శాత్రవజలదములు గుమిగూడుచుండెను. వానియుఱుములును గొంచెముగా వినవాయెను. నెమ్మది

---

* మనము మంత్రాక్షతలఁ గైకొని యాశీర్వదించు తెఱఁగునఁ బాశ్చాత్యులేదేని యొక పానీయముం బుచ్చుకొనుచు నాశీర్వదింతురు. ఆశీస్సు నందువారు మనయందువలె సమ్ముఖమున నుండవలెనను నిర్బంధము లేదు.

మార్గముల నోటువడి గుండుదెబ్బలచే జయింతముగాకని బద్ధ సీమలు బద్ధవైరముం బూనిరి. యుద్ధము తప్పక తటస్థించు ననుట తెల్లమాయెను.

పేర్కొనంబడినదాదిగ లింకను సమ్ముఖమున కనేకులు వచ్చిపోఁ గడంగిరి. గొప్పవా రనక, నీచు లనక, ముదుకఁ డనక, బాలుఁ డనక, బీద లనక, భాగ్యవంతు లనక యెల్లరును నా మహనీయునిఁ జూడ వచ్చుచుండిరి. ఇట్లుండ నొకనాఁ డిద్దఱుబాలు రతని కార్యస్థానము ముంగల నర్తాడుచుండిరి.

వారి నత్యాదరమున డాసి లింకను,

"నాయనలారా! సౌఖ్యంబున నున్నవారలే? మీ కే నేమి సేయవలయు? రండు. కూర్చొనుఁ" డనియెను.

వారిలోఁ గుఱుచటివాఁడు "మేము గూర్చొనరాలే" దనెను.

"మీ కేమి గావలయునో యడుగుఁ" డని లింకను వారి జంకు నుడుపువిధమునఁ బల్కెను.

దాని కా చిన్నవాఁడు "నేనును నాస్నేహితుఁడును మీపొడవునుగుఱించి వివాదపడితిమి. తాను మీపొడుగున్నాఁ డని నుడువుచున్నాఁ" డనెను.

అదివిని లింకను మొగమున చిఱునగ వంకురింప "అలా గా? ఆ చిన్నవాఁడు నిశ్చయముగాఁ బొడవుగనే యున్నాఁడు.

"చూతముగదా" యనుచు వెడలి తన కఱ్ఱం దెచ్చి "ఎవ్వరు పొడవైనది చూతము రమ్మ"ని జాగ్రత్తగ నా పిల్లవాని పొడగు లెక్కించి తనపొడవును లెక్కింపఁజేసి యిద్ద ఱొక్కటె పొడుగగుటఁ గాంచి,

"అవును నిజము. మే మిరువుర మొక్కటియె. అతఁడీవిషయమును సూక్ష్మముగ గ్రహించె" నని పొట్టిబాలునకుఁ జెప్పి వారి తగవుఁదీర్చి మంచిమాటలతో వారిని బుజ్జగించి పంపివేసెను.

ఘనత ఘనత యని మౌఢ్యముపూని యజ్ఞానులపై మండిపడెడు మహానుభావు లీ లింకను నడత గమనింతురు గాక!

అతఁడు న్యాయవాదిగ నున్నప్పుడు తన భ్రమణముల నొకానొక ముసలాపెయింట భుజించుచుండును. ఆమె యతని దర్శింప నేతెంచెను. కొన్నివిషయములను స్మరింపఁజేసినతరువాత నామెను గుర్తించి సంతసమున స్వాగతమిచ్చి కుశలప్రశ్న లడిగెను. అందుమీఁద నామె,

"నాఁడు మీ కేను బెట్టిన బీదయుపభోజనము జ్ఞప్తియందున్నదా?" యనెను.

"లేదు. మీయింట నే నెప్పుడును భోజనమున లోపమనుభవింపలేదు."

"ఒకరోజు మే మెల్లరమును గుడువఁ బదార్థము లెల్లయుఁ గర్చుపడి యుండెను. అట్టి తరుణమున మీ రేగుదెంచితిరి. కొంచెము రొట్టెయుఁ బాలునుమాత్రమునే మీ కొసంగితిని. మీ రది స్వీకరింపుచుండఁగ నే మన్నన వేడఁ 'జింతిలనేల. ఈయాహారము దేశాధ్యక్షున కైనం జాలదా' యంటిరే" యని యావృద్ధనారి సౌహృదయముగఁ బల్కెను.

లింకను దానికి నవ్వి యా స్వల్పాహారము తృప్తికిఁ దెచ్చుట కై స్నేహభావమున నెనిమిదిమైళ్లు నడచివచ్చిన యవ్వం గొనియాడెను.

చికాగో పట్టణమున లింకనును గారవింప నొక గొప్ప సభ జరిగెను. ఆసమయమున నొక చిన్నపిల్ల భయపడుచు లింకనును జేరవచ్చుచుండెను. లింక నది గనిపెట్టి చేసైగచే దానిం బిలిచి "అమ్మాయీ! నీ కేమి కావలయుఁ జెల్పు" మని యడిగెను. సంకోచవృత్తి నాకన్నె "మీపేరు గావలె" నని వేడెను. ఇంతలో మఱికొందఱు గన్యలు వచ్చుటఁ గాంచి లింకను "ఇక్కడ నింకను గొందఱుపడుచు లున్నారు. నీ కొక్కదానికె నా నామమిచ్చిన వా రెల్లరు నసంతుష్టు లగుదురుగదా" యనెను.

"మొత్తము మే మెనిమిదిగు రున్నారము. మాకందఱకు మీ పేరియ్యవలయు నని" యా శిశువు వల్కెను.

వదలి వాషింగ్టనునకుఁ దరలెను. అతఁడు దనస్నేహితులకు వ్రాసిన వాక్యములోఁ దనకు దైవము సహాయపడవలెఁగాక తా నెక్కడ యేమిసేయుటకు నసమర్థుఁడయని దేవునిపై భారమువైచి న్యాయమార్గముపై దృష్టి సారించుట వెల్లడించెను.

అతనిని శత్రువులు చంపుదురేమో యని దిగులొందిన దతని జననిమాత్రము గాదు. స్ప్రింగుఫీల్డునందలి స్నేహితులెల్లరును నట్లె వ్యాకుల మందుచుండిరి.

అతఁడు వాషింగ్టను సేరుమార్గమున నందిన గౌరవమంతింతనరాదు. త్రోవయందుఁ బ్రతిపట్టణమువారును నతనిం జేరి మహోత్సాహమున మర్యాదలు సలిపి యాతని వాగమృతము గ్రోలుచు వచ్చిరి. ఎచటఁజూచినను ఫిరంగి ప్రేలనంబులును, జయజయారావములును, మంగళధ్వానములును, జెవుల కానంద మొసఁగుచుండెను. చిత్రతోరణంబులును, బహువిధ పతాకములును, సర్వజన సమూహములును నతని దారి నలంకరించుచుండెను. ఇట్లనన్యసామాన్య వైభవంబున మహావీరుండువోలె లింకను ఫిలడెల్ఫియా సేరవచ్చునప్పటి కాతనిఁ జంపఁ జేయఁబడిన ప్రయత్న మొండు గనిపెట్టిరని వార్తఁ దెచ్చిరి. కావున మఱుసటిదినము మధ్యాహ్నము బహిరంగముగ వైభవమునఁ బోవుట మాని నాఁటిరాత్రి యెరికిఁ దెలియక లింకను ప్రయాణముసలిపి వాషింగ్టను సేరెను.

## పదునేడవ ప్రకరణము.

### "సితగృహ" లంకరణము.

ఉత్తమోద్యోగమున లింకను సూపిన యౌదార్యాది గుణసంపత్తినిగుఱించి తెలుపుటయె మనకుఁ గర్తవ్యము గాన నతఁడు దేశాధ్యక్షుఁడుగ నున్నంతకాలము ప్రబలుచుండిన "తిరుగుబాటు" నణఁచుటలో నతఁడు సేసిన యేర్పాటులనుఁ గనుపఱిచిన శక్తియు వర్ణించుట యనవసరము. రెండుకోట్ల సంఖ్యగల "సంయోగపు" సేననుదీర్చుటయందును, దేశము నందలి యపాయకరంబులగు కక్షల నదపున నుంచుటయందును, దేశభక్తిపూర్ణుఁడగుఁ బ్రతిమనుజుని గౌరవ విశ్వాసముల సంపాదించుటయందును, వేనవేలుయుద్ధరంగముల జయమందుటయందును, మహాశక్తియుత మగు నావిక సైన్యము నిర్మించుటయందును, యుద్ధమునకై మూఁడువేలకోట్ల డాలర్లు సేర్చుటయందును, రాజకీయ వ్యవహారముల జనులకు నమ్మిక గలుగఁజేయుటయందును, నాలుగుకోట్ల బానిసలకుస్వచ్ఛంద వృత్తి నొసంగుటయందును, మన్నిన్నటికంటె నెక్కుడుగ దేశమునకు నెమ్మది దెచ్చుటయందును లింకను వెల్లడించిన శక్తి సామర్థ్యంబు లత్యద్భుతములు. వీని నన్నిటింగూర్చి వ్రాయగడంగిన నొక్కొకదాని కొక్కొక సంపుటమైనం

జాలదు. రోమక రాజ్యమును మహోన్నతపదవికిఁ దెచ్చి లోకమునందలి నాయకశిఖామణుల శ్రేష్ఠుఁడని పేరు వడసిన సీజరునకంటె లింకను గొప్పవాఁడని యొకానొక పెద్దసభ యందు నుడువఁబడియెననిన మన కిక్కార్యముల నిశ్చయపరిమాణము స్ఫురింపఁగలదు. ఇంత మహాద్భుతవ్యాపకము గల విషయములఁ జర్చించుటలో లింకను స్వభావము సంపూర్ణముగ బయలుపడక పోవచ్చును. గొప్పరాష్ట్రాధిపతియై కోట్లకొలఁది నెన్నఁదగుఁ బ్రజలఁ బరిపాలించుచు నతఁడు సర్వసాధారణకార్యముల నెట్లు మెలఁగెనో విశదీకరించిన నతని గొప్పతనమునకు దారిసూపిన గుణపుంజములు దెల్లము గాఁగలవు. ఉపన్యాస సహస్రములకంటెఁ గొన్ని యుదాహరణములాతని సామర్థ్యము, న్యాయబుద్ధి, దేశభక్తి, ప్రయత్నశక్తి, దయాళుత్వము, స్వబలసాహాయ్యపరత్వము, మనోదార్ఢ్యము, చాతుర్యము, వివేచన, ప్రతిభ, యౌదార్యము, ప్రాబల్యము మున్నగువాని జక్కఁగఁ జూపఁగలవు. ఈకారణముఁబట్టి "సితగృహము"*న లింకను గడపిన సంవత్సరముల నాతని చరిత్రయందలి బోధకవిషయముల నెత్తివ్రాయుచు వచ్చెదము.

---

* అమెరికాదేశమందలి సంయుక్తరాష్ట్రముయొక్క రాజధాని యగు వాషింగ్‌టన్‌పట్టణములో దేశాధ్యక్షు లుండుటకు నిర్మింపఁబడిన రాజమందిరమునకు "సితగృహ" మని పేరు.

1861 వ సంవత్సరము మార్చినెల 4 వ తేది లింకను దేశాధ్యక్షత వహించు నుత్సవము జరుపఁబడియెను. ఆ యా నందము చూచుటకు లక్షలకొలఁది జనులు వాషింగ్టను పట్టణమునకు వచ్చిచేరిరి. అల్లరుల కారంభించి దేశాధ్యక్షుని బొడిచివేయఁ బ్రయత్నములు గాఁగలవేమో యనుభయమున జనరల్ స్కాట్టు పట్టణమును గాపాడుటకుఁ దగిన దండు నాయత్తపఱచి యుండెను. లింకను దన ప్రథమోపన్యాసము నీ క్రిందిపదములతో రాజ్యవైరుల హృదయములకు నాటఁ బల్కి ముగించెను.

"అతృప్తులగు నో దేశీయసోదరులారా! నావలన నెంత మాత్రమును నంతర్యుద్ధప్రాప్తి గాఁ జాలదు. అట్టి ఘోర కృత్యము జరుగవలసివచ్చిన దానికి మీర యావశ్యకతఁ గలుగఁ జేయువా రగుదురు. రాజ్యనిర్వాహకు లెప్పటికిని మీపైఁ బడరు. మీరు ముందుపడి పోరాడకున్న మీ కెట్టి పెనం గుటయుఁ దటస్థింపదు. మీ రీ రాజ్యాంగము నశింపఁజేయుద మని దేవుని యెదుటఁ బ్రమాణము సేసియుండలేదు; అయిన నేనో నాయోపినంత రాజ్యాంగమును నిలిపి, సంరక్షించి, స్థా పింప సంపూర్ణ మనస్కుఁడనై శపథ మంగీకరించి యున్నాను. ముగింపుసేయ నా మన సొప్పకున్నది. మనము శత్రువులము గాము. స్నేహితులమె యగుదుము. ద్వేషము మన మొకరిపై

నొకరము పూనుటయుఁ దగదు. తామస మొక్కటి మనల లోఁబఱచుకొనినను నీ యనురాగబంధములఁ ద్రెంప నీయఁ గూడదు. అనేకయుద్ధరంగములనుండియు, ననేక దేశభక్తుల సమాధులనుండియు నీదేశములోని ప్రతిమనుష్యుని హృదయ కమలమువఱకును బ్రతిమందిరమునందలి సభాస్థానమువఱకును వ్యాపించియుండు గుప్త స్మరణతంత్రీస్పర్శంబున మన సాత్త్విక గుణరాజంబుల ప్రదర్శంబునకంటె నెక్కుడుగ సంయోగకీర్త నాస్వనము ప్రబలఁజేయఁ గల్గుదుముగాక !"

నాఁటి ప్రాతఃకాలమున లింకను దన ప్రథమోపన్యాసము నింట భార్యాదులకుఁ జదివి వినిపించి తన్నొక్కటిగ విడిచిపొం డనివేఁడెను. కవాట మట్లె తెఱచియుండిరి. అతఁడు దన్నుఁ, దన పుత్రకళత్రంబులఁ, దనదేశంబును సర్వేశ్వరున కప్పగించుకొని యాతని దయామయత్వంబు దమనెల్ల సంరక్షించును గాత యని భక్తిరసానుగుణస్వనమునఁ బ్రార్థించుచుంట యాతనిమిత్రు లెల్ల వినిరి. అతనిపై నిడఁబడిన భారము మానవశక్తికి మించి దైవసాహాయ్యములేక మోయ నలవి గాకుండెను.

లింకనునకుఁ బూర్వ ముండిన రాజకీయోద్యోగస్థులు దక్షిణసీమలవారై రాజ్యమును మహా హీనపదవికిఁ దెచ్చి యుండిరి. అంతర్యుద్ధమున కెన్నిమార్గములు వలయునో యన్ని మార్గము లేర్పఱచి యుండిరి. బొక్కసమున నొక్క కాసై

నను లేకుండఁ జేయుటయె గాక రాజ్యాంగమునందలి నమ్మకమును జెఱచి యప్పు పుట్టించుకొనుటయె దుస్సాధ్యముఁ జేసియుండిరి. దొరకిన ద్రవ్యమున విశేషభాగమును లంచములిచ్చి యల్లకల్లోలమునకు జనుల రేఁపఁజూచి రనియుఁ బ్రవాద మొకటి యుండెను. ఉత్తరసీమల యందలి గిడ్డంగులలోని మందు మొదలగు యుద్ధోపకరణముల నన్నింటిని దక్షిణసీమల ముఖ్యస్థానముల కనిపి వాని బలపఱచి యుత్తరసీమల నిరాధారములఁ జేసియుంచిరి. ఇఁక నౌకాసేన గతిఁజూతు రేనిఁ దొంబది యుద్ధనావ లుండుటకు మాఱుగ లింకను దేశాధ్యక్షత పూనునప్పటికి రెండుమాత్రమ సిద్ధముగ రాజ్యవహుల కక్కఱకు వచ్చునట్లుండెను. ఇట్టి తరుణమున దక్షిణసీమలు దిరుగఁబడిన రాజ్యాంగమునకుఁ బరాజయము తప్పక గలుగునటుల నుండెను.

లింకను దేశాధ్యక్షత వహించినవెంటనె సీమప్రతినిధి యొక్కఁ డతని కీ విషయముల విశదీకరించి యునైటెడ్ స్టేట్స్ సంయుక్తరాష్ట్రపుఁ దండ్రి యగు వాషింగ్టను సేనానాయకత్వమున కియ్యకొనినపు డెంత కఠినకాలముగ నుండెనో యప్పుడు నంత కఠినకాలంబ యనియు నతని కెంతసాధన న్యూనత గల్గెనో లింకనున కంత సాధన న్యూనతగల దనియుఁ జింతాసూచనముగఁ బల్కెను. దానికిఁ బ్రత్యుత్తరముగ లింకను,

“మీరు జెప్పునది గొంత నిజము. అయిన వాషింగ్టనున కంటె నాకుఁ బరికరము లెక్కుడు గలవు. రాజ్యహితులగు

లోకులు స్వదేశాభిమానులు నా పక్షమున నుండ నా కేమియు లోపము గలుగద" ని దీర్ఘాలోచన పరత్వమునఁ దన మనోనైర్మల్యంబును గనుబఱచుచు నుడివెను. దురభిమాన మతని కెప్పుడును లేదు. జనులలో మెలఁగి వారి యభిప్రాయముల నెఱింగికొని యనుభవముచే జ్ఞానము సంపాదింపకున్నఁ దనశక్తివల్లన జయమందలే నని యతఁడు చక్కఁగ గ్రహించెను. సర్వజనానుకూలం బగునా రాజ్యాంగముపైఁ దన దేశీయులందఱకు ననురాగము గలదనియు, నవినీతు లొక్కరిద్దఱంత పాటువడినను జయమందఁజాలరనియుఁ గట్టిగ నమ్మియుండెను. ఇట్లు జనుల నాదరించి కించిత్తైన ననుమానభయములు లేక వారిం దనవారిగఁ బ్రథమమునుండిఁ జేకొనుట యెయట్టి మహోపద్రవకాలమునఁ గర్తవ్యాంశమని యతఁడు గనిపెట్టుట మిక్కిలిశ్లాఘనీయము. కొంచె మటునిటుఁ గొంకువాఁడయి యుండిన నాపదవి కతఁ డనర్హుఁ డయి యుండును.

గతప్రకరణమున యునైటెడ్ స్టేట్సులో మూఁడుకక్షలుండె నని చెప్పితిమి. అందు లింకను రిపబ్లికను గక్షకుఁ జేరినవాఁడు. దానితో ననేక విషయముల నంగీకరించునది మఱియొండు కక్ష గలదు. అందు ప్రముఖుఁడు డగ్లసను నతఁడుండెను. అతనితో ననేకపర్యాయములు లింకను పోరాడి జయమందియుండెను. అయిన దేశోద్ధారణ కార్యమునకై డగ్లసు

స్నేహితు లతనిని లింకనుతోఁ జేరమని వేడిరి. అతఁడును జక్కఁగ యోచించి యిట్టి యుత్పాతముల కాలమున వెను దీసినఁ గార్యము చెడు ననుట పరికించి లింకనుస్నేహముఁగోరి "సితగృహమున"కుఁ జని యట లింకనును దర్శించి,

"తండ్రీ! లింకను! ఈ రాష్ట్రమునకెల్ల దేశాధ్యక్షుఁడ వగు నీవు నాకును దేశాధ్యక్షుఁడవె" యని చే యిచ్చెను. లింకను మనము కరగి మిక్కిలి సంతసమున నా కరంబు స్వీక రించి యతని దేశభక్తికి మెచ్చి వందనము లాచరించెను. ఈ విధమున మహా ప్రసిద్ధివడిన యిద్దఱు ప్రతి కక్షియందలి ప్రాముఖ్యులు దేశక్షేమమునకై యేకీభవించిరి. తరువాత లింకను డగ్లసునకుఁ దన యుద్దేశ పత్రమును జదివిచెప్పెను. అం దతఁడు డెబ్బదియైదువేల సైనికులఁ జేర్ప నిశ్చయించి యుండెను. డగ్లసు దక్కినవిషయము నెల్ల లింకనుతో నంగీక రించి యీవిషయమునమాత్రము "రెండులక్షల సేనకూర్చిన బాగుండును. మీ శత్రువుల టక్కరితనంబుల నే నెఱిఁగినంత చక్కఁగ మీ రెఱుంగర" ని తెల్పి యాదేశ పటముపై రక్షింపఁబడవలసిన స్థలములనెల్లఁ జూపి రాజ్యాధికారు లిప్పటి తిరుగుబాటు నట్టె యణఁచివేయ గట్టి యేర్పాటులఁ జేసి తీర వలెనని చెప్పి ముగించెను.

మరునాఁడె లింకను డగ్లసు లోకక్లైబ్ రనుట దేశ మంతయుఁ దెలిసిపోయెను. నాఁడుమొదలు డగ్లసు పరలోక

ప్రాప్తిఁ జెందువఱకు లింక నతని యాప్తస్నేహితుఁడుగ గణించు చుండెను. అతఁడును లింకనుకు శత్రువుల మాయోపాయ ములఁ దెలుపుచు మహోపకార మొనరించుచుండెను. అతను దివి కేగ నాతని మరణము దేశమునకంతకు నష్టమనుట లింకను వెల్లడిచేసెను.

లింకను దన ప్రథమోపన్యాసమునఁ జేసిన వాగ్దాన ములకు భేదముగ నెన్నఁడును నడచినది లేదు. "మీరు ముందు యుద్ధమునకుఁ జొరఁబడకున్న మీ కెట్టి పెనంగుటయుఁ దటస్థింప ద"ని తన ప్రతికక్షి వారికిఁ జెప్పినవాక్కు నట్లె పాలించెను. దక్షిణరాష్ట్రముల సంఘమువారు 1861 వ సంవ త్సరము ఏప్రిల్ నెల 12 వ తేదిన దిరుగఁబడి సంటరుకోటపై ఫిరంగిపేల్చి ముందు యుద్ధమును బ్రారంభించినవారైరి. నాఁటి మధ్యాహ్నము "తిరుగుబాటు" సేనాని యాకోట సేనానిని లోఁబడు మని యనియెను. అందుమీఁద నతఁడు "రాజ్యాం గముపరమున నీకోటఁ గాపాడుట నాకు ధర్మమై యున్నద"ని ప్రత్యుత్తర మిచ్చెను.

"అట్లయిన నీపట్టణమువారు మావైరులని యెంచెదమ"ని "తిరుగుబాటు" సేన యాపట్టణమును ముట్టడించెను.

లింక నాపట్టణమునందలి సేనకు భోజనపదార్థముల యుద్ధనావయందుఁ బంపుటమాని సాధారణ నావయందుఁ

బంపెను. శత్రు లద్దానిఁబట్టి యాపివేసిరి. ఈవిషయము లింక నెంతస్నేహముఁగోరి కలహమునకుఁ గారణ మొసంగ నయిచ్ఛ గలవాఁడో విశదము సేయుచున్నది.

తమ శక్తికొలఁదిఁ బోరాడి ఫలముగానక యా పట్టణపు సేన శత్రువులకుఁ బడుమూడవతేది లోఁబడియెను.

ఇట్లు దక్షిణమునందలి బద్ధసీమలు రాజ్యాంగముపై దాడివెడలుట సిద్ధమాయెను. రాజ్యాధికారు లవలంబింపవల సిన మార్గమును వార తెలియఁజేసిరి. ఎట్లయినను బ్రయత్నించి యల్లకల్లోలములనడుగంటఁజేసి బద్ధసీములఁ బరాజితులఁ జేసి తీరవలెననుట విశద మాయెను. దానికి యుద్ధమునక్క వేరొం డుపాయము లేకుండుటయు బయల్పడెను. అందువలననే లింకను డెబ్బదియైదువేల సైనికుల నియమింప నిశ్చయించెను. నాఁటినుండి యతఁడు శత్రువుల నడంపఁదగు నుపకరణముల సేకరించుటయందును సేనావిషయముల నెఱింగికొనుట యందును మగ్నుఁ డయ్యెను. అన్నివిషయముల నందఱి యభి ప్రాయముల విని తనయభిప్రాయముల మార్చుకొనుచుండినను లింక నితరులకు భయఁపడి తాను మంచిదని నమ్మినది వదులు వాఁడు గాఁడు.

దక్షిణసీమలయందలి బానిసలకు నాయుధములిచ్చి వారి సాయముఁ గొనినయెడల లెస్స యని యొకకార్యదర్శి వ్రాసెను.

దానికి లింకను "ఇది యెన్నటికిం దగదు. ఈవిధమునం గార్య దర్శి స్వతంత్రింపంగూడదు. ఆపని తనదిగాదు. నాదె యగు" ననెను.

శత్రువులచేతం బడిన రాజ్యాంగసైనికుల వారు బహు క్రూరముగం జూచుచువచ్చిరి. దేశపు జనులెల్లరును గొన్ని ఘోరకృత్యముల విని కోపోద్దీపితులై యుండిరి. కావునం గొందఱు లింకనుం డాసి "మనచేం బడినశత్రుజనుల బాధించి ప్రతీకార మొనరింపుండ"ని నుడివిరి. అదివిని యతం డాగ్రహము సూచించి,

"ఆవిధమున నేనొక్కనాండును మనుష్యులం బీడింపం జాలను. ఎవ్వ రేమియాడిన నాడుదురు గాక. ఏమి చేసినను జేయుదురుగాక. నే నట్టి యమానుష కార్యముల సహింపం జాల" నని ప్రత్యుత్తర మిచ్చెను.

లింకను కడువా రనేకులు కామేరనను కార్యదర్శిపై నిష్టములేనివారై యతని నాపదవినుండిం దీయింప సమకట్టి కొందఱు ప్రతినిధులనేర్చి లింకనువద్దకుం బంపిరి. వారు చెప్పిన దంతయు విని లింకను,

"అయ్యలారా! మీ రేమో చెప్పుచున్నారు. అయినను నాకు నమ్మకము బుట్టదయ్యెను. అతనిపై నొక్క సత్యమగు నేరము సూపితిరేని నే నాతనిశిరంబు మీ కప్పగించెదను.

అయిన నిశ్చయ మూవంతయైన లేని వెడగుమాటల నమ్మి నే బనిఁబూనువాఁడను గా" నని నిర్భయముగఁ బలికి వారినిఁ బంపివేసెను.

ఫిరంగి యొక్కటి క్రొత్తగఁ జేయఁబడెను. దానిఁ బరీక్షించుటకుగా నొక కొందఱు సీమప్రతినిధి సభ్యులు నియమింపఁబడిరి. వా రావిషయమును విపులముగ నేఁబదిపుటలు నింపి వ్రాసిపంపిరి. లింక నాగ్రంథముం జూచి "వీ రిందులఁ గొంచము జ్ఞాన ముపయోగించి విషయముల సంక్షిప్తముగఁ దెలుపవలదే? గుఱ్ఱమును బరీక్షింపుఁడనిన దాని రోమములు లెక్కించునట్టి బుద్ధిమంతులుగ నున్నారు. నే నిది చదువుకొనవలెనన్న మఱియొకజన్న మెత్తవలసినదే" యనుచు దాని బల్లపైఁ బాఱవైచెను.

నౌకా సేనాధికారు లిద్దఱు వ్యాపారుల నన్నదమ్ముల రాజ్యాంగపు ధన మపహరించిరని వారిపై నేరముమోపి కారాగృహమున నుంచి నెలలకొలఁది పీడించుచుండిరి. లింక నావ్యాజ్యెమును బరిశీలించి యన్నదమ్ము లిరువురును నిరపరాధు లని తెలిసికొని తానే యధికారము పూని,

"ఈ యిరువురును నౌకా సేనవిషయమున లక్షయిరువదియైదువేలవ్యాపారము జరుపుచుండిరి. అం దిరువదియైదువేలపహరింప వారి కెడ ముండెను. వారిపై నేరము మోపినది

రెండువేల యున్నారింటికి. అందు నిప్పుడు సంశయించు చుండు నది నూటివిషయమె. నే నతఁడొక్కఁ డాసైన నపహరించెనని నమ్ముటలేదు. కావున నిదివఱకుఁ జేయఁబడిన తీర్పు లన్నియు నే నంగీకరించుటలేదు. అవియెల్ల నిందుమూల మున రద్దుపఱుపఁబడి ప్రతివాదులకు స్వేచ్ఛ యొసఁగఁబడిన ద"ని యుత్తరువు చేసెను.

ఈవిషయములన్నియు లింకను మెత్తనివాఁడైనను దగిన యెడ ధైర్యము సూపుచు వచ్చె ననుటను స్థిరపఱుచుచున్నవి. అతఁడు దానే స్వయముగ యోచించి పనులఁ దీర్చుచుండె ననుటఁగూడ విశద మగుచున్నది.

లింకను దేశాధ్యక్షత వహించిన రెండవయేడతని కనేక దుఃఖములు సంభవించెను. యుద్ధపువార్త లొక్కటియెగాక యతని కుమారుఁ డొక్కఁడు మృతినొందెను. రెండవవాఁడు పరలోకప్రాప్తిఁ జెంద సిద్ధపడెను. లింకను వానిని గాచుచు బహుకాల మిలువెడలి బయటికి వచ్చిన దెఱుఁగఁడు. పుత్ర వియోగ మతనికి మిక్కిలి యసహ్య మాయెను. ఎంత పని పాటుల నున్నను 'నాయనా' యని ముద్దులొలుకుఁ బల్కుల దగ్గరఁజేరు కుమారుఁడు మరణావస్థయందుఁ బఱుండుటఁ జూచిచూచి యెల్లపుడు దుఃఖించుచుండెను. కుమారునిపై నెనరున విలపించుచుఁ గడు నమ్రహృదయుఁడై పలుమాఱు

దైవముం దలంచి ప్రార్థించుచుండును. అప్పుడు జరుగు యుద్ధమున న్యాయము జరుగుంగాకనియు వేడుచుండెను.

రెండవకుమారుఁడు మెల్లమెల్లగ నారోగ్యము నందెను. యుద్ధమునందును రాజ్యాంగ మల్లనల్లన జయించుచు వచ్చెను.

లింకను దన రాష్ట్రపు సైనికులయందలి దురభ్యాసముల మాన్ప మిక్కిలి పాటుపడెను. త్రాగుఁబోతుతనము ఒట్టిడుకొనుట యను నీరెండువిషయములగుఱించి చక్కఁగ నుపన్యసించి వాని రెంటిని నణఁచుట కుత్తరువులుసేసి వానినెల్లఁ గట్టిగఁ జెల్లించుచువచ్చెను.

లింకను యుద్ధభటులయెడఁ గనుపఱచినఁ ప్రేమాతిశయ విషయములును, నతఁడు బానిసలకు ముక్తినొసంగి వారి నాదరించిన తెఱంగును నొక్కొక్క టొక్కొక్కప్రకరణమున కర్హమైనది గాన నిచటఁ బొందుపఱుపఁ బడవయ్యెను.

---

## పదునెనిమిదవ ప్రకరణము.

### యుద్ధభటులయం దనురాగము.

ఇంతకుఁబూర్వ మొకప్రకరణమున లింకను బ్లాకుహాకు యుద్ధమునకు సైనికుఁడుగ వెళ్లెనని వ్రాసితిమిగదా. అతఁడపు డనుభవించిన కష్టసుఖములు మనమున నుండెఁగాన

నసగ్గళవిధిగ రావచ్చునని యతఁ డుత్తరువు సేసెను. అధికారు లడ్డగింపఁ బ్రయత్నించుటకుఁగూడఁ గారణము లేకపోలేదు. దేశాధ్యక్షత పనులె లెక్కకుమీరి లింకను కాలమంతయు నాక్రమించుకొని యతని నలయించుచుండును. ఈదిగువఁ గనుపఱచిన లింకను దినకృత్యములఁ బఠించినచో నతఁ డీయుద్ధభటుల నెప్పుడు దనియించుచుండెనో యను నాశ్చర్యము మనకుఁబుట్టకపోదు.

"లింకను వేకువజామున లేచువాఁ డగుట ప్రతిదినమును దన స్వంత లేఖన ప్రతిలేఖనమునకు రెండుమూడుగంటలఁ బుచ్చును. అంతలోపలన నేదో యొక వార్తాపత్రికఁ జదువును. తొమ్మిదిగంట లగుడుఁ బ్రాతఃకాల భోజన మాచరించి యుద్ధకార్యస్థానమున కేగి యట వృత్తాంతము లరసికొని యచ్చటి సేనానాయకునితోఁ గొంత ముచ్చటించును. అచ్చటినుండి "సితగృహము"నకు వెడలి యొక్క కార్యదర్శి సాయముతో నుదయపుఁ దపాలుఁ జూచుకొనును. కొన్ని జాబులకుఁ బ్రత్యుత్తరాంశములు గార్యదర్శి వ్రాసికొనును. తక్కినవి లింకన యుంచుకొని తరువాత వానికిఁ దాన బదులు వ్రాయును. ప్రతి జాబును జక్కగ గమనింపఁబడును. చిక్కుల కిక్కలైనను బ్రత్యుత్తరముల నందఁ దగు జాబులెల్లఁ బ్రత్యుత్తరము లందుచుండును. మంగళ శుక్రవారములుమాత్రము మంత్రా

లోచనదినములు; తక్కంగలదినముల దేశాధ్యక్షుం జూడఁగోరువారు ప్రక్కగదిఁజేరి తమపేరుగల చీటీలంపఁ బ్రార్థితులు. కొన్ని సమయముల లింకను దపాలు చూచుకొనుట ముగించులోపల సేవకుఁ డీచీటీల నొకకట్టగఁ బట్టుకొని యుంటగూడఁ దటస్థించుచుండును. ఆచీటీలవరుసన లింకనును జూడఁగోరువా రతని గదిఁ బ్రవేశింతురు. సాధారణముగా మూడునాలుగు గంటల కాలము వీరు వచ్చుచునే యుందురు. అందుఁ బదిమందిలోఁ దొమ్మిదిగు రుద్యోగార్థులు. వారి కందఱకును మిక్కిలి యాదరణతో లింకను బదులు చెప్పుచుండును. నయస్వభావంబునను, మృదువాక్యములను నతఁడు చూడఁబోవువారలకెల్ల హృదయబాంధవుఁడో యనఁ జూపట్టుచుండును. నాలుగు గంటలమీఁద లింక నీకార్యమునుండి లేచి భార్యతో సహా విహారార్థమేగును. ఆఱుగంటలకు సాయంకాలభోజనంబు గుడుచు. అతని పఙ్క్తికి మిత్రు లొక్కరును లేని దినమే యుండదు. వారి సాంగత్యమున నుద్యోగపుఁ జింతలనెల్ల మాని యతఁడు గెంటకీ సీమయందువలె మెలఁగుచుండును."

"లింకను రాత్రి పదిమొదలు పండ్రెండుగంటలవఱకుఁ జుట్టివచ్చుచుండును. దగ్గరఁ గల్గుకార్యదర్శుల కందఱకు దర్శనమిచ్చి వారితోఁ బలువిషయములఁగూర్చి సంభాషించుచుండును. అతని పద్ధతి నెఱిఁగినవా రతని రాత్రిఁ జూడవలెనన్న

బయట వెతకుచు నెక్కడలేకున్న సేనానాయకు నింటికడఁ గాంతురు. యుద్ధవిషయము లంతరాత్రివఱకు నటఁ దెలిసి యుండును గాన లింక నచటికిఁ బోయి వినుచుండును. తక్కుంగలవారెల్ల నిద్రించుచున్నను దేశాధ్యక్షుఁడుమాత్రము జాగరూకుఁడై ప్రవర్తించుచుండును.''

ఇన్ని కార్యముల నిర్వహించుచు లింకను యుద్ధభటుల స్నేహితులవిన్నపము లాలకించి వానిని నెమ్మదిగఁ బరామర్శించి వారికిఁ దగు సాయ మొనర్చుటకును, వైద్యశాలలకు వెడలి పరీక్షించుటకును, సైన్యము లుండుశిబిరంబులకుఁ బోయి తన కుఱ్ఱల మేలుకీడ్లెఱుంగుటకును గాల మెట్లు గడించుచుండెనో దెలియలేక యాశ్చర్యజలధి మునిఁగి తేలవలసి యున్నది. ఈ విషయ మతని మనము సొచ్చినంత మఱి యే విషయమును జొరలేదనుట కనేక నిదర్శనము లున్నవి. దేశక్షేమము యుద్ధభటుల సామర్థ్యమువల్లనె కలుగుననుట యతఁడు బాగుగ గ్రహించి "వారిద యుత్తమ ధర్మము; వారే సంపూర్ణ గారవమున కర్హు ల" నియెను. అతఁడు దనకడపటి దినమువఱకును యుద్ధభటులను బ్రభువులకంటెఁ బ్రజాపతినిధులకంటె నెక్కుడు సమ్మానించుచుండెను.

ఒకతఱి నీయనకు స్వాగత మిచ్చుట కనేకులు గుమిగూడి, యొకరివెంట నొక రతనిసమ్ముఖమునకు వచ్చి మన్నన వడయు

చుండిరి. రాజకీయోద్యోగస్థులకును, దేశీయసభాజనులకును, ప్రభువులకును గొందఱికి హస్త మొసఁగి, విసిగి, తరువాతఁ దలయూఁచుటచేతనే సమ్మానించుచుండెను. తుట్టతుద గాక గాయముతగిలిన సైనికుఁడు నామమాత్రము వస్త్రధారియగుఁ దన ముసలితల్లితోఁ, బ్రవేశించుటఁ గని లింకను దనస్థానము నుండి వేగముగఁ బోయి వారి కత్యాదరముతో హస్త మొసఁగి యతిసంతసంబున స్వాగత మిచ్చి ముసలినిగూర్చి "తల్లీ! నీకడుపు చల్లనయ్యె. ఇట్టి దేశాభిమాని యగు కుమారునిఁ గన్న నీవు ధన్యురాలవు. నీ పుత్రునిస్థితికి నే నెంతయు దుఃఖించుచున్నాను" అని చెప్పెను.

ఒకానొకదినమున లింకను, దన గదినుండి ప్రక్కగాఁ బోవు త్రోవనఁ దేనీళ్లు పుచ్చుకొని వచ్చుటకుఁ బోవుచు, మార్గముమధ్యమున నొకపాపని యాక్రందన ధ్వని విని వెనుకకుఁ దిరిగి యుద్యోగస్థానమున కేతెంచి సేవకుని బిలిచి,

"ఓయీ! ప్రక్కన నెవరైన నొకస్త్రీ వేచియున్నదా" యని యడిగెను. "అవును మహాప్రభూ! మూఁడురోజుల నుండి యామె యున్నద"ని వాఁ డనెను. అట్టి యాలస్యమునకుఁ జింతిల్లుచు నాయమ నిచ్చటికిఁ దక్షణమే తీసికొని రమ్మని యానతిచ్చెను. చంటిపిల్ల నెత్తుకొని, యొకస్త్రీ శీఘ్రకాలములోఁ బ్రవేశించి సేననుండి పాఱిపోయినందుకుఁ దన

భర్తను దలదీయ నిశ్చయించిరని చెప్పి యాకఠినశిక్ష మాన్పి తనకు పతిభిక్ష నిడవలె నని వేడెను. వెంటనే దేశాధ్యక్షుఁడు మన్ననపత్ర మొకటి వ్రాసి యామె కిచ్చి తగు నధికారుల యొద్దకుఁ బోవ నియమించి, యామెభర్తను గాపాడెను.

కృశించి సన్నగిలి వికారాకారుఁడగు నొకపిల్లకాయ దేశాధ్యక్షునిఁ జూడవచ్చిన గుంపులో నిల్చియుండెను. వానిఁ జూచి, "నాయనా! నీ కేమి కావలయు"నని లింక నడిగెను. "ప్రభూ! మీ పటాలములలో నొకదానియందు నేను రెండేండ్లు నగారా వాయించుచుంటిని. కర్నల్ కొకనాఁడు నాపై నాగ్రహమువచ్చి నన్నుఁ దఱిమివేసెను. రోగపీడితుఁడనై యౌషధ శాలఁ జేరి చాలకాల మైనతరువాత, స్వస్థతఁజెంది మరల మీకృపాకటాక్షములపాలుగా నిట్లు వచ్చితి" ననెను. అది విని వానిస్థితిగతుల విచారించి, బంధుమిత్రాదు లెవ్వరును లేక యేకాకియై పనిచేయు దార్ఢ్యములేని యాదిక్కుమాలిన మానిసి వృత్తాంతమునకుఁ జాలిఁగొని, కండ్ల నీళ్లు నించి మాటలాడ నోరాడక యొక కాగితముపై "నీబాలుని జాగ్రత్తగఁ గాపాడుఁడ" ని వ్రాసి తగునధికారులయొద్దకుఁ బంపి యా బాలుని సంతసింపఁజేసెను.

వాషింగ్టన్ పురవాసి యొక్కఁ డీకథఁ జెప్పుచున్నాఁడు: ఒకనాఁడు నే దేశాధ్యక్షునిఁజూచుటకుఁ బోయియుంటిని. అప్పు

డొకవృద్ధస్త్రీ ఖిన్నవదనయై యాతనిఁజూడఁ గాచియుండెను. అతఁడు తనకు స్వాభావికమగు నాదరముతో నామెను దగ్గరఁ జీరి వృత్తాంతంబడిగెను. ఆయమ "అయ్యా! నావిభుఁడును, ముగ్గురు కుమారులును సైనికులైరి. గడచిన యుద్ధమున నా మగఁడు పరలోకగతుఁడాయెను. అప్పటినుండి యేకాకినై బహుదుఃఖములఁ జెంది కష్టజీవినై యున్నదానను. నాపెద్ద కుమారు నాకప్పగింప వేడుదమని వచ్చితి న”నెను. ఆమె ముఖమువైపు కొంతకాలము చూచి, మిక్కిలి మృదుపదంబుల "తల్లీ! నీవు మాకెల్లరనిచ్చి, నీయేడుగడఁ గోలుపోయితివి. కావున నీపుత్రులనొక్కని నీకిచ్చుట ధర్మమే” యని చెప్పుచు, వెంటనే యుత్తరువు వ్రాసియిచ్చెను.

ఆ యుత్తరువుం గొని యామె స్వయముగ సేనవిడిదికిఁ గుమారుఁ గొనిరా వెడలెను. అయిన నతఁడు యుద్ధమునఁ జావుదెబ్బదిని వైద్యశాలకుఁ దీసికొనపోఁబడి యుండెను. ఈ సమాచారమువిని యా మాత మిక్కిలి తత్తరమున నచటికిఁ బోయెను. ఆమె పుత్రునిఁ గండ్లఁజూడకమున్నె యతఁడు ప్రాణములు విడిచెను. పట్టరాని శోకము నట్టె యణఁచుకొని యక్కడి వైద్యుఁడు వ్రాసియిచ్చిన పత్రముఁగొని యామె మరల లింకనును జూడ వేచియుండెను. నాఁడును నే నచటికిఁ గార్యార్థినై వెడలి యుంటిని. ఆమె

విషయమే నాకు జ్ఞాపక ముండలేదు. అయిన నాపెను గాంచినతక్షణము లింక నామెవార్తనంతయు విని "అమ్మా! నీవు వేరుగ నన్నడుగుట యనవసరము. నీకుఁ గావలసినవస్తువు నీ కిప్పించెద. నీద్వితీయపుత్రుని సైన్యమునుండి విడిపించెద" నని యుత్తరువు లిఖింపఁజొచ్చెను.

అతఁ డట్లు వ్రాయుచుండ నావృద్ధురాలు దల్లికుమారుం బోలె లింకను దల నిమురుచు నశ్రువుల రాల్చుచుండెను. లింకను ముగించి యార్ద్రచక్షువులతో గద్గదస్వనంబున "నిదె కొమ్ము. నిలచినయిరుపురలో నీ కొక్కఁడును నా కొక్కఁడును నయ్యె" ననుచుఁ బత్ర మందిచ్చెను. ఆయవ్వ దానిం బుచ్చుకొని కనుల నీళ్లు నిలిపి మరల నొకమా రతని శిరంబుఁ దడవి "నాయనా! లింకను! దేవుఁడు నీకు మేలు సేయుగాత. నీవు చిరాయు వగుదువుగాక. నీవె యెల్లపు డీరాష్ట్రాధిపత్యము వహింతువుగాక" యని దీవించిపోయెను.

ఒకానొకసైనికుఁడు మూడుమాఱులు సేనవిడిచి పాఱి పోయియుండెను. ఒకతూరి రక్షకభటులఁ గొందఱిని విషము పెట్టి చంపఁ బ్రయత్నించెను. కావున వాని నురిదీయవలసినదిగా దండనవిధించి యురిదీయఁబడుటకు నతనిఁ గారాగృహమునం దుంచిరి. అయిన నతఁడుచేసిన కార్యము లున్మాదజనితము లని సీమప్రతినిధి హారిసునకుఁ దెలియవచ్చెను. కార్యదర్శి

మొదలగువారినిఁ బతిమాలి యాసైనికుని మిత్రులు విఫలము నొందిరి. తరువాత హారిసు దేశాధ్యక్షుని దగ్గరకు వెళ్ల నిశ్చయించుకొనెను. బృహస్పతివారము ప్రాతఃకాలము సైనికుని నురిదీయ నిశ్చయించిరి. బుధవారమురాత్రి పండ్రెండుగంటలకు హారిసు లింకను గృహము సేరెను. అప్పుడు లింకను నిదురబోవుచుండెను. హారిసు వేచియున్నాఁడను వార్త చేరి చేరకమున్నె యతఁడుమేల్కొని లేచి రాసెలవిచ్చెను. హారిసాయనప్రక్కనఁ గూరుచుండి యాసైనికునికి నిశ్చయముగా మనోవైకల్యమే యనియు నతనిశిక్ష యతఁడు వైద్యులచే బరీక్షింపఁబడువఱకు నాపఁబడవలెననియు వేడెను. వెంటనే లింకనాసైనికునికి విధించిన దండన యాపివేయఁ బడవలసినదని యొక తంత్రీవార్త బంప నుత్తరువుచేసెను. ప్రొద్దున లేచి మఱి యొక తంత్రీవార్తఁ బంపెను. సరియగుకాలమున నీవార్తలు చేరునో లేదోయను భయమున నాలుగువయిపుల నాలుగు వార్తలు నియమితకాలములోఁ బంపెను.

మఱియొకసారి యొకపసిసైనికునకుఁ బహారా కాచువేళ నిద్రవోయినందునకుఁ గాల్పఁబడవలయు నను శిక్షవిధించిరి. అయిన నేదియో యొక కారణమున, నాతనిశిక్షుంచుట కొన్ని రోజులవఱకు నాపియుంచిరి. అప్పు డతఁడు తండ్రికి మిక్కిలిధైర్య మొసఁగుచు గంభీరోక్తులఁ, దానొక స్నేహితునితల్లికిఁ జేసిన

వాగ్దానమునకై యీస్నేహితుఁడు బడలియుండినందున నతని మూటలు మోయుటవలనను గడుదూరము నడుచుటవలనను అలసియుండినను, అతనిధర్మము దానెరవేర్ప నియ్యకొనెననియుఁ, బాపపునిదుర తన్ను మోసపుచ్చుట నెఱుఁగఁడాయెననియు, దనయధికారి స్వధర్మ మాచరింపవలసినందునఁ దనకు సాయమియ్యఁజాల ననియోఁ గావునను, దనమిత్రుఁడు దనకు బదులు ప్రాణము లర్పింప సిద్ధపడియుండుటను, వా రిరువురును నిందనీయులుగా రనియు, దైవము తన్నుఁ గరుణించి, పైకిఁ గొనిపోవుచున్నాఁడనియు వ్రాసి యొకలేఖఁ బంపెను. అతనిచెలియలు దేశాధ్యక్షునిదయాళుత్వ మెఱిఁగినది గావున నాజాబుఁ దీసికొని లింకనుగారియొద్దకుఁబోయి తనసోదరుని రక్షింప వేఁడి యాజాబు చేతికిచ్చెను. ఆయన దానిని జదివి, గుండెకరిగి యశ్రువులు చింద నాపడుచున కభయమిచ్చిపంపి, విడుదలయుత్తరువు వ్రాసి తానె దానిని దీసికొనిపోయి తగునధికారుల కిచ్చెను.

సందర్భవశమున నిదివఱ కొకపర్యాయము లింక నొక గొప్ప వైద్యశాలను దర్శించి రా వెడలుట చెలుపఁబడెను. దాని నిచట విపులముగ వర్ణింతుముగాత. ఒకతఱి సిట్టీపాయింటు నందలి వైద్యశాలల నెల్లఁ దాఁ జూచి యుద్ధభటుల కందఱకుఁ జేయి యిచ్చి గౌరవించి రా గోరి లింక నచటి ముఖ్యవైద్యునకు వార్తఁ బంపెను. అతఁడు లింకనుగడ కేతెంచి,

"దేశాధ్యక్షా! తా మెంతకార్యమునకుఁ గడఁగితిరో యెఱుంగుదురే?" యనెను.

"మీ వైద్యశాలలయం దెందఱున్నా రని" లింక నడిగె. "ఐదాఱువేల భటు లున్నారు. మీ రందఱకు దర్శన మిచ్చు నప్పటికి మిక్కిలి యలసెద ర" ని యా వైద్యుఁడు ప్రత్యుత్తర మిచ్చెను.

అదివిని లింకను దరహాసిత వదనుండై "ఆపని కేను బూర్ణముగఁ దగియున్నానని నమ్ముచున్నాను. ఎట్లైనను బ్రయత్నించి నా యోపినంత చేసెద. నా 'కుఱ్ఱల' నే నిఁకఁ జూడను గాఁబోలు. కావున వారు దేశక్షేమమునకై పడినపా ట్లైనెంత మెచ్చితినొ వారి కిప్పుడె వెల్లడిపఱచెద" నని వైద్య శాలకుఁ బ్రయాణమై పోయెను.

ముఖ్యవైద్యుఁడు త్రోవసూప లింకను బ్రతిమంచముకడ నిలచి ప్రతిభటుని విషయము లారసి కొందఱస్థితికి హర్ష మందుచుఁ, గొందఱగతికి వగచుచుఁ, గొందఱఁ జీరుచు, గొందఱఁ గరుణించుచు నందఱ సమ్మానించి హస్తం బొసంగు చుండెను.

ఇట్లతఁడు గౌరవించుచు నొక తిరుగుబాటు సేనా భటుఁడు పట్టువడినవాఁడు పరుండిన శయ్యఁ దరియుచుండెను. అతఁడు చేసాచుటకుమున్న వాఁడు హస్తము ముందిడి

"ప్రభూ! లింకను. నేను రాజ్యాంగమునకు వ్యతిరేకముగఁ బోరాడిన తప్పిదమునకై క్షమింపుమని వేడఁ జాలకాలము వేచియున్నాఁడ" నని కన్నీరుగార్చుచుఁ బల్కెను.

లింకను వాని యునికికి వ్యసనపడి ప్రత్యశ్రువులు వ్రాల్చి వాని మన్నించి యభయహస్తంబిచ్చి సంతసింపఁజేసెను. ఇట నాతఁడు దనకు లోఁబడిన శత్రువుల క్షమింపఁజేసిన యుత్తరవు స్మరణకు వచ్చుచున్నది. "తన దుష్ప్రవర్తన కెవ్వఁడు పరిపూర్ణమనముసఁ బరితపించి దానిం దగువిధమునఁ గనుపఱచునో వాని నిర్భయముగ క్షమింపవచ్చును. అట్టివారేరైన నుసరిమె. భిన్నాభిప్రాయము వలదు." ఈకడపటి మాటలనేక యుపన్యాసములకంటె స్ఫుటముగ క్షమాపరిపాకంబుం బ్రకటింపవే!

వైద్యశాలచుట్టుం దిరిగి పనిముగిసె ననుకొని లింక నాసీనుఁడై యుండెను. అప్పు డాశాలయం దొక్కభాగమునకు వారు పోలేదనియు, నచ్చటి 'కుఱ్ఱలు' లింకనును జూడఁ గోరెద రనియుఁ దెలియనాయెను. అంత నావైద్యుఁ డతనిఁ జూచి,

"మీరు మిక్కిలియలసితిరి. నేనును డస్సితిని. పోకున్నను దొందరలేదు. మీరు వెడలకుఁడ" నియెను. "నేను వెడలియే తీరవలెను. నాకుఁ దెలియునంతవఱ కొక్కనినైనను

విడిచిపోను. నా 'కుఱ్ఱలు' నను జూడకున్న మిక్కిలి యసంతుష్ట హృదయు లగుదురని" లింకను మరలఁబోయి నిలువ యున్న భటుల నాదరించి మనస్సంతోషమునఁ బలుగంటల మీఁద నింటికిఁ దరలెను.

యుద్ధమున నెచటనేని యనేకులు హతులైరని లింకను వినిన మిక్కిలి కుందు. "ఘోరము, ఘోరము" ని పలుకుచుఁ బలుమాఱు భోజనాదులపై దృష్టియే సారింపకుండు. జయ వార్తలు వచ్చిన నితరులు దనుఁ బొగడినఁ దాను యుద్ధభటుల చేతన యాజయం బొదవెనని వారిని గొనియాడు. వారిపై నెల్లప్పుడుఁ బ్రాణము లుంచుకొని వారి కేపాని వచ్చినను దానె యనుభవించినట్లు దుఃఖించుచుఁ గొంత తనదేహ దార్ఢ్యముఁగూడఁ గోలుపోవుచుండు. సైనికుల త్యాగంబున కతఁడు మిక్కిలి యలరి వా రొకవిధమునఁ దనకంటె గొప్పవారని తలంచు. అట్లగుట వారి సౌఖ్యాభివృద్ధికిఁ జేయఁబడు ప్రయత్నములనెల్ల నతఁ డామోదించుచుండును.

సైనికులకు సాయ మొనర్ప ద్రవ్యము సేర్చుటకుఁ గొన్ని గొప్ప సంతలు జరుపఁబడియెను. అచ్చోటులనెల్ల లింక నగ్రస్థానము వహించుచువచ్చెను. ఫిలడెల్ఫియా పట్టణమున జరిగిన సంతలో 50 లక్షల డాలర్లు దొరకె నని విని లింకను "దేశాభిమానమునను న్యూయార్కుదేశమునుబోలిన దేశము

మఱొం డున్నదే? ధైర్యవంతులగు నా 'కుఱ్ఱల' కిది యెంత సౌఖ్యం బిచ్చుచున్నదో చూడుఁడి" యని యుప్పొంగి పలికెను.

'తిరుగుబాటు' సేనయందలి యుద్ధభటులు చేఁ జిక్కి-నపుడు వారి కాహారాదులు లేకుండఁ జేసిచంపుట కతఁ డెప్పటి కిని నియ్యకొనకుండుటయేగాక వారిని గష్టములపాలు సేయుటకుఁగూడ నంగీకరింపకుండును. ప్రతికృతి యొనరింపవలసివచ్చి నను మఱియేవిధముననైన నొనరింపవలసినదేగాని యుద్ధభటుల నిడుమలు గుడిపించుటమాత్రము దగదు. లింకను దిరుగఁబడిన సైనికులయెడఁ గూడ నితరులయెడంబోలెఁ దన దయామయత్వముఁ జూపుచుండును.

ఒకతఱి ననేకులు గాయపడిన 'తిరుగు బాటు' సైనికులుంచఁబడిన గృహమునకు లింకను వెడలెను. వా రందఱిఁ గలయఁజూచి యతఁడు,

"మీరాటంకము వలుకకున్న మీ కెల్లర కేను హస్తం బొసఁగఁగోరుచున్నాను. మన దేశమునకై నడపి తీరవలసిన ధర్మముంబట్టి యీ యుద్ధముఁ జరపవలసియున్నది. మీ శక్తికి మీరినకారణములచే మీలో ననేకులు నాకు వైరులుగఁ గన్పట్టుచున్నా రనుట నిజము. అయిన మీపై నాకెట్టి క్రోధమును లేదు. మీ మేల కోరుచు స్నేహభావమున హస్తం బొసఁగెద" ననియెను.

వారును గొంచెము వెనుదీసియుఁ గొంత తడవునకు దేశాధ్యక్షుని చేయిఁగొన ముందు కేతెంచిరి. అయిన నందనేకులు లేవనేరని యంత దుర్బలు లయియుండిరి. కావున లింకను వారికడకేగి కై యొసఁగి "కుఱ్ఱలారా! ధైర్యము విడనాడకుఁడి. ఉల్లాసమున నుండుఁడి. మా యోపినంత జాగ్రత్తతో మిమ్ముఁ గాపాడెదము గాక. దైవము మీకు మేలుసేయును గాత" యని ప్రోత్సాహపఱచెను.

ఈ ప్రసంగము చూపరుల మనంబు నల్లె కొల్లఁగొనియెను. అచట నున్నవారల నొక్కరును గంటనీరు విడువనివారు లేరు. 'తిరుగుబాటు' సైనికుల ననేకులు గొల్లని యేడ్వసాగిరి. వారి కెప్పుడు నిట్టి యాదరణ దటస్థించునని వారు కలనైనఁ దలపరైరిగదా!

ఇట్టి యుపకృతియెగదా లింక నొనరింప వేచియుండును!

కం. "ఉపకారికి నుపకారము
విపరీతము గాదు చేయ వివరింపంగా
నపకారికి నుపకారము
నెప మెన్నక చేయువాఁడు నేర్పరి సుమతీ."

## పందొమ్మిదవ ప్రకరణము.

### బానిసలకై పడినపాట్లు.

లోకములోన ననేకులు దమ జాతివారలఁ, దమ మతము వారలఁ, దమ దేశీయుల నిడుమలనుండి విడిపించి మహా గౌరవం బందియున్నారు. గాని యితరజాతివారల నితరమతస్థులఁ దమకంటె హీనజన్ములుగఁ బరిగణింపఁబడు వారలఁ దమ దాసుల లేవనెత్తఁజూచినవాఁడు గడుఁ దక్కువ. గ్రీసు దేశమునందుఁ బ్రజ లుత్తమ నాగరికమున నుండుతఱి నాగరిక స్వభావము దయ నంకురింపఁజేయఁ గొందఱు ప్రభువులు దమదాసుల బిడ్డలవలెఁ బరిగణింపుచు వారికి స్వేచ్ఛ నొసంగుచు వచ్చిరి. అయిన నది "మనుష్యులెల్లరు నొక్కటియ. అందఱు విశృంఖలలీల పనిచేసినంగాని లోకము సుఖంబున నుండదు. ఒకరికొకరు సాహాయ్యులు గావలసినదనియే గాని యొకరు మఱియొకరి యాత్మదేహముల రెంటింగొని తమ స్వలాభమున కుపయోగించుకొనఁ గూడదనుట దైవికాజ్ఞ" యను జ్ఞానము వ్రేడముటవలన జరుగుచు వచ్చినదిగాదు. అట్టి జ్ఞాన మంకురించి వృద్ధిపొందుట కారంభించినది పదు నెనిమిదియవ శతాబ్దమునఁ గడపటి సంవత్సరములయందు.

దానికి దారిసూపినవా రమెరికనులు * దాని పరిపాకమును గనఁబఱచిన వారును వారె. లోకాద్భుతంబును లోకోపకారంబును నగువారికార్యము బానిసజాతిగ నేర్పఱుపఁబడి యున్న నీగ్రోల దాస్యమునుండి విముక్తులఁ జేయుటయ. అక్కార్యమునకు ముఖ్యకారకుఁడు లింకను. అతఁడు మొదట బానిసలఁ జూచుటయు వారి స్థితినిగుఱించి దయార్ద్రహృదయంబునఁ బిన్ననాటనె యుపన్యసించుటయు మన మెఱుఁగుదుము. అతఁడు క్రమక్రమముగ వృద్ధినొందినకాలమునఁగూడ సమయము దొరకినయెడలనెల్ల బానిసమును ఖండించుచు వచ్చుటయు మనకుఁ దెలిసినవిషయమే. అతఁడు దేశాధ్యక్షతవహించి స్వదేశోద్ధారకుఁడగుటయెగాక దాస్యజాతికి ముక్తిదాయకుఁడుగ నయ్యెను. రాష్ట్రపు సంయోగము నిలుప నెప్పుడు పాటువడియెనో న్యాయపరిపాలనం బెప్పుడు దలపెట్టెనో యప్పుడ లింకను దాసుల వరపుడములఁ జెండాడ నిశ్చయింపవలసి వచ్చెను. అంతర్యుద్ధము మూఁడుసంవత్సరములు జరిగినతరువాత నతఁడు నిరంకుశసరణి నిర్భయముగ నిస్సంశయముగ నీరీతిఁ బల్కెను:

"స్వభావమువలననే నేను దాస్యమునకు వైరిని. దాస్యము నిస్సందేహముగా భూమియందలి యన్యాయములలో మొద

* ఈవిషయమున నాంగ్లేయులును సమ్మానమందవలసినవారె. వారును నితరులకు స్వాతంత్ర్యము గలుగఁజేయఁ బాటుపడిరి.

ట్రిది. అది ఘోరము గాదంటిరేని మఱి యే తప్పుప్రవర్తనయు ఘోరము గాఁ జాలదు. నేను బానిసల నెప్పుడుఁ గనినను, వారి దుర్దశం గుఱించి యెప్పుడు వినినను వారి స్థితినిగుఱించి యెప్పుడు దలపోసినను దాస్య మమానుషం బనుట నా మనసునకు వచ్చుచున్నది. అయిన నా దేశాధ్యక్షపదము నా యిచ్చచొప్పున నీవిషయమునఁ దెగించి నాకుఁ బనిసేయుటకు ననర్గళశక్తి నొసంగ లేదనుటయు నే నెఱుఁగుదును......... బానిసము మొదలుగా గల్గు చిన్నవిషయముల నిలపుటకై రాజ్యమును, రాజ్యపద్ధతులును, రాజ్యాంగమును నశింపఁ జేసితినేని నేను నా ధర్మముఁ జేసినవాఁడను గాఁజాలను...... జరుగు కార్యములకును వాని ఫలములకు నేను గర్తను గాను. అవియ నాకుఁ గర్త లనిచెప్ప నొప్పును. మూడుసంవత్సరముల యుద్ధమునకుఁ బిదప నేఁడు మన రాష్ట్రపు స్థితిఁజూచిన నొక గక్షచేఁగాని మనుజునిచేఁగాని నిర్ణయింపఁబడినట్లు గనఁబడదు. దైవమ యిట్లు నడపుచున్నాఁడు. మనగతి యేమి యగుననుటయు విదితమ. ఈ గొప్ప యన్యాయ ప్రవర్తనం బును లోకమునుండి తుడిచివేయవలె ననియు నా యన్యాయమున కింతకాలము మన యుత్తరదక్షిణసీమలనుండు మనము ప్రోద్బల మిచ్చినందులకుఁ దగువిధమున శిక్ష నొందవలె ననియు దైవము దలంచెనా నిష్పక్షపాతపురుషులు దేవుని

న్యాయస్వరూపుఁడనియు సౌజన్యమూర్తి యనియుఁ బొగడ బడెం డతని కార్యరాజంబులం గందురుగాత."

లింక నొకానొక స్నేహితునకు వ్రాసినజాబు నొకదాని నిటఁ బొందుపఱచెదము.

"ఏదైనను దాస్యమును నిలుపనిదే సంయోగము నిలుపఁ జాలమనిరేని వారితో నే నేకీభవింపను.

"ఏదైనను దాస్యముఁ దుదముట్టించనిదే సంయోగము నిలుపఁజాలమనిరేని వారితోను నే నేకీభవింపను.

"నాకుఁ గర్తవ్యము సంయోగ సంరక్షణయేగాని దాస్య సంరక్షణగాని దాస్యసంహారముగాని కావు"

"ఒక్క దాసునినైన విముక్తుఁజేయక సంయోగము నిలుపఁ గల్గుదునేని యట్లె చేయుదు. అందఱ విడిపించిన సంయోగము స్థిర మగునెడ నా త్రోవనె త్రొక్కుదును. కొందఱ విడిచినఁ గార్యము సరి యగునెడ నట్లె యొనరుతు.

"దాసులకై నేఁ జేయు పనియెల్ల సంయోగము స్థిర పఱచుటకె. నాకెయ్యది దీపనికి సహకారి గాదని నమ్మిక గలిగు నద్దానిఁ బరిత్యజింతు.

"నాయందలి లోపములఁ జూపినపక్షమున నవి తప్పులే యైనఁ దిద్దుకొనియెద. క్రొత్తమార్గములఁ దెల్పిన సరి యగు మార్గము లైన వాని నంగీకరింతు.

"నే నిట నాపదమునఁ గర్తవ్య విషయముల నొడివితిని. దీనఁజేసి సర్వజనులు స్వతంత్రులై సమానులై యుండవలె నను మదిచ్ఛ యెంతమాత్రమును మార్పు నెందలేదనుటను వ్యక్తపఱచుచున్నాఁడను."

ఇట్టినియమములకును నపేక్షలకును లోనై లింకను దాస్య విషయమును దఱిసి యయ్యాసురనిర్మాణమును నిర్మూలించి యదే కారణంబుగ నుద్భవించినయుద్ధమునకు రెండులక్షల నీగ్రోల (బానిస సిద్దీల) భటులుగ నియమించి యాదేశమందలి ప్రతి బానిసకును స్వతంత్రం బొసంగెను. ఇట్లొసంగుటయందును నతఁడు మిక్కిలి జాగరూకత చూపెను. సంయోగపు సైన్య ములు 'దిరుగుబాటు' నణఁచునంతటి గొప్ప జయమందువఱ కును దాను బానిసలపరమునఁ జేయు నుత్తరువులు రిత్త యగు నని గుర్తించి లింక నెందఱు దాస్యవిమోచనప్రకటనము సేయు మనినను జేయక తరుణము వేచియుండెను. ఆంటీటమను యుద్ధ రంగమునఁ దనసేనలు సంపూర్ణజయం బందె ననెడివార్త దిక్కు దిక్కునకుఁ బర్వినతోడనె 1862 వ సంవత్సరము సెప్టంబరు నెల 22 వ దినమున లింక నెల్లర మనము రంజిల్లఁజేయు దేన విమోచన ప్రకటనపత్ర మమెరికాసీమలయం దన్నిటఁ జదువఁ బడవలసినదిగ నేర్పఱచెను. 1863 వ సంవత్సర ప్రారంభమున నుండి దిరుగఁబడిన సీమలయందలి దాసులెల్లరును స్వతంత్ర

పౌరులఁబలెఁ బరిగణింపఁ బడుదురుగాక. యునైటెడ్ రాష్ట్రపు నధికారు లీ విషయము గుర్తెఱింగి బానిసలు విడుదలనొందుటకై చేయు ప్రయత్నములం దెల్లఁ దోడ్పడుదురుగాక. వారి కేలాటి యభ్యంతరములును జేయకుందురు గాక" అను సారాంశములు గలప్రకటన యారాష్ట్రమం దంతయుఁ బ్రజ్వరిల్లెను. ఈ విమోచన ప్రకటనపత్రంబె యమెరికనుల స్వాతంత్ర్య గౌరమున కనూనతారాణంబై నేఁటికిని ఇఁకముం దెప్పటికిని వారి రాజ్యాంగమునకు నుత్తమాలంకరణముగ నొప్పెడిని.

ఈ విమోచనపత్రము వెలువడినతోడనె దక్షిణసీమల వారు పలువిధముల లింకనుకు జంకుపుట్టింపఁజూచిరి. అయిన ప్రయత్నములెల్ల వృథ యయ్యెను. 1863 వ సంవత్సరము ప్రారంభ మగుటయు విమోచనపత్రము సంపూర్ణముగఁ జెల్లింపఁబడియెను.

కొంద ఱుత్తరసీమలవారు దాస్యనిరాసకులుగూడ నీపత్రమునకుఁ గినిసిరి. లింక నొక్కపెట్టున నందఱకు స్వేచ్ఛ గలుగఁ జేయాలే దనియు ననేక నిబంధనలఁ జేర్చెననియు వా రసంతృప్తులైరి. సంయోగముఁ జేరఁగోరిన దాస్యము వదలుట ముఖ్యమై యుండెను. కావుననే తిరుగుబాటుసీమ యేని నిర్ణీతదినమునకు మున్ను సంయోగముం జేరెనా ముక్తసీమ దనంతటఁ దాన

యగు. దాస్యము వలయుసీమలు తిరుగుబాటుసీమలుగ నుండు. తిరుగుబాటున నుండుటంజేసి వానియందలి దాసులకు సీపత్రపు నధికార ముపయోగింపఁబడును. ఏవిధమునైన నీగ్రోలు ముక్తి గాంతురనుటను లింకను గ్రహించి యుండెను. కావున నతని మార్గమే కాలోచితముగ నుండె ననుటకు సందియము లేదు.

ఇఁక లింకను నీగ్రోలకుఁ జూపిన దయానురాగంబులును వా రతనికిఁ గనుపఱచిన గారవప్రేమలును వెల్లడిసేయు విషయములఁ గొన్నిటిం దెల్పెదము.

సొజర్న డనునొక నీగ్రోస్త్రీ 9 ముదుసలి మిషిగను నుండి గడుదూరము లింకనును జూడ నేతెంచెను. లింకను దన కుర్చీనుండి లేచి మనఃపూర్వకంబుగ నామెకు స్వాగతమిచ్చి "మిముఁ గాంచి మిక్కిలి సంతోషించితి" నని నుడువుచు నాసనంబునఁ గూర్చుండుఁడని సమ్మానించెను.

"దేశాధ్యక్షా! తాము మొదట సీపదవి నందినతోడనె మిము నసురులు సించివైతు రని నామనము భయం బందెను. అట్లు జరుగకుండ దైవము మిముఁ గాపాడుం గాత మని వేడి, నను నతఁడు సజీవిగ నుంచిన మీ దర్శనము సేసికొందు నని నిర్ణయించితిని. నా యిచ్ఛ దేవుఁ డిప్పటివఱకు నాలుగు సంవత్సరములు నెఱవేర్చి యున్నాఁడు. నా కోరికఁ దీర్చుకొను దము గా కని వచ్చితి" నని యా యబల పల్కెను.

"నేఁటివఱకు మీ కీశ్వరుఁ డాయు వొసంగుటకు నే నెంతయు సంతసించుచున్నాఁడ" నని లింకను ప్రత్యుత్తర మిచ్చెను.

"మీ గుణంబుల నెంతయు మెచ్చితిని. ఇదివఱకుం గల దేశాధ్యక్షులలో మీర యుత్తములని" యా వృద్ధనారి లింకనునకుఁ దన మనంబు వెల్లడిసేసెను.

"మీజాతి విముక్తిగుఱించి తలపెట్టుచున్నారు గాఁబోలు" నని దేశాధ్యక్షుఁడు ప్రతివల్కెను.

తరువాత నొక యఱగంటకాలము లింక నామెతో సంభాషణ సల్పెను. ఆమె కతఁడు చూపిన మర్యాదయు స్నేహమును నాపట్టణమందలి శ్వేత స్త్రీలలో నుత్తమురాలికైనను జూపియుండఁడనిన నతిశయోక్తి గానేరదు.

ఫ్రెడరిక్కు డగ్లసను ముక్తబానిస యొకరుఁడు వాషింగ్టనున కేతెంచెను. ఆసంగతి విని లింక నతని బసకుఁ దన బండినంపి "వచ్చి నా గృహమునఁ దేనీళ్లు స్వీకరించి పోవలె" నని * వేఁడెను. డగ్లసా యాతిథ్య మంగీకరించె. దేశాధ్యక్షుని గేహమునకు నల్లమానిసి విందారగింప నేతెంచిన దిదియ ప్రథమతరుణము. లింకను దన యతిథి నతిగౌరవమునఁ

* మనము భోజనమునకుఁ బిలిచి గౌరవించు తెఱంగున నిది పాశ్చాత్యులలో నొకగౌరవసూచక సాంప్రదాయము.

జూచుచు నతని లోకువను స్మరింపఁజేయ నెడమియ్యకుండెనని డగ్లసు నుడివియున్నాఁడు.

ఒకనాఁడు వాషింగ్టను పౌరుఁ డొకఁడు దేశాధ్యక్షుని కార్యస్థానముం జేరి యతఁ డాదేశపు నోట్లఁ గొన్నిటి లెక్క పెట్టుచుంటఁ గాంచెను. లింక నాతనిం గాంచి "ఈ పని నా దేశాధ్యక్షతకు సంబంధించిన సాధారణపుఁ గార్యములలోనిది గాదు. రాజాంగపుఁ జట్టదిట్టములచే విధింపఁబడని పను లనేకములు దేశాధ్యక్షుఁడు సేయవలసి యుండు" ననియెను.

ఆ పెద్దమనుష్యుఁ డుచితవిధి నంగీకారము సూచించి యా కార్యమున నెట్టి విశేషముగలదో యెఱుఁగ నిచ్ఛఁ గాన్పింపఁజేసెను.

"ఈ ద్రవ్యము కోశప్రకరణమునకుఁ జేరిన యొక పేద నీగ్రో ద్వారపాలకునిది. అతఁ డిప్పుడు మశూచికముచే మిక్కిలి వంతలందుచు వైద్యశాలయం దున్నాఁడు. చేవ్రాలు సేయ నశక్తుఁ డగుట నతఁడు జీతముఁ గొన నసర్థుఁ డయ్యెను. కావున నే నాయిక్కట్టుం దీర్ప మిక్కిలి శ్రమపడి తుట్టతుదకుఁ బారిభాషిక గష్టములఁ దరింప నతని వేతనముం గొనఁగంటిని. ప్రస్తుతము దాని నాతని యిచ్ఛచొప్పునఁ బంచిపెట్టుచున్నాను. అం దొక్కభాగమును నాచేతన నొక సంచియం దుంచి పైన పేరువ్రాసి దాచవలె నని యాతని కోరిక యై

యున్నది. దానిప్రకారమ యొనర్చుచున్నాన"ని దయామ యత్వంబున నీ మహానీయుఁడు దన పదవి కార్యముల నుపేక్షింపరాని వాని వదలి రోగపీడితుఁడై దుఃఖమున మున్గిన హీనమానవునికి సాయ మొనర్చి యౌదార్య సమకట్టి యుండుట వెల్లడి పఱచెను.

"తిరుగుబాటు" పరిపాలకులు నీగ్రోయుద్ధభటులు చేఁజిక్కినచో దయ యనుమాటయే తలపెట్టక వారిని నాసురప్రవర్తనంబుచే నలయించి పాలియించుచుండిరి. ఆ ఘోర వృత్తాంతము దన చెవిఁబడినతోడనె లింకను నీగ్రో సైనికుల సంరక్షణార్థమై యీక్రింది యుత్తరువు ప్రకటించెను.

"దేశమందలి ప్రజలకెల్లరకును జాతిమతాది భేదము లెంచక సంరక్షణ యొసంగుట ప్రతిప్రభుత్వమువారికిని ధర్మమయి యున్నది. అందునను సైనికులుగ గ్రహింపఁబడినవారికి శరణ మొసంగుట ముఖ్యతమము. రాష్ట్రముల చట్టము ననుసరించియు సభ్యజాతుల యుద్ధ నిర్వహణ కార్యముల యనాది మర్యాదలం బట్టియుఁ బట్టువడిన పరజాతి బందాల నాదరించుటయందుఁ డెల్లవారు నల్లవా రను తారతమ్య మెంచఁగూడ దనుట విదితము. చిక్కిన యేమనుజుని నైనను నీగ్రో యనికాని యకారణముగఁగాని బానిసగ నమ్ముట యమానుషంబును నిప్పటి నాగరిక జనుల కొక పెద్ద యవ

రాధమును నగు. యునైటెడ్‌స్టేట్సు సంయుక్తప్రభుత్వమువారు దమ సైనికుల కందఱ కొకవిధమగు సంరక్షణము నొసంగుచున్నారు. ఇందుకు వ్యతిరేకించి మాశత్రువు లేదైనన రంగుపాపమున దాస్యమున కమ్మిన దానికిఁ దగిన ప్రతికృతి మావశమున నుండు వారిసైనికుల కొనర్తుమనుట గ్రహింపవలసినది. కావున యుద్ధపుచట్టములకు వ్యతిరిక్తముగ మాసైనికుఁడొకఁడు చంపఁబడిన నెదురుసైనికుఁడొకఁడు మాచే హతుఁడగుననుట యెఱుఁగునది ; మాసైనికుఁడొకఁడు దాస్యమున కమ్మఁబడినఁ బరసైనికుఁడు మఱియొకఁడు మాదేశమునందలి జనోపయోగకార్యములకు నేమింపఁబడి మావాఁడు విడుదల చెందువఱకుఁ గష్టతమవృత్తి నుంచఁబడు ననుటయుఁ దెలియునది.

ఆబ్రహాములింకను."

లింక నెపుడును గష్టతమంబగు ప్రతికృతి గావింప నొల్లఁడు. పట్టువడిన సైనికులఁ బస్తువెట్టి చంపు టతనికి స్వభావవిరుద్ధము. కాని శత్రువులవల్ల జరుగు నాసుర కర్మలఁ గడతేర్ప మఱొండుపాయములేమి లింకను ప్రాణమునకుఁ బ్రాణముఁ గొన సిద్ధపడియెను.

ఒక బానిసవ్యాపారికి నైదుసంవత్సరములు గారాగృహనివాసమును నొక వేయిడాలరుల యపరాధమును విధింపఁబడియెను. అతఁడు కారాగృహవాసము పూర్తిగ సలిపియుం

డెను. అపరాధ మియ్య లేనందున నాతని నట్టె పట్టియుంచిరి. కావున నతనిపరమునఁ గొందఱు లింకనుం డాసి యతని మన్నించి విడుదలసేయుమని వేఁడుచు నతనినుండి గుండె గఱిగించుఁబత్రము నొక్కదానిని దెచ్చిరి. ఆజాలి వుట్టించు జాబు చదివి లింకను "ఈలేఖ నాభావముల నాకర్షించుచున్నయది. శరణుసొచ్చి దయకుఁ బాత్రులమని విన్నవించువారల కేను లోఁబడుట నాలోపమని యెఱుఁగుదు. ఈయపరాధి మనుష్యుఁ డెప్పుడు సేయనట్టి క్రూరహత్య చేసియుండినను నీమొ ఱాల కించి విడుతును. అయిన నితఁడు నాలుగు డాలర్ల కాశించి దక్షిణాఫ్రికా కదేపనిగ వెడలి యాదేశపుఁ గన్నులుదెఱవని కూనల దొంగిలించి వారినెల్ల నంత్యములేని వరవుడమున కమ్మ సాహసించిన మహాహాతకుఁడు; గారాగృహంబునఁ గుల్లి ప్రాణములు విడిచిన విడుచునుగాక. నాక్షమాపణ నెన్నటికి నంద జాలఁ డనుట నిత్యము నిస్సంశయము నిర్ధారితము." అనెను.

యుద్ధము సంపూర్తి యయినతరువాత లింకను నీగ్రోలకు దెల్లవారలతో సమానముగ రాజ్యాంగ విషయముల సమ్మతు లిచ్చు నధికార మిచ్చుటకు దీర్మానించె ననుటయు వారియెడ నతనికిఁగల యాదరణ దెల్లమగుచున్నది.

లింకనున కొకతఱి గొప్ప స్వాగతమీఁబడెను. తెల్లవా రంద ఱతనిఁ దర్శించి చనినపిదప నీగ్రో లొకరితరువాత నొకరు

లింకనును భయమున డాయుచుండిరి. అతఁ డదిగుర్తెఱిఁగి చిఱునగవుతో వారిం జీరి చేయిచ్చెను. అంత వారిహర్షం బునకు మితిలేకపోయె. కొందఱు వెఱ్ఱిగ నవ్వసాగిరి. మఱి కొంద ఱేడ్వసాగిరి. అనేకులు గొంత నవ్వుచుఁ గొంత యేడ్చు చుండిరి. అందఱును "తండ్రీ లింకను! దేవుఁడు నిన్నెప్పుడు గాపాడుగాత. నీ కెప్పుడు సుఖంబు లొడఁగూర్చుఁగాత" మని పలువిధముల దీవింపఁదొడఁగిరి.

ఇట్లు లింకనునకు నీగ్రోలు గనుపఱచిన గౌరవ మంతింత యని వర్ణింపనేరము. వర్ణించుటయు ననవసరము. అనేకు లతనిఁ జూచిన సంతోష మను మహాసముద్రమున మునిఁగి యొడలెఱుఁగక హర్షాశ్రువులు రాల్చుచుందురు. కొంద ఱాతని దీవించుటయందు తమకాలమెల్లఁ బుత్తురు. అందఱును నతని దమ విమోచనకారుఁ డని దైవముం బోలెఁ దమతమ యిండ్లఁ బూజించుచుందురు.

లోకమునఁ బూర్వపద్ధతులెల్ల నశించి బూర్వపు రాజ్యము లెల్లఁ దారుమారై, ప్రజాపరిపాలనంబె న్యాయపరిపాలనం బని నెగడి, సర్వజనులు స్వాతంత్ర్య రాజ్యముల సుఖంబుబొందు నప్పటికిఁ గూడ నమెరికాయందలి యే మార్పులు దృష్టిపథంబు నుండిఁ దొలఁగిపోయినను, లింకను దేశాధ్యక్షతయందలి యే యుద్ధము లేకార్యము లేసంస్కరణములు మనుష్యుల మన

ములనుండి సెలవు గైకొనినను నతఁడు చేసిన దాస్యవిమో చనమును దాసులకై యతఁ డొనర్చిన మేలును లోకమెప్పటి కిని మఱవకుండుననుటకు సందేహము లేదు.

## ఇరువదియవ ప్రకరణము.

### ద్వితీయ నిర్వాచనము, యుద్ధసమాప్తి.

లింకను దేశాధ్యక్షత వహించి నాలుగుసంవత్సరములు గావచ్చెను. ఆ పదవికి మరల నతనినే యనేకులు పేర్కొను చువచ్చిరి. కొందఱు పౌరు లడ్డువలుకఁ జూచిరిగాని వారి మొఱ్ఱ లరణ్యరోదనము లయ్యె. బాల్టిమోరునందు దేశీయ మహా సభ జరుగుటయు లింకనె తమపాలకుఁడౌ గాతమను నుతు కుల సంఖ్య వీచికలపై వీచికలువలెఁ బొరలి ప్రతికూల శేషము నట్టె నెట్టి దట్టమగు నోటుగుట్టతిట్టలఁ బట్టించె. యుద్ధ రంగమునుండి లింకననుంగులు దమ యయ్య నెయ్యంబున మరల దేశాధ్యక్షుఁడై తమ్మధ్యక్షింపవలసిన దని తెల్లముగ వెల్లడించిరి. కాన దేశీయ మహాసభయం దొక్కసీమవారు దక్కఁ దక్కినవారెల్ల నొక్కపట్టునఁ దమ సమ్మతుల లింక నున కచ్చుపడ నిచ్చుటయు నవ్వారును నివ్వెఱం దమసమ్మతుల నతనికె క్రమ్మఱించిరి. ఇవ్విధమున నతఁడాసభవా రందఱచేఁ బేర్కొనఁబడియెను.

పేర్కొనఁబడిన రెండుమాసములకు లింక నేఁబదిలక్షల సైనికుల నప్పటిసేనకుఁ జేర్ప సమకట్టి తన యుద్దేశముం బ్రకటింప నుద్యమించెను. యుద్ధమనిన జనులు వేసరి యుండుట విశదముగఁ గాంచి యాలోచన సభ్యులు లింకను మరల నిర్వాచింపఁబడకపోవుట కయ్యది కారణంబగునేమోయని జడిసి దాని నాపివేయఁ బ్రయత్నించిరి. వారు నుడువున దెల్ల సావధానముగ విని లింక నెప్పటివలె స్థైర్యంబూని "నేను మరల దేశాధ్యక్షత వహించు టావశ్యకము గాదు. ధైర్యమున యుద్ధసీమఁ బోరాడు నాకుఱ్ఱలకు సాయం బొసంగుటయు దేశము నపాయమునుండి సంరక్షించుటయుఁ గర్తవ్యంబులు. నే నేఁబది లక్షల సైనికులఁ జేర్చియే తీరెద. అందులకై యపజయం బందవలసివచ్చిన గౌరవమున నందెదనుగాక" యని తన దలఁచినకార్యముం జేసెను. దైవ మతని పరిశ్రమల సఫలంబుసేసె. అతని కపజయముఁదలంచిన శత్రువు లడఁగిపోయిరి. అదివఱ కెన్నఁడును నేరికిని జేరనన్నిసమ్మతు లతని కాతఁడేఁ జేరెను. ఆ జయమున కనేకు లలరి తమ సంతసము బహిరంగముగ నతనికిఁ దెలియఁజేసిరి. లింకను దనయందు వారికిఁ గల నమ్మికమునకుఁ గృతజ్ఞత సూచించి యెవ్వరియెడను దన కసూయ యొడమనందున తన గెలుపునంజేసి యాత్మవిజయంబును నరిపరాజయంబును గల్గెనని ముదమందుట లేదనియు నితరులకు

దుష్టచింతన లారోపించుట దన స్వభావములోనిది గాదనియు జనులు స్వాతంత్ర్యపరముననుండ వారిచే నాపనిని జేయించి నంపులకు సర్వనియామకుం డగు నా సర్వేశ్వరునకు నతు లొనర్చుననియుఁ బ్రత్యుత్తర మిచ్చెను.

1865 వ సంవత్సరము మార్చినెల 5 వ తేది లింకను రెండవమారు దేశాధ్యక్ష్యత వహించెను. నాఁటిదినము ననే కోత్సవములు జరిగెను. దేశమంతట సంతోషచిహ్నములు గానవచ్చె. అతని యుపన్యాసము మిక్కిలి చక్కఁగ నుండెను. అం దతఁడు గడచిన నాలుగుసంవత్సరములలో జరిగిన వృత్తాంతముల సంగ్రహముగ వర్ణించి తాము ప్రారంభించిన పని నెవరిమీఁదను గ్రౌర్యమూనక న్యాయముఁదప్పక దేశక్షేమము పై దృష్టియుంచి చిరమగు నెమ్మది గలుగఁజేయువిధమున నెరవేర్ప దైవము దోడ్పడుఁగాక యని ప్రార్థించి ముగించెను.

రాజకీయోద్యోగములఁగుఱించి లింకను మొదట తీర్మానింపవలసి వచ్చెను. అప్పటివఱకేగక్షువారు ప్రబలులైన నా గక్షకుఁ జేరనివారిఁ దీసివేయుచుంట యాచారముగ నుండెను. మాటికిమాటికి నేర్పాటులు సేయుటలోఁ గాలహరణ మొక్కటియేగాక తమపక్షము పేరుకొఱకు నన్యాయముగ సమర్థులఁ గూడ నొక్కొకమారు తఱిమివేయవలసి వచ్చుచుండును. ఇంతియకాక యొక్కస్థానమునుండి యొక్కరునిఁ దీసివైచిన

దాని కిరువదిగురు పెనంగుటయు, నేరో యొక్కఁ జేర్పడినతరు వాత నితరులు పందొమ్మిదిగురు కారణములేకయె దేశాధ్యక్షుని పైఁ గోప మూనుటయుఁ దటస్థించుచుండును. ఈవిషయముల నెల్ల గమనించి లింకను దనప్రభుత్వమునఁ దప్పులేక నేరినిం దీయఁగూడదనియు, సమర్థులకుఁ బ్రోత్సాహ మొసంగవలసిన దనియుఁ గట్టుచేసి నడిపించెను.

రెండవమారు లింకను దేశాధ్యక్షత వహించుటె సంయోగసైన్యమునకు స్వాతంత్ర్యపక్షమున న్యాయపుఁ గక్షకు నేఁబదిలక్షల సైనికులఁ జేర్చినంతటిబలం బొసంగెను. తిరుగుబాటుసీమల కంతకంతకు దూరమగుచుండిన జయఘటన దృష్టిపథంబున నుండియె తొలంగిపోయెను. వారికి బరాజయమే సంప్రాప్త మగుచువచ్చెను.

లింకను రెండవమా అధికారము పూనిన మూడువారములకు దేహారోగ్యము నిమిత్తమును దన 'కుఙ్జలకు' దగ్గరనుండు నిమిత్తమును సిట్టిపాయింటుకుఁ దరలెను. అప్పుడ దానికిఁ గొంచెము దూరమున మహా యుద్ధం బొండు జరిగె. తిరుగుబాటు సేన లోటువడి తమ యాధీనమందలి రిచ్మండు కోటలో దాగుకొనియె. సంయోగపు సేన లాపట్టణము ముట్టడించెను. సంగ్రామం బతియుగ్ర మయ్యెను. లింక నద్దానిని మిక్కిలి జాగరూకుఁడై గమనించి యుద్ధకార్యదర్శికిఁ దెలియఁజేయు

చూచెను. మూఁడు దినములమీఁదట నాపురము లోఁబడియెను. శత్రువులు చెల్లాచెదరైరి. పట్టువడిన ప్రదేశము నం గెలిచినవారు వందిహారావములతో జయభేరులు మ్రోయించుచు వందిమాగధబృందపరీవృతులై యట్టహాసమునఁ జేరుచుండురు. లింకను మాత్రము సర్వసాధారణముగ వీథులంబడి నడచి మనఃపూర్వకముగ లోఁబడియుండిన డేవిసు కార్యస్థానముంజేరి యాపురముం గాంచెను. అతఁడింత సాహసమున శత్రువుల యూరుసొచ్చి స్వామిద్రోహి వదలిపోయి యుండినగృహముననె రెండుదినము లుండెను. దేశభక్తులందఱు అతఁడేమి యగునో గదా యని కంప మందుచుండిరి. అనేకు లతఁడు మూర్ఖసాహసమున నాకార్య మొనర్చె నని తెగడిరి. అతఁడు మరలివచ్చి వాషింగ్టను చేరె నని వినిన వెంటనె యెల్లరును హర్షం బందిరి.

రిచ్మండు లోఁబడెనని సంతసమున దేశమంతయుఁ బండుగలనుభవించిరి. ఉపన్యాసములును, సంగీతములును, ఘంటారావములును, బాణసంచులును, దీపావళులును, లోకుల యానందంబును వెల్లడించెను. ప్రతిచోటను జనులు లింకనును స్మరించి యతనిబుద్ధిని, దేశభక్తిని, కార్యనిర్వాహకత్వమును వేనోళ్లఁ బొగడిరి.

ఈ యుత్సవములు జరుగుచుండగనే రిచ్మండు పట్టువడిన వారము కాలమునకుఁ 'దిరుగుబాటు' నాయకుఁడు లీ పరా

జితుఁడయి రాజ్యాంగపు దండుకుఁ జిక్కెనను వార్త దేశము పైఁ బర్వి యాహ్లాదముం బదిరెట్లు హెచ్చించెను.

యుద్ధము పరిసమాప్తి నొందెను. స్వాతంత్ర్యము జయ మందెను. వాషింగ్టనుపురపు రాజ్యభవనమున

"దైవమునందును, జనులయందును, రాజ్యాంగమునందును నమ్మక ముంచుటచే నీసంయోగము నిలచిన దని" యొక చోటను,

"ఈశ్వరుఁ డీవిధమున నొనర్చియున్నాఁడు. అతని కృత్యములు మహాద్భుతములని" రెండవపట్టునను లిఖించి యచ్చోటుల జయధ్వజము లెత్తిరి. అమెరికాకు మహోత్సవ కాల మిదె యేతెంచెను.

ఆనందకరం బగు నెమ్మదిసమయము ప్రాప్తించెననువార్త విద్యుల్లతాగమనంబున దేశమంతట వ్యాపించెను; సముద్ర మధ్యమునఁ బఱచి దేశదేశములకుం జేరి స్వాతంత్ర్యంబు జయమొందె ననిచాటి జనులెల్లర హర్షవీచికలఁ దేల్చెను.

యునైటెడ్ స్టేట్సు రాష్ట్రపుఁ బ్రజలు గనుపఱచిన సంతోషమునకు మేరయే లేదు. ఈ పట్టువడెననువార్త చెవి సోకినంతనె యనేకు లనేకవిధములఁ దమ ముదమును వెల్లడించిరి. కొందఱు దేవాలయములందలి (అనగా చర్చిలయందలి) గంటల మ్రోయించిరి; కొందఱు ఫిరంగులఁ బేల్చిరి;

కొందఱు తమతమ స్నేహితులఁ గౌగిలించిరి; కొంద ఱశ్రువులు రాల్చిరి; మఱికొందఱు నవ్వనారంభించిరి; అందఱుఁ దమతమ రీతి సంతసంబును వెలిఁబుచ్చిరి. ఇప్పట్టున నమెరికాయందు దమ యారావములచే నింగిముంచు సంఖ్యాతీతము లగు గంట మ్రోగుడులును, దమ గంభీరధ్వానములచే దిశ లవియఁ జేయు ఫిరంగిమొత్తముల యుద్రేకములును, దమ యల్ల కల్లోలముచేఁ బరాజితశత్రువులఁ గల గుండువడఁజేయు జయ నినదములును, సంతోష తరంగముల విచ్చలవిడి వాయుమండలమునఁ బ్రసరింపఁజేయు మంగళవాద్యములును, దాస్యాంధకారము వాపి యిదె స్వాతంత్ర్యభానుండు వెడలెను గనుఁడని ప్రకటించు జ్యోతులయు బాణసంచులయు వెలుంగులును, మిక్కుటముగ బిక్కటిలి యంతటి సుదినము లాదేశము నకట మున్నెపుడును గలుగలేదనుట ననూన మార్గంబున నగుపఱచెను.

లింకను దాఁ దన పరిపాలనమునఁ జేయ సమకట్టిన మహాకార్యము నెరవేర్చెను. తిరుగుబాటును మొదలంటి నశింపఁ జేసి సంయోగము నుద్ధరించెను. అమెరికనులును వారి పరిపాలకులును నొక్కరు దప్పక యెల్లరును నతనిని గొనియాడుచుఁ దమచే నగు విధమునఁ గృతజ్ఞత నూపుచున్నారు.* ఎప్పుడును నతనిని యునైటెడ్ రాష్ట్రపుఁ దండ్రియగు

* మొన్న మొన్న (ననగా 1903 వ సంవత్సర ప్రాంతముల) లింకను

వాషింగ్టనునకు సమానుఁడుగ సన్మానించుచున్నారు. * వీరిరువురును మహాకష్టదినముల రాజ్యాంగమును నడపి సంరక్షించి జయప్రదముగ నిక్కట్టులనుండి తప్పించి స్వాతంత్ర్యమున మెలఁగుట గలుగఁజేసిరి.

---

## ఇరువదియొకటవ ప్రకరణము.

### ఘోరహత్య ; అంత్యము.

లింకను దేశాధ్యక్షత వహించినదిమొద లెవ్వ రతని పైఁబడి యెప్పుడు వధించెదరో గదా యనుభయ మందఱకు నుండె ననువిషయ మిదివఱకే తెలుపఁబడెను. అతనికిఁగూడ నట్టి యంతము దనకు వేచియున్నదేమో యనిశంకించుటకుఁ దగినంత సూచనలు పొడసూపెను. అధికారము వహిం

---

పైగారవమునూప నాతనిసతికి నిచ్చుభరణమును రాజ్యాంగమువారు మిక్కిలి యౌదార్యము గనుపఱచుచు హెచ్చించి యున్నారు.

* రాజ్యభవనమున నొకప్రక్కన జాతీయ స్వాతంత్ర్యముం గలుగఁ జేసిన వాషింగ్టను జ్ఞాపకార్థ మతనిపేర నొక శాసన మొప్పుచుండెను. యుద్ధముముగిసినతోడనె దానికిసమానముగ మఱియొకప్రక్కన సంయోగపు స్థైర్యమునకును స్వాతంత్ర్యోద్ధరణమునకుఁ గారణభూతుఁ డగు లింకనుజ్ఞాపకార్థము మఱొండు శాసనము నిలిపి యాస్థానము నలంకరించిరి.

చినదాదిగఁ దన్ను బ్రాణములు గొందుమని జంకించుచు వైరులు వ్రాయుచువచ్చిన పత్రము లనేకము లతఁ డందు కొనుచుండెను. అయిన నవి దనకుఁ బ్రారంభమునఁ గొంచె మార్తి గలుగఁజేసినను రానురాను సర్వసాధారణ మగుటవలన నలయింప లేకుండెనఁట. ఏమివింత? ప్రాణాపాయసూచనలు గూడ సాధారణము లగునే?

ఇతరాధికారులు పలుమాఱు లింకను సంరక్షణార్థము గొంతదండు నతనిగృహముచుట్టు నుంచుటకును నాతనివెం బడి పంపుటకును బ్రయత్నించిరి. దాని కతఁ డంగీకరింపకుం డెను. అట్లు చేయుటవలన లాభ మొక్కటియు లేదనియు దుర్మార్గుల కవనమ్మకముం గనుపఱచి వారి కోపానలంబు నింక నెక్కుడు చేయువిధం బగుననియుఁ, దన్ను సంహరింప నిశ్చ యించిన వారి కెన్నియో మార్గములు గలవనియు, వానినెల్ల నాపుటకుఁ బ్రయత్నించుట రాజ్యాంగపుఁ బనిని నిల్పుటయే యనియు, నట్టియుద్యమముల ఖండించుచు వచ్చెను.

1865 వ సంవత్సరము 14 తేది ప్రాతఃకాలమున లింకను కుమారుఁడు సేనానాయకుల నొక్కఁడు లీ పట్టువడినతెఱం గెఱింగింప నేతెంచెను. అతనితోడన జనరిల్లాల నను స్నేహి తునివద్దనుండి లింకనుకు రిచ్మండుపట్టణముఁ జొచ్చినరీతి మరల సాహసించి దనప్రాణముల నపాయస్థితియం దిడుకొనఁగూడదని

బోధించుచు నుత్తరము వచ్చిచేరెను. లింకను నద్దానికి సమ్మతించి జాగ్రత్తగ నుండెను.

నాఁడ ప్రథమజయపు నాలుగవ సంవత్సరోత్సవదినము. నాఁడ రిపులచేఁ జిక్కియుండిన సంయోగరాష్ట్రపు ధ్వజము గోటపై నెక్కింప నియమిత మయియుండెను. ఈ రెండుత్సవములును మహాసంతసమునఁ జరుపఁబడెను. ప్రతిగ్రామమునుండియు రాజభక్తులనేకులు గుంపులుగుంపులుగ విచ్చేసి సంపూర్ణహృదయమున నుపన్యాసములు విని, మంగళవాద్యముల కలరి, మిక్కిలి సంతుష్టహృదయు లయి యుండిరి.

ఇంకను దమ యాహ్లాదమును వెల్లడిసేయ నాఁటిరాత్రి మహావైభవమునఁ గడప నిశ్చయించి నాటకాదివినోదముల కేర్పాటులు గావించిరి. అం దొక గొప్పనాటకశాలయందలి ప్రదర్శనము వీక్షింప రాష్ట్రపు నుద్యోగస్థులఁ బ్రాముఖ్యులెల్లరును నాహూయమాను లైరి. లింకను మొదలుగ నందఱు నచటికిఁ దఱలుదురని వార్తాపత్రికలు ఘోషించెను.

నిశాసమయమున నెనిమిదిగంటలమీఁద నలుబదినిమిషములకు లింకను దనభార్యతోను గొప్ప యుద్యోగస్థులతోను నాటకశాలం బ్రవేశించెను. ఆ మహనీయుని రాక కచ్చటిజనులుప్పొంగి కరాస్ఫాలనంబున జయజయారావంబుల నతనికి స్వాగత మిచ్చుచు గౌరవముసూప లేచి నిలిచిరి. అతఁడు

నాట్యరంగమున కెదురుగ నొక యుత్తమాసనమున నాసీనుఁ డయ్యెను. ఆశాలయందలి జను లెల్లరు దమతమస్థానములఁ గూర్చుండిరి. సద్దడఁగినాటకము ప్రారంభమాయెను.

పదిగంట లగునప్పటి కొకగుండు రివ్వుమని పేలుట వినవాయెను. కొంద అది నాటకమున నొకభాగ మేమో యని తలంచుచుండిరి. అయిన లింకనుసతికేక లిడుటయు హంతకుఁడు లింకను నాసనము క్రిందినుండి నిర్గమించుటయు నొక ఘోరకార్య మనివార్యముగ జరిగెననుట యెల్లరకుం దెల్లము సేసెను. ఆ హంతకుఁడు రంగస్థలమున కెగసి

"రాజద్రుహు లిట్లె మడయుదురు గాత" మని గర్జించుచుఁ దళతళమెఱయు నొక ఖడ్గముం ద్రిప్పి,

"నేఁటికి దక్షిణసీమల పగదీరె" ననుచుఁ దప్పించుకొని పోయెను.

చూపరులెల్ల రొక్క నిమిషమాత్రము దిగ్భ్రమఁజెంది చూచిరి. వెంటనె వారిలో నొకఁడు 'జాన్ విల్కెసు బూత'ని బిగ్గరగ నఱచె. అనేకులు 'వానిం గాల్పుఁడీ కాల్పుఁ డని' వాని వెన్నంటిరి. స్త్రీలు గొల్లుమని యేడ్చి మూర్ఛపోయిరి. పురుషు లొడలుదెలియనివారింబోలె నదరించుచు బెదరించుచుండిరి. అందఱును వ్యాకులచిత్తు లయిరి. వారి యవస్థ వర్ణింప నలవిగాదు. మహా వైభవమున సంతోష

తరంగముల నోలలాడుచుండిన జను లెల్లరును నగాధశోక కర్దమాంబుధి మునింగి లేవలేకుండిరి. ఇట్లుండఁ జిచ్చునకు గాలి తోడ్పడిన తెఱంగున లింకను కార్యదర్శి సీవార్డు చంపఁ బడెనని తెలియనాయెను. లోకుల ఖేదభయంబులు చెప్ప నుక్తులుచాలవు. ఎచ్చటఁ జూచినను హత్యల వార్తయె మెండయ్యెను. రాజ్య మరాజక మగు ననియు గొప్ప యుద్యోగస్థు లెల్లరును బ్రాణము లర్పింప సిద్ధపడవలె ననియు వదంతి గలిగెను.

'బూతు' మొదలుగాఁ గల్గు కొందఱుదుర్మార్గులు దాస్య వ్యాపార పక్షపాతు లొక సంఘముగఁ జేరి రాజకీ యోద్యోగస్థులఁ దుదముట్టింపఁ దీర్మానించి యుండిరి. లింకనును మార్చి 4 వ తేదీననె సంహరింపఁ బ్రయత్నించిరి గాని వారి పన్నుగడలు జయమందలేదు. కాన తమ మనోరథము నిపుడు తీర్చికొనిరి. సేనానాయకుఁడు పనివడి పిలడెల్ఫియాకు వెడలి యుండెఁ గానఁ దప్పించుకొనియెను. లేకున్న లింకనుతో నతఁడును దివికేగియుండును.

రాజ్యాధికారు లీ దుర్మార్గుల వెదకిపట్టిరి. బూతును అతని స్నేహితులును దాము చేసిన కార్యములకు ఫలముగ గుండు దెబ్బలు దిని పరలోకప్రాప్తిఁ జెందిరి.

లింకను జంపఁబడె నను వార్త యునైటెడ్ రాష్ట్రముల నంతయు రెండవరోజుదయమునఁ దెలియనాయెను. పట్టణపట్టణమందును, పల్లెపల్లియందును, దుఃఖ తిమిరములు దట్టములయ్యెను. అంగళ్లయందలి నలుపువస్త్రములెల్లయు నుపయోగింపఁబడియెను * ప్రతిమనుజుఁడు వేరొక్కరుని దనస్నేహితునిఁ జూచినపుడెల్ల "ఘోరము ఘోరము"ని విలపించుట విననాయెను. జనులు సభలుచేర్చి తమ దుఃఖమును వెల్లడించిరి. దేవాలయముల ననేకులు గుమిగూడి దైవము లింకను జీవమును సుగతిం జేర్చుగాతమని ప్రార్థించిరి.

ఇఁక నీగ్రోల స్థితి యంటిమే యూహింపం గూడఁజాలము. తండ్రి గతుఁడైన శిశువు లెట్లు విలపింతు రట్లు లింకను చావునకు వీరు విలపించిరి. ఎచ్చటఁ జూచినను నీ నల్లవారు దుఃఖముచే ముఖములు వాంచి చేతులు పిసికికొనుచు 'దైవమా' 'దైవమా' 'దైవమా' యని మొఱ్ఱలిడుచు నేరు పలుకరించినను బలుకనేరక వీథులంబడి పోవుచుంటయు ననేకు లొక్కటిగఁజేరి మోకాళ్లపై నొరగి దేవునికి దమ యార్తహృదయముల నివేదించుటయుఁ గాన నయ్యెను.

---

* పాశ్చాత్యులు దుఃఖముఁ గనుపఱుప నల్లవస్త్రముల ధరింతురు. తమగృహాదుల నలుపునఁ గప్పుదురు. వార్తాపత్రికలలోను జాబులలోను గూడఁ గాగితము చుట్టును నల్లగీతల ముద్రింతురు.

లింకను మరణవార్త దేశదేశములకుఁ బర్వెను. మన చక్రవర్తినిగా నుండిన విక్టోరియారాణియును, ఫ్రాంసు చక్రవర్తిగ నుండి స్వాతంత్ర్యమునకుఁ బాటుపడిన నెపోలియను, నతని సతియు, ఫ్రాంసు, రష్యా, ఇటలీ, ప్రష్యా మొదలగు దేశముల రాజ్యాంగమువారును దమ దుఃఖమును వెల్లడిసేయుచు లింకనుసతి నోదార్చుచు పత్రికలు వ్రాసిరి. స్వాతంత్ర్యముఁ గోరువారందఱును లింకను మరణము విని యశ్రులు రాల్చిరి.

లింకను కళేబరమును రెండవరోజు వాషింగ్టనునందు సితగృహమునకుఁ దీసికొనిపోయిరి. అచ్చటినుండి యుచితవిధమున స్ప్రింగుఫీల్డునకు నతని స్వగ్రామమునకుం గొంపోవ నేర్పఱచిరి. త్రోవయందు దొరకొన్న పట్టణములను కోట్లకొలఁది ప్రజలు లింకను శవమునకు మహాగౌరవముఁ జూపి తమదుఃఖమును వెల్లడిచేసిరి. శోకార్ద్రహృదయులు సల్పు సపర్యలఁ గొనుచు లింకను దేహమాత్రుఁడై యిలువచ్చిచేరెను. అచ్చట నతని బంధుమిత్రు లెంత పొగిలిరో చదువరుల యూహింతురుగాక. మరణానంతరకృత్యముల నొనర్చి నతాననులై మౌనమున దుఃఖధారల వెల్లడించుచు వేనవేలు జను లాతని కళేబరమును సమాధిఁజేర్చిరి. * అచ్చట నాచార్యులు

* అచ్చట నొకపెద్దభవనముఁగట్టి రాజ్యాంగమువారు లింకనును గౌరవించియున్నారు.

లింకనునుగుఱించి నుడివిన వాక్యములలోని ముగింపుభాగముతో మనమును ముగింతముగాక.

"నాయకశిఖామణీ! ఇఁక సెలవైసంగుము. పోయివచ్చెదము. దేశమంతయు నిను వీడఁజాలక దుఃఖించుచున్నారు. అయిన నేమిచేయనగు. దేవునియాజ్ఞ యైనది. మాకోరికలిపుడు పనికిరావు. నిన్ను మే మెప్పుడును మఱువము. దేశమునఁ దల్లులు దమ కుమారులకు నీపేర మొదట గఱపుదురుగాత. మన బాలురెల్లరు నీగుణముల సంపాదింపఁ బ్రయత్నింతురుగాక. రాజ్యనిర్వాహకులు నీ జేసిన కార్యములఁ గని జ్ఞానము నెందుదురుగాత. పెదవులు గదలలేకున్నను నీమాటలింకను మాకు వినవచ్చుచున్నవి. నీ వదనమునకుఁ జలనము లేకున్నను దానినుండి యుద్భవించిన స్వాతంత్ర్యమున కగువాక్కుల ఛాయ లోకమునందెల్ల ప్రౌఢముగ వినవగుచు బానిసల నలరఁజేయుచున్నది. కాలుఁడు నిను నిర్బంధించినట్లగుపడుచుండినను గీర్తిచే నీ స్వేచ్ఛమై లోకమునందెల్ల సంచరించుచున్నాఁడవు. నీ చావు నీకోటమి గాదు; నీ సంహారకుఁడు నీపై వైరమూనఁడయ్యెను. మనములు గట్టివైచి మా జాతీయత సంహారింప నతఁడును నతనివారును సమకట్టిరి. అయిన నీప్రాణములైన నర్పించి మాయిడుమల దప్పించినం దులకు మాయుద్ధారకుండుగ మేము నినుఁ బూజించు

చున్నారము. భూమియు నిన్నుఁ దన జయోపేతపుత్రుం డని యుగ్గడించుచున్నది. వీరాగ్రేసరా! దేశోద్ధారకా! లోకపూజితా! సన్మిత్రా! నీకుఁ బరలోకమున మే లగుఁగాత."

ఆబ్రహాము లింకను

సంపూర్ణము.

Printed at the Vaijayanti Press, 32, Mount Road, Madras.—1907.

# తప్పొప్పులు.

| పుటము | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 24 | 1 | మెండగొాలెఁ | మెండగాలెఁ |
| 26 | 3 | గ్రంధము | గ్రంథము |
| 27 | 1 | నిరర్ధకం | నిరర్థకం |
| 38 | 4 | గన్నములు | గన్నముల |
| 38 | 6 | కిటకీదట్టము | కిటికీచట్టము |
| 45 | 6 | పుస్తకత్రయంబులును | పుస్తకత్రయంబును |
| 47 | 3 | దిగులంది | లింకనుదిగులంది |
| 49 | 13 | జాపు | జాబు |
| 50 | 17 | ప్రధమ | ప్రథమ |
| 53 | 15 | గాని | గాక |
| 61 | 7 | సమగ్ధతకును | సమర్థతకును |
| 67 | 10 | ప్రేమతో | ప్రేమలతో |
| 73 | 8 | దటు | దట్టు |
| 73 | 20 | అండర్సను అనువాఁడు క్రీకుమీఁదను | అండర్సను క్రీకుమీఁదను |
| 74 | 1 | సేయుచుండిరి | సేయుచుండెను |
| 76 | 1 | నిర్ణిత | నిర్ణీత |
| 85 | 18 | లింకనులు | జెంట్రిలింకనులు |
| 92 | 1 | యోాదపు | రోాదనదపు |
| 95 | 6 | నుండుటకతఁడు | నుండుటతఁడు |
| 95 | 18 | మూాడడుగుల | మూాడడుగులు |
| 102 | 3 | డొాక | డొాకకొాన్ని |

| పుటము | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 109 | 19 | శిధిల | శిథిల |
| 114 | 3 | యది | యిది |
| 116 | 1 | పరవక్షపు | పరపక్షపు |
| 117 | 8 | జేరెను | జీరెను |
| 118 | 20 | క్యాసిగారి | క్యాసుగారి |
| 119 | 14 | నీకిప్పుడైన | నీకెప్పుడైన |
| 122 | 16 | న్యూసేలముల | న్యూసేలము |
| 132 | 2 | ప్రఖ్యాతుల | ప్రఖ్యాతులు |
| 132 | 17 | సభాద్యక్షా | సభాధ్యక్షా |
| 133 | 10 | వేసవి | వేసరి |
| 134 | 1 | వక్తలగు | ప్రవక్తలగు |
| 155 | 2 | కరాస్పాలనంబును | కరాస్ఫాలనంబును |
| 165 | 14 | యని | మని |
| 166 | 20 | జెప్పు | సెప్పు |
| 169 | 4 | అతను | అతఁడు |
| 174 | 6 | బట్టిడు | ఒట్టిడు |
| 183 | 19 | నాపియంచిరి | నాపియుంచిరి. |
| 189 | 7 | యని | మని |
| 190 | 8 | సేచ్ఛ | స్వేచ్ఛ |
| 191 | 11 | ముక్తిదాయకుఁడుగ | ముక్తిదాయకుఁడును |
| 192 | 8 | నిలపుటకై | నిలుపుటకై |

For Books Apply to :—

M. R. Ry. RAVICHETTY RANGA RAO,

Residency Bazaar, Hyderabad (Deccan).

M. R. Ry. G. HARISARVOTTAMA RAO, B. A.,

Training College, Rajahmundry.